Dwaraka

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

భోగి శుభాకాంక్షలు

ఆదివారం | 14-1-2018 | పేజీలు: 20 + 16 + 32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: రూ. 6.00 | సంపుటి: 14 సంచిక: 184

శ్రీహేవళంబినామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, పుష్యమాసం, బహుళపక్షం; తిథి: త్రయోదశి రా. 2.31 తదుపరి చతుర్దశి; నక్షత్రం: జ్యేష్ఠ మ. 1.14 తదుపరి మూల; వర్జ్యం: రా. 10.16-12.04; దుర్ముహూర్తం: సా. 4.28-5.12; అమృతఘడియలు: లేవు; రాహుకాలం: సా. 4.30-6.00; సూర్యోదయం: 6.53; సూర్యాస్తమయం: 5.57

నిజామాబాద్ సిటీ*

Nizamabad | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Kakinada | Khammam | Kadapa | Ongole | Nallagonda | Bangalore and Chennai



మైదాన్
MYDAN
నిజామాబాద్ • ఆదివారం 14 జనవరి 2018

మెల్‌బోర్న్‌లో మెరిసేదెవరో?


ఫెడరర్
నడాల్

లేటు వయసులో అదిరే ఆటతీరుతో కుర్రాళ్లకు సవాల్ విసురుతున్న ఫెడరర్ టైటిల్ నిలబెట్టుకుంటాడా..? గాయాలతో సతమతమవుతూనే గ్రాండ్‌స్లామ్స్ నెగ్గుతున్న నడాల్ మరోసారి విజృంభిస్తాడా..? ఫామ్‌లేమితో బాధపడుతున్న జొకోవిచ్ ఈసారైనా పుంజుకుంటాడా..? సెరెనా గైర్హాజరీలో హలెప్, వోజ్నియాకి సత్తా చాటుతారా..? ఏమో.. గెలుపెవరిదైనా పక్షంరోజుల పాటు టెన్నిస్ ఫ్యాన్స్‌కు పండగే. సీజన్ తొలి గ్రాండ్‌స్లామ్ ఆస్ట్రేలియన్ ఓపెన్ మొదలయ్యేది రేపే. మరింకేం.. హార్డ్‌కోర్టులో 'హార్ట్' గెలిచేందుకు ఆటగాళ్లు చేసే విన్యాసాలను తిలకిద్దాం రండి.

(ఆంధ్రజ్యోతి క్రీడావిభాగం)

కళాత్మక ఆటతీరుతో పుష్కరకాలంగా అభిమానులను అలరిస్తున్న స్విస్ మాస్టర్ ఫెడరర్‌కు ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్ నిలబెట్టుకునేందుకు బంగారు అవకాశం. బ్రిటన్ స్టార్ ఆండీ మర్రే, ఆసియా నంబర్‌వన్ కీ నిషికోరి గాయాలతో ఇప్పటికే టోర్నీకి దూరమవడం.. మోచేయి గాయంతో ఆర్నెల్లు ఆటకు దూరమైన మాజీ నెంబర్‌వన్, 12సార్లు గ్రాండ్‌స్లామ్ చాంపియన్ నొవాక్ జొకోవిచ్ పూర్తి ఫిట్‌నెస్‌తో లేకపోవడం.. చిరకాల ప్రత్యర్థి, ప్రస్తుత నంబర్‌వన్ రఫెల్ నడాల్ ఇంకా మోకాలి సమస్యతో బాధపడుతుండడం.. సహచరుడు, మాజీ చాంపియన్ వావ్రింకా గతేడాది వింబుల్డన్ తర్వాత ఆటకు దూరమవడం.. ఈ అంశాలన్నీ 36ఏళ్ల ఫెడరర్‌కు కలిసొచ్చేవే. ఈ నేపథ్యంలో మరోసారి ఈ టోర్నీకి హాట్ ఫేవరెట్ ట్యాగ్‌తో అతడు బరిలో ఉన్నాడు.

ఫెడెక్స్ భారీ అంచనాలతో..

సూపర్‌ఫామ్‌తో మెల్‌బోర్న్‌లో అడుగుపెడుతున్న ఫెడరర్ నిరుడు అద్భుతంగా పుంజుకున్నాడు. ఐదేళ్లుగా ఒక్క మేజర్ టైటిల్ లేక దారుణంగా విఫలమైన ఫెడరర్ నిరుడు ఏకంగా రెండు గ్రాండ్‌స్లామ్స్ కొల్లగొట్టి అందరినీ ఆశ్చర్యపరిచాడు. రికార్డుస్థాయిలో ఐదోసారి ఆస్ట్రేలియన్ ఓపెన్, ఎనిమిదోసారి వింబుల్డన్ టైటిళ్లు సాధించి ఇప్పటి నవతరంతో పోటీపడేందుకు తాను సిద్ధంగా ఉన్నానంటూ సవాల్ విసిరాడు. రెండు గ్రాండ్‌స్లామ్స్‌తో పాటు 2017లో మరో ఐదు ఏటీపీ టోర్నీలు గెలిచి సత్తాచాటుకున్నాడు. దీనికితోడు ఈ సీజన్‌నూ ఘనంగా ప్రారంభించాడు. ఈనెలలో తాను ఆడిన 4 సింగిల్స్ మ్యాచ్‌లనూ ఫెడరర్ నెగ్గాడు. జర్మనీ యువ ఆటగాడు అలెగ్జాండర్ జ్వెరెవ్‌ను చిత్తుగా ఓడించడంతో పాటు తన దేశానికి చెందిన మెలిండాతో కలిసి మిక్స్‌డ్ పోరులో గెలుపొంది స్విట్జర్లాండ్‌కు ప్రతిష్ఠాత్మక హాప్‌మన్ కప్‌ను కట్టబెట్టడంలో కీలకపాత్ర పోషించాడు. పురుషుల సింగిల్స్ డ్రా ప్రకారం అల్జాజ్ బెడెన్‌తో తొలిరౌండ్ ఆడనున్న ఫెడరర్‌కు ఫైనల్ చేరే క్రమంలో భారీ సర్వీసుల యోధుడు రోనిచ్, మాజీ చాంప్ డెల్‌పొట్రో, డేవిడ్ గోఫిన్, బెర్డిచ్‌లు ఎదురవనున్నారు. వీళ్లపై గెలిస్తే.. ఫైనల్లో నడాల్, జొకోవిచ్‌లలో ఒకరిని ఢీకొనే చాన్సుంది. గతేడాది ఇదే వేదికపై ఫైనల్లో నడాల్‌ను చిత్తుచేసి ట్రోఫీ అందుకున్న ఫెడరర్‌కు ఈసారి అతన్నుంచి అంతగా ప్రతిఘటన ఎదురవకపోవచ్చన్నది విశ్లేషకుల అంచనా. మోకాలి గాయం నుంచి నడాల్ ఇంకా కోలుకోకపోవడం, జొకో పూర్తి ఫిట్‌గా లేకపోవడంతో ఫెడరర్ తన కెరీర్‌లో 20వ గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను అందుకోవడం ఖాయమన్న అభిప్రాయాలు బలంగా వినిపిస్తున్నాయి.

నడాల్ పుంజుకుంటేనే...

ఫెడరర్ తరహాలోనే నడాల్ కూడా అనూహ్యంగా పుంజుకున్నాడు. ఈ స్పెయిన్ కింగ్.. గతేడాది రెండు గ్రాండ్‌స్లామ్స్ నెగ్గాడు. మోకాలి గాయానికి శస్త్రచికిత్స కారణంగా అప్పటి దాకా ఆటలో పడుతూలేస్తూ వచ్చిన 31ఏళ్ల నడాల్ 2017లో ఫ్రెంచ్ ఓపెన్, యూఎస్ ఓపెన్ నెగ్గి తన ఆటలో పదును ఇంకా తగ్గలేదని నిరూపించాడు. ఆ ఏడాదిని నంబర్‌వన్ ర్యాంకుతో ముగించాడు. ఈ సీజన్‌లో మాత్రం నడాల్ మరోసారి గాయంబారిన పడడం ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో అతని అవకాశాలను దెబ్బతీసే ప్రమాదం లేకపోలేదు. మోకాలిగాయం తిరగబెట్టడంతో ఆస్ట్రేలియన్ ఓపెన్‌కు సన్నాహకమైన బ్రిస్బేన్ ఈవెంట్ నుంచి తప్పుకొన్నాడు. ప్రపంచ 83వ ర్యాంకర్ విక్టర్ బుర్గర్‌తో తొలిరౌండ్ ఆడనున్న టాప్‌సీడ్ నడాల్‌కు నాలుగోరౌండ్లో జాన్ ఇస్నర్ (అమెరికా) నుంచి సవాల్ ఎదురవనుంది. గతేడాది చివర్లో లేవర్ కప్‌లో ఇస్నర్ చేతిలో ఓడిన నడాల్ అతణ్ని అధిగమిస్తే.. ఆ తర్వాత జొకోవిచ్‌ను దాటాల్సి ఉంటుంది. జొకోపై గెలిస్తే ఫైనల్లో ఫెడరర్‌తో పోటీపడొచ్చు.

జొకోకు కష్టమేనా...?

తనకు పెట్టనికోటగా ఉన్న ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ఆరుసార్లు విజేతగా నిలిచిన సెర్బియా యోధుడు జొకోవిచ్‌కు ఈసారి మాత్రం పరిస్థితులు అనుకూలించేలా లేవు. గతేడాది వింబుల్డన్ క్వార్టర్‌ఫైనల్లో గాయం కారణంగా ఆరు నెలలపాటు ఆటకు దూరంగా ఉన్న జొకో మెల్‌బోర్న్ ఈవెంట్‌తో సీజన్‌ను కొత్తగా ఆరంభించాలనుకుంటున్నాడు. ఫామ్‌లేమితో ఐదేళ్లలో తొలిసారి టాప్‌టెన్ ర్యాంకుల్లో చోటు కోల్పోయిన జొకో.. 14వ సీడ్‌గా ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నాడు. తొలిరౌండ్లో డొనాల్డ్ యంగ్‌తో తలపడనున్న జొకో.. ఆ తర్వాత మోన్‌ఫిల్స్‌ను ఓడిస్తే, క్వార్టర్స్‌లో జ్వెరెవ్ రూపంలో యువ సవాల్‌ను ఎదుర్కోనున్నాడు. గాయం నుంచి పూర్తిగా కోలుకోకుండానే బరిలోకి దిగుతున్న జొకో ఇక్కడ ఏమేరకు రాణిస్తాడన్నది ఆసక్తికరంగా మారింది. జొకోవిచ్‌తోపాటు 2014 చాంపియన్, స్విస్ స్టార్ స్టాన్ వావ్రింకా టైటిల్‌పై ఆశలు పెట్టుకున్నా అవి ఎంతవరకు నెరవేరతాయన్నది డౌటే. గతేడాది వింబుల్డన్ తర్వాత మోకాలి సర్జరీతో ఆటకు దూరమైన వావ్రింకా.. నాలుగేళ్లుగా తనకు కోచ్‌గా ఉన్న మాగ్నస్ నార్మన్‌కు ఇటీవలే గుడ్‌బై చెప్పాడు. నార్మన్ శిక్షణలోనే ఆస్ట్రేలియన్ ఓపెన్ (2014), ఫ్రెంచ్ ఓపెన్ (2015), యూఎస్ ఓపెన్ (2016) నెగ్గిన 32ఏళ్ల వావ్రింకా.. ఇప్పుడెలా ఆడతాడో చూడాలి. వీరితోపాటు 3వ సీడ్ దిమిత్రోవ్, 4వసీడ్ జ్వెరెవ్, 5వ సీడ్ డొమినిక్ థీమ్, 6వ సీడ్ సిలిచ్ టైటిల్‌వేటలో ఉన్నారు.

మహిళల్లో 'ఓపెన్' చాన్స్..


మహిళల సింగిల్స్‌లో డిఫెండింగ్ చాంపియన్ సెరెనా విలియమ్స్ గైర్హాజరవడంతో ఈసారి ఫేవరెట్ ఎవరన్నది కచ్చితంగా చెప్పలేని పరిస్థితి. 20మంది టాప్‌స్టార్లకు టైటిల్‌పై అంచనాలున్నాయి. వీరిలో ప్రధానంగా నంబర్‌వన్ ర్యాంకర్ హలెప్, రెండోసీడ్ కరోలినా వోజ్నియాకి, మూడోసీడ్ ముగురుజా, నాలుగోసీడ్ స్విటోలినా, వెటరన్ స్టార్ వీనస్ విలియమ్స్, షరపోవాకు అవకాశాలున్నాయి. లోకల్ ప్లేయర్ అలివియాతో ప్రారంభరౌండ్ ఆడనున్న రొమేనియా స్టార్ హలెప్ ఇటీవలే షెన్‌జెన్ టోర్నీ నెగ్గి జోరుమీదున్నది. తొలి గ్రాండ్‌స్లామ్ టైటిల్ కోసం ఎప్పటినుంచో ఎదురుచూస్తున్న మాజీ నంబర్‌వన్ వోజ్నియాకి (డెన్మార్క్) గతేడాది ఏకంగా 8 ఈవెంట్లలో ఫైనల్ చేరి అద్భుతమైన ఫామ్‌లో ఉంది. రొమేనియా అన్‌సీడెడ్ భామ మిహేలా బుజార్నెస్‌తో వోజ్నియాకి తన పోరు ప్రారంభించనుంది. 2017లో ఐదు డబ్ల్యూటీఏ టైటిళ్లతో పాటు ఈ సీజన్‌లో బ్రిస్బేన్ ఓపెన్ విజయంతో స్విటోలినా (ఉక్రెయిన్) ఉత్సాహంతో ఉంది. వింబుల్డన్ చాంపియన్ ముగురుజా (స్పెయిన్), ఫ్రెంచ్ ఓపెన్ విజేత వోస్తపెంకో (జర్మనీ), యూఎస్ ఓపెన్ చాంపియన్ స్లోన్ స్టీఫెన్స్ (అమెరికా)లు ఫామ్‌లేమితో సతమతమవుతుండడం ప్రత్యర్థులకు సానుకూలాంశాలు. 37ఏళ్ల వీనస్ విలియమ్స్ లేటు వయసులోనూ ఘాటైన ఆటతీరుతో యువ క్రీడాకారిణులకు సవాల్ విసురుతున్నది. నిరడుఉ రెండు గ్రాండ్‌స్లామ్స్‌లో రన్నరప్‌గా నిలిచి మళ్లీ టాప్-5 ర్యాంకుల్లోకి రావడంతో వీనస్ అవకాశాలను కొట్టిపారేయలేం.

షరపోవా.. అదరగొట్టేనా..?

మాజీ చాంపియన్ మరియా షరపోవా ఈసారి అండర్‌డాగ్‌గా బరిలోకి దిగుతున్నది. 15నెలల నిషేధం పూర్తిచేసుకొని గతేడాది ఏప్రిల్‌లో పునరాగమనం చేసిన ఈ రష్యన్ బ్యూటీ మేజర్ టైటిల్‌తో తన సత్తాచాటుకోవాలని ఆరాటపడుతున్నది. నిషేధం కారణంగా ఏకంగా వందల్లోకి ర్యాంకును చేజార్చుకున్న షరపోవా.. ఇటీవల ఐదారు ఈవెంట్లలో పోటీపడింది. షెన్‌జెన్‌లాంటి ఈవెంట్లలో సెమీఫైనల్ ప్రదర్శనతో తిరిగి టాప్-50లోకి చేరుకుంది. ప్రస్తుతం 47వ సీడ్‌గా ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో తలపడుతున్న షరపోవా.. జర్మనీకి చెందిన తజానా మరియాతో తొలిరౌండ్ ఆడనుంది.

ప్రైజ్‌మనీ

సింగిల్స్ విజేత	రూ. 25.44 కోట్లు
సింగిల్స్ రన్నరప్	రూ. 12.72 కోట్లు
డబుల్స్ విజేత	రూ. 4.77 కోట్లు
డబుల్స్ రన్నరప్	రూ. 2.38 కోట్లు
మిక్స్‌డ్ విజేత	రూ. 1.01 కోట్లు
మిక్స్‌డ్ రన్నరప్	రూ. 50.89 లక్షలు


హలెప్
వోజ్నియాకి
షరపోవా
జొకోవిచ్

పప్పూ కుమారుడొక్కడే కాదు..!

బిహార్ రాజకీయ నాయకుడు పప్పూయాదవ్ కుమారుడు సర్తాక్ రంజన్.. ఒక్క మ్యాచ్ కూడా ఆడకుండా ఢిల్లీ టీ-20 టీమ్‌లో చోటు దక్కించుకోవడం ఇప్పుడు దేశ వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. డీడీసీఏ సెలెక్టర్ల తీరుపై పెద్ద ఎత్తున విమర్శలూ చెలరేగుతున్నాయి. అయితే అధికారం, అంగబలం, బంధుప్రీతితో కొందరు అర్హత లేకున్నా ఆయా జట్లలో స్థానం దక్కించుకోవడం ఇప్పుడేమీ కొత్త కాదు. గతంలో ఇలా టీమ్‌లోకి వచ్చిన వారు ఎంతో మంది ఉన్నారు.

తేజస్వినీ యాదవ్



బిహార్ మాజీ ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ యాదవ్ కుమారుడు. కనీసం ఒక్క రంజీ మ్యాచ్ కూడా ఆడకుండానే ఐపీఎల్ టీమ్ ఢిల్లీ డేర్‌డెవిల్స్‌లో చోటు దక్కించుకున్నాడు. కానీ తుది జట్టులో మాత్రం ఒక్కసారి కూడా స్థానం లభించలేదు. 2009లో రంజీ ట్రోఫీ ప్లేట్ లీగ్‌లో విదర్భతో జరిగిన మ్యాచ్‌లో జార్ఖండ్‌కు ప్రాతినిధ్యం వహించాడు. ఆ తర్వాత రెండు లిస్ట్-ఎ, నాలుగు టీ-20లు ఆడాడు. ఏడు మ్యాచ్‌ల్లో కలిపి 37 పరుగులు మాత్రమే సాధించాడు. 13 ఏళ్ల వయసులో విరాట్ కోహ్లీ సారథ్యంలోని ఢిల్లీ అండర్-15 టీమ్‌లో తొలిసారి చోటు లభించింది. పెద్దగా క్రికెట్‌లో కొనసాగని యాదవ్ 2015లో బిహార్ మంత్రి అయ్యాడు.



అనురాగ్ ఠాకూర్

బీసీసీఐలో చక్రం తిప్పగలిగిన వాళ్లలో ఠాకూర్ ఒకడు. హిమాచల్ సీఎం, మాజీ ఎంపీ ప్రేమ్‌కుమార్ ధుమాల్ పుత్రరత్నం. బీసీసీఐ అధ్యక్షుడిగానూ పనిచేశాడు. అయితే 2000వ సంవత్సరంలో దేశవాళీ మ్యాచ్‌లో జమ్మూ-కశ్మీర్‌కు కెప్టెన్‌గా వ్యవహరించాడు. ఆ తర్వాత క్రికెట్ అడ్మినిస్ట్రేషన్‌లోకి ఎంట్రీ ఇచ్చాడు. ఫస్ట్‌క్లాస్ క్రికెటర్‌గా గుర్తింపు పొందడానికి రంజీ జట్టుకు ఎంపికయ్యాడు కూడా. ఈ అర్హతతో బీసీసీఐ జూనియర్ సెలెక్షన్ కమిటీలో చోటు సంపాదించుకున్నాడు. ఆ తర్వాత బోర్డు కార్యదర్శి, అధ్యక్షుడిగా ఎదిగాడు. లోధా సంస్కరణల అమలును వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో సుప్రీం కోర్టు ఠాకూర్‌ను పదవి నుంచి తప్పించింది.

జయదేవ్ షా



బీసీసీఐ, సౌరాష్ట్ర క్రికెట్ అసోసియేషన్‌కు కార్యదర్శిగా పనిచేసిన నిరంజన్ షా తనయుడు. అత్యధిక రంజీ మ్యాచ్‌లకు నాయకత్వం వహించిన రికార్డు కూడా జయదేవ్‌కు ఉంది. ఐపీఎల్ ఆరంభం నుంచి రాజస్థాన్ రాయల్స్, ముంబై, డెక్కన్ చార్జర్స్, గుజరాత్ లయన్స్‌కు ఎంపికయ్యాడు. కానీ ఈ తొమ్మిదేళ్లలో ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదు. 2008లో ఆసీస్-ఎ, న్యూజిలాండ్-ఎతో జరిగిన ముక్కోణపు సిరీస్‌కు కూడా ఎంపికయ్యాడు. అయితే తన ఎంపికలో తన తండ్రి నిరంజన్ షా పాత్ర ఏమాత్రం లేదని జయదేవ్ చెబుతుంటాడు.

అనిరుద్ధ శ్రీకాంత్

టీమిండియా మాజీ క్రికెటర్ కృష్ణమాచారి శ్రీకాంత్ కుమారుడు. దేశవాళీ మ్యాచ్‌లలో కొన్ని రోజులు ఆడిన అనంతరం చెన్నై సూపర్ కింగ్స్‌లో చోటు దక్కించుకున్నాడు. కానీ ఎప్పుడూ గుర్తింపు సాధించేంత స్థాయి ప్రదర్శన చేయలేదు. 2011లో ఆస్ట్రేలియాలో జరిగిన ఎమర్జింగ్ ప్లేయర్ టోర్నీలో భారత్-ఎకు ఎంపికయ్యాడు. అప్పుడు శ్రీకాంత్ చీఫ్ సెలెక్టర్ కావడంతోనే ఇది జరిగిందనే విమర్శలూ వచ్చాయి.



మీకు తెలుసా?



చనిపోయిన మేకతో..

20 మంది గుర్రాలపై ఉంటారు. మైదానం మధ్యలో ఓ మేక కళేబరం ఉంటుంది. గుర్రాలపై నుంచి చేతులతో ఆ కళేబరాన్ని అందుకొని గోల్‌లైన్‌పై పడేయడమే ఈ ఆట. కళేబరాన్ని హస్తగతం చేసుకొనే క్రమం హింసాత్మకంగా ఉంటుంది. ఈ గేమ్ పోలో లాంటిదన్నమాట. కాకపోతే పోలోలో స్టిక్స్, బాల్ ఉంటాయి. ఇక్కడ కేవలం చేతులనే ఉపయోగించాలి. ఈ ఆటను బుజ్‌కాషీ అంటారు. ఇది ఆఫ్ఘనిస్థాన్ జాతీయ క్రీడ.

Dwaraka

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ఆదివారం | 14-1-2018

Nizamabad | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Kakinada | Khammam | Kadapa | Ongole | Nallagonda | Bangalore and Chennai





న్యాయవ్యవస్థ కోసమే నోరు విప్పాం

త్వరలో పరిష్కారం లభించవచ్చు

బయటి వారి జోక్యం అవసరం లేదు

రాష్ట్రపతికి ఆ బాధ్యత లేదు: జోసఫ్

సంక్షోభం లేదు: జస్టిస్ గొగోయ్



మనిషా..? పశువా?!

ఆవులు, బర్రెలకు లైంగిక సుఖమేదీ?

ఇంజెక్షన్లతో సరి.. పాల ఉత్పత్తే ప్రధానం

పెయ్య దూడలే కావాలి.. కోడెలు వద్దు!

పశువులపై మనుషుల క్రూరత్వం

ఎద్దులు, దున్నలకు మరణశాసనం

'బొల్లిగిత్త శరీరాన్ని ఒక పక్కకు విల్లులాగా వంచి మునెమ్మవైపు నాలుగడుగులు జరిగింది. అలా మరొకసారి చేసి మునెమ్మకు చేరువగా వచ్చి అకస్మాత్తుగా తన ముందరికాళ్లను పైకెత్తి ఆమె వీపుమీదుంచింది' ..ప్రముఖ రచయిత

మిగతా 8వ పేజీలో...

రేపు సంక్రాంతి.. పంటల పండుగ. ఎల్లుండి కనుమ.. పశువుల పండుగ! వ్యవసాయంలో తమకు ఎంతో సాయం చేసే బసవన్నలకు రైతులు కృతజ్ఞతలు చెప్పే రోజు. చక్కగా స్నానం చేయించి.. పసుపు, కుంకుమలతో, పూలతో పూజ చేయడం.. వాటి కొమ్ములను అలంకరించడం.. చిరు గంటలు కట్టి మురిసిపోవడం.. రివాజు. కానీ అదంతా గతం! ఆడపిల్ల పుడితే చంపేస్తున్న మనుషులు.. పశువులకు పుట్టే కోడెదూడలను కబేళాలకు తరలిస్తున్నారు! పశువులకు లైంగిక సుఖం లేకుండా ఇంజెక్షన్లతో కృత్రిమ గర్భధారణ చేయించి.. పెయ్యదూడలు పుడితేనే సాకుతున్నారు!! 'మన కోసం పశువులు' అనే స్థితిని దాటి.. 'మన కోసం మాత్రమే పశువులు' అనే స్థాయికి చేరుకున్న మనిషి వైఖరిపై, పశువుల దుస్థితిపై ప్రత్యేక కథనం..

వాటీజ్ దిస్ మిలార్డ్..!

ఆర్కే విశ్లేషణ 4వ పేజీలో

కొత్త పలుకు!

రాజీ దిశగా సుప్రీం రగడ

నలుగురు రెబెల్ జడ్జీలతో రేపు సీజే చర్చలు?

రంగంలోకి దిగిన ప్రధాని నరేంద్ర మోదీ!

చీఫ్ జస్టిస్ ఇంటికి ప్రిన్సిపల్ సెక్రటరీ

ఇంటి వద్ద కారులోనే ఎదురు చూపులు

నృపేంద్ర మిశ్రాను కలవని దీపక్ మిశ్రా

న్యూఢిల్లీ, జనవరి 13: న్యాయవ్యవస్థలో సునామీ సృష్టించిన నలుగురు జడ్జీల తిరుగుబాటు వ్యవహారం రాజీ దిశగా సాగుతోంది. ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రాపై తీవ్రస్థాయిలో గళమెత్తిన నలుగురిలో ఇద్దరు- జస్టిస్ కురియన్ జోసెఫ్, జస్టిస్ రంజన్ గొగోయ్- కాస్త చల్లబడ్డారు. అసలు సంక్షోభమే లేదని, కేవలం విధివిధానాలకు సంబంధించిన విభేదాలు మాత్రమేనని తేల్చేశారు. ఇక ప్రధాని నరేంద్ర మోదీ నిన్నటి నుంచీ అటార్నీ జనరల్ కేకే వేణుగోపాల్ ద్వారా గోప్యంగా రాజీ యత్నాలు సాగిస్తూనే ఉన్నారు. శనివారం

మిగతా 12వ పేజీలో...

చిదంబరం ఇంట్లో ఈడీ సోదాలు 12



పాస్‌బుక్ మేళా

రాష్ట్రవ్యాప్తంగా ఒకేరోజు మార్చి 11న పంపిణీ

70 లక్షల కమతాలకు ఒకేసారి జారీ

రాష్ట్రపతి లేదా ప్రధాని చేతుల మీదుగా!

ఆనాటి నుంచే కొత్త రిజిస్ట్రేషన్ విధానం

భూ రికార్డుల నమోదుకు 'ధరణి' వెబ్‌సైట్

వివాద భూములపై త్వరలో నిర్ణయం: సీఎం

8 గంటల పాటు సుదీర్ఘ సమీక్ష

హైదరాబాద్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా మార్చి 11న ఒకేరోజు కొత్త పాస్ పుస్తకాలను పంపిణీ చేస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించారు. పూర్తిస్థాయి సంస్కరణలతో వస్తున్న కొత్త రిజిస్ట్రేషన్ విధానం కూడా అదే రోజు నుంచి ప్రారంభం అవుతుందని వెల్లడించారు. అదే రోజు మండల రెవెన్యూ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ కార్యకలాపాలు ప్రారంభిస్తామన్నారు. కొత్త పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమానికి రాష్ట్రపతి లేదా ప్రధాన మంత్రిని ఆహ్వానించనున్నట్లు తెలిపారు. కొత్త పాస్ పుస్తకాల జారీ, రిజిస్ట్రేషన్ విధానంలో సంస్కరణలపై ప్రగతి భవన్‌లో శనివారం దాదాపు 8 గంటలపాటు సుదీర్ఘ సమీక్ష జరిగింది. రాష్ట్రంలో నిర్వహించిన

మిగతా 7వ పేజీలో...



ప్రగతి భవన్‌లో కేసీఆర్ దంపతుల సంక్రాంతి పూజలు



స్టాంపులు, రిజిస్ట్రేషన్ల ఐజీగా వాకాటి కరుణ

పెట్టుబడి సాయం సాగు భూమికే

క్షేత్రస్థాయిలో పరిశీలించి అందజేత 7

ఉపసంఘం నివేదిక

సర్పంచ్‌కు పరోక్షం! 7

తప్పుచేస్తే ట్రైబ్యునల్ ద్వారా చర్యలు

పదేళ్లకోసారి రిజర్వేషన్ రొటేషన్

పంచాయతీ ముసాయిదా సిద్ధం!

సీఎంకు ఉపసంఘం నివేదిక

చట్టం కోసం ప్రత్యేకంగా అసెంబ్లీ

మద్యం మత్తుకు బలి

- అదుపు తప్పి డివైడర్‌ను ఢీ కొన్నకారు
- యువకుడి మృతి.. ముగ్గురికి గాయాలు
- మృతుడు.. బాసర ఆలయ పూజారి

11







2450.2017

ఆదివారం 14 జనవరి 2018
ఆంధ్రజ్యోతి
4 | తమసోమా జ్యోతిర్గమయ



ఆర్కే RK

కొత్తపలుకు

వాటీజ్ దిస్ మిలార్డ్!

'ఈ దేశంలో ఏమి జరుగుతోందో తెలుసుకోవాలనుకుంటున్నాను'.. అని ఒక కేసు విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చలమేశ్వర్ ఇటీవలే వ్యాఖ్యానించారు. అసలు ఇంతకీ సుప్రీంకోర్టులో ఏమి జరుగుతోంది? అని ఈ దేశ ప్రజలు ఇప్పుడు తెలుసుకోవాలనుకుంటున్నారు. న్యాయ వ్యవస్థ చరిత్రలో తొలిసారిగా జస్టిస్ చలమేశ్వర్ నివాసంలో నలుగురు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు సమావేశమై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రాపై ఆరోపణలు సంధించారు. ఈ పరిణామం న్యాయ వ్యవస్థనే కాకుండా మొత్తం దేశాన్నే దిగ్భ్రాంతికి గురిచేసింది. 70 ఏళ్ల స్వతంత్ర భారతావనిలో అన్ని వ్యవస్థలూ విశ్వసనీయత కోల్పోతుండగా, న్యాయ వ్యవస్థ ఒక్కటే పెద్దదిక్కుగా ఉంటూ వచ్చింది. ఇప్పుడు ఆ దిక్కు కూడా బజారున పడింది. శుక్రవారంనాటి పరిణామాల తర్వాత అత్యున్నత న్యాయస్థానం కూడా అభాసుపాలైంది. సాధారణ ప్రజలకు కూడా సుప్రీంకోర్టుపై నమ్మకం పోయే పరిస్థితి ఏర్పడింది. నలుగురు సీనియర్ న్యాయమూర్తులు లేవనెత్తిన అంశాలు నిజమే అనుకున్నా, వారు అలా బయటపడి విలేకరుల సమావేశం ఏర్పాటుచేయడంపై దేశవ్యాప్తంగా భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రధాన న్యాయమూర్తి చర్యలను ఆక్షేపించడానికి విలేకరుల సమావేశం ఏర్పాటుచేయడం సమర్థనీయమా? కాదా? అన్న విషయంలో కూడా వాదోపవాదాలు సాగుతున్నాయి. శాసన వ్యవస్థ, కార్యనిర్వాహక వ్యవస్థ పనితీరును సమీక్షించి తీర్పులు ఇచ్చే అత్యున్నత న్యాయస్థానమే వివాదాస్పదం కావడం ఆందోళనకర అంశమే! తమ ఆవేదనను పంచుకోవడానికి మరో మార్గం లేనందునే విలేకరుల సమావేశం ఏర్పాటుచేశామని నలుగురు న్యాయమూర్తులూ చెప్పుకొచ్చారు. అయితే వారు ఇలా వ్యవహరించడం సరికాదన్న అభిప్రాయం బలంగా వినిపిస్తోంది. ప్రధాన న్యాయమూర్తి వ్యవహార శైలిపై అభ్యంతరాలు, ఆక్షేపణలు ఉంటే రాష్ట్రపతిని కలిసి వివరించి ఉంటే బాగుండేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. సుప్రీంకోర్టు జడ్జీలను నియమించేది రాష్ట్రపతే కనుక విభేదాలు ఉంటే ఆయన దృష్టికి తీసుకువెళ్లినా ఆ విషయం ప్రజలకు తెలిసేది కదా.. అన్నది ఒక అభిప్రాయం! అందుకు విరుద్ధంగా సుప్రీంకోర్టు వ్యవహారాలు ఇప్పుడు బజారునపడినందున అందరి పరువూ పోయింది. ఈ దేశంలో ఇప్పటివరకు న్యాయమూర్తులు పటిష్ఠమైన రక్షణలో ఉన్నారు. న్యాయమూర్తులను విమర్శించడం

> **జస్టిస్ చలమేశ్వర్ సకాలంలో సుప్రీంకోర్టుకు రాకుండా అడ్డుపడింది కూడా అప్పుడు సుప్రీంకోర్టు సీనియర్ న్యాయమూర్తిగా ఉన్న తెలుగువాడేనని చెబుతారు. తనను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి కాకుండా అడ్డుపడ్డారన్న ఆవేదన జస్టిస్ చలమేశ్వర్‌లో ఇప్పటికీ ఉందని ఆయన సన్నిహితులు చెబుతుంటారు. తనకు అన్యాయం జరిగిందని ఆవేదన చెందే చలమేశ్వరే తాము హైకోర్టు న్యాయమూర్తులుగా నియమితులు కాకుండా అడ్డుపడ్డారని కొంతమంది న్యాయవాదులు ఆరోపిస్తుంటారు.**

కోర్టు ధిక్కారం కిందకు వస్తుందన్న అభిప్రాయం ప్రజలలో ఉంది. అలాంటప్పుడు న్యాయమూర్తులే న్యాయమూర్తులను విమర్శిస్తే పరిస్థితి ఏమిటన్న ప్రశ్న ఇప్పుడు ఉత్పన్నం అవుతోంది. హైకోర్టు న్యాయమూర్తిగా ఉండి సుప్రీంకోర్టు కొలీజియం నిర్ణయాలను విమర్శించినందుకు జస్టిస్ కర్ణన్‌ను కోర్టు ధిక్కారం కింద విచారించి ఆరు నెలల కారాగార శిక్ష విధించారు. జస్టిస్ కర్ణన్ తన శిక్షను అనుభవించి ఇటీవలే జైలు నుంచి బయటకు వచ్చారు. ఆయనను కోర్టు ధిక్కారం కింద విచారించి శిక్షించిన న్యాయమూర్తులలో జస్టిస్ చలమేశ్వర్ కూడా ఉన్నారు. సుప్రీంకోర్టు పనితీరును విమర్శించినందుకు సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ మార్కండేయ ఖట్జూను కోర్టుకు పిలిపించి మరీ క్షమాపణ చెప్పించుకున్నారు. ఇలా చేయడం ద్వారా సుప్రీంకోర్టు ఔన్నత్యాన్ని, గౌరవాన్ని కాపాడుకుంటూ వచ్చారు. ఇప్పుడు అదే సుప్రీంకోర్టులో పనిచేస్తున్న న్యాయమూర్తులు బహిరంగంగా విమర్శలు చేయడం కోర్టు ధిక్కారం కిందకు రాదా? అన్న ప్రశ్న సామాన్య ప్రజలలో ఉత్పన్నం అవుతోంది. న్యాయమూర్తులు ఏమైనా చేయవచ్చా? వారికి కట్టుబాటు అంటూ ఉండదా? అన్న ప్రశ్నలు కూడా తలెత్తుతున్నాయి. హైకోర్టు న్యాయమూర్తిగా ఉండి సుప్రీంకోర్టును తప్పుబట్టిన జస్టిస్ కర్ణన్‌ను ఎందుకు శిక్షించారన్న ప్రశ్న ఇప్పుడు రాదా? దళితుడు కనుకే ఆయనపై చర్య తీసుకున్నారా? అని ఎవరైనా ప్రశ్నిస్తే న్యాయ వ్యవస్థ ఏమని సమాధానం చెబుతుంది? న్యాయ వ్యవస్థలో, ముఖ్యంగా సుప్రీంకోర్టులో ఏదో తేడాగా ఉంటోందని చాలా కాలంగా ప్రచారంలో ఉంది. ఇప్పటివరకు మూసి ఉన్న గుప్పిటను ఇప్పుడు తెరిచారు. ఫలితంగా న్యాయ వ్యవస్థ పరువు పోయింది. జిల్లాస్థాయి న్యాయ వ్యవస్థలో లొసుగులు ఉంటే హైకోర్టు స్థాయిలో తగు చర్యలు తీసుకుంటూ ఉంటారు. హైకోర్టులలో లొసుగులు ఉంటే సుప్రీంకోర్టు పరిష్కరించేది. ఇప్పుడు సుప్రీంకోర్టులోనే లొసుగులు ఉంటే ఎవరు పరిష్కరించాలి? ఈ ప్రశ్నకు సమాధానం చెప్పేవారు కరువయ్యారు. ఇదే అంశాన్ని ఒక విలేకరి ప్రశ్నించగా, తన వద్ద సమాధానం లేదనీ, సమస్య పరిష్కరించే ప్రత్యామ్నాయ మార్గం కనిపించడం లేదనీ జస్టిస్ చలమేశ్వర్ బదులిచ్చారు. త్వరలోనే అన్నీ సర్దుకుంటాయని అటార్నీ జనరల్ కె.కె.వేణుగోపాల్ వంటివారు చెబుతున్నారు. సర్దుకోవడం అంటే ఏమిటి? ఆరోపణలు చేసినవారు– ఆరోపణలకు గురి అయినవారు రాజీ పడతారా? బజారున పడినవారు రాజీపడిపోతే, రేపు కక్షిదారులు కూడా మేం మేం రాజీ పడతాం అని అంటే అనుమతి ఇస్తారా? హత్య చేసిన వాడు హత్యకు గురైన వ్యక్తి కుటుంబసభ్యులతో రాజీపడటాన్ని చట్టాలు సమర్థిస్తాయా? లేదు కదా! కార్యనిర్వాహక వ్యవస్థకు ప్రతి విషయంలో కోడ్ ఆఫ్ కండక్ట్ పేరిట ఒక నియమావళి ఉంటుంది. కారణం ఎంత బలమైనది అయినా ఈ నియమావళిని ఉల్లంఘించినవారిపై చర్యలు తీసుకుంటూ ఉంటారు. అలా తీసుకున్న చర్యలను సుప్రీంకోర్టు సైతం సమర్థించిన సందర్భాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో న్యాయమూర్తులకు నియమావళి ఉండదా? వారు అన్నింటికీ అతీతులా? మాలో మేం తిట్టుకుంటాం– కొట్టుకుంటాం.. అయినా అడిగే హక్కు ఎవరికీ లేదని న్యాయ వ్యవస్థ చెప్పగలదా? సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని అభిశంసించే అంశాన్ని జాతి పరిశీలించాలని నలుగురు న్యాయమూర్తులు శుక్రవారంనాడు కోరారు. ఇదొక అసాధారణ పరిణామం. జరుగుతున్న పరిణామాలు న్యాయ వ్యవస్థ అంతర్గత వ్యవహారమని కేంద్ర ప్రభుత్వం భావిస్తున్నట్లు వార్తలు వచ్చాయి. సుప్రీంకోర్టు పరువు బజారున పడినప్పుడు సరిదిద్దలేని పరిస్థితిలో వ్యవస్థ ఉండటం ఏమిటి? న్యాయ వ్యవస్థ అంటే కొంతమంది న్యాయమూర్తులకే సొంతమా? ఈ దేశ ప్రజలకు ఏమీ సంబంధం లేదా? రాజ్యాంగ నిర్మాతలు ఈ దుస్థితిని ఊహించి ఉండరు. తీర్పుల విషయంలో న్యాయమూర్తులు విభేదించడం సహజమే గానీ వ్యవహార శైలి విషయంలో విభేదించుకోవడం ఇదే మొదటిసారి కనుక ఇలాంటి సందర్భాలలో ఏమి చేయాలి? వివాదాలను ఎలా పరిష్కరించుకోవాలి? మొదలైన అంశాలను పరిశీలించడానికి ఇప్పుడొక వ్యవస్థ అవసరమనిపించడం లేదా? ప్రభుత్వ శాఖలలో నియమావళి అమలవుతున్నప్పుడు న్యాయ వ్యవస్థలో నియమావళి అవసరం లేదా? కింది కోర్టులలో న్యాయమూర్తులు అపసవ్యంగా తీర్పులు ఇచ్చినా, ఇతరత్రా

> **సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని అభిశంసించే అంశాన్ని జాతి పరిశీలించాలని నలుగురు న్యాయమూర్తులు శుక్రవారంనాడు కోరారు. ఇదొక అసాధారణ పరిణామం. న్యాయవ్యవస్థ అంటే కొంతమంది న్యాయమూర్తులకే సొంతమా? ఈ దేశ ప్రజలకు ఏమీ సంబంధం లేదా? రాజ్యాంగ నిర్మాతలు ఈ దుస్థితిని ఊహించి ఉండరు. తీర్పుల విషయంలో న్యాయమూర్తులు విభేదించడం సహజమే గానీ వ్యవహార శైలి విషయంలో విభేదించుకోవడం ఇదే మొదటిసారి కనుక ఇలాంటి సందర్భాలలో ఏమి చేయాలి? వివాదాలను ఎలా పరిష్కరించుకోవాలి? మొదలైన అంశాలను పరిశీలించడానికి ఇప్పుడొక వ్యవస్థ అవసరమనిపించడం లేదా?**



తప్పులు చేసినా వెంటనే హైకోర్టులు చర్యలు తీసుకుంటాయి. హైకోర్టు, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు తప్పు చేస్తే మాత్రం చర్యలు తీసుకునే వ్యవస్థ లేదు. పార్లమెంట్ అభిశంసిస్తే తప్ప ఉన్నత న్యాయస్థానాలలో నియమితులైన న్యాయమూర్తులను ఎవరూ ఏమీ చేయలేరు. నిజాయితీతో, నిర్భీతితో తీర్పులు ఇవ్వడం కోసం ఉన్నతస్థాయి న్యాయమూర్తులకు రాజ్యాంగంలో ఈ విధమైన రక్షణ కల్పించారు. అయితే దురదృష్టవశాత్తూ ఈ రక్షణ ఏర్పాట్లు అప్పుడప్పుడు దుర్వినియోగం అవుతున్నాయి. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రాను ఆక్షేపించినవారిలో జస్టిస్ రంజన్ గొగోయ్ ఒకరు. ఈయన జస్టిస్ దీపక్ మిశ్రా తర్వాత ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించబోతున్నారు. ఆ స్థాయిలో ఉన్న న్యాయమూర్తి కూడా విలేకరుల సమావేశంలో పాల్గొనడం ఆశ్చర్యం కలిగించకమానదు. కారణాలు ఎంతటి బలమైనవి అయినప్పటికీ నియమావళికి కట్టుబడి ఉండాలని ఇతరులకు చెప్పే న్యాయమూర్తులు తమకు మాత్రం ఏ నియమావళీ ఉండదని ఎలా భావిస్తున్నారో తెలియదు. విధులను వదిలేసి కోర్టు నుంచి బయటకు వెళ్లిపోయి ప్రత్యేకంగా సమావేశం కావడం తిరుగుబాటు కిందకు రాదా? ప్రభుత్వ శాఖలలో ఇలా జరిగితే సమ్మె అంటారు లేదా క్రమశిక్షణ ఉల్లంఘనకు పాల్పడ్డారని అంటారు. మరి సుప్రీంకోర్టులోనే ఇలా జరిగితే ఏమనాలి? సుప్రీంకోర్టులో గత నాలుగు నెలల నుంచి కొన్ని పరిణామాలు గతి తప్పుతున్నాయన్నది నలుగురు న్యాయమూర్తుల వాదన! ఈ విషయాన్ని ప్రధాన న్యాయమూర్తి దృష్టికి తీసుకువెళ్లినా ప్రయోజనం లేకపోయిందని వారు చెప్పుకొచ్చారు. అలాంటప్పుడు సీనియర్ న్యాయమూర్తుల ముందున్న ప్రత్యామ్నాయాలు ఏమిటి? విలేకరుల సమావేశాలు ఏర్పాటుచేసి తమ ఆవేదన వ్యక్తంచేయడం ఒక్కటే ప్రత్యామ్నాయమా? లేక తమను నియమించే రాష్ట్రపతికి లేఖ రాయడం లేదా వ్యక్తిగతంగా కలిసి నివేదించే అవకాశం లేదా? ఇవేవీ కాకుండా అందుబాటులో ఉన్న ఇతర మార్గాలు ఏమిటన్నది ఇప్పుడు తేలాల్సి ఉంది.

ఒక్కొక్కరికి ఒక్కో రూలా?

మిగతా వ్యవస్థలలో మాదిరిగానే న్యాయ వ్యవస్థలో కూడా అవలక్షణాలు ప్రవేశించాయన్న అభిప్రాయం దేశ ప్రజలలో బలంగా ఉంది. న్యాయమూర్తులను ఏమైనా అంటే కోర్టు ధిక్కారం కింద శిక్షకు గురికావలసి వస్తుందన్న భయంతో ఎవరూ నోరు విప్పడం లేదు. ఇటీవల కాలంలో కొంతమంది న్యాయవాదులు కోర్టు హాలులోనే న్యాయమూర్తులకు సవాళ్లు విసురుతున్నారు. న్యాయ వ్యవస్థలోని అవలక్షణాల వల్ల కక్షిదారులు మాత్రమే కాదు– న్యాయమూర్తులకు కూడా అన్యాయం జరిగిన సందర్భాలు అనేకం. సుప్రీంకోర్టు కొలీజియంలో ఉన్నవారు తమకు ఇష్టమైన వారిని హైకోర్టు న్యాయమూర్తులుగా నియమించుకుంటారన్న అభిప్రాయం న్యాయ వ్యవస్థలో విస్తృతంగా ఉంది. తమకు కావలసిన వారు జాబితాలో లేని పక్షంలో అలాంటి జాబితాలను కొలీజియం అనేక సందర్భాలలో తిప్పి పంపింది. మన ఉమ్మడి హైకోర్టులో న్యాయమూర్తుల నియామకం విషయంలోనే ఇలా జరిగిందని ప్రచారంలో ఉంది. ఈ కారణంగా అర్హతలు ఉన్నవారు కాకుండా ప్రాపకం ఉన్నవారే హైకోర్టు న్యాయమూర్తులుగా నియమితులవుతున్నారన్న అపప్రథ బలంగా ఉంది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులుగా ఎవరికి అవకాశం ఇవ్వాలి? హైకోర్టు ప్రధాన న్యాయమూర్తుల నుంచి సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా ఎవరిని ఎంపిక చేయాలి? ఎవరిని ఏ రాష్ట్రానికి బదిలీ చేయాలి? మొదలైన విషయాలలో న్యాయ వ్యవస్థలో కూడా రాజకీయాలు చోటుచేసుకుంటాయని చెబుతారు. ఉమ్మడి రాష్ట్రంలో హైకోర్టు న్యాయమూర్తి ఒకరిని సకాలంలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమించకుండా జాప్యం చేసినందున ఆయనకు సుప్రీంకోర్టుకు వెళ్లే అవకాశం రాకుండా పోయిందన్న ప్రచారం ఉంది. చివరకు ఆయన వేరే రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పదవీ విరమణ చేశారు. అంతెందుకు ఇప్పుడు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని ఆక్షేపించినవారిలో ప్రముఖుడైన జస్టిస్ చలమేశ్వర్‌ను కూడా సకాలంలో సుప్రీంకోర్టుకు వెళ్లకుండా అడ్డుపడటం వల్ల అన్యాయం జరిగిందని చెబుతారు. సకాలంలో ఆయన సుప్రీంకోర్టుకు వచ్చి ఉంటే జస్టిస్ దీపక్ మిశ్రా కంటే ముందు ప్రధాన న్యాయమూర్తి అయి ఉండేవారని అంటారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమితుడు కావడంలో తనకు అన్యాయం జరుగుతున్నందుకు నిరసనగా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి పదవికి రాజీనామా చేయాలని కూడా జస్టిస్ చలమేశ్వర్ ఒక దశలో ఆలోచించారు. జస్టిస్ చలమేశ్వర్ సకాలంలో సుప్రీంకోర్టుకు రాకుండా అడ్డుపడింది కూడా అప్పుడు సుప్రీంకోర్టు సీనియర్ న్యాయమూర్తిగా ఉన్న తెలుగువాడేనని చెబుతారు. తనను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి కాకుండా అడ్డుపడ్డారన్న ఆవేదన జస్టిస్ చలమేశ్వర్‌లో ఇప్పటికీ ఉందని ఆయన సన్నిహితులు చెబుతుంటారు. తనకు అన్యాయం జరిగిందని ఆవేదన చెందే చలమేశ్వరే తాము హైకోర్టు న్యాయమూర్తులుగా నియమితులు కాకుండా అడ్డుపడ్డారని కొంతమంది న్యాయవాదులు ఆరోపిస్తుంటారు. ఈ విషయంలో జస్టిస్ చలమేశ్వర్ అభిప్రాయం మరోలా ఉంటుంది. హైకోర్టు, సుప్రీంకోర్టు న్యాయమూర్తుల నియామకంలో రాజకీయాలు చోటుచేసుకుంటున్నాయన్న భావన చాలాకాలంగా ఉంది. ఈ పెడధోరణి ఇప్పుడే మొదలు కాలేదు. తీర్పుల విషయంలో కూడా చాలామందికి చాలా అనుమానాలు ఉన్నాయి. ఉన్నత న్యాయస్థానాలలో కొన్ని సందర్భాలలో తీర్పులు అనుకూలంగా రావాలంటే న్యాయమూర్తులకు అనుకూలురైన న్యాయవాదులను నియమించుకుంటే సరిపోతుందన్న అభిప్రాయం కూడా న్యాయవాద వర్గాలలో ఎప్పటి నుంచో ఉంది. న్యాయ వ్యవస్థలోకి సైతం అవినీతి ప్రవేశించిందని న్యాయమూర్తులే పలు సందర్భాలలో వ్యాఖ్యానించారు. దీన్నిబట్టి న్యాయ వ్యవస్థ కూడా అవలక్షణాలకు అతీతం కాదని తేలిపోవడం లేదా? తాము సీనియర్లు అయినా అప్రధానమైన పోస్టింగులు ఇస్తున్నారని కార్యనిర్వాహక వ్యవస్థలో పనిచేసే ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు పలు సందర్భాలలో వాపోతుంటారు. కొంతమంది పోస్టింగులలో తమకు అన్యాయం జరుగుతోందంటూ న్యాయస్థానాలను ఆశ్రయించడం కూడా జరిగింది. ఇప్పుడు జస్టిస్ చలమేశ్వర్ నేతృత్వంలో నలుగురు న్యాయమూర్తులు లేవనెత్తిన అభ్యంతరం కూడా ఇటువంటిదే! సీనియర్లమైన తమ బెంచ్‌ల ముందు విచారణకు రావలసిన ముఖ్యమైన కేసులను తమ కంటే జూనియర్ న్యాయమూర్తుల బెంచ్‌లకు కేటాయిస్తున్నారన్నది వారి ప్రధాన ఆరోపణ! దీనికి సమాధానం చెప్పవలసింది ప్రధాన న్యాయమూర్తి మాత్రమే! అయితే సుప్రీంకోర్టులో గానీ, హైకోర్టులలో గానీ న్యాయమూర్తులందరూ సమానమే! సమానులలో ప్రధాన న్యాయమూర్తి ప్రథముడు మాత్రమే గానీ ఎక్కువ కాదు. ఈ విషయాన్ని జస్టిస్ చలమేశ్వర్ కూడా శుక్రవారంనాడు చెప్పారు. అలాంటప్పుడు ఏ కేసును ఏ బెంచ్‌కైనా కేటాయించవచ్చు కదా! సుప్రీంకోర్టు న్యాయమూర్తులందరూ సమానులే అయినప్పుడు సీనియర్, జూనియర్ అన్న తేడా ఎందుకుండాలి? అనుభవం ఉన్నవారు, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులుగా పనిచేసినవారే సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా నియమితులవుతారు. ఏ కేసును ఏ బెంచ్‌కు కేటాయించాలన్నది ప్రధాన న్యాయమూర్తి నిర్ణయిస్తుంటారు. ఇక్కడే లొసుగులు చోటుచేసుకుంటాయని న్యాయవాద వర్గాలు అంటూ ఉంటాయి. ఫలానా న్యాయమూర్తి ముందుకు కేసు వస్తే చాలు– అనుకూలంగా తీర్పు వస్తుందన్న అభిప్రాయం కూడా కక్షిదారులలో ఉంది. మొత్తంమీద విమర్శలు, ఆరోపణలకు అతీతం కాని దుస్థితికి న్యాయ వ్యవస్థ చేరిందని మనమందరం భావించవచ్చు. జస్టిస్ చలమేశ్వర్ నేతృత్వంలోని నలుగురు న్యాయమూర్తుల చర్యను సమర్థిస్తున్నవారు– విమర్శిస్తున్నవారు కూడా ఉన్నారు. న్యాయ వ్యవస్థ తీసుకునే నిర్ణయాలపై ఎప్పుడూ భిన్నాభిప్రాయాలు ఉంటూ ఉంటాయి. ఎందుకంటే ఒక్కో న్యాయమూర్తి ఒక్కో దృక్కోణంలో కేసులను పరిశీలించి తీర్పులు ఇస్తుంటారు కనుక! ఈ కారణంగా నలుగురు న్యాయమూర్తుల చర్య ప్రశ్నార్థకం అయ్యింది. బహిరంగంగా విలేకరుల సమావేశం పెట్టి తమ అభిప్రాయాలు వ్యక్తంచేయడానికి వారి కారణాలు వారికి ఉండవచ్చు. అయితే వారు ఎంచుకున్న మార్గం సమర్థనీయమా? కాదా? అని ఎవరు చెప్పాలి? సుప్రీంకోర్టు పరువు తీసినందుకు ఆ నలుగురినీ కోర్టు ధిక్కారం కింద శిక్షించగలరా? అది సాధ్యం కానపుడు జస్టిస్ కర్ణన్‌ను ఎందుకు శిక్షించినట్టు? కొలీజియం నిర్ణయాలు గానీ, ప్రధాన న్యాయమూర్తి వ్యవహారశైలి గానీ సరిగా లేని విషయం నిజమే అయితే జస్టిస్ కర్ణన్ విమర్శలలో కూడా వాస్తవం ఉండి ఉండాలి కదా? సుప్రీంకోర్టు గౌరవానికి భంగం కలిగించినందుకు జస్టిస్ కర్ణన్‌ను శిక్షించినట్టు విస్తృత ధర్మాసనం అప్పట్లో పేర్కొంది. ఇప్పుడు నలుగురు న్యాయమూర్తుల చర్య సుప్రీంకోర్టు గౌరవాన్ని భంగపరచినట్టు కాదా? సుప్రీంకోర్టులో అవాంఛనీయ పరిణామాలు చోటుచేసుకుంటున్నాయనీ, కేసుల కేటాయింపులో పద్ధతి లేకుండా పోవడం వల్లనే విధిలేని పరిస్థితులలో బయటపడాల్సి వచ్చిందని ప్రధాన న్యాయమూర్తిపై తిరుగుబాటు బావుటా ఎగురవేసిన నలుగురు న్యాయమూర్తులూ చెప్పుకొచ్చారు. ఇలా అయితే ప్రజాస్వామ్యానికే ముప్పు అని కూడా ఆందోళన చెందారు. వారి ఆవేదనలో అర్థం ఉండవచ్చు గానీ, అందుకు వారు ఎంచుకున్న మార్గమే అభ్యంతరకరంగా ఉందని మెజారిటీ న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. మొత్తంమీద ఈ నలుగురు న్యాయమూర్తులూ న్యాయ వ్యవస్థలో సరికొత్త సంప్రదాయానికి తెర తీశారు. ఈ పరిణామం ఇకపై న్యాయ వ్యవస్థలో ఎలాంటి విపరీత పోకడలకు దారితీస్తుందో చూడాలి. ఈ చర్యను ఆదర్శంగా తీసుకుని ఇకపై వివిధ రాష్ట్రాలలోని హైకోర్టులలో కూడా ప్రధాన న్యాయమూర్తిపై న్యాయమూర్తులు తిరుగుబాటు బావుటా ఎగురవేస్తే పరిస్థితి ఏమిటి? అలాంటి ధోరణులను చక్కదిద్దవలసిన సుప్రీంకోర్టుకు ఇకపై ఆ నైతిక హక్కు ఉంటుందా? న్యాయ వ్యవస్థలోనే లుకలుకలు ఏర్పడితే దాని ఔన్నత్యం ఏమి కావాలి? సుప్రీంకోర్టు అంటే కిందిస్థాయి న్యాయ వ్యవస్థకే కాదు– ఈ దేశ ప్రజలందరికీ గౌరవంతో పాటు భయం– భక్తి కూడా ఉండేవి. ఇప్పుడు ఇలా బజారున పడిన తర్వాత ఆ పరిస్థితి ఉంటుందా? మనకు, సుప్రీంకోర్టు న్యాయమూర్తులకు తేడా ఏమిటి? అని సామాన్య ప్రజలు ప్రశ్నించుకోరా?

> **ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రాను ఆక్షేపించిన వారిలో జస్టిస్ రంజన్ గొగోయ్ ఒకరు. ఈయన జస్టిస్ మిశ్రా తర్వాత ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించబోతున్నారు. ఆ స్థాయిలో ఉన్న న్యాయమూర్తి కూడా విలేకరుల సమావేశంలో పాల్గొనడం ఆశ్చర్యం కలిగించకమానదు. కారణాలు ఎంతటి బలమైనవి అయినప్పటికీ నియమావళికి కట్టుబడి ఉండాలని ఇతరులకు చెప్పే న్యాయమూర్తులు తమకు మాత్రం ఏ నియమావళీ ఉండదని ఎలా భావిస్తున్నారో తెలియదు.**

తమకు అన్యాయం జరిగిందంటూ కోర్టులను ఆశ్రయించే వారిని వివిధ స్థాయిలలోని న్యాయమూర్తులు అడిగే మొదటి ప్రశ్న "మీరు ముందుగా సమస్య పరిష్కారానికి సంబంధించిన వేదిక వద్దకు వెళ్లారా?" అన్నది. హైకోర్టు స్థాయిలో పరిష్కారం కావలసిన సమస్యలను సుప్రీంకోర్టు దృష్టికి తీసుకువెళ్లినప్పుడు ముందుగా హైకోర్టును ఆశ్రయించండి అని సూచిస్తుంటారు. ఈ సూత్రం ఆ నలుగురు న్యాయమూర్తులకు వర్తించదా? అన్నదే ఇప్పుడు ప్రశ్న. తమ ముందు మరో ప్రత్యామ్నాయం ఏదీ లేకనే మీడియా ముందుకు వచ్చామని వారు చెబుతున్నారు. ప్రత్యామ్నాయం లేని పరిస్థితి ఉంటే ప్రత్యామ్నాయం ఏర్పాటు చేసుకునే అధికారం, సమర్థత సుప్రీంకోర్టుకు ఉంటుంది కదా! ఇతర వ్యవస్థలలో ఇలాంటి పరిస్థితి ఉంటే ప్రత్యామ్నాయ వ్యవస్థ ఏర్పాటుకు తగు చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు న్యాయమూర్తులే ఆదేశిస్తుంటారు కదా! తమ విషయం వచ్చేసరికి అలా ఎందుకు చేయలేకపోయారు? తమను తామే నియమించుకునే అధికారం ఉన్నవారు కేసుల కేటాయింపు నుంచి అన్ని విషయాలకూ మార్గదర్శకాలు రూపొందించుకోలేరా? అన్న సందేహం సామాన్యులకు కలగకుండా ఎందుకుంటుంది? మన దేశంలో ప్రతి వ్యవస్థకూ కొన్ని కట్టుబాట్లు ఉంటాయి. ఈ కట్టుబాట్లకు న్యాయ వ్యవస్థ మాత్రం అతీతం ఎలా అవుతుంది? ప్రధాన న్యాయమూర్తి గానీ, మరో న్యాయమూర్తి గానీ న్యాయంగా వ్యవహరించనప్పుడు సరిదిద్దుకునే వ్యవస్థ ఉండాలి కదా! ఇతర వ్యవస్థలలోని తప్పొప్పులను ఎత్తిచూపే న్యాయ వ్యవస్థ తనలోని తప్పొప్పులను కూడా గుర్తించి సరిదిద్దుకోవడానికై ఆత్మపరిశీలన చేసుకోవలసిన తరుణం ఆసన్నమయ్యింది. అలా కాకుండా అంతా మా ఇష్టం అనుకుంటే ఎవరూ చేయగలిగింది ఏమీ ఉండదు గానీ సుప్రీంకోర్టు అన్నా, అది ఇచ్చే తీర్పులన్నా ప్రజలకు గౌరవం పోయే పరిస్థితి వస్తోంది. కేసు విచారణకు హాజరయ్యే కక్షిదారులకు డ్రెస్ కోడ్ ఉండాలనీ, జీన్స్ ప్యాంట్లు, టీ షర్టులు వంటివి వేసుకోకూడదని న్యాయమూర్తులు మందలించిన వార్తలు విన్నాం. అలాంటప్పుడు న్యాయమూర్తులు కూడా ఉన్నతంగా వ్యవహరించాలని ఆశించే హక్కు పౌరులకు లేదా? న్యాయ వ్యవస్థపై అజమాయిషీ చేయడానికి రాజకీయ వ్యవస్థ కాచుకుని ఉంది. ఆ అవకాశం రాజకీయ వ్యవస్థకు ఇవ్వాలా? లేదా? అన్నది న్యాయమూర్తులే తేల్చుకోవాలి. కేసులను ఏ బెంచ్‌కు కేటాయించాలన్న విషయంలో పూర్తి అధికారం ప్రధాన న్యాయమూర్తులకే ఉంటుంది. ఈ విషయాన్ని గతంలో ఏర్పాటైన రాజ్యాంగ ధర్మాసనం కూడా ధ్రువీకరించింది. జస్టిస్ లోయా మృతి కేసును సీనియర్ల బెంచ్‌కు కాకుండా జూనియర్లున్న డివిజన్ బెంచ్‌కు కేటాయించడం ఏమిటన్న ప్రశ్నను జస్టిస్ చలమేశ్వర్ ప్రభృతులు లేవనెత్తారు. ఏ కేసునైనా మొదట డివిజన్ బెంచ్‌కే కేటాయిస్తారనీ, కేసు ప్రాధాన్యాన్ని బట్టి ఆ కేసును విస్తృత ధర్మాసనం చేపట్టాలా? లేదా? అన్నది డివిజన్ బెంచ్ నిర్ణయిస్తుందని న్యాయ నిపుణులు చెబుతున్నారు. ఎంవోపీ విషయంలో కూడా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సరిగ్గానే వ్యవహరించారనీ, ఇందుకు గత తీర్పులే నిదర్శనమనీ న్యాయవాద వర్గాలు చెబుతున్నాయి. ఆయా కేసుల విచారణ మధ్యలో సంబంధిత కేసులను ఆ కేసును విచారిస్తున్న న్యాయమూర్తి నుంచి తప్పించి మరొకరికి అప్పగించే అధికారం కూడా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి ఉంటుందని ఇంతకు ముందు తీర్పులు చెబుతున్నాయి. కేసుల కేటాయింపు విషయంలో మార్గదర్శకాలు లేనప్పుడు ఆ విషయాన్ని అభ్యంతరపెట్టడం ఏమిటని న్యాయ నిపుణులు ప్రశ్నిస్తున్నారు. జరుగుతున్న పరిణామాలను రాజకీయ పార్టీలు ఆసక్తితో గమనిస్తుండగా, సామాన్యులు మాత్రం నిశ్చేష్టులై చూస్తున్నారు. నలుగురు న్యాయమూర్తుల విలేకరుల సమావేశం తర్వాత సీపీఐ నాయకుడు డి.రాజా, జస్టిస్ చలమేశ్వర్‌ను ఆయన నివాసంలో కలుసుకోవడం కూడా వివాదాస్పదం అవుతోంది. ఒకసారి వివాదానికి తెర లేపితే అన్నీ వివాదాలే అవుతాయి. ఈ పరిణామాలను తనకు అనుకూలంగా మలచుకోవడానికై అధికార భారతీయ జనతా పార్టీ సిద్ధంగా ఉంది. మొత్తంమీద న్యాయమూర్తుల మధ్య తలెత్తిన విభేదాలు న్యాయ వ్యవస్థపైనా, ప్రత్యేకంగా న్యాయమూర్తుల గౌరవంపైనా తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. వారి గౌరవాన్ని అవి మంటగలిపాయి. ఎవరో ఒకరు మధ్యవర్తిత్వం వహించి ఈ వివాదాన్ని పరిష్కరించవచ్చు గానీ, న్యాయ వ్యవస్థకు జరిగిన అగౌరవాన్ని ఎవరు తొలగిస్తారు అన్నదే ఇప్పుడు ప్రశ్న. 'కోడలికి బుద్ధి చెప్పాల్సిన అత్తే తెడ్డు నాకినట్టు' ఇతర వ్యవస్థలు దారితప్పకుండా కాపాడాల్సిన న్యాయ వ్యవస్థ దారితప్పి కట్టుబాటు తెంచుకుంటే మన గతి ఏమిటి? అయిపోయింది– అంతా సర్వనాశనం అయ్యింది. న్యాయ వ్యవస్థకు గానీ, మరొకరికి గానీ ఎవరి ప్రయోజనాలు వారికి ముఖ్యమని తేలిపోయింది కదా? న్యాయ వ్యవస్థకు కూడా జవాబుదారీతనం ఉండాల్సిన అవసరాన్ని తాజా పరిణామాలు మరోమారు గుర్తుచేస్తున్నాయి!

> **తమకు అన్యాయం జరిగిందంటూ కోర్టులను ఆశ్రయించేవారిని వివిధ స్థాయిలలోని న్యాయమూర్తులు అడిగే మొదటి ప్రశ్న "మీరు ముందుగా సమస్య పరిష్కారానికి సంబంధించిన వేదిక వద్దకు వెళ్లారా?" అన్నది. హైకోర్టు స్థాయిలో పరిష్కారం కావలసిన సమస్యలను సుప్రీంకోర్టు దృష్టికి తీసుకువెళ్లినప్పుడు ముందుగా హైకోర్టును ఆశ్రయించండి అని సూచిస్తుంటారు. ఈ సూత్రం ఆ నలుగురు న్యాయమూర్తులకు వర్తించదా? అన్నదే ఇప్పుడు ప్రశ్న. తమ ముందు మరో ప్రత్యామ్నాయం ఏదీ లేకనే మీడియా ముందుకు వచ్చామని వారు చెబుతున్నారు. ఇతర వ్యవస్థలలో ఇలాంటి పరిస్థితి ఉంటే ప్రత్యామ్నాయ వ్యవస్థ ఏర్పాటుకు తగు చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు న్యాయమూర్తులే ఆదేశిస్తుంటారు కదా! తమ విషయం వచ్చేసరికి అలా ఎందుకు చేయలేకపోయారు?**

యూట్యూబ్‌లో 'కొత్త పలుకు' కోసం
http://www.youtube.com/abntelugutv

కుక్కుట సందేశం

ఊసుపోక

కోళ్లన్నాక ఎదురుపడితే కొట్లాడుకుంటాయ్! అది వాటి అలవాటు!! కొట్లాటన్నాక చూడ్డానికి చుట్టూ నలుగురు గుమికూడతారు. చూస్తున్నప్పుడు ఏది గెలుస్తుందన్న కుతూహలం సహజం కదా! మనుషులు కొట్లాడుకుంటే ఆపొచ్చుగానీ... కోళ్లు కొట్లాడుకుంటే ఎలా ఆపగలం? దీనికి సుప్రీంకోర్టు మాత్రం ఏం చేస్తుంది? అని ప్రశ్నించాడు గోదావరి జిల్లాలకు చెందిన ఓ ఎమ్మెల్యే! సంక్రాంతి కోడి పందేలను సుప్రీంకోర్టు కూడా ఆపలేదని ఆయన తనదైన గోదావరి ఎటకారంలో చెప్పారన్నమాట!

ఆయన ఏ సంక్రమణ ముహూర్తంలో ఆ మాటన్నారోగానీ... కోళ్ల కొట్లాటను 'ఆపాల్సిన ఢిల్లీ పెద్ద మనుషులు' తామే పందెం కోళ్లలా కొట్లాడుకోవడం మొదలుపెట్టారు. ఇది కలికాలవైపరీత్యం అని కొందరు వాపోయారు. కానీ వారికి తెలియని సంగతి ఏమిటంటే.. కొక్కొరొకో అంటూ పొద్దున్నే అందర్నీ నిద్రలేపే కోడిగారికి కాలజ్ఞాని అనే పేరు కూడా ఉంది. పందెం కోళ్ల సంగతి తేల్చే రోజే ఢిల్లీలోనూ 'పందెం కోళ్లు' పరస్పరం తలపడడం కాకతాళీయమని ఎలా అనుకోగలం?! ద్విజులు శ్రేష్ఠులని కదా పెద్దలు చెప్పింది. ద్వి–జులంటే రెండు పుట్టుకలు కలవారు అని అర్థం. కోడి కూడా ద్విజనే. అది ఒకసారి గుడ్డు రూపంలో పుడుతుంది. తర్వాత కోడి రూపం దాలుస్తుంది. అందువల్లే దానికంత కాల జ్ఞానం అబ్బిందేమో!

కోడి తలే చాలా చిన్నగా ఉంటుంది. ఇక అందులో మెదడేం ఉంటుంది? జ్ఞానం ఏముంటుంది? అని కొందరి సందేహం. అందుకే తెలివి తక్కువ వాడిని.. 'కోడి మెదడు' అని ఈసడింపుగా తీసేస్తారు. కానీ నిజానికి కోడి జీవితమే ఒక సందేశం.

గుడ్డుగా పుట్టినప్పటి నుంచి కోడిలా చచ్చిపోయేదాకా అన్ని రూపాల్లోనూ అది ఉపయోగపడుతుంది. రాజ్యాన్ని రాసిచ్చిన బలి చక్రవర్తికన్నా, తొడ కోసిచ్చిన శిబి చక్రవర్తికన్నా, కొడుకునే వండిపెట్టిన సిరియాళుడి తండ్రికన్నా, తానే ఆహారంగా మారిన జీమూత వాహనుడికన్నా కోడి చాలా గొప్పది. అది మన కోసమే పుడుతుంది. మన కోసం ఆత్మార్పణం చేసుకుంటుంది. 'పరోపకారార్థమిదం శరీరం' అన్న ఆర్యోక్తికి అచ్చు నిదర్శనం కోడి!

కోడి పక్షి. కానీ అన్ని పక్షుల్లా ఎగరదు. ఎంత అవసరమో అంతే ఎగురుతుంది! అతి ఆరాటం పనికిరాదని దీని అర్థం. కోడి జంతువు కాదు. కానీ పెంపుడు జంతువులా మసలగలదు. మనల్నే నమ్ముకుని, మన ఇంట్లోనే ఉంటూ, మన కోసమే, కోసేంత దాకా వేచి చూసేంత ఓపిక ఎవరికి ఉంటుంది చెప్పండి! మనం బుట్టకింద కమ్ముకోవచ్చు. చికెన్ చేసి కుమ్ముకోవచ్చు. లేదా అమ్ముకోవచ్చు. పెంచుకున్న అనుబంధాన్ని మనం క్షణాల్లో తుంచుకుంటాం. మనం కోడిని మోసం చేస్తామే గానీ, కోడిగారు మనల్ని ఎప్పుడూ మోసం చేయదు! అదీ కోడి సహృదయత!

> **కోడి పక్షి. కానీ అన్ని పక్షుల్లా ఎగరదు. ఎంత అవసరమో అంతే ఎగురుతుంది! అతి ఆరాటం పనికిరాదని దీని అర్థం. కోడి జంతువు కాదు. కానీ పెంపుడు జంతువులా మసలగలదు. మనల్నే నమ్ముకుని, మన ఇంట్లోనే ఉంటూ, మన కోసమే, కోసేంత దాకా వేచి చూసేంత ఓపిక ఎవరికి ఉంటుంది చెప్పండి!**

ఇంటి మీదో, పెంట మీదో దొరికే పురుగో పుట్రో, చెత్తో చెదారమో తింటుంది. సూర్యోదయం కాకముందే నిద్ర లేస్తుంది. తాను లేవడమే కాదు; అందరినీ నిద్ర లేపి పనిలోకి వెళ్లాలంటూ పురమాయిస్తుంది. అంతకుమించి ఏ సౌకర్యమూ దానికి అక్కర్లేదు. ఎన్ని మంచి అలవాట్లు! ఎంత సింపుల్ లైఫ్! ఎప్పుడు ఖర్చై పోతామో తెలియని ఇంతోటి జీవితానికి ఇంత కన్నా ఎక్కువ ఉరుకులాట అవసరమా? అన్నది కోడిగారు ఇస్తున్న సందేశం.

సాయంత్రమైతే తనను గంప కింద కమ్మేస్తారని కోడికి తెలుసు. అయినా అది ఒక పట్టాన దొరకదు. పట్టుకోవాలంటే ముప్పుతిప్పలు పడాల్సిందే! కోడి ఊరికే అలా ఉరుకుతుందనుకుంటున్నారా? రోజూ ఎంతో కొంత సేపు పరుగెత్తితేనే యజమానికి షుగరూ, బీపీ రాకుండా ఉంటాయన్నది దాని సదుద్దేశం! మనమూ దీన్ని గుర్తించాలి. పొద్దస్తమానం చికెన్ తిని తొంగొని సోఫాలో కూర్చుని రిమోట్ నొక్కుతూ టీవీ చూడకుండా.. బజార్లో తిరిగి బేజారయ్యేంత చెమట కార్చాలి. అప్పుడే రోగాలు రాకుండా ఉంటాయి మరి!

మనం ఓపిక ఉన్నా ఒక్కరి కంటే ఎక్కువ కనం. పిల్లో పిల్లాడో పుట్టగానే... ముడ్డి కూడా సరిగ్గా కడుక్కోలేని వాడికి కూడా బలవంతంగా న్యాపీ ప్యాడ్స్ బిగించి బండెల దొడ్డిలాంటి బళ్లో వేస్తాం. గద్దల్లా పొడుచుకు తినే ఇంగ్లిషు చదువులకు ఎరగా వేస్తాం. మరి పెట్టమ్మ ఏం చేస్తుంది? గంపెడంత మంది పిల్లల్ని కంటుంది. వెంట తిప్పుకొంటూ బతుకు తెరువు నేర్పిస్తుంది. గద్దల్లాంటివి కనిపిస్తే రెక్కల కింద దాచుకుని కాపాడుకుంటుంది తప్ప మనలా వాటికే అప్పగించదు! ఫారం కోళ్లలా పిల్లల్ని పెంచుతున్న మమ్మీడాడీ నేర్చుకోవాల్సిన సంగతిది!

పెళ్లిళ్లకు, ఫంక్షన్లకు మనం చెత్తా చెదారం కొనుక్కెళ్లి గిఫ్టులుగా చదివిస్తాం. కోడిని చూసి నేర్చుకోవాలి! కోడి గుడ్డు పెడుతుంది. దాన్నిండా ఎన్ని పోషకాలు! ఇచ్చేదేదో పనికొచ్చేది ఇవ్వు అన్నది కోడి– గుడ్డు చెప్పే గూఢార్థం.

కోడి రోజుకు ఒక గుడ్డే పెడుతుంది. 'పెట్ట'లేక కాదు! నీ దగ్గరున్నవన్నీ ఒకేసారి ఇచ్చేస్తే, ఆ క్షణంతో నీ పని అయిపోయినట్టేనన్నది అంతరార్థం. కొడుకులను నమ్మి, ఆస్తులన్నీ రాసిచ్చి, ప్రాణాలు పోగొట్టుకుంటున్న అమ్మానాన్నలు గుర్తించాల్సిన గుట్టిది!

కోడి నిద్ర అని ఎకసెక్కాలాడుతాంగానీ అది చాలా విశిష్టం. కన్ను మూసిందో, తెరిచిందో తెలియదు. కానీ నిద్ర మాత్రం పూర్తవుతుంది. ఎవడెప్పుడు వెన్నుపోటు పొడుస్తాడో తెలియని ఈ కాలంలో కోడి నిద్రకన్నా మించిన అప్రమత్తత ఏముంటుంది. ఎన్నికల సమయంలో నాయకులు గుర్తించాల్సిన అంశమిది!!

అలనాడు పలనాడు తరహాలో రాజులు చేతుల్లో కత్తులు పట్టుకుని కుత్తుకలు కోసుకునేవారు. ప్రజాస్వామ్య యుగంలో మీకా శ్రమ ఎందుకంటూ పుంజుగారే పుంజుకుని రంగంలోకి దిగారు. కాళ్లకు కత్తులు కట్టించుకుని మారాజుల తరఫున రంజైన రణం చేస్తున్నారు. వెధవ డబ్బు పోతే పోయింది గానీ ఎంత జన నష్టం తప్పింది! కోళ్లకు తెలంగాణ ప్రాంతీయ భావ



నలు లేవు. గెలిపించామా? లేదా? విజయమా? వీర వంటకమా? అంతే!!

చివరాఖరు: ఈసారి సంక్రాంతి పండుగ మూడు రోజులు కాదు; ఏకంగా ఏడాది! వచ్చే ఏడాదే ఎన్నికలు కనుక అప్పుడే 'పెత్తనా'యణ పుణ్యకాలం మొదలైంది. సంవత్సరమంతా రాజకీయ బొమ్మల కొలువే! ఓట్లేసేదాకా లీడర్ హరిదాసులు చిరతలు కొడుతూనే ఉంటారు. సంక్రాంతి పురుషులు పథకాల ముగ్గులోకి దింపుతుంటారు. గాలి మాటలతో గాలి పటాలు ఎగరేసి గాలం వేస్తారు. అవతలి పార్టీలో భోగి మంట పెట్టి ఇవతలి పార్టీవారు చలి కాచుకుంటారు. అధినాయకుడు ఆటకు తలాడించే డూడూ బసవన్నలు సరేసరి! అర్థంకానిదేమంటే... ఒకరికొకరం తోడుంటూ సహజీవనం సాగించాలని వేసే రథం ముగ్గును సీపీఎం ఒకవైపు నుంచి, సీపీఐ మరో వైపు నుంచి మొదలుపెట్టింది. ఆ ముగ్గులేమో ఎక్కడా కలిసేట్టు లేవు. పాపం లెఫ్ట్ పార్టీలు.. ఏమైపోతాయో.. ఎక్కడ తేలతాయో!

■ కృ.తి.
kruthi1972@gmail.com

రికార్డులకెక్కిన రంగవల్లి



సంక్రాంతి సందర్భంగా పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో వేసిన భారీ ముగ్గు వండర్ బుక్ ఆఫ్ రికార్డుల్లోకి ఎక్కింది. జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో రామగుండం ముంగిట్లో రంగుల హరివిల్లు' పేరిట నిర్వహించిన కార్యక్రమంలో 500 మంది మహిళలు పాల్గొని 1,800 చదరపు గజాల విస్తీర్ణంలో 1,930 చుక్కలతో ఈ భారీ ముగ్గు వేశారు. ఇందులో తెలంగాణ మ్యాప్, సింగరేణి, ఎన్టీపీసీ, రామగుండం మునిసిపల్ కార్పొరేషన్ లోగోలను రూపొందించారు. ఈ ముగ్గును చూసిన వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధి రంగజ్యోతి నిర్వాహకులకు ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. - గోదావరిఖని



అంతర్జాతీయంగా పేరొందిన పోచంపల్లి ఇక్కత్ చీరలు భేష్ అని హైదరాబాద్ లోని యూఎస్ ఎంబసీ కాన్సుల్ జనరల్ కేథరిన్ బీ హడ్డా అన్నారు. శనివారం యాదాద్రి-భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లిని ఆమె సందర్శించారు. కనుముకుల హ్యాండ్లూమ్ పార్కును, పోచంపల్లి లోని చేనేత మగ్గాలు సందర్శించారు. ఇక్కత్ డిజైన్లను పరిశీలించి నేత కార్మికుల పనితీరును ప్రశంసించారు. - భూదాన్‌పోచంపల్లి

తియ్యని వేడుక



సికింద్రాబాద్‌లోని పరేడ్ మైదానంలో ఇంటర్నేషనల్ స్వీట్ ఫెస్టివల్ శనివారం అట్టహాసంగా ప్రారంభమైంది. దేశ, విదేశాల నుంచి ఔత్సాహికులు ఈ ఫెస్టివల్‌లో పాల్గొన్నారు. కొలువుదీరిన రకరకాల స్వీట్లను కొనుగోలు చేయడానికి జనం భారీగా వచ్చారు.



సమావేశంలో మాట్లాడుతున్న స్పీకర్

విశ్వబ్రాహ్మణుడిగా పుట్టడం అదృష్టం

▸▸ స్పీకర్ మధుసూదనాచారి

హైదరాబాద్, జనవరి 13: విశ్వబ్రాహ్మణుడిగా పుట్టడం పూర్వ జన్మ సుకృతం అని శాసన సభ స్పీకర్ మధుసూదనాచారి అన్నారు. శనివారం రవీంద్రభారతిలో తెలంగాణ విశ్వబ్రాహ్మణ అర్చక పురోహితుల సంఘం మహా సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మధుసూదనాచారి మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణుల సమస్యల పట్ల సీఎం కేసీఆర్‌కు సంపూర్ణ అవగాహన ఉందన్నారు. అన్ని వర్గాల అభివృద్ధికి కృషి చేస్తున్న సీఎం కేసీఆర్ విశ్వబ్రాహ్మణుల అభివృద్ధికి బాటలు వేస్తారని చెప్పారు. విశ్వబ్రాహ్మణులు ఐక్యంగా ఉండాలని సూచించారు. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి విశ్వ బ్రాహ్మణుల వేద పాఠశాలలకు ప్రభుత్వ సహకారం అందిస్తుందని తెలిపారు. ప్రభుత్వం త్వరలోనే విశ్వ బ్రాహ్మణుల సమస్యలు పరిష్కరిస్తుందని అన్నారు.

ఐక్యతతోనే బీసీల సమస్యల పరిష్కారం

▸▸ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్



అభివాదం చేస్తున్న సుధారాణి, జాజుల తదితరులు

కాళోజీ జంక్షన్, జనవరి 13: ఐక్యతతోనే బీసీల సమస్యలు పరిష్కారం అవుతాయని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. శనివారం వరంగల్ అర్బన్ జిల్లా కేంద్రంలోని కాకతీయ యూనివర్సిటీ ప్రాంగణంలో బీసీ ఉపాధ్యాయల సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బీసీ ఉపాధ్యాయినులకు సావిత్రి బాయి పూలే ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ బీసీ ఉపాధ్యాయులకు పదోన్నతుల్లో రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈనెల 28న హైదరాబాద్‌లో బీసీ ఉద్యోగుల మహాసభను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర ఆర్థిక సహకార సంస్థ చైర్‌పర్సన్ గుండు సుధారాణి మాట్లాడుతూ.. నేటి మహిళలకు సావిత్రిబాయి పూలే ఆదర్శమని అన్నారు. కేంద్రం తీసుకువస్తున్న మహిళాల బిల్లులో బీసీ మహిళలకు ప్రత్యేక కోటా కల్పించాలన్నారు. అనంతరం 200 మంది ఉపాధ్యాయినులకు సావిత్రిబాయి పూలే అవార్డుతో పాటు ప్రశంస పత్రాలు అందజేశారు.

'భగీరథ' పనుల్లో కూలీ మృతి

పాల్వంచ రూరల్, జనవరి 13: మిషన్ భగీరథ పనుల్లో విద్యుత్ షాక్‌కు గురై ఉత్తరప్రదేశ్‌కు చెందిన వలస కూలీ మృతి చెందాడు. ఈ ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలో జరిగింది. పాల్వంచలోని శ్రీనివాసకాలనీలో మిషన్ భగీరథ పనులు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శనివారం ఎక్స్‌కవేటర్‌తో లారీలో ఉన్న సిమెంట్‌పైపులను కాల్వలోకి దించుతున్నారు. అక్కడ పని చేస్తున్న కూలీ చట్టు(21) కూలీ సిమెంట్‌పైపును పట్టుకుని కాల్వలోకి మళ్లిస్తున్నాడు. ఎక్స్‌కవేటర్‌కు పైన ఉన్న విద్యుత్ తీగలు పైపులకు తగిలి చట్టు విద్యుదాఘాతంతో మృతి చెందాడు.

'ఔషధ ప్రయోగం'పై పోలీసుల కుట్ర

హెచ్‌ఆర్సీకి నాగరాజు కుటుంబ సభ్యుల ఫిర్యాదు.. ఎనిమిది నెలలు గడిచినా కొలిక్కిరాని మృతి కేసు

▸▸ ఎఫ్ఎస్ఎల్ రిపోర్ట్ పేరిట పోలీసుల కాలయాపన

▸▸ ఫార్మా కంపెనీని తప్పించే యత్నమంటున్న బాధితులు



నాగరాజు (ఫైల్)

జమ్మికుంట రూరల్, జనవరి 13: ఫార్మా కంపెనీ ఔషధ ప్రయోగం బారిన పడి మృతి చెందిన వంగర నాగరాజు కేసు మానవహక్కుల కమిషన్ (హెచ్‌ఆర్సీ)కు చేరింది. నాగరాజు మృతి చెంది ఎనిమిది నెలలు గడిచినా పోలీసులు ఎటువంటి చర్యలూ తీసుకోకుండా.. ఉద్దేశపూర్వకంగానే జాప్యం చేస్తున్నారంటూ అతని కుటుంబ సభ్యులు శనివారం హెచ్‌ఆర్సీకి ఫిర్యాదు చేశారు. ఎఫ్ఎస్ఎల్ రిపోర్ట్ పేరిట పోలీసులు కాలయాపన చేస్తున్నారని, ఫార్మా కంపెనీని కేసు నుంచి తప్పించేందుకు కుట్ర పన్నారని ఆరోపించారు. జమ్మికుంట మండలం నాగంపేట గ్రామానికి చెందిన వంగర నాగరాజు ఔషధ ప్రయోగానికి గురై.. గత ఏడాది జూన్ 2వ తేదీన మృతి చెందిన విషయం తెలిసిందే. అతడు వడదెబ్బ కారణంగా చనిపోయినట్లు తొలుత భావించిన కుటుంబ సభ్యులు.. నాలుగు రోజుల తరువాత అతని బ్యాగ్‌లో బెంగళూరులోని లోటస్ ఫార్మా కంపెనీకి చెందిన పత్రాలను గుర్తించారు. నాగరాజుపై ఆ కంపెనీ ఔషధ ప్రయోగానికి పాల్పడినట్లు తెలుసుకున్నారు. అనంతరం ఈ సంఘటనను 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తీసుకువచ్చింది. పూర్తి ఆధారాలతో జూన్-16న మృతుడి భార్య అనసూర్య లోటస్ ఫార్మా కంపెనీపై ఫిర్యాదు చేశారు. దీంతో కేఎంసీ వైద్య బృందం జూన్ 19న నాగరాజు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించింది. నెల రోజుల అనంతరం రిపోర్టు సమర్పించగా.. హిస్టో ప్యాథాలజీ రిపోర్ట్ క్లారిటీ లేదంటూ, 8రకాల టెస్టులకు సంబంధించి ఎఫ్ఎస్ఎల్‌కు పంపారు. ఎఫ్ఎస్ఎల్ రిపోర్ట్ వస్తే గాని విచారణ ముందుకు సాగదంటూ పోలీసులు చెబుతున్నారు. అయితే గత నవంబరులో కొత్తపల్లి గ్రామానికి చెందిన ఆశోక్‌కుమార్ అనే వ్యక్తి కూడా లోటస్ ఫార్మా కంపెనీ ఔషధ ప్రయోగానికి గురై మతి స్థిమితం కోల్పోయిన సంఘటన వెలుగు చూడడంతో మరోసారి దుమారం రేగింది. ఈ సందర్భంగా పోలీసులు నాగరాజు కుటుంబాన్ని స్టేషన్‌కు పిలిపించి నెల రోజుల్లో ఎఫ్ఎస్ఎల్ రిపోర్ట్ వస్తుందని, దాని ఆధారంగా వెంటనే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కానీ, వాయిదాలు వేసుకుంటూ దాటవేస్తున్నారే తప్ప.. తమకు న్యాయం చేయడం లేదంటూ బాధిత కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కేసును సీఐ ప్రశాంత్‌రెడ్డి పక్కదోవ పట్టించేందుకు యత్నిస్తునాన్నరంటూ మృతుడు నాగరాజు కుమారుడు శ్రీనివాస్ హెచ్‌ఆర్సీకి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదును స్వీకరించిన హెచ్‌ఆర్సీ.. ఔషధ ప్రయోగానికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు, పోలీసులకు ఎప్పుడు ఫిర్యాదు చేశారు వంటి పత్రాలు తీసుకొని ఈ నెల 16న రావాలని బాధిత కుటుంబానికి సూచించారు.



కాశీవిశ్వనాథ్, జయంత్, అజయ్ (ఫైల్)

కుటుంబ కలహాలకు ముగ్గురు బలి

▸▸ ఇద్దరు కుమారులతో సహా రైలు కింద పడిన హోంగార్డ్

ఖమ్మం క్రైం జనవరి 13: ఖమ్మం రైల్వే స్టేషన్ పరిధిలో ఒక వ్యక్తి తన ఇద్దరు కుమారులతో ఆత్మహత్య చేసుకున్నాడు. ఖమ్మం జిల్లా కల్లూరుకు చెందిన నేరేళ్ల విశ్వనాథ్ (40) కొత్తగూడెంలో హోం గార్డుగా పనిచేస్తున్నాడు. కుటుంబ కలహాల కారణంగా శనివారం తన కుమారులు జయంత్(13) అజయ్ కుమార్(12)తో కలిసి ఖమ్మంలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య భర్తల మధ్య తలెత్తిన విభేదాల కారణంగా తరచూ గొడవలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో శుక్రవారం అర్ధరాత్రి వరకు భార్యభర్తలు గొడవ పడ్డారని సమాచారం. శనివారం ఉదయం 7గంటల ప్రాంతంలో విశ్వనాథ్ తన ఇద్దరు కుమారులను తీసుకుని కల్లూరులో బస్సెక్కాడు. 10గంటల ప్రాంతంలో విజయవాడ వైపు వెళ్లే రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు.


అంగట్లో కేసీఆర్ కిట్లు

▸▸ ప్రైవేటు ఆస్పత్రుల ప్రసవాలకూ వర్తింపు

▸▸ దొంగ రికార్డులు సృష్టిస్తున్న సిబ్బంది

▸▸ ఎంవీపాలెం పీహెచ్‌సీలో లొసుగులు

ఖమ్మంరూరల్, జనవరి 13: కేసీఆర్ కిట్లు పక్కదారి పడుతున్నాయి! సర్కారు దవాఖానాల్లో ప్రసవాలను పెంపొందించేందుకు నిరుడు జూన్‌లో ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకంలో అవినీతి జరుగుతోంది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఆరోగ్య పరీక్షలు చేసుకొని, అక్కడే కాన్పు చేసుకున్న మహిళలకు విడతల వారీగా నగదు, కేటీఆర్ కిట్లు అందిస్తున్నారు. అయితే.. ఎక్కడ ప్రసవాలు జరిగినా పీహెచ్‌సీలోనే కాన్పు జరిగినట్టుగా పత్రాలను సృష్టిస్తూ కొందరు అక్రమాలకు పాల్పడుతున్నారు. ఈ మేరకు ఖమ్మం రూరల్ మండలం ఎం.వెంకటాయపాలెం పీహెచ్‌సీలో జరిగిన ఘటన 'అమ్మఒడి పథకం'లో చోటుచేసుకున్న అవినీతిని చాటింది. అక్కడ ప్రైవేటు ఆస్పత్రులు, ఇళ్లవద్ద ప్రసవం అయిన వారికి కూడా ఈ పథకానికి అర్హులుగా తప్పుడు రికార్డులు సృష్టిస్తున్నారు. పీహెచ్‌సీల పరిధిలోని మధ్యవర్తుల ద్వారా గర్భిణుల వివరాలను సేకరించి లబ్ధిదారులుగా చేర్చుతున్నారు. ఈ మేరకు సాయం కింద అందే రూ12వేలు/రూ.13వేలు మొత్తంలో సగం వారి నుంచి ముందుగానే వసూలు చేసుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. ఎం.వెంకటాయపాలెం గ్రామంలోని పీహెచ్‌సీలో జూన్ నుంచి ఇప్పటిదాకా 20మంది ప్రసవించినట్టు లెక్కలు చూపిస్తున్నారు. వీరి పిల్లలకు జనన ధ్రువీకరణ పత్రం కోసం గ్రామ పంచాయతీ సిబ్బందికి పీహెచ్‌సీ సిబ్బంది జాబితాను కూడా పంపారు. కాగా, ఈ ప్రసవాల్లో పీహెచ్‌సీలో జరిగినవి రెండు లేదా మూడు కాన్పులేననే ఆరోపణలు వినిపిస్తున్నాయి.



ప్రైవేటు ఆస్పత్రిలో జరిగినట్టు ఆన్‌లైన్ నమోదు



పీహెచ్‌సీలో ప్రసవం అయినట్టు పంచాయతీకి ఇచ్చిన జాబితా

మహబూబాబాద్ జిల్లా కేసముద్రానికి చెందిన సంధ్య ఆగస్టు 17న ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ఓ ఆడపిల్లకు జన్మనిచ్చింది. అయితే, ఆమెకు ఎం.వెంకటాయపాలెంలో బంధువులు ఉండడంతో ప్రసవం అయిన తర్వాత అక్కడికి వచ్చింది. దీంతో అక్కడి పీహెచ్‌సీ సిబ్బంది.. ఆమెకు తమ వద్దనే ఆగస్టు 20వ తేదీన ప్రసవం జరిగినట్టు, కేసీఆర్ కిట్‌ను అందించినట్టుగా రికార్డులు సృష్టించారు. పల్లెగూడేనికి చెందిన ఓ మహిళకు మూడో ప్రసవానికి కూడా కేసీఆర్ కిట్‌ను ఇచ్చినట్టు సమాచారం.

భార జల కేంద్రంలో గ్యాస్ లీక్.. ఒకరు మృతి

అశ్వాపురం జనవరి 13: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు భార జల కేంద్రంలో శనివారం హైడ్రోజన్ సల్ఫైడ్ విష వాయువు లీక్ కావడంతో ఒక ఉద్యోగి మృతి చెందాడు. మిగతా ఉద్యోగులు అప్రమత్తంగా వ్యవహరించడంతో ప్రాణ నష్టం తప్పింది. శనివారం కర్మాగారంలోని హెచ్2ఎస్ ప్రధాన ప్లాంటులో ఒక గొట్టం జాయింట్ వద్ద గ్యాస్ లీక్ అయింది. దీనిని గమనించకుండా ముందుకెళ్లిన సీనియర్ టెక్నీషియన్ వేల్పుల వెంకటరమణ(37) హెచ్2ఎస్ వాయువు ప్రభావంతో కింద పడిపోయాడు. మిగతా ఉద్యోగులు ఇది గమనించి, రక్షణ చర్యలు తీసుకుని వెంకటరమణ వద్దకు వెళ్లారు. అతడిని ఆసుపత్రికి తరలించేటప్పటికే మృతి చెందాడు. ప్రమాద సంఘటన తెలిసిన వెంటనే అధికారులు హెచ్2ఎస్ సరఫరాను నిలిపి వేశారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

మర్పల్లి, జనవరి 13: పంట నష్టం, అప్పుల బాదతో ఓ కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. వికారాబాద్ జిల్లా మర్పల్లికి చెందిన ఈడిగి నాగయ్య గౌడ్ (38) తనకున్న అర ఎకరం పొలంతోపాటు మరికొంత భూమిని కౌలుకు తీసుకుని సాగు చేశాడు. మూడేళ్లుగా అతివృష్టి అనావృష్టితో పత్తి, మొక్కజొన్న, కంది పంటలు దెబ్బతిని ఆశించిన దిగుబడులు రాలేదు. సాగు కోసం బ్యాంకుల్లో రూ.50 వేలు, ప్రైవేట్ అప్పులు రూ. 3 లక్షలు పేరుకుపోయాయి. దీంతో మనోవేదనకు గురయ్యాడు. బుధవారం మధ్యాహ్నం ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన నాగయ్యగౌడ్, తన పొలంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

నస్రుల్లాబాద్, జనవరి 13: కామారెడ్డి జిల్లా నస్రుల్లాబాద్ మండలం సంగెం గ్రామ శివారులో అంకోల్ తండాకు చెందిన బానోత్ మోహన్ (39) శనివారం విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. గ్రామ శివారులో మోహన్ తన మొక్కజొన్న చేనులో నీటిని పారించేందుకు వెళ్లగా, బోరు మోటారు విద్యుత్ వైరు కాలికి తగులడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.

మేడారంలో యువకుడి హత్య

మేడారం, జనవరి 13: జయశంకర్ భూపాలపల్లి జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో ఓ యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. వరంగల్ అర్బన్ జిల్లా కేంద్రంలోని శివనగర్‌కు చెందిన శివ, పృథ్వీరాజ్ మేడారం ఐటీడీఏ అతిథి గృహం సమీపంలో శుక్రవారం ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌ను ప్రారంభించారు. శివకు మిత్రుడైన పూసబెల్లి ప్రసాద్ (25) వారికి సహాయంగా వచ్చాడు. శనివారం రాత్రి 8 గంటల సమయంలో వెనుక నుంచి వచ్చిన ముగ్గురు గుర్తు తెలియని యువకులు ఒక్కసారిగా ప్రసాద్‌పై కత్తితో దాడి చేశారు. వారిని అడ్డుకునేందుకు శివ, పృథ్వీరాజ్ ప్రయత్నించగా బెదిరించి ప్రసాద్‌ను హత్య చేశారు. ఒంటిపై ఆరు చోట్ల కత్తితో పొడవడంతో అక్కడికక్కడే మరణించాడు. అతను మరణించినట్లు నిర్ధారించుకున్న దుండగులు పరారయ్యారు. గద్దెల ప్రాంగణంలో బందోబస్తు విధుల్లో ములుగు డీఎస్పీ రాఘవేందర్ రెడ్డి, పస్రా సీఐ బాలాజీ, తాడ్వాయి ఎస్సై కరుణాకర్‌రావు సంఘటనా స్థలికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు.

ఇస్రో వందో ఉపగ్రహ ప్రయోగం విజయవంతం

కరెంట్ అఫైర్స్

జాతీయం

లాలూకు జైలు



దాణా కుంభకోణానికి సంబంధించి రెండో కేసుల్లోనూ దోషిగా నిర్ధారణ అయిన ఆర్జేడీ అధినేత లాలూప్రసాద్ యాదవ్‌కు రాంచీ సీబీఐ ప్రత్యేక కోర్టు జనవరి 6న మూడున్నరేళ్ల జైలు శిక్ష, రూ.10 లక్షల జరిమానా విధించింది. లాలూ బిహార్ ముఖ్యమంత్రిగా ఉండగా 1990-97 మధ్య పశుదాణాకు సంబంధించి రూ.970 కోట్ల ప్రభుత్వ నిధులను వివిధ ఖజానాల నుంచి అక్రమంగా స్వాహా చేశారన్నది ప్రధాన అభియోగం. దీనికి సంబంధించి మొత్తం అయిదు కేసులు ఉండగా.. చాయిబాసా ఖజానా నుంచి రూ.37.7 కోట్లు అక్రమంగా డ్రా చేసిన మొదటి కేసులో లాలూ, మరో మాజీ సీఎం జగన్నాథ్ మిశ్రా సహా 45 మందికి కోర్టు నాలుగేళ్ల క్రితం ఐదేళ్ల జైలు, రూ.5 లక్షల జరిమానా విధించింది. ఇప్పుడు దేవ్‌గఢ్ ఖజానా నుంచి రూ.89.27 లక్షలను నిబంధనలకు విరుద్ధంగా డ్రా చేశారన్న కేసులో శిక్ష పడింది.

సెక్షన్ 377 తీర్పు పునఃపరిశీలన

స్వలింగ సంపర్కం నేరమని స్పష్టం చేస్తున్న... ఐపీసీ సెక్షన్ 377పై వెలువరించిన తీర్పును పునఃపరిశీలించడానికి సుప్రీంకోర్టు అంగీకరించింది. ఈ సెక్షన్ రాజ్యాంగబద్ధమైనదేనని, ఇందులో లోపాలు ఏవీ లేవని 2013లో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. ఆ తీర్పును మళ్లీ పరిశీలించేందుకు అంగీకరిస్తూ - దీన్ని జనవరి 8న విస్తృత ధర్మాసనానికి నివేదించింది. అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా సహా 26 దేశాలు గే సెక్స్‌ను సమ్మతిస్తూ చట్టాలు చేశాయి. చైనాలో స్వలింగ సంపర్కం నేరం కాదు, కానీ స్వలింగ సంపర్కుల పెళ్ళికి మాత్రం చట్టబద్ధత లేదు.

డీజీపీలు, ఐజీల వార్షిక సదస్సు

మధ్యప్రదేశ్‌లో గ్వాలియర్ సమీపంలోని బీఎస్ఎఫ్ అకాడమీలో డీజీపీలు, ఐజీల వార్షిక సదస్సు జనవరి 6, 7, 8 తేదీల్లో జరిగింది. ఇందులో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొన్నారు. భవిష్యత్తులో భద్రతను మరింత పటిష్టపరచుకునేందుకు తీసుకోవాల్సిన చర్యలపై పోలీసు ఉన్నతాధికారులతో ప్రధాని నరేంద్ర మోదీ చర్చించారు. ఈ సదస్సులోనే దేశంలోని ఉత్తమ పోలీస్ స్టేషన్లకు అవార్డులు అందజేశారు. ఉత్తమ పోలీస్ స్టేషన్లుగా కోయంబత్తూర్ పోలీస్ స్టేషన్ మొదటి స్థానంలో, హైదరాబాద్‌లోని పంజగుట్ట పోలీస్ స్టేషన్ రెండో స్థానంలో, ఉత్తరప్రదేశ్‌లోని లక్నో కమిషనరేట్ పరిధిలోని గుడుంబా పోలీస్‌స్టేషన్ మూడో స్థానంలో నిలిచాయి. ప్రతి ఏడాది రాష్ట్రాల పోలీసు ఉన్నతాధికారులు, కేంద్రీయ బలగాల ఉన్నతాధికారులు సమావేశమై భద్రతాపరమైన అంశాలపై చర్చిస్తారు. సాధారణంగా ఈ సమావేశం ఢిల్లీలో జరుగుతుంది. కానీ బీజేపీ అధికారంలోకి వచ్చాక.. ఢిల్లీ బయట వేర్వేరు కేంద్రాల్లో ఈ సమావేశం ఏర్పాటు చేస్తోంది. 2014లో గువాహటి, 2015లో రాణ్ ఆఫ్ కచ్, 2016లో హైదరాబాద్‌లో ఈ సదస్సు జరిగింది.

ప్రవాస భారత పార్లమెంటేరియన్ల సదస్సు

ప్రవాస భారత పార్లమెంటేరియన్ల తొలి సదస్సు జనవరి 9న న్యూఢిల్లీలో జరిగింది. ఇందులో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొన్నారు. దక్షిణాఫ్రికా నుంచి భారత్‌కు మహాత్మాగాంధీ వచ్చిన రోజుకు సంబంధించిన 102వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఈ సదస్సును నిర్వహించారు. ఇందులో 24 దేశాలకు చెందిన 134 మంది ప్రవాస భారతీయ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఇస్రో వందో ఉపగ్రహ ప్రయోగం

భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) జనవరి 12న ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీహరికోట సతీశ్ ధవన్ అంతరిక్ష కేంద్రం (షార్) నుంచి తన వందో ఉపగ్రహాన్ని విజయవంతంగా కక్ష్యలో ప్రవేశపెట్టింది. ఈ క్రమంలో పోలార్ ఉపగ్రహ వాహకనౌక (పీఎస్ఎల్వీ)-సీ40ని ద్వారా 31 ఉపగ్రహాలను నిర్దేశిత కక్ష్యలోకి చేర్చింది. ఇందులో వివిధ దేశాలకు



చెందిన 25 మినీ, మూడు మైక్రో ఉపగ్రహాలతో పాటు భారత్ భూపరిశీలనకు సంబంధించి కార్టోశాట్-2 సిరీస్, మరో రెండు ఉపగ్రహాలు ఉన్నాయి. వీటితో వంద ఉపగ్రహాలను కక్ష్యలోకి పంపిన దేశంగా భారత్ కీర్తిని సొంతం చేసుకుంది. దీంతో 237 విదేశీ ఉపగ్రహాలను వివిధ కక్ష్యల్లోకి చేరవేసినట్లయింది.

ప్రత్యూష్ జాతికి అంకితం

దేశంలోనే అత్యంత వేగవంతమైన సూపర్ కంప్యూటర్ ప్రత్యూష్‌ను కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ మంత్రి హర్షవర్ధన్ పుణెలో జనవరి 8న ప్రారంభించారు. తుపాన్లు, భూకంపాలు, గాలి నాణ్యత, ఉష్ణ గాలులు, వరదలు, కరవు వంటి వాటికి సంబంధించిన కచ్చితమైన సమాచారాన్ని ఈ కంప్యూటర్ అందజేస్తుంది.

ఆధార్ స్థానంలో 'వర్చువల్ ఐడీ'

ఆధార్ కార్డులోని వివరాల గోప్యతపై ఆందోళన వ్యక్తం అవుతున్న తరుణంలో యూఐడీఏఐ కొత్త పద్ధతిని తీసుకొచ్చింది. దీంతో అవసరాలకు ఆధార్ కార్డుకు బదులు 'వర్చువల్ ఐడీ'ని సమర్పిస్తే సరిపోతుంది. ఇది 16 అంకెలుగా ఉంటుంది. ఈ ఏడాది మార్చి 1 నుంచి వర్చువల్ ఐడీని క్రియేట్ చేసుకోవచ్చు. జూన్ 1 నుంచి అన్ని సంస్థలూ తప్పనిసరిగా దీన్ని ఆమోదించాలి.

సింగిల్ బ్రాండ్ రిటైల్‌లో 100 శాతం ఎఫ్‌డిఐ

విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల విధానంలో ప్రభుత్వం మరోసారి భారీ మార్పులు చేసింది. సింగిల్ బ్రాండ్ రిటైల్‌లో ఆటోమేటిక్ మార్గంలోనే 100 శాతం ఎఫ్‌డిఐకి అనుమతి ఇచ్చింది. ఎయిర్‌ఇండియాలో 49 శాతం వాటా తీసుకునేందుకు విదేశీ ఎయిర్‌లైన్స్ సంస్థలకు అవకాశం కల్పించింది.

7.3 శాతానికి వృద్ధి: ప్రపంచ బ్యాంకు

ప్రస్తుతేడాదిలో భారత ఆర్థిక వృద్ధిరేటు 7.3 శాతానికి పెరగవచ్చని, వచ్చే రెండేళ్లపాటు 7.5 శాతం చొప్పన వృద్ధి నమోదు చేసుకోవచ్చని ప్రపంచ బ్యాంక్ అంచనా వేస్తోంది. మిగత దేశాలతో పోలిస్తే భారత్ ఆర్థికాభివృద్ధి సామర్థ్యం అపారమని, ఈ మధ్య చేపట్టిన సంస్కరణలు దేశ పురోగతికి బాటలు వేయనున్నాయని '2018 గ్లోబల్ ఎకనామిక్ ప్రాస్పెక్ట్స్' పేరుతో వరల్డ్ బ్యాంక్ విడుదల చేసిన నివేదిక పేర్కొంది.

రాష్ట్రీయం

కరీంగనగర్‌లో ఐటీ టవర్



కరీంనగర్‌లో నిర్మించతలపెట్టిన ఐటీ టవర్‌కు ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ జనవరి 8న శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కరీంనగర్ ఐటీ టవర్‌లో కార్యకలాపాలు చేపట్టడానికి సిద్ధంగా ఉన్న 8 కంపెనీలతో అవగాహన ఒప్పందాలు కుదిరాయి. అందులో ఒకటి ఆస్ట్రేలియా, రెండు అమెరికన్, మూడు హైదరాబాద్ కంపెనీ, రెండు కరీంనగర్ కంపెనీలు ఉన్నాయి.

హైదరాబాద్‌లో డబ్ల్యుసిఐటి సదస్సు

హైదరాబాద్‌లో ఫిబ్రవరి 19 నుంచి 21 వరకు వరల్డ్ కాంగ్రెస్ ఆన్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (డబ్ల్యుసిఐటి) సదస్సు జరగనుంది. దీంతోపాటే నాస్కామ్ ఇండియా లీడర్‌షిప్ ఫోరమ్ (ఎన్ఐఎల్ఎఫ్) సదస్సు కూడా నిర్వహిస్తారు. ఈ సదస్సుకు దేశ విదేశాల నుంచి 2,500కి పైగా ప్రతినిధులు హాజరుకానున్నారు.

జన్మభూమి - మా ఊరు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జన్మభూమి - మా ఊరు కార్యక్రమాన్ని జనవరి 2 నుంచి 11 వరకు నిర్వహించింది. జనవరి 2న ప్రకాశం జిల్లా దర్శిలో జరిగిన ప్రారంభ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు.

తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన



జోగుళాంబ గద్వాల జిల్లా రాజోలి మండలంలోని తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకానికి రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్ రావు జనవరి 8న శంకుస్థాపన చేశారు. ఈ పథకం ద్వారా అలంపూర్ నియోజకవర్గంలోని 87,500 ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉంది.

అంతర్జాతీయం

ఉత్తర, దక్షిణ కొరియా చర్చలు

దాదాపు రెండేళ్ల తర్వాత ఉత్తర, దక్షిణ కొరియాల మధ్య అధికారిక చర్చలు జనవరి 9న జరిగాయి. దక్షిణ కొరియా పరిధిలోకి వచ్చే పాన్‌ముంజోమ్ గ్రామం ఈ చర్చలకు వేదికగా నిలిచింది. గ్రామాన్ని శాంతి గ్రామంగా వ్యవహరిస్తారు. ఫిబ్రవరిలో దక్షిణ కొరియాలో జరిగే వింటర్ ఒలింపిక్స్‌కు తమ క్రీడా బృందాలను పంపించేందుకు ఉత్తర కొరియా ఈ సందర్భంగా అంగీకరించింది.

బ్రిటన్ మంత్రివర్గంలో రిషిసునక్



బ్రిటన్ మంత్రివర్గంలో ప్రవాస భారతీయులకు చోటు లభించింది. వారిలో కన్జర్వేటివ్ పార్టీ తరఫున రిచ్‌మండ్ నుంచి ఎంపీగా ఎన్నికైన రిషి సునక్‌కు హౌసింగ్, కమ్యూనిటీస్, లోకల్ గవర్నమెంట్ వ్యవహారాల బాధ్యతలు అప్పగించారు. ఈయన ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నారాయణమూర్తి అల్లుడు. సునక్‌తోపాటు భారత సంతతికే చెందిన ఫెర్నాండెజ్ కూడా మంత్రిగా నియమితులయ్యారు. కాగా అలోక్‌వర్మ ఇప్పటికే మంత్రి పదవిలో కొనసాగుతున్నారు.

ఆసియాన్ - ప్రవాసీ భారతీయ దివస్

ఆసియాన్ - ప్రవాసీ భారతీయ దివస్ జనవరి 7న సింగపూర్‌లో జరిగింది. ఇందులో భారత విదేశీ వ్యవహారాల మంత్రి సుష్మా స్వరాజ్ పాల్గొన్నారు. అదేవిధంగా ఆసియాన్ - ఇండియా రౌండ్ టేబుల్ సమావేశం జనవరి 6న ఇండోనేషియాలోని జకార్తాలో జరిగింది. ఈ సమావేశానికి కూడా సుష్మా హాజరయ్యారు.

అతి పెద్ద ప్రధాన సంఖ్య

ప్రపంచంలోనే ఇప్పటి వరకు తెలిసిన అతిపెద్ద ప్రధాన సంఖ్యను అమెరికాకు చెందిన జొనాథన్ పేస్ కనుగొన్నారు 2ను 7,72,32,917 సార్లు గుణించి, ఆ తర్వాత అందులో నుంచి '1' ని తీసివేశారు. ఆ వచ్చిన సంఖ్యలో 2,32,49,425 అంకెలున్నాయి. ఇప్పటివరకు తెలిసిన ప్రధాన సంఖ్య కన్నా ఎం77232917 అని పిలుస్తున్న ఈ ప్రధాన సంఖ్యలో దాదాపు 10 లక్షల అంకెలు ఎక్కువగా ఉన్నాయి. అత్యంత అరుదుగా ఉండే ఈ ప్రధాన సంఖ్యలను మెర్సెన్నె ప్రధాన సంఖ్యలు అంటారు. 350 ఏళ్ల కిందటే ఈ ప్రధాన సంఖ్యల గురించి అధ్యయనం చేసిన ఫ్రెంచ్ శాస్త్రవేత్త మారిన్ మెర్సెన్నె పేరు వీటికి పెట్టారు. ఈ కొత్త ప్రధాన సంఖ్యను ఆరు రోజుల పాటు ఆగకుండా లెక్కించారు. ఎం77232917 ఇప్పటి వరకు కనుగొన్న 50వ మెర్సెన్నె ప్రధాన సంఖ్య.

క్రీడలు

హాప్‌మన్ కప్ విజేత స్విట్జర్లాండ్

ప్రతిష్ఠాత్మక హాప్‌మన్ కప్ టెన్నిస్ టోర్నమెంట్‌ను స్విట్జర్లాండ్ గెలుచుకుంది. జనవరి 6న జరిగిన ఫైనల్లో రోజర్ ఫెడరర్, బెన్సిచ్‌లతో కూడిన స్విట్జర్లాండ్ జట్టు, అలెగ్జాండర్ జ్వెరేవ్, ఎంజెలిక్ కెర్బర్ సభ్యులుగా ఉన్న జర్మనీ జట్టును ఓడించింది. 30 ఏళ్ల చరిత్ర ఉన్న ఈ టోర్నీలో స్విట్జర్లాండ్ విజేతగా నిలవడం ఇది మూడోసారి. గతంలో 1992, 2001లో స్విట్జర్లాండ్ చాంపియన్‌గా నిలిచింది.

యాషెస్ విజేత ఆస్ట్రేలియా



ఆస్ట్రేలియా - ఇంగ్లండ్ జట్ల మధ్య జరిగే ఐదు మ్యాచ్‌ల యాషెస్ క్రికెట్ సిరీస్‌ను ఆస్ట్రేలియా 4-0తో కైవసం చేసుకుంది. సిడ్నీలో జనవరి 8న ఈ సిరీస్ ముగిసింది. ఐదు టెస్ట్‌ల్లో 687 పరుగులు చేసిన ఆసీస్ సారథి స్మిత్ మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌గా ఎంపికయ్యారు.

భారత వికెట్ కీపర్ సాహా రికార్డు



ఒక టెస్టు మ్యాచ్‌లో అత్యధిక క్యాచ్‌లు అందుకున్న భారత వికెట్ కీపర్‌గా సాహా రికార్డు సృష్టించాడు. దక్షిణాఫ్రికాతో కేప్‌టౌన్‌లో జనవరి 8న ముగిసిన తొలి టెస్టులో అతను రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి పది క్యాచ్‌లు అందుకున్నాడు. ధోని 2014లో ఆస్ట్రేలియాపై తొమ్మిది క్యాచ్‌లతో నెలకొల్పిన రికార్డును అతను అధిగమించాడు. మొత్తంగా ప్రపంచ క్రికెట్లో రసెల్ (ఇంగ్లాండ్), డివిలియర్స్ (దక్షిణాఫ్రికా) చెరో 11 క్యాచ్‌లతో ఉమ్మడిగా అగ్రస్థానంలో ఉండగా.. రెండో స్థానంలో ఉన్న బాబ్ టేలర్, గిల్‌క్రిస్ట్ (ఆస్ట్రేలియా)లను సాహా సమం చేశాడు.

అంతర్జాతీయ స్కీయింగ్‌లో భారత్‌కు తొలి పతకం

టర్కీలో జరిగిన ప్రతిష్ఠాత్మక 'ఆల్పైన్ ఎజెర్ 3200 కప్' అంతర్జాతీయ స్కీయింగ్ టోర్నీలో చండీగఢ్‌కు చెందిన 21 ఏళ్ల ఆంచల్ ఠాకూర్ కాంస్య పతకం గెలుపొందింది. తద్వారా ఈ క్రీడలో భారత్‌కు తొలి అంతర్జాతీయ పతకం అందించింది.


వార్తల్లో వ్యక్తులు

ఇస్రో ఛైర్మన్‌గా డాక్టర్ కె.శివన్



భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ఛైర్మన్‌గా డాక్టర్ కె.శివన్ ఎంపికయ్యారు. ప్రస్తుత ఛైర్మన్ ఏఎస్ కిరణ్‌కుమార్ పదవీకాలం ఈ నెల 14తో ముగుస్తుండటంతో ఆయన స్థానంలో త్రివేండ్రంలోని వీఎస్ఎస్‌సీ డైరెక్టర్‌గా ఉన్న శివన్‌ను ఎంపిక చేస్తూ కేంద్ర ప్రభుత్వం జనవరి 10న ఆదేశాలు జారీ చేసింది. శివన్ 1982లో పీఎస్ఎల్వీ రాకెట్ విభాగంలో ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించారు. జీఎస్ఎల్వీ, మార్క్ 3, రీ యూజబుల్ రాకెట్ వంటి ప్రయోగాల్లో శివన్‌ది కీలక పాత్ర.

నాసా వ్యోమగామి జాన్ యంగ్ మృతి



ప్రముఖ వ్యోమగామి జాన్ యంగ్ (87) జనవరి 5న కన్నుమూశారు. అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ (నాసా) నిర్వహించిన జెమిని, అపోలో, స్పేస్ షటిల్ వంటి కార్యక్రమాల్లో భాగంగా అంతరిక్షంలోకి వెళ్లిన ఒకే ఒక్క వ్యోమగామి జాన్ యంగ్. అంతేకాకుండా ఆరుసార్లు అంతరిక్షంలోకి వెళ్లొచ్చిన తొలి వ్యోమగామిగా, అంతరిక్షంలో అత్యధిక సమయం గడిపిన వ్యక్తిగానూ ఆయన రికార్డు సృష్టించారు.

సిక్కిం బ్రాండ్ అంబాసిడర్‌గా రెహమాన్

సిక్కిం రాష్ట్రానికి బ్రాండ్ అంబాసిడర్‌గా ప్రముఖ సంగీత దర్శకుడు ఏ.ఆర్. రెహమాన్‌ను జనవరి 8న నియమించారు. భారతదేశంలో ఏకైక ఆర్గానిక్ రాష్ట్రంగా సిక్కిం. పర్యాటకం, వ్యాపార అంశాల్లో రెహమాన్ ప్రచారకర్తగా వ్యవహరించనున్నారు.

అజీజ్ అన్సారీకి గోల్డెన్ గ్లోబ్




గోల్డెన్ గ్లోబ్ అవార్డులను జనవరి 7న లాస్ ఏంజెల్స్‌లో ప్రదానం చేశారు. ఇందులో భారత సంతతికి చెందిన అజీజ్ అన్సారీకి గోల్డెన్ గ్లోబ్ పురస్కారం దక్కింది. మాస్టర్ ఆఫ్ నన్ టీవీ సిరీస్‌లో నటనకుగాను అన్సారీకి ఈ అవార్డు లభించింది. ఓప్రా విన్‌ఫ్రేకు సిసిల్ బీ మిల్లే పురస్కారం అందజేశారు.



రామచంద్రారెడ్డి ఉప్పుల

ఆర్కిటెక్చర్ కెరీర్‌కు.. నాటా బాట



దేశంలో ఆర్కిటెక్చర్ విద్యకు సంబంధించిన ప్రమాణాలను నిర్దేశించే ద కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ (సీఓఏ) నాటా పరీక్షను ఏటా నిర్వహిస్తుంది.

450కిపైగా కాలేజీల్లో

ఈ పరీక్షలో అర్హత సాధించడం ద్వారా ఐఐటీలు, ఎన్ఐటీలు మినహా దేశవ్యాప్తంగా ఉన్న 450కిపైగా కాలేజీల్లో బీఆర్క్ (బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్) కోర్సులో ప్రవేశం పొందొచ్చు. నాటా స్కోర్ 2018-19 విద్యా సంవత్సరానికి మాత్రమే చెల్లుబాటు అవుతుంది.

అర్హత

- 50 శాతం మార్కులతో మేథమెటిక్స్ ఒక సబ్జెక్ట్‌గా 10+2/తత్సమానం/చివరి సంవత్సరం పరీక్షలకు హాజరవుతున్న వారు అర్హులే.
- 50 శాతం మార్కులతో మేథమెటిక్స్ ఒక సబ్జెక్ట్‌గా 10+3 విధానంలో ఏదైనా డిప్లొమా/చివరి సంవత్సరం పరీక్షలకు హాజరవుతున్న వారు అర్హులే.
- పదేళ్ల స్కూలింగ్ తరవాత 50 శాతం మార్కులతో మ్యాథమెటిక్స్ ఒక సబ్జెక్ట్‌గా ఇంటర్నేషనల్ బ్యాకులరేట్ డిప్లొమా / చివరి సంవత్సరం పరీక్షలకు హాజరవుతున్న వారు అర్హులే.

రాత పరీక్ష

రాత పరీక్షకు 200 మార్కులు కేటాయించారు. ఇందులో పార్ట్-ఎ, పార్ట్-బి విభాగాలు ఉంటాయి.

- ఇందులో మేథమెటిక్స్, జనరల్ ఆప్టిట్యూడ్, డ్రాయింగ్ విభాగాల నుంచి ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నల విభజన, మార్కుల కేటాయింపు ఇలా ఉంటుంది.

	విభాగం	ప్రశ్నలు	మార్కులు
పార్ట్-ఎ	మేథమెటిక్స్	20	40
	జనరల్ ఆప్టిట్యూడ్	40	80
పార్ట్-బి	డ్రాయింగ్	2	80
	మొత్తం		200

- పార్ట్-ఎలోని మేథమెటిక్స్, జనరల్ ఆప్టిట్యూడ్ విభాగాలను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారు. ఈ విభాగానికి కేటాయించిన మొత్తం మార్కులు 120. ఇందులో సమాధానాలను గుర్తించడానికి 90 నిమిషాల సమయం కేటాయిస్తారు. నెగిటివ్ మార్కులు లేవు.
- పార్ట్-బిలోని డ్రాయింగ్ విభాగాన్ని ఆఫ్‌లైన్‌లో (పేపర్ - పెన్సిల్ విధానం) నిర్వహిస్తారు. ఇందుకు ఏ4 సైజ్ పేపర్లను ఇస్తారు. వాటిపై రెండు డ్రాయింగ్స్‌ను గీయాలి. 90 నిమిషాల సమయం కేటాయిస్తారు.

కనీస మార్కులు తప్పనిసరి

పార్ట్-ఎలో కనీసం 25 శాతం మార్కులను కటాఫ్‌గా నిర్ణయించారు. అంటే 120కి 30 మార్కులను సాధించాలి. అదేవిధంగా పార్ట్-బిలో కూడా 25 శాతం మార్కులను కటాఫ్‌గా నిర్దేశించారు. అంటే 80కి 20 మార్కులను సాధించాలి. ఈ విధంగా సాధించిన వారిని మాత్రమే పరిగణనలోకి తీసుకొని మెరిట్ లిస్ట్‌ను ప్రిపేర్ చేస్తారు. వీరికి మాత్రమే బీఆర్క్ కోర్సులో ప్రవేశం కల్పిస్తారు.

ముఖ్య సమాచారం

- వయసు: 17 ఏళ్లు (2018 జూలై 31 నాటికి)
- దరఖాస్తు: ఆన్‌లైన్ ద్వారా
- దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 2, 2018.
- రాత పరీక్ష తేదీ: ఏప్రిల్ 29, 2018
- తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, చీరాల, గుంటూరు, కాకినాడ, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, కర్నూలు, నెల్లూరు, రాజమండ్రి, విజయనగరం.
- ఫలితాల వెల్లడి: జూన్ 1, 2018.
- వెబ్‌సైట్: http://www.nata.in/

సిలబస్

- **మేథమెటిక్స్:** ఇందులో ఆల్జీబ్రా, లాగరిథమ్స్, మ్యాట్రిక్స్, ట్రిగ్నోమెట్రీ, కోఆర్డినేట్ జ్యామెట్రీ, 3డైమెన్షనల్ కోఆర్డినేట్ జ్యామెట్రీ, థియరీ ఆఫ్ క్యాలిక్యులస్, అప్లికేషన్ ఆఫ్ క్యాలిక్యులస్, పర్మిటేషన్ అండ్ కాంబినేషన్, స్టాటిస్టిక్ అండ్ ప్రొబబిలిటీ వంటి అంశాల నుంచి ప్రశ్నలు ఇస్తారు.
- **జనరల్ ఆప్టిట్యూడ్:** ఇందులో ఆర్కిటెక్చర్‌కు సంబంధించిన అవగాహనను పరీక్షించేందుకు వివిధ ఆకృతులు, 2, 3 డైమెన్షనల్ ఆబ్జెక్ట్స్, ఆర్కిటెక్చర్ రంగంలో ఇటీవల జాతీయ/అంతర్జాతీయ స్థాయుల్లో చోటు చేసుకున్న సంఘటనలు వంటి అంశాల నుంచి ప్రశ్నలు ఇస్తారు. వాటితోపాటు మేథమెటికల్ రీజనింగ్, సెట్స్ అండ్ రిలేషన్స్, అనలిటికల్ రీజనింగ్, మెంటల్ ఎబిలిటీ అంశాలపై ప్రశ్నలు అడుగుతారు.
- **డ్రాయింగ్:** సృజనాత్మకతను పరీక్షించేందుకు ఉద్దేశించిన విభాగం. ఇందులో డ్రాయింగ్ పట్ల విద్యార్థి ఆసక్తి, నైపుణ్యం, వివిధ ఆకృతులను చిత్రించే నేర్పు, ఊహాశక్తి వంటి అంశాలను పరిశీలిస్తారు. ఈ క్రమంలో ఒక వస్తువు లేదా నమూనాను ఇస్తారు. దాన్ని యథాతథంగా చిత్రించడం, ఒక వస్తువును ఇచ్చి దాన్ని విభిన్న ఆకారాల్లో గీయమనడం, నిత్య జీవితంలో ఎదురయ్యే సంఘటనలను ఊహించి స్కెచెస్ వేయడం, నిర్ణీత ఆకారాలను ఆకట్టుకునే రంగులతో పూరించడం వంటి ప్రశ్నలను అడుగుతారు. ఈ పేపర్‌ను ఒకటి కంటే ఎక్కువ మంది ఎగ్జామినర్లు మూల్యాంకనం చేస్తారు. ఈ నేపథ్యంలో వారందరూ ఇచ్చిన మార్కుల సగటు తీసుకుంటారు. దాని ఆధారంగా ఈ విభాగానికి మార్కులను ఇస్తారు.

జాబ్ కార్నర్

లేడీ హార్డింజ్ మెడికల్ కాలేజ్

న్యూఢిల్లీలోని లేడీ హార్డింజ్ మెడికల్ కాలేజ్ - నాన్ పీజీ జూనియర్ రెసిడెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- మొత్తం ఖాళీలు: **70**
- విభాగాలవారీ ఖాళీలు: యాక్సిడెంట్ & ఎమర్జెన్సీ 10, అనెస్థీషియా 4, బ్లడ్ బ్యాంక్ 2, మెడిసిన్ 4, అబ్‌స్టెట్రిక్స్ & గైనకాలజీ 12, ఆర్థోపెడిక్స్ 2, సర్జరీ 6, పీడియాట్రిక్స్ (క్యాజువాలిటీ 5, మెడిసిన్ 9, నియోనాటాలజీ 2, నెఫ్రాలజీ 6, సర్జరీ 6), డెంటల్ & ఓరల్ సర్జరీ 2
- అర్హత: ఎంబీబీఎస్/ బీడీఎస్ ఉత్తీర్ణతతోపాటు ఢిల్లీ మెడికల్ కౌన్సిల్/ ఢిల్లీ డెంటల్ కౌన్సిల్ గుర్తింపు పొంది ఉండాలి. 2015 డిసెంబరు 31 నాటికి ఇంటర్న్‌షిప్ పూర్తిచేసినవారు దరఖాస్తుకు అనర్హులు.
- వయసు: 2017 డిసెంబరు 31 నాటికి 30 ఏళ్లు
- ఎంపిక: రాత పరీక్ష ద్వారా
- రాత పరీక్ష: ఎంబీబీఎస్ అభ్యర్థులకు జనవరి 29, బీడీఎస్ అభ్యర్థులకు ఫిబ్రవరి 5న
- దరఖాస్తు రిజిస్ట్రేషన్: ఎంబీబీఎస్ విభాగానికి జనవరి 22న, బీడీఎస్ విభాగానికి జనవరి 30న
- వెబ్‌సైట్: lhmc-hosp.gov.in

టెక్నీషియన్లు

సీఎస్ఐఆర్ ఆధ్వర్యంలోని సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మైనింగ్ అండ్ ఫ్యుయెల్ రీసెర్చ్ (సీఎస్ఐఆర్-సీఐఎంఎఫ్ఆర్) - టెక్నీషియన్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- ఖాళీలు: **18**
- అర్హత: పదోతరగతి ఉత్తీర్ణతతోపాటు ఐటీఐ/ నేషనల్ ట్రేడ్ సర్టిఫికెట్(కార్పెంటర్/ సర్వేయర్/ పంప్ ఆపరేటర్/ ప్లంబర్/ ఐటీ/ ఎలక్ట్రీషియన్/ మెషినిస్ట్/ టర్నర్/ హౌస్ కీపింగ్) పొంది ఉండాలి.
- వయసు: దరఖాస్తు నాటికి 28 ఏళ్లలోపు ఉండాలి
- ఎంపిక: ట్రేడ్ టెస్ట్/ స్కిల్ టెస్ట్ ద్వారా
- రిజిస్టర్డ్ / స్పీడ్ పోస్టు ద్వారా దరఖాస్తు చేరేందుకు ఆఖరు తేదీ: ఫిబ్రవరి 15
- వెబ్‌సైట్: www.cimfr.nic.in


గవర్నర్‌ను కలిసి వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ-టీఎస్ నాయకులు

వంటేరు అరెస్టు అక్రమం

» మందకృష్ణను విడుదల చేయాలి.. గవర్నర్‌కు టీడీపీ-టీఎస్ వినతి

సైదాబాద్/హైదరాబాద్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): టీడీపీ రైతు విభాగం అధ్యక్షుడు వంటేరు ప్రతాప్‌రెడ్డిని టీఆర్ఎస్ ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేసిందని గవర్నర్ నరసింహన్‌కు ఆ పార్టీ నేతలు ఫిర్యాదు చేశారు. అక్రమ కేసులను ప్రభుత్వం ఉపసంహరించుకునేలా జోక్యం చేసుకోవాలని కోరారు. టీడీపీ-టీఎస్ అధ్యక్షుడు ఎల్.రమణ నేతృత్వంలో సీనియర్ నేతలు రావుల చంద్రశేఖర్‌రెడ్డి, మోత్కుపల్లి నర్సింహులు, పెద్దిరెడ్డి తదితరులు శనివారం రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిశారు. ప్రభుత్వంతో మాట్లాడతానని గవర్నర్ హామీ ఇచ్చారని రమణ తెలిపారు. చంచల్‌గూడ జైల్లో ఉన్న వంటేరు, ఎమ్మార్పీఎస్ నేత మందకృష్ణ మాదిగను టీడీపీ నేతలు పరామర్శించారు. సంక్రాంతి రోజున జైల్లో వంటేరు మౌన, నిరహార దీక్ష చేపడ్తారన్నారు.

టీఆర్ఎస్ పాలనలో స్థానిక సంస్థలు నిర్వీర్యం

» పార్టీలో చర్చించాక 'నాగం'పై నిర్ణయం: కిషన్‌రెడ్డి, లక్ష్మణ్

హైదరాబాద్/గద్వాల/రవీంద్రభారతి, జనవరి 13(ఆంధ్రజ్యోతి): టీఆర్ఎస్ పాలనలో స్థానిక సంస్థలు నిర్వీర్యమయ్యాయని బీజేఎల్పీ నేత కిషన్‌రెడ్డి విమర్శించారు. నిధులు కేటాయించని రాష్ట్ర ప్రభుత్వం ఒక్కో పంచాయతీకి కేంద్రం కేటాయించిన రూ.80 లక్షలను కూడా దారి మళ్లించిందన్నారు. కొత్త పంచాయతీ చట్టం ముసాయిదాను అన్ని వర్గాలతో చర్చించి రూపొందించాలన్నారు. నాగం జనార్దన్‌రెడ్డి విషయంలో పార్టీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. కాగా, తెలంగాణ ద్రోహులే మంత్రులుగా ఉన్నారన్న హోంమంత్రి నాయిని వ్యాఖ్యలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ శనివారం గద్వాలలో డిమాండ్ చేశారు.

వచ్చే నెలలో కోదండరాం కొత్త పార్టీ?

హైదరాబాద్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): టీజేఏసీ చైర్మన్ కోదండరాం ఫిబ్రవరిలోగా కొత్తపార్టీని ప్రకటించనున్నట్లు తెలిసింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. పార్టీకి పలు పేర్లు పరిశీలించారు. పార్టీని ఈ నెల మూడో వారంలో ఢిల్లీలో రిజిస్ట్రేషన్ చేయిస్తారు. ఫిబ్రవరి చివరివారంలో బహిరంగ సభ వేదికపై పార్టీని ప్రకటించాలని నిర్ణయించారు. టీజేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రైతు అధ్యయన యాత్రపై శనివారం స్టీరింగ్ కమిటీ సమావేశంలో చర్చించారు. ఫిబ్రవరి మొదటివారంలో రైతులతో సభ నిర్వహించాలని, రైతాంగ సమస్యలపై ఈ నెల 22 నుంచి 30 వరకు జిల్లాల్లో సదస్సులు నిర్వహించాలని నిర్ణయించారు.

కేసీఆర్ పిలిస్తే చర్చకు సిద్ధం: షబ్బీర్ అలీ

హైదరాబాద్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): విద్యుత్తుపై చర్చకు సీఎం కేసీఆర్ స్వయంగా ముందుకొస్తే తానూ సిద్ధమని శాసనమండలి కాంగ్రెస్‌పక్ష నేత షబ్బీర్ అలీ అన్నారు. రాజకీయానుభవంలోనూ, మంత్రిగానూ కేసీఆర్ కన్నా తానే సీనియర్‌ను అన్నారు. నేటి మిగులు విద్యుత్తు కాంగ్రెస్ పుణ్యమే అన్నారు. విద్యుత్తుపై ఎలాంటి వాస్తవాలు నిరూపించేందుకైనా తాను సిద్ధమన్నారు. పంచాయతీరాజ్ నూతనచట్టంపై అఖిలపక్ష సమావేశంలో నిర్ణయం తీసుకోవాలన్నారు. ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. సర్పంచ్‌లను ప్రత్యక్ష ఎన్నికల నుంచి తప్పించేందుకే పంచాయతీ చట్టంలో మార్పులు చేస్తున్నారన్నారు. టీఆర్ఎస్‌లో కుమ్ములాటలు మొదలయ్యాయని, తాము గతంలో చెప్పిన మాట ఇప్పుడు వాస్తవమవుతోందన్నారు.

కమీషన్ల కోసమే ప్రైవేటు విద్యుత్తు

» సవాలును స్వీకరించకుండా పారిపోయారు: రేవంత్

హైదరాబాద్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): టీఆర్ఎస్ ప్రభుత్వం లంచాలు, కమీషన్ల కోసమే రాష్ట్రంలో జెన్‌కో సామర్థ్యాన్ని తగ్గించి, ప్రైవేటు విద్యుత్తు కొనుగోళ్లను పెంచిందని కాంగ్రెస్ నేత రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఈ విషయంపై తమ ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా టీఆర్ఎస్ నేతలు పారిపోయారన్నారు. ప్రభుత్వ సంస్థల స్థూల ఉత్పత్తిని 87% నుంచి 69%కు తగ్గించిన కేసీఆర్ సర్కారు ప్రైవేటు విద్యుత్తు కొనుగోళ్లను 7వేల మిలియన్ యూనిట్ల నుంచి 17 వేల మిలియన్ యూనిట్లకు పెంచిందన్నారు. ఏపీ రూ.4.74కే యూనిట్ విద్యుత్తు ఇస్తామన్నా తీసుకోకుండా టీఆర్ఎస్ ప్రభుత్వం రూ.5.50కు కొనుగోలు చేస్తూ ప్రజలపై భారం మోపుతోందన్నారు. ఎంపీ బాల్క సుమన్ తనను రవ్వంత అని వ్యాఖ్యానించారని, తాను ముమ్మాటికీ నిప్పు రవ్వనేనని రేవంత్ తెలిపారు.

మందకృష్ణపై పీడీ యాక్ట్ నమోదుకు కుట్ర

» టీఆర్ఎస్‌లో చేరలేదని వంటేరుపై నిర్బంధం: రేవంత్

సైదాబాద్/హైదరాబాద్/గజ్వేల్, జనవరి 13: మందకృష్ణపై ప్రభుత్వం పీడీయాక్ట్ నమోదుకు కుట్రపన్నుతోందన్న సమాచారం అందిందని కాంగ్రెస్ నేత రేవంత్‌రెడ్డి అన్నారు. చంచల్‌గూడ జైల్లో రిమాండ్‌లో ఉన్న మందకృష్ణ, టీడీపీ నేత వంటేరు ప్రతాప్‌రెడ్డిలను ఆయన శనివారం పరామర్శించారు. రాష్ట్రంలో పౌరహక్కుల ఉల్లంఘనపై గవర్నర్ స్పందించాలన్నారు. వంటేరు ప్రతాప్‌రెడ్డి టీఆర్ఎస్ కండువా కప్పుకోలేదన్న కోపంతో అక్రమ కేసులు పెట్టి జైల్లో ఉంచడం దారుణమన్నారు.


బెంగళూరులో కర్ణాటక సీఎస్ రత్నప్రభను కలిసిన కేఆర్‌టీఏ సభ్యులు

తెలంగాణ భవన్‌కు స్థలం కేటాయించండి

» కర్ణాటక చీఫ్ సెక్రటరీని కోరిన కేఆర్‌టీఏ బృందం

హైదరాబాద్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): బెంగళూరులో తెలంగాణ భవన్ ఏర్పాటుకు స్థలాన్ని కేటాయించాలని కర్ణాటక ప్రధాన కార్యదర్శి కె.రత్నప్రభను కలిసి విజ్ఞప్తి చేసినట్లు కర్ణాటక రాష్ట్ర తెలంగాణ అసోసియేషన్ (కేఆర్‌టీఏ) అధ్యక్షుడు సందీప్ కుమార్ శనివారం తెలిపారు. రత్నప్రభ సానుకూలంగా స్పందించారన్నారు. ఈ భవనానికి 'పంపనా తెలంగాణ భవన్' అని పేరు పెట్టాలని కేఆర్‌టీఏ ప్రతిపాదించిందన్నారు.

ఫ్లోరైడ్ నివారణకు 440 కోట్లు ఇచ్చాం: కేంద్రం

న్యూఢిల్లీ, జనవరి 13(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ఫ్లోరైడ్ నివారణకు ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.440.51 కోట్లు విడుదల చేశామని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. కేంద్ర తాగునీరు, పారిశుధ్య శాఖ మంత్రికి ఎంపీ నంది ఎల్లయ్య రాసిన లేఖకు ఈ మేరకు సమాధానమిచ్చింది. జాతీయ నీటి నాణ్యత ఉప కార్యక్రమం కింద మంజూరు చేసిన రూ.687.6 కోట్లు ఫ్లోరైడ్ బారినపడ్డ 966 ఆవాసాల్లో వెచ్చించాలని సూచించామని తెలిపింది.

మార్చి 4న సీపీఎస్ జనజాతర

హైదరాబాద్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించేందుకు బడ్జెట్ సమావేశాల్లోగా నిర్ణయం తీసుకోవాలని తెలంగాణ స్టేట్ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు గంగాపరం స్థితప్రజ్ఞ ప్రభుత్వాన్ని కోరారు. మార్చి 4న హైదరాబాద్‌లో సీపీఎస్ జన జాతరను నిర్వహిస్తామన్నారు. ప్రభుత్వ సొమ్ము, ఉద్యోగి కష్టార్జితంపై షేర్ మార్కెట్ పెత్తనం సబబు కాదన్నారు.

మార్చి 31లోపు పెండింగ్ కేసుల పరిష్కారం

హైదరాబాద్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): ఐదేళ్లు అంతకంటే ఎక్కువ కాలం పెండింగ్‌లో ఉన్న కేసులన్నింటినీ మార్చి 31లోగా పరిష్కరించడంపై ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లోని న్యాయాధికారులు దృష్టి సారించాలని హైకోర్టు రిజిస్ట్రార్ జుడీషియల్ సర్క్యులర్ జారీ చేశారు. అమలుకు వీల్లేని ఎన్‌బీడబ్ల్యూ కేసులను 'లాంగ్ పెండింగ్ కేసెస్'(ఎల్‌పీసీ)లుగా మార్చాలన్నారు.

పాస్‌బుక్ మేళా

(మూడోపేజీ తరువాయి)

సమగ్ర భూ ప్రక్షాళన ద్వారా వచ్చిన ఫలితాలను ఈ సమావేశంలో విశ్లేషించారు. "స్వతంత్ర భారతదేశ చరిత్రలో తెలంగాణలో మాత్రమే సమగ్ర భూరికార్డుల ప్రక్షాళన చేపట్టాం. దేశానికే ఆదర్శంగా నిలిచిన ఈ కార్యక్రమం తర్వాత భూమి వివరాలు ప్రభుత్వం వద్ద అందుబాటులో ఉన్నాయి. ఆ వివరాలతో కూడిన పాస్ పుస్తకాలను కొత్తగా ప్రింట్ చేస్తున్నాం. 70 లక్షల కమతాలకు ఒకేరోజు పాస్ పుస్తకాలు అందిస్తాం. వివరాలను ప్రభుత్వ వెబ్‌సైట్‌లో పెడ్తాం. కోర్‌బ్యాంకింగ్ తరహాలో ల్యాండ్ వెబ్‌సైట్ నిర్వహిస్తాం.దీనికి 'ధరణి' అనే పేరును ఖరారు చేశాం. అవినీతికి ఆస్కారం లేని పారదర్శకమైన కొత్త రిజిస్ట్రేషన్ విధానాన్ని తీసుకొస్తున్నాం"అని వివరించారు. రెవెన్యూ పరిధిలోనే ఇకపై భూముల నిర్వహణ, రిజిస్ట్రేషన్ల ప్రక్రియ జరుగుతుందని, 2 శాఖల మధ్య మరింత సమన్వయం సాధించడానికి ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్‌గా కొనసాగుతున్న వాకాటి కరుణకే రిజిస్ట్రేషన్ల శాఖ కమిషనర్‌గా అదనపు బాధ్యతలు అప్పగిస్తామన్నారు.

అవినీతి, నకిలీలు తొలగించడమే లక్ష్యం

భూముల క్రయ విక్రయాలు, రిజిస్ట్రేషన్లు, భూ రికార్డుల నిర్వహణలో 100% పారదర్శకత సాధించడం, అవినీతిని నిరోధించడం, నకిలీ పాస్ పుస్తకాలను అరికట్టడం వంటి లక్ష్యాలతో సంస్కరణలు తీసుకొస్తున్నామని సీఎం కేసీఆర్ తెలిపారు. "రైతులు, ఇతర ప్రజలు తరచూ ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే బాధతప్పాలి. రిజిస్ట్రేషన్ కార్యాలయానికి ఒకేసారి వెళ్తే పాస్ పుస్తకం కొరియర్ ద్వారా ఇంటికే చేరాలి. ఎవరి వద్దకూ వెళ్లకుండానే ఒక్కరోజులో పనిపూర్తికావాలి. ఇకపై నకిలీ పాస్ పుస్తకాలు, వాటిపై రుణాలు తీసుకోవడం సాధ్యం కాదు. భూ రికార్డుల నిర్వహణను ప్రభుత్వం కట్టుదిట్టం చేస్తుంది. ప్రతి విషయం 'ధరణి'లో నమోదవుతుంది" అన్నారు. రాష్ట్రంలోని ప్రతి ఎకరం వివరాలు పొందుపరుస్తూ, ఎప్పటికప్పుడు చోటుచేసుకునే మార్పులను నమోదు చేస్తూ, కోర్ బ్యాంకింగ్ తరహాలో 'ధరణి'ని నిర్వహిస్తామన్నారు. ఇందుకు ప్రత్యేకంగా ఐటీ విభాగాన్ని ఏర్పాటు



చేస్తున్నామన్నారు. రిజిస్ట్రేషన్, పేరు మార్పిడి వివరాలు అదేరోజు ధరణిలో నమోదవుతాయని, రాష్ట్రంలో ఎక్కడి నుంచైనా వెబ్‌సైట్ నుంచి వివరాలు తెలుసుకోవచ్చన్నారు. విదేశాల్లో ఉన్న వారూ ధరణి ద్వారా అందే సమాచారంతో క్రయ, విక్రయాలు జరుపుకోవచ్చని తెలిపారు.

త్వరలో పార్ట్ బీ చేపడతాం

భూ రికార్డుల ప్రక్షాళన విజయవంతమైందని, గ్రామీణ ప్రాంతాల్లో దాదాపు 90 శాతానికిపైగా స్పష్టత వచ్చిందని, ఏ భూమికి ఎవరు యజమానో తేలిందని సీఎం కేసీఆర్ చెప్పారు. వీటి ఆధారంగానే కొత్త పాస్ పుస్తకాల జారీ, పంట పెట్టుబడి మద్దతు పథకం అమలు చేస్తామని చెప్పారు. కోర్టు కేసులు, ఇతర వివాదాలు, అభ్యంతరాలున్న భూములను పార్ట్-బీలో చేర్చామని, ఈ లెక్కలు తేల్చడానికి త్వరలోనే కేబినెట్ సమావేశం నిర్వహించి కొన్ని విధాన నిర్ణయాలు తీసుకుంటామని చెప్పారు. ఆ తర్వాత పార్ట్-బీలోని వివాదాస్పద భూముల ప్రక్షాళన చేపడతామన్నారు.

ఎమ్మార్వోలకు సబ్ రిజిస్ట్రార్ బాధ్యతలు

రైతులు, ఇతర ప్రజలకు అందుబాటులో ఉండేందుకు ప్రతి మండల రెవెన్యూ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకునే వెసులుబాటు కల్పించాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. "రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న 141 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను యథాతథంగా కొనసాగిస్తాం. వారి పరిధి కార్యాలయమున్న మండలానికే పరిమితమవుతుంది. మిగిలిన 443 మండలాల్లో ఎమ్మార్వోలకు సబ్ రిజిస్ట్రార్ బాధ్యతలు అప్పగిస్తాం. వారు వారానికి ఐదు రోజులు రిజిస్ట్రేషన్ బాధ్యతలు నిర్వర్తిస్తారు. అత్యవసర పరిస్థితుల్లో ఎమ్మార్వోలు హాజరుకాలేకపోతే, ఆ బాధ్యతను డిప్యూటీ తహసీల్దార్లకు అప్పగిస్తాం" అన్నారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్ శర్మ, రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ తివారీ, సీఎం ముఖ్య కార్యదర్శులు ఎస్.నర్సింగ్ రావు, శాంతి కుమారి, కార్యదర్శి స్మితా సభర్వాల్, మీ సేవ కమిషనర్ జీటీ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సాగు భూములకే చెక్కులు

» సీఎంకు మంత్రివర్గ ఉపసంఘం నివేదిక

హైదరాబాద్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): పంట పెట్టుబడి మద్దతు పథకం అమలుకు సంబంధించిన నివేదికను మంత్రివర్గ ఉపసంఘం సీఎం కేసీఆర్‌కు అందజేసింది. వ్యవసాయ మంత్రి పోచారం శ్రీనివాస రెడ్డి నేతృత్వంలోని ఉపసంఘం శనివారం ప్రగతి భవన్‌లో ముఖ్యమంత్రితో భేటీ అయింది. రైతుల నుంచి అభిప్రాయాలు, సూచనలు సేకరించామని, అత్యధిక రైతులు చెక్కుల రూపంలోనే ఇవ్వాలని తెలిపారని పోచారం చెప్పారు. సాగుకు యోగ్యం కాని భూములకు మద్దతు ఉండదని, క్షేత్రస్థాయిలో పరిశీలించి సాగు యోగ్యమైన భూములకు చెక్కులు అందిస్తామన్నారు. పట్టా భూమి అయినా రాళ్లురప్పలతో ఉంటే పెట్టుబడి సాయం ఇవ్వడం సరికాదని ఉపసంఘం అభిప్రాయపడింది. సాగుకు యోగ్యం కాని భూములను పథకం నుంచి తొలగిస్తారు. పెట్టుబడి సాయం అందించడానికి ఎకరాలపై పరిమితి లేదు. రాష్ట్రంలో 97.2% రైతులు 10 ఎకరాల్లోపే ఉన్నారు.

ప్రతిపాదిత నూతన రిజిస్ట్రేషన్ విధానం ఇదే!

- అమ్మేవారు, కొనేవారు అంగీకారంతో తహసీల్దార్ (సబ్‌రిజిస్ట్రార్) అపాయింట్‌మెంట్ తీసుకొని.. పాస్‌పుస్తకాలతో వస్తే, బయోమెట్రిక్ ద్వారా వేలిముద్రలు, ఫొటోలు, సంతకాలు తీసుకుంటారు.
- డాక్యుమెంట్ తయారీకి లైసెన్స్‌డ్ రైటర్లు ఉంటారు. అమ్మేవారు/కొనేవారు స్వయంగా డాక్యుమెంట్ రాసుకున్నా అనుమతిస్తారు.
- ఎంత భూమి అమ్ముతున్నారో దానిని అమ్మేవారి పాస్ పుస్తకం నుంచి సబ్ రిజిస్ట్రార్ తొలగిస్తారు. కొన్నవారి పాస్ పుస్తకంలో నమోదు చేస్తారు. ఇద్దరి పాస్ పుస్తకాలను వెంటనే ఎమ్మార్వోకు పంపుతారు. ఆయన మ్యుటేషన్ చేస్తారు.
- ఈ వివరాలను ఎమ్మార్వో కార్యాలయంలోని భూమి రికార్డుల్లో నమోదుచేస్తారు. వాటిని అక్కడి ఐటీ అధికారికి పంపిస్తారు. ఆయన ఆ వివరాలను వెబ్‌సైట్‌లో నమోదు చేస్తారు. వెంటనే, కొన్నవారికి, అమ్మిన వారికి ఎస్ఎంఎస్ వెళ్లిపోతుంది.
- పాస్ పుస్తకాలను ఇప్పటి మాదిరిగా ఆర్డీవోకు పంపాల్సిన అవసరం లేదు. పేరు మార్పిడి (మ్యుటేషన్) బాధ్యత పూర్తిగా ఎమ్మార్వోదే.
- రైతులకిచ్చే పాస్ పుస్తకంలో ఖాతా నంబరు, పాస్ పుస్తకం యునీక్ కోడ్, గ్రామం, మండలం కోడ్, యజమాని ఆధార్ నంబరు ఉంటాయి.

ప్రగతి భవన్‌లో సీఎం సంక్రాంతి పూజలు

హైదరాబాద్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సందర్భంగా శనివారం ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్ దంపతులు పూజలు నిర్వహించారు. ఈ కార్యకమంలో ప్రభుత్వ ప్రధాన సలహాదారు రాజీవ్‌శర్మ, సీఎంవో ముఖ్యకార్యదర్శి నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్ సంక్రాంతి శుభాకాంక్షలు

సంక్రాంతి సందర్భంగా తెలుగు రాష్ట్రాల ప్రజలకు గవర్నర్ నరసింహన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండుగ.. అందరి కుటుంబాల్లో ఆనందోత్సహంతోపాటు ప్రేమ, సోదరభావం పెంపొందించాలని ఆకాంక్షించారు.

24 గంటల కరెంటు సక్సెస్‌పై

కాంగ్రెస్‌కు కడుపు మంట

» నోరుంది కదాని ఏది పడితే అది వాగడం మంచిది కాదు

» జైలుకెళ్లి చిప్పకూడు తిన్నవారూ నీతి గురించి మాట్లాడమా?

» విలేకరులతో ఇష్టాగోష్ఠిలో కేటీఆర్

హైదరాబాద్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): వ్యవసాయానికి 24 గంటల కరెంటు సరఫరా విజయవంతం కావడంతో కాంగ్రెస్ కడుపు మండుతోందని మంత్రి కె.తారకరామారావు అన్నారు. టీఆర్ఎస్‌పార్టీ స్థిరపడితే తెలంగాణలో ఎప్పటికీ అధికారంలోకి రామేమోనని ఆ పార్టీ నేతలు రగిలిపోతున్నారన్నారు. శనివారం విలేకరులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడిన మంత్రి.. విద్యుత్ కొనుగోలులో అవినీతిపై ఆధారాలుంటే న్యాయస్థానాన్ని ఆశ్రయించవచ్చని సూచించారు. 'నోరుంది కదా అని అడ్డంగా ఏది పడితే అది మాట్లాడడం మంచిదికాదు. జైలుకు వెళ్లి చిప్పకూడు తిన్నవారు కూడా నీతి గురించి మాట్లాడితే ఎలా? వ్యవసాయానికి 24 గంటల కరెంటుతో రైతులు పూర్తి సంతృప్తితో ఉన్నారు. విద్యుత్‌పై శాసనసభ వేదికగా చర్చిద్దామంటే పారిపోయిన నేతలు ఇప్పుడు పంచాయితీరాజ్ చట్టంపై అఖిలపక్షం పెట్టాలంటున్నారన్నారు. శాసనసభ నియోజకవర్గాల సంఖ్య పెరిగే అవకాశాలున్నట్టు సమాచారం ఉందన్నారు. కాగా.. ఆదివారం నుంచి 27వ తేదీ వరకూ విదేశీ పర్యటనలున్నట్లు తెలిపారు. 22 వరకు దక్షిణకొరియా, జపాన్, 23న దావోస్ పర్యటనలున్నాయన్నారు.

స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్

ఐజీగా వాకాటి కరుణ

హైదరాబాద్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ వాకాటి కరుణకు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ కమిషనర్, ఇన్‌స్పెక్టర్ జనరల్‌గా ప్రభుత్వం అదనపు బాధ్యతలను అప్పగించింది. ప్రస్తుతం ఐజీగా కార్మిక శాఖ కమిషనర్ అహ్మద్ నదీం వ్యవహరిస్తున్నారు. ఆయన స్థానంలో కరుణకు బాధ్యతలు అప్పగిస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

ట్యాంపరింగ్‌కు అవకాశమివ్వొద్దు: సీసీఎల్ఏ

నవీకరణ, శుద్ధీకరణ తర్వాత సిద్ధం చేసిన రికార్డుల్లో ట్యాంపరింగ్‌కు అవకాశం ఇవ్వొద్దని కలెక్టర్లకు సీసీఎల్ఏ స్పష్టం చేశారు. రికార్డులను భద్రపరచాలని, మాన్యువల్ పహణీపై వీఆర్ఓ ముద్ర ఉండాలని సూచించారు. జనవరి ఒకటి తర్వాత నవీకరించిన డేటాను ప్రత్యేక రిజిస్టర్‌లో నమోదు చేయాలని, త్వరలో ఎల్ఆర్‌యూపీ వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని, రికార్డులను సవరిస్తే ఆ వివరాలు ఏ రోజుకారోజు సాయంత్రం 4 కల్లా అందజేయాలని పేర్కొన్నారు.


సచివాలయంలో సమావేశమైన మంత్రివర్గ ఉపసంఘం సభ్యులు జూపల్లి, కేటీఆర్, పోచారం, ఇంద్రకరణ్, ఈటల, హరీశ్, తుమ్మల

సర్పంచ్‌కు పరోక్షం!

పంచాయతీరాజ్ ముసాయిదా సిద్ధం

హైదరాబాద్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఇక సర్పంచ్ పదవికి పరోక్ష ఎన్నిక జరగనుంది. తప్పు చేసిన సర్పంచ్‌లపై క్రమశిక్షణ చర్యలకు ట్రైబ్యునల్ ఏర్పాటు చేస్తారు. ఇందులో ప్రభుత్వం పాత్ర ఉండదు. రిజర్వేషన్ రొటేషన్‌ను ఐదేళ్లకు కాకుండా పదేళ్ల తర్వాత చేపట్టాలని నిర్ణయించారు. ఐదేళ్లకే మారడం వల్ల ఒకసారి ఎన్నికైన వారు మళ్లీ అవకాశం రాదనే భావనతో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, అలా కాకుండా బాధ్యతగా పనిచేసేందుకు ఈ నిర్ణయం దోహదపడుతుందని భావిస్తున్నారు. ఈ మేరకు పంచాయతీరాజ్ చట్టం మార్పుపై వేసిన మంత్రివర్గ ఉపసంఘం ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిసి తన నివేదికను సమర్పించింది. పంచాయతీరాజ్ చట్టంపై సీఎం గత ఆదివారం మంత్రివర్గ ఉపసంఘం వేయగా, ఆరు రోజుల్లో ఐదు మార్లు సుదీర్ఘంగా సమావేశమై చర్చించారు. శనివారం సచివాలయంలో తుది సమావేశం అనంతరం ముసాయిదా చట్టం తుది ప్రతిని తీసుకొని సీఎం దగ్గరకు వెళ్లారు. జూపల్లి కృష్ణారావు నాయకత్వంలోని కమిటీలో ఈటల రాజేందర్, హరీష్‌రావు, కేటీఆర్, తుమ్మల నాగేశ్వరరావు, ఇంద్రకరణ్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి సభ్యులుగా ఉన్నారు. ఇక ముఖ్యమంత్రి మార్పులేమైనా చెబితే అనుగుణంగా సవరణలు చేస్తారు. పంచాయతీరాజ్ చట్టంపై ఇప్పటికే నిపుణుల కమిటీ ఒక ముసాయిదాను రూపొందించింది. దానిపైనే మంత్రివర్గ ఉపసంఘం మరింత కసరత్తు చేసింది. "పల్లె ప్రగతి-గ్రామ స్వరాజ్యం" పేరిట రూపొందించిన ముసాయిదాను ఆమోదించేందుకు ఈ నెల మూడో వారంలో శాసనసభ సమావేశాలను నిర్వహిస్తారు.

ఉప సంఘం ప్రధాన నిర్ణయాలు.

- పంచాయతీలకు బడ్జెట్‌లోనే నిధులు.జనాభా ఆధారంగా కేటాయింపులు
- మౌలిక సదుపాయాల కల్పనపై ప్రజలకు అడిగే హక్కు.
- గ్రామసభల్లో ప్రజల భాగస్వామ్యం తప్పనిసరి. 500 జనాభా ఉంటే 50 మంది, 10 వేల జనాభా దాటితే 400 మంది హాజరవ్వాలి.
- కొత్తగా 4 వేల పంచాయతీలు. అందులో 2 వేలు తండాలు
- 300 జనాభా ఉన్నా తండా పంచాయతీలుగా అవకాశం
- గ్రామ పంచాయతీల్లో కో ఆప్షన్ సభ్యుల నియామకం.
- కో ఆప్షన్ సభ్యులుగా ముగ్గురు, ఒకరు ఎన్నారై?
- సర్పంచ్‌లకు కార్యనిర్వహణాధికారాలు, విధులు, బాధ్యతలు
- లేఅవుట్‌లు, కొన్ని అంతస్తుల వరకు జిల్లా స్థాయిలో అనుమతులు
- పరిమిత నిర్మాణాలకు మండల స్థాయిలోనే అనుమతి
- అనుమతి లేని లే అవుట్లు, ప్లాట్లకు రిజిస్ట్రేషన్ నిరాకరణ
- సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు సిట్టింగ్ ఫీజు
- పరిశ్రమల ఏర్పాటుకు పంచాయతీల అనుమతి అవసరం లేదు.
- చట్టాలు, నిబంధనలు అతిక్రమించే వారిపై జరిమానాలు.

నకిలీ గల్ఫ్ ఏజెంట్లపై పీడీచట్టం

» ఏజెంట్లు .. ఈ-మైగ్రేట్‌లో రిజిస్టర్ చేసుకోవాలి

» లేదంటే కఠిన చర్యలు తప్పవు: మంత్రులు కేటీఆర్, నాయిని

» ప్రవాసీ సమస్యలపై అధికారులతో సమీక్ష

హైదరాబాద్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): బతుకుదెరువు కోసం గల్ఫ్ తదితర దేశాలకు వెళ్లేవారిని పదే పదే మోసం చేసే నకిలీ ఏజెంట్లపై పీడీ చట్టం నమోదు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు మంత్రులు కేటీఆర్, నాయిని నర్సింహారెడ్డి తెలిపారు. విదేశాలకు ఉపాధి కోసం వలసవెళ్లే కార్మికుల సంక్షేమం, పాస్ పోర్టుల ఇప్పించే ఏజెంట్ల వ్యవహారంపై శనివారం ఆయా శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం కేటీఆర్ విలేకరులతో మాట్లాడుతూ నకిలీ ఏజెంట్లను గుర్తించేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. గల్ఫ్‌లో ఉపాధి కోసం కార్మికులను పంపేందుకు ఏర్పాట్లు చేసే ఏజెంట్లు నెల రోజుల్లో నిర్దేశించిన వివరాలను ఈ-మైగ్రేట్‌లో రిజిస్టర్ చేసుకోవాలన్నారు. లేదంటే వారిని అక్రమ ఏజెంట్లుగా గుర్తిస్తూ.. క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. నకిలీ ఏజెంట్లను గుర్తించేందుకు త్వరలోనే పోలీసులు మార్గదర్శకాలను రూపొందిస్తారని వివరించారు. విదేశీ మంత్రిత్వ శాఖ ఇచ్చిన 'సురక్షితంగా వెళ్లండి..! సుశిక్షితులై వెళ్లండి..!' అనే నినాదానికి అనుగుణంగా తెలంగాణ ప్రభుత్వ టాం కంపెనీ ద్వారా చట్టపరంగా విదేశాలకు వెళ్లాల కేటీఆర్ సూచించారు.

ఫిబ్రవరిలో విదేశీ భవన్

రాజధాని నగరంలో విదేశీ భవన్‌కు ఫిబ్రవరి రెండో వారంలో శంకుస్థాపన చేసేందుకు చర్యలు తీసుకోవాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్, ఎన్నారై


అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి కేటీఆర్, చిత్రంలో నాయిని

శాఖ ఉన్నతాధికారులను ఆదేశించినట్టు మంత్రి కేటీఆర్ తెలిపారు. కేంద్ర-రాష్ట్రప్రభుత్వాలు ఎన్నారైలకు, వలస కార్మికుల కోసం చేపడుతున్న చర్యలు, ప్రభుత్వ పథకాలను ప్రజలకు తెలియజేసేలా విస్తృత స్థాయిలో ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించామన్నారు. ఈ విషయంలో రాష్ట్ర పోలీస్ శాఖ కొంతకాలంగా తీసుకుంటున్న చర్యలను మంత్రి అభినందించారు. మానవ అక్రమ రవాణాను అరికట్టడంలో మైనారిటీల సంక్షేమ శాఖ, కార్మిక శాఖ, ఎన్నారై, పోలీస్ శాఖలు సంయుక్తంగా బృందాలు ఏర్పాటు చేసుకుని కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. మానవ అక్రమ రవాణాకు పాల్పడుతున్న ఏజెంట్లపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని, ఈ మేరకు పాస్‌పోర్టు కార్యాలయ అధికారులు సహకారం తీసుకోవాలని సూచించారు. ఈ సమీక్షలో డీజీపీ మహేందర్‌రెడ్డి, హోంశాఖ ముఖ్యకార్యదర్శి రాజీవ్ త్రివేది, ఎన్నారై, పోలీసు శాఖల అధికారులు పాల్గొన్నారు.

స్థానిక ఉప ఎన్నికల్లో టీఆర్ఎస్ హవా

16 ఎంపీటీసీలకుగాను 10 స్థానాల్లో గెలుపు

» ఇద్దరు చొప్పున కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థుల గెలుపు

» జానారెడ్డి నియోజకవర్గంలో టీఆర్ఎస్ విజయం

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

అధికార టీఆర్ఎస్ మరోసారి సత్తా చాటింది. రాష్ట్రంలోని పలు చోట్ల జరిగిన ఎంపీటీసీ ఉప ఎన్నికల్లో ఘనవిజయం సాధించింది. మొత్తం 16 ఎంపీటీసీ స్థానాలకు ఉప ఎన్నికలు జరగగా.. 10 స్థానాలను గులాబీ పార్టీ కైవసం చేసుకుంది. ప్రతిపక్ష కాంగ్రెస్, బీజేపీ చెరో రెండు చొప్పున స్థానాలను గెలుపొందగా.. రెండు చోట్ల స్వతంత్ర అభ్యర్థులు విజయం సాధించారు. కాగా టీఆర్ఎస్ గెలుపొందిన ఎంపీటీసీల్లో ఓ స్థానం.. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, ఆ పార్టీ శాసనసభాపక్ష నేత కుందూరు జానారెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం పరిధిలోనిది కావడం గమనార్హం. నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ నియోజకవర్గం నిడమనూరు మండలంలోని ఎర్రబెల్లి ఎంపీటీసీ స్థానానికి ఇప్పటిదాకా కాంగ్రెస్ ప్రాతినిధ్యం వహిస్తుండగా.. తాజా ఉప ఎన్నికల్లో అది టీఆర్ఎస్ వశమైంది. టీఆర్ఎస్ అభ్యర్థి మన్నెం వెంకన్నయాదవ్ 563 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఇక టీఆర్ఎస్ ఓడిన స్థానాల్లో ఒకటి సీఎం కేసీఆర్ సొంత జిల్లాలో ఉంది. సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం ఆకునూరు ఎంపీటీసీ-1 ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి తాటికొండ వేణుగోపాల్ 94 ఓట్ల మెజారిటీతో టీఆర్ఎస్ అభ్యర్థిపై విజయం సాధించారు. అయితే ఇక్కడ టీఆర్ఎస్ ఓటమికి స్థానిక ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి నిర్లక్ష్య వైఖరే కారణమన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ఎంపీటీసీ స్థానం	జిల్లా	గెలిచిన పార్టీ
నెట్నూరు	కుమ్రం భీం ఆసిఫాబాద్	టీఆర్ఎస్
కౌతాల	కుమ్రం భీం ఆసిఫాబాద్	టీఆర్ఎస్
అంకుశాపూర్ (ఏకగ్రీవం)	సిరిసిల్ల	టీఆర్ఎస్
భద్రాచలం-7	భద్రాద్రి కొత్తగూడెం	టీఆర్ఎస్
జక్కేపల్లి	ఖమ్మం	టీఆర్ఎస్
కనమనూరు	మహబూబ్‌నగర్	టీఆర్ఎస్
గోపాలదిన్నె	వనపర్తి	టీఆర్ఎస్
కిష్టాపురం	నల్లగొండ	టీఆర్ఎస్
ఎర్రబెల్లి	నల్లగొండ	టీఆర్ఎస్
జన్వాడ	రంగారెడ్డి	టీఆర్ఎస్
అచ్చంపల్లి	కరీంనగర్	కాంగ్రెస్
ఆకునూరు-1	సిద్దిపేట	కాంగ్రెస్
గంగాధర	కరీంనగర్	బీజేపీ
మద్నూరు-2	కామారెడ్డి	బీజేపీ
లింగంపల్లి	మహబూబ్‌నగర్	స్వతంత్ర
కొత్వాల్‌గూడ	రంగారెడ్డి	స్వతంత్ర



ప్రమాదంలో గాయపడ్డ షాహల్, సుమన్

ప్రేమను గెలిపించుకోబోయి ప్రమాదం

» 'పెద్దలు' వెంబడించడంతో చెట్టును ఢీకొన్న కారు

» ప్రేమజంటకు గాయాలు.. డ్రైవర్ మృతి

ఖమ్మం క్రైం, జనవరి 13: ఇద్దరూ ప్రేమించుకున్నారు. పెద్దలను ఎదిరించి పెళ్లి చేసుకున్నారు. కానీ, వారి ప్రేమను, పెళ్లిని అంగీకరించని పెద్దలు.. వారిని విడదీసేందుకు వెంబడించడంతో ప్రేమ జంట ప్రమాదానికి గురైంది. వివరాల్లోకి వెళితే.. భద్రాద్రి జిల్లా ఇల్లెందుకు చెందిన సుమన్ గాంధీ, షాహల్ ఐదేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. కాగా వీరి ప్రేమ విషయం షాహల్ ఇంట్లో తెలియడంతో కుటుంబసభ్యులు ఆమెకు మరో వ్యక్తితో వివాహం చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. దీంతో స్నేహితుల సాయంతో ఈ జంట శుక్రవారం మహబూబాబాద్ జిల్లా అనంతారంలోని దేవాలయంలో వివాహం చేసుకున్నారు. అనంతరం ఇల్లెందు పోలీసులను ఆశ్రయించి రక్షణ కోరగా.. వారు యువతి తల్లిని, బంధువులను పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చారు. అయినా మారని పెద్దలు.. శుక్రవారం రాత్రి నుంచి వారిని వెంబడించారు. దీంతో ఈ జంట.. స్నేహితులతో కలిసి కారులో పారిపోయే ప్రయత్నం చేశారు. అయితే యువతి బంధువులు మరో వాహనంలో వారిని వెంబడించారు. ఈ క్రమంలో ఖమ్మం అర్బన్ మండలం గోపాలపురం వద్దకు రాగానే వెనుకనుంచి వస్తున్న కారు.. వీరి కారును ఢీకొట్టడంతో.. కారు అదుపుతప్పి ఓ చెట్టును ఢీకొట్టింది. దీంతో కారు నుజ్జునుజ్జయి డ్రైవర్ మద్దెల రాజు (25) అక్కడికక్కడే మృతి చెందగా.. షాహల్, సుమన్‌లతోపాటు తరుణ్ అనే మరో యువకుడు గాయపడ్డారు.

దుర్యోధనుణ్ని చంపిన భీముణ్ని నిర్జిస్తా...





Paramjyothi
పరంజ్యోతి

దశావతారాల్లో రామచంద్రమూర్తి అవతారం తర్వాత వచ్చేవి బలరామ అవతారం, కృష్ణభగవానుడి అవతారం. దేవకీవసుదేవుల సుతుడు కృష్ణుడు కాగా.. రోహిణి, వసుదేవుల కుమారుడు బలరాముడు. దేవకి అష్టమగర్భుని చేత సంహరింపబడతావని కంసునికి అశరీరవాణి చెప్పినప్పటి నుంచి.. ఆయన దేవకి కడుపున పుట్టిన శిశువులందరినీ హరిస్తూ వచ్చాడు. అయితే, ఏడో గర్భం వచ్చేటప్పటికి పరమాత్మ ఒక విచిత్రమైన స్థితిని ఆవిష్కరించాడు. అదేమిటంటే.. నందుడు, వసుదేవుడు మంచి స్నేహితులు. వసుదేవుడు కారాగారంలో ఉన్నప్పుడు.. ఆయన భార్య రోహిణి నందుని వద్ద ఉన్నది. యోగమాయ దేవకీదేవి గర్భంలోని పిండాన్ని సంకర్షణం చేసి.. అనగా కడుపులోంచి పిండాన్ని తీసుకువెళ్లి రోహిణి కడుపులో ప్రవేశపెట్టింది. గర్భసంకర్షణం చేత పుట్టినవాడు కనుక.. బలరాముడిని సంకర్షణుడు అని కూడా అంటారు. బలరాముడు సాక్షాత్తూ శేషుని అంశ. ఆయన ఆయుధాలు రోకలి, నాగలి. శ్రీరామాయణంలో లక్ష్మణుడుగా వచ్చిన శేషుడు.. అన్నగా రామచంద్రమూర్తి చాలా కష్టాలు పడ్డాడని భావించి ఈసారి తాను అన్నగారుగా రావాలని సంకల్పంచేసి వచ్చిన అవతారమే బలరామావతారం. భీముడికీ, దుర్యోధనుడికీ గదాయుద్ధం నేర్పినవాడు బలరాముడే. అయితే, ఆయన దుర్యోధన పక్షపాతి. అందుకే కురుక్షేత్రంలో కృష్ణుడు పాండవుల పక్షాన ఉండడంతో.. తానెంతో అభిమానించే దుర్యోధనుని వెనుక ఉండలేక తీర్థయాత్రలకు వెళ్లిపోతాడు. యుద్ధం పూర్తయ్యే సమయానికి తిరిగి వస్తాడు. మర్నాడే.. భీమ, దుర్యోధనుల గదాయుద్ధం. ఆయుద్ధంలో భీముడు తన గదతో దుర్యోధనుని తొడలపై మోదగానే అతడు పడిపోయాడు. బలరాముడు అది అన్యాయమన్నాడు. దుర్యోధనుణ్ని చంపిన భీముణ్ని నిర్జిస్తానంటూ నాగలి, రోకలి పట్టుకుని భీముని మీదకు వెళ్లాడు. అప్పుడు కృష్ణుడు.. అది భీముడి ప్రతిజ్ఞ అని, మాట నిలబెట్టుకోవడం సుక్షత్రియుడి లక్షణమని, అలాగే తొడలు విరిగి పడిపోవాలంటూ దుర్యోధనుడికి మైత్రేయి మహర్షి శాపం ఉందని అందుకే అలా జరిగిందని వివరించడంతో శాంతిస్తాడు. చివరికి కృష్ణ భగవానుడు శరీరం విడిచిపెట్టే సమయంలోనే తానూ శరీరాన్ని విడిచిపెడతాడు.

– చాగంటి కోటేశ్వరరావు శర్మ

లోకం తీరు



మనిషా.. పశువా?!



జంతువులకూ లైంగిక ఆనందం

బీబీసీ కథనం

ఈ సృష్టిలో మనుషులు మాత్రమే లైంగిక ఆనందం కోసం శృంగారంలో పాల్గొంటారని.. జంతువులు కేవలం పిల్లల్ని పుట్టించడానికే సృష్టికార్యంలో పాల్గొంటాయని చాలా మంది భావిస్తారు. అయితే, జంతువులకు కూడా లైంగిక సుఖం ఉంటుందని పేర్కొంటూ బీబీసీ 2014లో ఒక కథనాన్ని ప్రచురించింది. ఉదాహరణకు.. బోనోబోలు (ఒకరకం చింపాంజీలు) గర్భధారణ జరిగే అవకాశం లేని సందర్భాల్లో కూడా శృంగారంలో పాల్గొంటాయని శాస్త్రజ్ఞులు గుర్తించినట్లు అందులో పేర్కొంది. అలాగే.. ఆడ సింహాలు రోజుకు 50 నుంచి 100 సార్లు, అలా కొద్ది రోజులపాటు మగసింహాలతో శృంగారంలో పాల్గొంటాయని వివరించింది. అలాగే.. ఇటలీకి చెందిన అల్ఫోన్సో ట్రోయిసి, మోనికా కరోసి అనే ఇద్దరు పరిశోధకులు జపనీస్ మకాక్‌లను (అవి ఒకరకం కోతులు) 238 గంటలపాటు పరిశీలించారు. ఆ సమయంలో అవి 240సార్లు శృంగారంలో పాల్గొన్నాయి. ఆ సమయంలో ఆడ మకాక్‌లు భావప్రాప్తికి గురైనట్టు వారు గమనించారు. ఇలా చాలా ఉదాహరణలను బీబీసీ తన కథనంలో పేర్కొంది.

(మూడో పేజీ తరువాయి)

కేశవరెడ్డి రాసిన 'మునెమ్మ' నవలలో కీలక ఘట్టమిది! తీవ్ర వాదోపవాదాకు దారి తీసిన సంచలనం. ఆ నవలలో ఎద్దుది లైంగికోద్రేకమేనా కాదా అన్నది పక్కన పెడితే.. నిజజీవితంలో పశువులకు లైంగిక సుఖం లేకుండా పోతోంది! ఆడశిశువులను అమ్మకడుపులోనే చిదిమేస్తున్న మనుషులు.. ఆడపశువులకు ఇంజెక్షన్లతో కృత్రిమ గర్భధారణ చేయించి, వాటికి పెయ్య దూడలు పుడితేనే సాకుతున్నారు! కోడెలు పుడితే పుట్టిన కొద్దిరోజులకే కబేళాలకు తరలించి మరణశాసనం విధిస్తున్నారు.

●●●

ఎద్దు బీదదయితే చేను బీద!
ఎద్దుకొద్దీ సేద్యం.. సద్ది కొద్దీ పయనం!!
ఎద్దు ఏడ్చిన ఎవుసం.. రైతు ఏడ్చిన రాజ్యం బాగుపడవు!!

..ఎద్దులే ఆధారమైన ఒకప్పటి తెలుగు రైతుల జీవితానికి అద్దం పట్టే సామెతలివి! ఇంటి ముందు జోడెడ్లు ఉన్న రైతు మహరాజు లెక్కే! కానీ అదంతా ఒకప్పటి సంగతి. రైతు ఇంటి ముంగిట రంకెలు వేస్తూ, మెడగంటలతో సవ్వడి చేస్తూ, మాట చేప్తే తలూపుతూ, ఎదురొచ్చే పశువులతో కయ్యానికి సిద్ధమన్నట్టు కాలు దువ్వుతూ.. దగ్గరికెళ్తే కొమ్ములు విసురుతూ, యజమానిపై విశ్వాసం చూపుతూ, వ్యవసాయ పనుల్లో పాలుపంచుకునే ఎద్దులు కాలక్రమంలో కనుమరుగవుతున్నాయి. అరక మోస్తూ, పొలం దున్ని, రైతు పండించిన పంట బస్తాలను ఇళ్లకు తరలించే జోడెద్దులు యాంత్రీకరణతో బలి పశువులు అవుతున్నాయి. మానవాళికి మేలు చేసే మూగ జీవాలకు ఆధునిక యుగంలో విలువ లేకుండా పోతోంది. పని పశువులతో రైతు కుటుంబాల అనుబంధాలు యంత్రాల రాకతో పుటుక్కున తెగుతున్నాయి. పాలు ఇచ్చే పాడి పశువులు తప్ప.. పని పశువుల పెంపకం తగ్గిపోతోంది. అచ్చోసిన ఆంబోతు, దున్నపోతు పుట్టువడి అనే జాతీయాలు నేటితరం వినలేని దుస్థితి దాపురించింది. పంటల సాగు ఖర్చులు పెరిగి నష్టాల పాలవుతున్న రైతు.. వ్యవసాయానికి అనుబంధమైన పశుపోషణను మానేసి, యంత్రాలపై చూపే ఆసక్తి చూపడమే ముఖ్య కారణంగా కన్పిస్తోంది. పరిస్థితి ఇలాగే కొనసాగితే, భవిష్యత్‌లో మగ పశువులు అంతరించే ప్రమాదం ఉందని జంతు ప్రేమికులు వాపోతున్నారు.

కృత్రిమ గర్భధారణే దిక్కు..

గతంలో ప్రతి గ్రామంలో పశుగణాభివృద్ధి కోసం మేలిరకం ఆంబోతులు, దున్నపోతులను పెంచేవారు. గ్రామంలో బొడ్రాయిలు వేసినప్పుడు.. కొంత మంది మంచి లక్షణాలు కలిగిన కోడె దూడలకు పూజలు నిర్వహించి దేవుడి పేరుతో విడిచిపెట్టేసేవారు. ఏ పంట పొలంలో మేసినా వాటిని అడ్డుకునే వారుకాదు. అవి ఇష్టం వచ్చినట్టు తిరుగుతూ ఎదకు వచ్చిన ఆవులతో జతగూడేవి. గేదెలు, దున్నపోతులు సహజసిద్ధంగానే ప్రవర్తించేవి. కానీ, ఈ పద్ధతి వల్ల మేలు జాతి పశువులు ఉత్పత్తి కావటం లేదని.. పలు రకాల వ్యాధులు వారసత్వంగా సంక్రమిస్తున్నాయని ప్రభుత్వం కృత్రిమ గర్భధారణను ప్రవేశ పెట్టింది. ఫలితంగా ఆడ జాతి పశువులకు.. వీర్యకణాల ఇంజెక్షన్లతో కృత్రిమ గర్భధారణ చేయిస్తున్నారు రైతులు. దీని వల్ల అటు ఆడ పశువులు, ఇటు మగ పశువులు లైంగిక సుఖానికి దూరమవుతున్నాయని జంతు ప్రేమికుల వాదన. మారుతున్న పరిస్థితుల్లో గ్రామీణ ప్రాంతాల్లోనూ పశువులను చాలా మంది కొట్టాలకే పరిమితం చేస్తున్నారు. కనీసం మేతకు బయటికి తీసుకువెళ్లే వారి సంఖ్య తగ్గిపోతోంది. ఇందుకు కారణం పశువులను తోలుకుపోవడాన్ని నామోషీగా భావించడమే. దీని వల్ల పచ్చిమేత, గాలి, తమకు అవసరమైనప్పుడు నీరు లేక పశువులు అలమటిస్తున్నాయి.

ఆర్థికంగా భారం.. అందుకే..

పనిపశువులతో ఏ పనీ చేయించనప్పుడు.. కేవలం మేపడానికే అట్టిపెట్టుకోవడం కష్టమని అందుకే మాంసం వ్యాపారులకు విక్రయిస్తున్నామని జగిత్యాల జిల్లా ఆలూరుకు చెందిన పాడి రైతు లక్ష్మీనారాయణ వివరించారు. అలాగే.. సహజసిద్ధంగా పశువులను దాటించాలంటే ఒక్కోసారికి రూ.100 నుంచి రూ.200 దాకా తీసుకుంటున్నారని.. ఇంజెక్షన్ అయితే రూ.50 లోపే పని పూర్తవుతుందని రైతులు చెబుతున్నారు. అందుకే గ్రామాల్లో రైతులు దాదాపు 99% ఇంజెక్షన్ల ద్వారా గర్భధారణ చేయించడానికే మొగ్గుచూపుతున్నారని వారు వివరించారు.

దారుణంగా తగ్గిన మగపశువుల సంఖ్య..

తెలుగు రాష్ట్రాల్లో పాడి పశువుల కన్నా పని పశువుల సంఖ్య గణనీయంగా తగ్గింది. ఒకప్పుడు ఇంటి అవసరాలకు ఒకటో, రెండో పాడి గేదెలు, ఆవులు ఉంటే, నాలుగైదు జతల ఎద్దులు వ్యవసాయానికి ఉండేవి. కానీ కాలక్రమంలో వ్యవసాయానికి ఇనుము,, సరుకు రవాణాకు ట్రాక్టర్లు, లారీలు రావడంతో పని పశువుల పెంపకం తగ్గింది. 2015 గణాంకాల ప్రకారం ఏపీలోని 13 జిల్లాల్లో.. పనికి వచ్చే ఎద్దులు 12,03,944 ఉండగా, దున్నపోతులు 1,24,499 మాత్రమే ఉన్నాయి. పాలిచ్చే ఆవులు 19,24,499 ఉండగా, గేదెలు 35,25,527 ఉన్నాయి. రాష్ట్రంలో 35 లక్షల గేదెలు ఉండగా, దున్నపోతులు లక్షా పాతిక వేలు కూడా లేవు. ఆవులు 19 లక్షలుపైగా ఉండగా, ఎద్దులు 12లక్షలే ఉన్నాయి. తెలంగాణలో చూస్తే.. 2006లో రాష్ట్రవ్యాప్తంగా 1,46,40,879 పశువులు (ఆడ, మగ) ఉన్నట్లు లెక్క తేలింది. 2012లో జరిగిన పశు గణన ప్రకారం ఆ సంఖ్య 48,80,298కి తగ్గిపోయినట్లు ఉన్నట్లు గుర్తించారు. తెలంగాణా, ఏపీలో కలిపి రెండు లక్షల ఒంగోలు జాతి పశువులు ఉండగా, అందులో ఎద్దులు సగానికి సగం కూడా లేవు. ఏపీలో సైతం.. దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాల్లో మాత్రమే ఒంగోలు జాతి పశుపోషణ అధికంగా జరుగుతోంది. మిగిలిన చోట్ల నాటు రకం ఎద్దులు, ఆవులే అధికంగా ఉండగా, దున్నపోతులు మూడొంతులు నాటు రకమే ఉన్నాయి. పోషణ కష్టమవుతున్న నేపథ్యంలో పశు సంతతి మగనుగడ కోసం ప్రభుత్వం చొరవ తీసుకుని, మగ పశువుల హాస్టళ్లను నిర్వహించాలని శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు.

– ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్



వాటికి లైంగిక భావన ఉండదు!



ఆడ పశువులకు మగ పశువులతోనే సంపర్కం జరగాలని లేదు. మనిషిలా పశువులకు ఆ భావన ఉండదు. కృత్రిమ గర్భధారణకైనా సహకరిస్తాయి. వాటికి అంత మానసిక పరిపక్వత ఉండదు.

– డాక్టర్ ముత్తారావు, ఒంగోలు జాతి పశు పరిశోధన స్థానం శాస్త్రవేత్త

ప్రకృతికి విరుద్ధం



పశువుల పెంపకం ప్రకృతికి విరుద్ధంగా సాగుతోంది. యాంత్రీకరణ వల్ల పశు సంతతి తగ్గుతోంది. మగ పశువులతో పని లేకుండాపోవడంతో వాటిని పోషించడం లేదు.

– వెల్మల రాంరెడ్డి, ప్రకృతి ప్రేమికుడు

దున్నపోతులు దొరకడం లేదు



గ్రామాల్లో ఆబోతులు, దున్నపోతులు లభ్యం కావడం లేదు. ఉన్నా ధర అధికంగా ఉంటుంది. ఆంబోతులు, దున్నపోతులు లేకపోవడం వల్ల పశు ఉత్పత్తికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

– వెంకటయ్య, రైతు, ఖమ్మం జిల్లా

ఉష్ణోగ్రతలు

కేంద్రం	కనిష్ఠం	గరిష్ఠం
ఆదిలాబాద్	09.0	31.6
హైదరాబాద్	16.3	32.8
వరంగల్	16.0	32.0
సంగారెడ్డి	17.0	32.0
నల్లగొండ	17.6	31.4

రేపటికల్లా ఈశాన్యం నిష్క్రమణ

విశాఖపట్నం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): దక్షిణాది రాష్ట్రాల నుంచి ఈశాన్య రుతుపవనాలు ఈనెల 15వ తేదీకల్లా నిష్క్రమించనున్నాయని వాతావరణ శాఖ తెలిపింది. ఆ తరువాత తూర్పుగాలుల ప్రభావం వుండబోదని వాతావరణ నిపుణుడొకరు తెలిపారు. రెండు రోజులుగా ఆగ్నేయ బంగాళాఖాతంలో కొనసాగుతున్న అల్పపీడనద్రోణి ప్రభావంతో గాలులు వీస్తున్నా వర్షాలు పడే అవకాశం లేదని పేర్కొన్నారు. కాగా, తెలంగాణలో మూడు నుంచి ఐదు డిగ్రీలు తక్కువగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆదిలాబాద్‌లో తొమ్మిది డిగ్రీలు నమోదైంది.

మతోన్మాదం వర్సెస్ లౌకికవాదం



కర్ణాటకలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికలు నాకు-యడ్యూరప్పకు మధ్యనో, నాకు-ప్రధానమంత్రి మోదీకి మధ్యనో కాదు. మతోన్మాదానికి, లౌకికవాదానికి మధ్యే. మా ప్రభుత్వంపై వ్యతిరేకత లేదు. సరిపడా మెజారిటీతో కర్ణాటకలో కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి వస్తుంది.

– కర్ణాటక సీఎం సిద్దరామయ్య

ఎవరినీ బాధపెట్టాలని కాదు!



తిరుమల వేంకటేశ్వర స్వామి విషయంలో ఎవరినీ బాధ పెట్టాలన్న ఉద్దేశం నాకు లేదు. ఈ వ్యవహారంలో నాపై పెట్టిన కేసులను చట్టపరంగా ఎదుర్కొంటా. సుప్రీంకోర్టు జడ్జిలు చేసిన వ్యాఖ్యలు చూస్తుంటే దేశంలో అసాధారణ పరిస్థితులు నెలకొన్నట్లుగా అనిపిస్తోంది. దీనిపై కేంద్రం తక్షణం స్పందించాలి. అదేసమయంలో న్యాయవ్యవస్థలో రాజకీయ జోక్యం ఉండకూడదు.

– డీఎంకే ఎంపీ కనిమొళి

నేటి పెట్రో ధరలు (లీ.)


పెట్రోల్	డీజిల్
పాత ధర రూ.75.10	పాత ధర 66.68
కొత్త ధర రూ.75.24	కొత్త ధర 66.88
పెరిగింది : 14 పైసలు	పెరిగింది : 20 పైసలు



హృదయానికి 'ప్యాచ్'ల రక్ష

న్యూయార్క్, జనవరి 13: గుండెపోటుకు గురై అనారోగ్యంతో బాధపడుతున్నవారికి శుభవార్త. రక్త సరఫరా జరగక గుండె కణజాలం పాడైన వారికోసం 'ప్యాచ్'లను అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ అలబామా శాస్త్రవేత్తలు తయారు చేశారు. వాటిని కణజాలం పాడైన చోట అతికించి గుండె పనితీరును మెరుగుపర్చవచ్చని పరిశోధకులు తెలిపారు. ఒక పందిలో పాడైన గుండె కణజాల పరిమాణాన్ని తగ్గించేందుకు ప్యాచ్‌లను అతికించి కోలుకునేలా చేసినట్లు వివరించారు.

ప్రొస్టేట్ కేన్సర్‌ను గుర్తించే జన్యు సాధనం



వాషింగ్టన్, జనవరి 13: పురుషుల్లో ప్రొస్టేట్ గ్రంథికి సోకే కేన్సర్‌ను ముందుగానే గుర్తించే జన్యు సాధనాన్ని అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. కొత్త రకం పాలిజెనెటిక్ హజార్డ్ స్కోర్ సాయంతో స్క్రీనింగ్ జన్యు సాధనాన్ని ఉపయోగించి.. ఎవరికి ప్రొస్టేట్ కేన్సర్ ముప్పు ఉంది? ఏ వయసులో వచ్చే ప్రమాదం ఉంది? తదితర సమాచారం తెలుసుకోవచ్చట. ప్రస్తుతం ఈ కేన్సర్‌ను గుర్తించేందుకు 'ప్రొస్టేట్ స్పెసిఫిక్ ఆంటిజెన్(పీఎస్ఏ)' పరీక్షను ఉపయోగిస్తున్నారు. దీని వల్ల ఆశించదగ్గ ఫలితాలు రావడం లేదని, అందుకే కొత్త స్క్రీనింగ్ సాధనాన్ని తయారు చేసినట్లు పరిశోధకులు తెలిపారు.

బరువైన సంక్రాంతి.. కొబ్బరి కాయలు కొట్టాలి!

- వికారాబాద్ ప్రాంతంలో విస్తృత ప్రచారం
- ఆలయాలకు పోటెత్తుతున్న మహిళలు

ధారూరు, జనవరి 13: ఓ ప్రచారం.. వికారాబాద్ జిల్లాలో కొబ్బరికాయలకు తెగ గిరాకీ తెచ్చిపెట్టింది! మహిళలను ఆలయాలకు పరుగులు పెట్టిస్తోంది. ఈసారి సంక్రాంతి బరువుగా వచ్చిందని, ఈ కారణంగా పిల్లలున్న మహిళలు ఉపవాస దీక్ష పాటించి, హనుమాన్ ఆలయాల్లో కొబ్బరి కాయలు కొట్టాలనేది ఆ ప్రచార సారాంశం. దీంతో ధారూర్ మండలం పలు గ్రామాల్లోని మహిళలు శనివారం ఆంజనేయస్వామి ఆలయాలకు పోటెత్తారు. బంధుమిత్రులకు ఫోన్లు చేసి మరీ చెబుతున్నారు. అయితే, ఈ విషయం పంచాగంలో ఎక్కడా చెప్పలేదని, ఒట్టి ప్రచారమని ధారూరు మండల కేంద్రానికి చెందిన అర్చకుడు చెన్నబసవయ్యస్వామి తెలిపారు. అమావాస్య రోజు కనుమ పండగ ఉన్నందున ఆ రోజు అమ్మ వారి దేవాలయాల్లో దీపం వెలిగించి దర్శనం చేసుకుంటే శుభం కలుగుతుందని ఆయన వివరించారు. సంక్రాంతి రోజు పెరుగు అన్నం భుజించాలని సూచించారు.



ధారూరులోని ఆంజనేయస్వామి దేవాలయంలో మహిళలు కొట్టిన కొబ్బరికాయలు

ఒకరోజు ముందే 'భోగి' భాగ్యం



రంగవల్లుల వెలుగు జిలుగులు... మధ్యలో భోగి మంటల కాంతులు.. ఇవన్నీ కలబోసి చుట్టూ చేరిన మగువల కళ్లలో సంక్రాంతి పండుగ సంబురాలుగా ప్రతిబింబించాయి. శనివారం తెలతెలవారుతుండగా గల్లీలోని చిన్నాపెద్దా అంతా ఒకచోట చేరి చక్కని ముగ్గులు వేశారు. రంగులద్దారు. మలిసంధ్య వేళ ఆ రంగవల్లి మధ్యలోనే భోగి మంట వేశారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో ఇలా ఒకరోజు ముందుగా కనిపించిన భోగి సంబురమిది.

50 కిలోలు.. 9 అడుగులు.. భారీ కొండచిలువ పట్టివేత

పశ్చిమగోదావరి జిల్లా లక్కవరంలో శనివారం భారీ కొండచిలువను గ్రామస్థులు పట్టుకున్నారు. 50 కేజీల బరువు, 9 అడుగుల వెడల్పుతో ఉన్న ఆ కొండచిలువను చూసేందుకు ప్రజలు తండోపతండాలు వచ్చారు. భోగి మంటలకు అవసరమైన పుల్లలను పొలాల్లో సేకరిస్తున్న సమయంలో దీన్ని గుర్తించారు. యువకులు, గ్రామస్థులు ధైర్యం చేసి కొండచిలువను పట్టుకుని ఆటోలో ఊరేగించారు. అనంతరం సమీపంలోని జి.కొత్తపల్లి అటవీప్రాంతంలో దాన్ని విడిచి పెట్టారు.

-జంగారెడ్డిగూడెం



పల్లెకెళ్లిన 'పట్నం'

- కిక్కిరిసిన బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు
- సంక్రాంతి పండుగకు 20 లక్షల మంది పయనం

హైదరాబాద్ సిటీ/యాదాద్రి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : ఊపిరాడని పని ఒత్తిడితో నిత్యం నలిగిపోయే నగరవాసులు నాలుగు రోజుల పండుగ కోసం పల్లెలకు వెళ్లారు. ఎదురు ఇళ్లల్లో ఉన్నా ఏనాడు పలకరించుకోని నగర సంస్కృతిని నుంచి పలకరింపుల 'నీళ్ల'నిచ్చే సొంతూళ్లకు బయలుదేరారు. లక్షలాది మంది ఒకేసారి సొంత ఊర్ల బాట పట్టడంతో రైల్వేస్టేషన్లు, బస్టాండ్లు ప్రయాణికులతో కిక్కిరిసిపోయాయి. టీఎస్ ఆర్టీసీ తెలుగు రాష్ట్రాలకు ప్రత్యేకంగా 3,262 సర్వీసులు నడుపుతోంది. ప్రభుత్వ, ప్రైవేట్ రవాణా సాధనాలు, సొంత వాహనాల్లో గ్రేటర్ నుంచి దాదాపుగా 20 లక్షల మంది పల్లెలకు వెళ్లడంతో హైదరాబాద్ రోడ్లు బోసిపోయాయి. దక్షిణ మధ్య రైల్వే 150 ప్రత్యేక రైళ్లను నడుపుతోంది. మరోవైపు యాదాద్రి భువనగిరి జిల్లాలోని చౌటుప్పల్ మండలం పంతంగి, బీబీ నగర్ మండలం గూడూరు టోల్‌ప్లాజా వద్ద వాహనాల రద్దీ నెలకొంది. పంతంగి టోల్‌ప్లాజా నుంచి శనివారం 40వేలకు పైగా వాహనాలు వెళ్లినట్లు అధికారులు తెలిపారు.



యాదాద్రి భువనగిరి జిల్లాలోని పంతంగి టోల్‌ప్లాజా వద్ద బారులుదీరిన వాహనాలు

» గంగిరెద్దు ఆట.. హరిదాసు పాట



సంప్రదాయ వస్త్రాలు ధరించి ముగ్గులు వేస్తున్న యువతులు.. అంతలోనే 'హరిలో రంగ హరి..' అంటూ వచ్చిన బాల హరిదాసు.. కాలి గజ్జెలు, మెడ గంటలతో గంగిరెద్దుల వినుల విందైన శబ్దాలు.. వాటికి తోడు సన్నాయి పాటతో ఆ కులస్తుల సందడి!! కొత్త పంటను ఇంటికి తెచ్చేందుకు సిద్ధం చేస్తున్న ఎడ్ల బండి.. సంక్రాంతి సంబురమంతా ఒకేచోట పోతపోసినట్టుగా ఉన్న ఈ దృశ్యం శనివారం కరీంనగర్ జిల్లా కేంద్రం రామచంద్రం కాలనీలోనిది!

దళితులకు భూమి ఏది?

- » భూ పంపిణీకి 5వేల ఎకరాలు రెడీ
- » నిధుల కొరతతో పంపిణీ చేయలేని దుస్థితి
- » 65 కోట్లే విడుదల.. 1609 ఎకరాలే రిజిస్ట్రేషన్
- » మార్చిలోగా లక్ష్యం చేరడం అనుమానమే!

హైదరాబాద్, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): దళితులకు మూడెకరాల భూపంపిణీ పథకంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం మార్చి నాటికి మరో 5 వేల ఎకరాలు పంపిణీ చేయాలని నిర్ణయించింది. 2073 ఎకరాలను ఈ నెలాఖరులోగా పంపిణీ చేయనుండగా.. మరో 3 వేల ఎకరాలను ఆర్థిక సంవత్సరం చివరి నాటికి పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటోంది. పలు జిల్లాల్లో భూ లభ్యత ఆశాజనకంగా లేకపోవడం, ధరలు ఎక్కువగా ఉండటం ఇబ్బందికరంగా మారింది. తక్కువ ధరలకు లభ్యమయ్యే భూమిలో సాగుకు అనువైన సారం లేకపోవడం, సౌడు నేలలు కావడంతో వాటిని రైతులు తిరస్కరిస్తున్నట్లు సాంఘిక సంక్షేమశాఖ అధికారులు చెబుతున్నారు. దీంతో ఈ ఏడాది లక్ష్యంలో 50% మాత్రమే సాధించే అవకాశం కనిపిస్తోంది. హైదరాబాద్ జిల్లాలో సాగు భూమి లేదు. మేడ్చల్ జిల్లాలో ధర ఆకాశానికి అంటడంతో భూ పంపిణీ సాధ్యం కాదని అంటున్నారు. భద్రాద్రి జిల్లాతో పాటు జగిత్యాల, జనగామ, మహబూబ్‌నగర్, నిజామాబాద్, పెద్దపల్లి, రంగారెడ్డి, సంగారెడ్డి, వరంగల్(అర్బన్) జిల్లాల్లోనూ భూముల లభ్యత ఆశాజనకంగా లేదు. ఫలితంగా ఈ ఏడాది 20జిల్లాలోనే భూపంపిణీ జరుగుతోంది.

25% భూమిని కూడా పంపిణీ చేయలేదు

భూ పంపిణీ పథకానికి సాంఘిక సంక్షేమ శాఖ 10 వేల



ఎకరాలు గుర్తించినా అందులో ఇప్పటివరకు 25% భూమిని కూడా పంపిణీ చేయలేకపోతోంది. ప్రభుత్వం సకాలంలో నిధులు కేటాయించకపోవడమే ప్రధాన కారణంగా తెలుస్తోంది. ఆర్థిక సంవత్సరం ముగిసేందుకు రెండున్నర నెలలే మిగిలి ఉన్న నేపథ్యంలో భూముల లభ్యత మేరకైనా కొనుగోలు, లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ జరిగే పరిస్థితి కనిపించడం లేదు. కనీసం 5 వేల ఎకరాలైనా పంపిణీ చేయాలని ఎస్సీ కార్పొరేషన్ లక్ష్యంగా పెట్టుకున్నా సాధ్యమయ్యేలా లేదు. తొలి విడతలో 943 మందికి పంపిణీ చేసేలా వివిధ జిల్లాల్లో 2298.18 ఎకరాల భూమి కొనుగోలు చేశారు. ఇందుకు రూ.106.53 కోట్లు అవసరం కాగా రూ.65 కోట్లే విడుదల చేసింది. ఆ నిధులతో ఎస్సీ కార్పొరేషన్ అధికారులు లబ్ధిదారుల పేరిట 1609 ఎకరాలే రిజిస్ట్రేషన్ చేశారు. మరో 3400 ఎకరాల భూమి మార్చి చివరినాటికి పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉందని, దీంతో 5 వేల ఎకరాల లక్ష్యాన్ని పూర్తి చేస్తామని అధికారులు చెబుతున్నారు. కానీ, నిధుల కొరత వల్ల సాధ్యమయ్యే పరిస్థితి కనిపించడం లేదు. ధరల్లో వస్తున్న మార్పుల ప్రభావం భూ పంపిణీపై పడే అవకాశం ఉందని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

టెన్త్ పిల్లలూ.. ఆల్ ది బెస్ట్

» ఉత్తరాలతో విద్యార్థుల్లో ఉత్సాహం నింపుతున్న హరీశ్‌రావు



సిద్దిపేట, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): 'ఎస్సెస్సీ స్టూడెంట్స్.. ఆల్ ది బెస్ట్' అంటూ త్వరలో వార్షిక పరీక్షలు రాసే సిద్దిపేట జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థుల్లో ఉత్సాహం నింపేందుకు మంత్రి హరీశ్‌రావు ప్రయత్నిస్తున్నారు. 11 వేల మంది విద్యార్థుల ఇంటి చిరునామాలు సేకరించి వారి ఇళ్లకు తన పేరిట స్ఫూర్తి నింపే సందేశాన్ని స్వయంగా రాసి లేఖలను పోస్టు చేయిస్తున్నారు. ప్రధానోపాధ్యాయులతో ఇప్పటికే రెండుసార్లు సమీక్ష నిర్వహించిన మంత్రి 100% ఫలితాలు వచ్చేలా చూడాలని ఆదేశించారు. అన్ని స్కూళ్లలో ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. విద్యార్థులకు స్నాక్స్ అందిస్తున్నారు. హరీశ్‌రావు వినూత్న ప్రయత్నాన్ని పలువురు అభినందిస్తున్నారు.

రాజ్యమేలుతున్న హిందూత్వం

- » అంబేద్కర్ మనుమడు ప్రొఫెసర్ ఆనంద్ తేల్‌తుంబ్డే
- » మహబూబ్‌నగర్‌లో విరసం 26వ మహాసభలు ప్రారంభం



ప్రసంగిస్తున్న ఆనంద్ తేల్‌తుంబ్డే

మహబూబ్‌నగర్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): బ్రాహ్మణీయ తత్వంతో ముడిపడ్డ హిందూ రాజకీయాలు దేశంలో రాజ్యమేలుతున్నాయని రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ మనుమడు, ముంబయి ఐఐటీ ప్రొఫెసర్ ఆనంద్ తేల్‌తుంబ్డే అన్నారు. విప్లవ రచయితల సంఘం(విరసం) 26వ రాష్ట్ర మహాసభలు శనివారం మహబూబ్‌నగర్‌లో ప్రారంభమయ్యాయి. ప్రారంభ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. భారతఉపఖండపు గతమంతా వైభోగమని, ముస్లింలు, క్రైస్తవుల రాకతో ఈ వైభవం మంటగలిసిందని భ్రమింపజేస్తూ ఆరెస్సెస్ లాంటి హిందూత్వ సంస్థలు ప్రజల్లో గందరగోళాన్ని సృష్టిస్తున్నాయని అన్నారు. దేశంలో హిందూత్వ అమలుకు తామూ వెనుకబడిలేమని చెప్పే రీతిలో కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ గుజరాత్ ఎన్నికల వేళ 29 దేవాలయాలను సందర్శించారని ఎద్దేవా చేశారు. పాలకవర్గాలు అమానుషంగా మారినప్పుడు ప్రత్యామ్నాయ సాహిత్యం రావాల్సి ఉందని, ఆ బాధ్యతను విరసం భుజానికెత్తుకోవాలని ప్రొఫెసర్ హరగోపాల్ సూచించారు.



మాజీ ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి జయంతిని పురస్కరించుకుని ఇందిరాపార్కులోని రాక్‌గార్డెన్‌లో ఆయన సమాధి వద్ద అంజలి ఘటిస్తున్న పాండిచ్చేరి సీఎం నారాయణస్వామి, మాజీమంత్రులు పొన్నాల, గీతారెడ్డి, మాజీ ఎంపీ వీహెచ్, మాజీ ఎమ్మెల్యే మర్రి శశిధర్‌రెడ్డి తదితరులు.

బడ్జెట్‌లో మాదిగలకు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలి

త్వరలో ఉద్యమ కార్యాచరణ : వంగపల్లి శ్రీనివాస్

హైదరాబాద్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టే బడ్జెట్‌లో మాదిగల అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించాలని ఎమ్మార్పీఎస్ తెలంగాణ వర్కింగ్ ప్రెసిడెంట్ వంగపల్లి శ్రీనివాస్ మాదిగ డిమాండ్ చేశారు. శనివారం విద్యానగర్‌లోని రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దళిత ఉప ప్రణాళికల పేరుతో, దళిత అభివృద్ధి నిధుల పేరుతో గతంలో జరిగిన కేటాయింపులతో ఒక సామాజిక వర్గానికే (మాల) లబ్ధి జరిగిందని మాదిగ, దాని ఉపకులాలకు ఆ నిధులు అందలేదని ఆరోపించారు. మాదిగలు నివసించే వాడల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టకపోవడం వల్ల నేటికీ ఆయా ప్రాంతాలు నేటికీ వెనకబడ్డాయని తెలిపారు.

7 వారాల గరిష్ఠ స్థాయికి బంగారం

న్యూఢిల్లీ : దేశ రాజధాని న్యూఢిల్లీ మార్కెట్లో శనివారం బంగారం ధర ఏడు వారాల గరిష్ఠ స్థాయికి చేరుకుంది. 99.9 శాతం స్వచ్ఛమైన 10 గ్రాముల బంగారం ధర 100 రూపాయలు పెరిగి 30,650 రూపాయల నుంచి 30,750 రూపాయలకు చేరుకుంది. కిలో వెండి ధర కూడా 100 రూపాయలు పెరిగి 39,900 రూపాయలకు చేరింది. అంతర్జాతీయ మార్కెట్లో బంగారం ధర క్రమంగా పెరుగుతోంది. ఈ నేపథ్యంలో దేశీయ మార్కెట్లోనూ ధరల పెరుగుదలకు అవకాశం ఏర్పడుతోంది. పారిశ్రామిక యూనిట్ల నుంచి డిమాండ్ పెరిగినందు వల్ల వెండి ధర వృద్ధి చెందుతోంది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ బంగారం ధర 1,337 డాలర్ల స్థాయిలో, ఔన్స్ వెండి ధర 17.21 డాలర్ల స్థాయిలో ఉంది.

ఆంధ్రాబ్యాంక్ మాజీ డైరెక్టర్ అరెస్ట్

మనీలాండరింగ్ ఆరోపణల్లో ఇపి గార్గ్.. స్టెర్లింగ్ బయో బ్యాంకు రుణాల కుంభకోణంలో భారీగా ముడుపులు



న్యూఢిల్లీ: అక్రమ రుణ వితరణ, మనీలాండరింగ్ ఆరోపణలపై ఆంధ్రాబ్యాంక్ మాజీ డైరెక్టర్ అనూప్ ప్రకాశ్ గార్గ్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) అధికారులు అరెస్ట్ చేశారు. గుజరాత్‌కు చెందిన స్టెర్లింగ్ బయోటెక్‌కు నిబంధనలకు విరుద్ధంగా ఆంధ్రాబ్యాంక్ సారథ్యంలోని బ్యాంకుల బృందం 5,000 కోట్ల రూపాయల మేర రుణాలను మంజూరు చేయడంలో గార్గ్ పాత్ర ఉన్నట్టు ఇడి ఆరోపించింది. ఈ 5,000 కోట్ల రూపాయలను బ్యాంకులకు స్టెర్లింగ్ బయోటెక్ ఎగవేసింది. ఈ మొత్తం వ్యవహారంలో గార్గ్‌కు బినామీ కంపెనీల ద్వారా స్టెర్లింగ్ బయో ప్రమోటర్లైన సందేసరా సోదరులు దాదాపు 1.5 కోట్ల రూపాయలను ముట్టజెప్పారని అంటున్నారు. ఆ సొమ్మును గార్గ్ కోల్‌కతా కేంద్రంగా ఉన్న డొల్ల కంపెనీల ద్వారా తన ఖాతాల్లోకి మళ్లించుకున్నట్టుగా చెబుతున్నారు. గార్గ్ ఆంధ్రాబ్యాంక్ డైరెక్టర్‌గా 2008-09 మధ్య పనిచేశారు. గార్గ్‌ను మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద ఇడి అధికారులు శుక్రవారం రాత్రి అరెస్ట్ చేసినట్టు తెలిసింది. స్టెర్లింగ్ బయో బ్యాంకు రుణాల స్కామ్‌కు సంబంధించిన కేసులో ఇది రెండో అరెస్ట్. గత నవంబరులోనే ఢిల్లీకి చెందని వ్యాపారవేత్త గగన్ ధావన్‌ను ఇడి అరెస్టు చేసింది.

ఇదీ నేపథ్యం...

- బ్యాంకుల నుంచి భారీ ఎత్తున రుణాలు రాబట్టేందుకు స్టెర్లింగ్ గ్రూప్ కంపెనీలు పద్దుల్లో గోల్‌మాల్‌కు పాల్పడినట్టుగా ఆరోపణలున్నాయి. టర్నోవర్, ఉత్పత్తిని భారీగా పెంచిచూపడంతోపాటు మూలధన వ్యయానికి సంబంధించి కూడా తప్పుడు రికార్డులను తయారు చేసింది. ఇందుకోసం దేశీయంగా, విదేశాల్లో ఉన్న తన అనుబంధ కంపెనీలను డొల్ల కంపెనీలను ఉపయోగించుకొంది. ఈ మొత్తం వ్యవహారంలో ఈ కంపెనీలకు వారి చార్టర్డ్ అకౌంటెంట్ సహకరించారు.
- ఈ కుంభకోణంలో స్టెర్లింగ్ బయో డైరెక్టర్లు చేతన్ జయంతిలాల్ సందెసరా, దీప్తి చేతన్ సందెసరా, రాజ్‌భూషణ్ ఓంప్రకాష్ దీక్షిత్, నితిన్ జయంతిలాల్ సందెసరా, విలాస్ జోషీ, చార్టర్డ్ అకౌంటెంట్ హేమంత్ హాతి, గార్గ్‌లకు వ్యతిరేకంగా సిబిఐ గతంలోనే కేసు నమోదు చేసింది. ఈ కేసుకు సంబంధించిన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఇడి మనీలాండరింగ్ ఆరోపణలపై దర్యాప్తు చేపట్టింది.
- ఇడి ఆరోపణల ప్రకారం, 2011లో ఆదాయం పన్ను శాఖ దాడుల సందర్భంగా స్టెర్లింగ్ బయో ప్రమోటర్ల వద్ద దొరికిన ఒక డైరీలో, గార్గ్‌కు 1.52 కోట్ల రూపాయలను నగదు రూపంలో చెల్లించినట్టుగా ఎంట్రీలున్నాయి. సందెసరా సోదరుల ఆదేశాల మేరకు వారి బినామీ కంపెనీల ఖాతాల నుంచి డబ్బులు డ్రా చేసి గార్గ్‌కు ముట్టజెప్పినట్టుగా ఇడి వెల్లడించింది.
- అక్రమంగా సంపాదించిన సొమ్మును కోల్‌కతా కంపెనీల ద్వారా కంపెనీలకు గార్గ్ మళ్లించినట్టుగా ఇడి ఆరోపిస్తోంది.
- 2016 డిసెంబరు ఆఖరునాటికే స్టెర్లింగ్ గ్రూప్ కంపెనీలు స్టెర్లింగ్ బయోటెక్, పిఎంటి మెషిన్స్, స్టెర్లింగ్ ఆయిల్ రిసోర్సెస్, స్టెర్లింగ్ సెజ్ అండ్ ఇన్‌ఫ్రా ఖాతాల్లో మొత్తం 533 కోట్ల రూపాయల మొండిబకాయిలున్నాయి.

సనోఫీ యూరోపియన్ జనరిక్ వ్యాపారంపై

అరబిందో ఆసక్తి

డీల్ విలువ రూ.12,800 కోట్లు?

ముంబై: ఫ్రెంచ్ ఔషధ దిగ్గజం సనోఫీకి చెందిన యూరోపియన్ జనరిక్ మందుల వ్యాపారం కొనుగోలుకు హైదరాబాద్‌కు చెందిన అరబిందో ఫార్మా ఆసక్తిగా ఉంది. జైడస్ క్యాడిలా, టొరెంట్ ఫార్మా, ఇంటాస్ కూడా ఈ వ్యాపారం కొనుగోలు కోసం పోటీపడనున్నాయి. ఈ విక్రయ ప్రక్రియలో భాగంగా సనోఫీ వ్యాపారం విలువను 200 కోట్ల డాలర్లు (రూ.12,800 కోట్లు)గా లెక్కగట్టే అవకాశం ఉంది. చైనాకు చెందిన ఓ టాప్ ఫార్మా కంపెనీతోపాటు అంతర్జాతీయ ప్రైవేట్ ఈక్విటీ (పిఇ) ఇన్వెస్టర్లు ఈ డీల్‌లో దేశీయ ఔషధ సంస్థలకు గట్టి పోటీనివ్వనున్నాయి. కొందరు పిఇ ఇన్వెస్టర్లు ఫార్మా కంపెనీల భాగస్వామ్యంలో బరిలోకి దిగనున్నట్లు తెలుస్తున్నది. యూఎస్‌కు చెందిన ప్రముఖ పిఇ సంస్థ అపాక్స్ పార్ట్‌నర్స్.. జైడస్ క్యాడిలాతో జట్టు కడుతుండగా.. సింగపూర్‌కు చెందిన టెమాసెక్, క్రిస్ క్యాపిటల్‌లు ఇంటాస్‌తో టైఅప్ అయ్యాయి.

ఈ ఏడాది చివరికల్లా యూరోపియన్ జనరిక్ వ్యాపారాన్ని విక్రయించాలని అనుకుంటున్నట్లు అమెరికాలోని శాన్‌ఫ్రాన్సిస్కో నగరంలో జరిగిన జెపి మోర్గాన్ హెల్త్‌కేర్ కాన్ఫరెన్స్‌లో సనోఫీ సిఇఒ ఓలివర్ బ్రాండికోర్ట్ తెలిపారు. 2008లో కొనుగోలు చేసిన చెక్ రిపబ్లిక్ సంస్థ జెంటివా ద్వారా సనోఫీ ఈ వ్యాపారాన్ని నిర్వహిస్తోంది.

తెలుపు రంగు కెటిఎం డ్యూక్ 390

ధర రూ.2.29 లక్షలు



న్యూఢిల్లీ: ప్రీమియం బైక్‌ల విక్రయ సంస్థ కెటిఎం ఇండియా.. తన ఫ్లాగ్‌షిప్ మోడల్ 'డ్యూక్ 390'లో తెలుపు రంగు వేరియంట్‌ను ప్రవేశపెట్టింది. ఇప్పటికే అందుబాటులో ఉన్న ఎలక్ట్రిక్ ఆరెంజ్ కలర్ వేరియంట్ లాగే వైట్ కలర్ డ్యూక్ 390 కూడా రూ.2.29 లక్షలకే లభించనుందని సంస్థ వెల్లడించింది. దేశవ్యాప్తంగా కెటిఎంకు ఉన్న 400కు పైగా షోరూంలలో ఈ బైక్ బుకింగ్స్ కూడా ప్రారంభమయ్యాయి. 43.5 పిఎస్ పవర్, 37 ఎన్‌ఎం టార్క్‌తో కూడిన డ్యూక్ 390లో ట్రెల్లిస్ ఫ్రేమ్, ఆల్ ఎల్ఇడి హెడ్‌ల్యాంప్, మల్టీఫంక్షన్ టిఎఫ్‌టి డిస్‌ప్లే, ఓపెన్ క్యాట్రిడ్జ్ సస్పెన్షన్, లార్జ్ డ్యూయల్ డిస్క్ బ్రేక్స్ వంటి ప్రీమియం ఫీచర్లను పొందుపర్చారు.

క్యుఐపితో హెచ్‌డిఎఫ్‌సి

రూ.13,000 కోట్ల సమీకరణ

న్యూఢిల్లీ : క్వాలిఫైడ్ ఇనిస్టిట్యూషనల్ ప్లేస్‌మెంట్ (క్యుఐపి) ద్వారా హెచ్‌డిఎఫ్‌సి లిమిటెడ్ 13,000 కోట్ల రూపాయల వరకు సమీకరించనుంది. ఇందుకు సంస్థ బోర్డు ఆమోదం తెలిపింది. ఈ మేరకు 2 రూపాయల ముఖ విలువ కలిగిన 6.43 కోట్ల షేర్లను 1,726.05 రూపాయల చొప్పున కేటాయించనున్నారు. ఈ సంస్థ హెల్త్ ఇన్సూరెన్స్ రంగంలోకి ప్రవేశించాలనుకుంటోంది.

ఐడిఎఫ్‌సి బ్యాంక్, క్యాపిటల్ ఫస్ట్ విలీనం

ముంబై : ఐడిఎఫ్‌సి బ్యాంక్, నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీ క్యాపిటల్ ఫస్ట్ విలీనానికి ఆయా సంస్థల బోర్డులు ఆమోదం తెలిపాయి. ఈ విలీన ఒప్పందం మేరకు ప్రతి 10 క్యాపిటల్ ఫస్ట్ షేర్లకు 139 షేర్లను ఐడిఎఫ్‌సి బ్యాంకు జారీ చేస్తుంది. ఐడిఎఫ్‌సి బ్యాంకు మరింతగా పరిణతి చెందేందుకు ఈ విలీనం దోహదపడుతుందని బ్యాంకు మేనేజింగ్ డైరెక్టర్, సిఇఒ రాజీవ్ లాల్ తెలిపారు. క్యాపిటల్ ఫస్ట్ లోన్ బుక్ పరిమాణం 22,974 కోట్ల రూపాయలు (గత సెప్టెంబరునాటికి)గా ఉంది. 30 లక్షల మంది కస్టమర్లు, 228 డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్ శాఖలు ఉన్నాయి. గత ఐదేళ్లకాలంలో ఈ కంపెనీ నిర్వహణలోని ఆస్తుల్లో వార్షిక సగటు వృద్ధి 27 శాతం వృద్ధి ఉంది.

రిఫైనరీ సామర్థ్యం రెట్టింపునకు

రూ.19.50 లక్షల కోట్లు కావాలి



కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్

భువనేశ్వర్ : దేశీయంగా వచ్చే పదేళ్లకాలంలో చమురు రిఫైనింగ్ సామర్థ్యాన్ని రెండింతలు పెంచేందుకు గాను 30,000 కోట్ల డాలర్ల (రూ.19.50 లక్షల కోట్లు) పెట్టుబడి అవసరం ఉంటుందని కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పేర్కొన్నారు. ప్రస్తుతం దేశీయంగా ఆయిల్ రిఫైనింగ్ సామర్థ్యం 24.7 కోట్ల టన్నులుగా ఉందని, పెట్రో ఉత్పత్తులకు డిమాండ్ క్రమంగా పెరుగుతోందని ఆయన చెప్పారు. తమ అంచనా ప్రకారం 2040నాటికి పెట్రో ఉత్పత్తుల డిమాండ్ 60 కోట్ల టన్నులను తాకే అవకాశం ఉందన్నారు. శనివారంనాడిక్కడ 22వ రిఫైనింగ్, పెట్రో కెమికల్స్ టెక్నాలజీ సమావేశాన్ని ధర్మేంద్ర ప్రధాన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఇప్పటికే ఉన్న రిఫైనరీ ప్రాజెక్టు విస్తరణ జరుగుతోందని, వీటి సామర్థ్యాలు మరో 14.2 కోట్ల టన్నుల మేర పెరగనున్నాయని ఆయన తెలిపారు. 6.9 కోట్ల టన్నుల సామర్థ్యాన్ని జత చేసేందుకుగాను రెండు భారీ ప్రాజెక్టులను త్వరలోనే ప్రారంభించనున్నామని చెప్పారు. రాజస్థాన్‌లోని బార్మర్ రిఫైనరీ 9 మిలియన్ టన్నులు, వెస్ట్‌కోస్ట్ రిఫైనరీ అండ్ పెట్రోకెమికల్స్ 6 కోట్ల టన్నుల సామర్థ్యాన్ని అందిస్తాయని తెలిపారు. 60 కోట్ల టన్నుల సామర్థ్య లక్ష్యాన్ని చేరుకునేందుకుగా వార్షికంగా 2 కోట్ల టన్నుల సామర్థ్యాన్ని జత చేయాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ దిశగానే అడుగులు పడే అవకాశం ఉందన్న విశ్వాసాన్ని ఆయన వ్యక్తం చేశారు. అయితే ఆశించిన స్థాయిలో రిఫైనరీ సామర్థ్యాలను పెంచుకోవాలంటే మరో 30,000 కోట్ల డాలర్ల పెట్టుబడి అవసరం ఉంటుందని పేర్కొన్నారు. రిఫైనింగ్, పెట్రోకెమికల్ పరిశ్రమ అత్యాధునికంగా మారాలని, ప్రభుత్వరంగంలోని కంపెనీలు పరిశోధనా, అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన కోరారు. ఆయిల్ రిఫైనరీల మధ్య ఆరోగ్యకరమైన పోటీ వాతావరణమే ఉందని ఆయన పేర్కొన్నారు.




ఓఎన్‌జిసి రాజమండ్రికి బెస్ట్ ఆన్‌షోర్ అసెట్ అవార్డు

ఆంధ్రప్రదేశ్‌లోని ఓఎన్‌జిసి రాజమండ్రి అసెట్‌కు ఆయిల్ ఇండస్ట్రీ సేఫ్టీ డైరెక్టరేట్ నుంచి బెస్ట్ ఆన్‌షోర్ అసెట్ అవార్డు లభించింది. భువనేశ్వర్‌లో జరిగిన సమావేశంలో కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చేతుల మీదుగా ఓఎన్‌జిసి ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ శశి శంకర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (అసెట్ మేనేజర్) డిఎంఆర్ శేఖర్ ఈ అవార్డును అందుకున్నారు. 2016-17 సంవత్సరానికి ఈ అవార్డు లభించింది.

మరింత మినహాయింపా? పన్ను రేటు తగ్గింపా?

బడ్జెట్‌లో జైట్లీ 'టాక్స్ మంత్ర'పై భిన్న అంచనాలు

బడ్జెట్ తేదీ దగ్గర పడుతున్న కొద్దీ వేతన జీవులు, మధ్యతరగతివర్గాల్లో అంచనాలు పెరగడం సహజం. ఈసారైనా మాపై మినహాయింపులు, రాయితీల జల్లు కురవకపోదా అని ఆశగా ఎదురుచూస్తుంటారు. మరి ఈసారి బడ్జెట్‌లో వీరికి లభించబోయే పన్ను తాయిలాలపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి..



వచ్చే నెల 1న కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ పార్లమెంట్‌లో బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు. ఈసారి బడ్జెట్‌లో పన్ను చెల్లింపుదారులకు మరింత ఊరట కల్పించవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. అందుకు ఉన్న అవకాశాలేంటో పరిశీలిద్దాం..

- ఆదాయ పన్ను మినహాయింపు పరిమితిని ప్రస్తుతమున్న రూ.2.5 లక్షల నుంచి రూ.3 లక్షల స్థాయికి పెంచే అవకాశం ఉందని అంచనాలు ఊపందుకున్నాయి.
- రూ.2.5 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు వార్షిక ఆదాయం ఆర్జిస్తున్న వారిపై పన్ను రేటును తగ్గించవచ్చన్న వాదనలూ విన్పిస్తున్నాయి.
- ఐటి చట్టంలో సెక్షన్ 80సి ప్రకారంగా ఆర్థిక, బీమా పథకాల్లో పెట్టుబడులతోపాటు గృహ రుణ వడ్డీ చెల్లింపులపై లభించే పన్ను మినహాయింపు పరిమితిని రూ.1.5 లక్షల నుంచి రూ.2 లక్షలకు పెంచే అవకాశం లేకపోలేదన్న అభిప్రాయాలూ వ్యక్తమవుతున్నాయి.
- ఎగువ మధ్యతరగతి వర్గాలకు సైతం పన్ను భారం నుంచి ఉపశమనం లభించే అవకాశం లేకపోలేదు. రూ.5 లక్షల నుంచి రూ.7.5 లక్షల వరకు ఆదాయం ఉన్న ఆర్జిస్తున్నవారికి పన్ను రేటును 10 శాతానికి తగ్గించవచ్చు.

ప్రస్తుత నిబంధనల ప్రకారం.. రూ.5-10 లక్షల శ్లాబులో ఉన్నవారు 20 శాతం పన్ను చెల్లించాలి.

ఐటి మినహాయింపు లభించే ఆదాయ పరిమితిని రూ.4-5 లక్షల వరకు పెంచవచ్చని గతసారి బడ్జెట్ సందర్భంగా చాలా మంది భారీ ఆశలు పెట్టుకున్నారు. చివరికి వారికి నిరాశే మిగిలింది. కాకపోతే రూ.2.5-5 లక్షల వార్షికాదాయం కలిగిన వారికి పన్ను రేటును 5 శాతానికి తగ్గించారు. గతసారి మినహాయింపు పరిమితిని యథాతథంగా కొనసాగించిన జైట్లీ.. ఈసారైనా కరుణించకపోతారా అని టాక్స్ పేయర్లు ఇప్పటికే ఆశల పల్లకీ ఎక్కేశారు. ధరాఘాత తీవ్రత పెరిగిన నేపథ్యంలో వేతన జీవులు, మధ్యతరగతి వర్గాలకు ఈసారి పెద్ద మొత్తంలో పన్ను తాయిలాలు లభించే అవకాశాలున్నాయి. అది పన్ను మినహాయింపు పరిమితి పెంపు ద్వారానా, కనిష్ఠ పన్ను శ్లాబు రేటును మరింత తగ్గించడం ద్వారానా అని తెలియాలంటే వచ్చే నెల వరకు ఓపిక పట్టాల్సిందే.

డిడిటికి మంగళం?

ఈసారి బడ్జెట్‌లో డివిడెండ్ డిస్ట్రిబ్యూషన్ టాక్స్ (డిడిటి)ను రద్దు చేసే అవకాశాలున్నాయి. తద్వారా పెద్ద మొత్తంలో డివిడెండ్ ప్రకటించేలా కంపెనీలకు ప్రోత్సాహం లభించడంతోపాటు రిటైల్ ఇన్వెస్టర్లకు రిటర్నులు మెరుగుపడనున్నాయని విశ్లేషకులు అంటున్నారు. దేశీయ సంస్థలకు మాత్రమే డిడిటి వర్తిస్తుంది. ప్రస్తుత నిబంధనల ప్రకారం.. షేర్‌హోల్డర్లకు డివిడెండ్ పంచే ఇండియన్ కంపెనీలు 15 శాతం డిడిటితోపాటు సర్‌చార్జ్, సెస్సు కలిపి 20.36 శాతం పన్ను చెల్లించాల్సి ఉంటుంది.

ప్రస్తుత పన్ను శ్లాబులు

వార్షికాదాయం (రూ.లక్షల్లో)	2016-17 పన్ను రేటు (శాతంలో)	2017-18 పన్ను రేటు (శాతంలో)
60 ఏళ్ల లోపువారికి		
0- 2.5	లేదు	లేదు
2.5-5	10	5
5-10	20	20
10పైన	30	30
సీనియర్ సిటిజన్లు(60 నుంచి 80 లోపువారు)		
0-3	లేదు	లేదు
3-5	10	5
5-10	20	20
10పైన	30	30
80 ఏళ్ల పైబడిన వారు		
0-5	లేదు	లేదు
5-10	20	20
10పైన	30	30

నోట్: గత బడ్జెట్‌లో జైట్లీ రూ.50 లక్షల నుంచి రూ.కోటి ఆదాయం కలిగిన వారిపై గరిష్ఠ పన్నుతో పాటు 10 శాతం సర్‌చార్జ్‌ను విధించారు. రూ.కోటికి పైగా వార్షికాదాయం కలిగిన వారిపై సర్‌చార్జీని 15 శాతంగా నిర్ణయించారు.



భారత్ బెంజ్ ట్రక్కులకు భారీ డిమాండ్

హైదరాబాద్ (ఆటోనగర్): భారత్ బెంజ్ ట్రక్కులకు కస్టమర్ల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. 2018 మోడల్‌కు సంబంధించి 100కి పైగా ట్రక్కులను (9 టన్నుల నుంచి 49 టన్నుల సామర్థ్యం కలిగినవి) భారత్ బెంజ్ అధీకృత డీలర్ శ్రీహర్ష ట్రక్కింగ్ విక్రయించింది. ఈ సందర్భంగా వాహన యజమానులతో కస్టమర్ మీట్‌ను ఏర్పాటు చేశారు. మరో 200 వాహనాలకు కూడా ఇప్పటికే బుకింగ్స్ తీసుకున్నట్టు శ్రీ హర్ష ట్రక్కింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ మురళీధర్ తెలిపారు. ఇప్పటి వరకు మూడు వేలకు పైగా భారత్ బెంజ్ ట్రక్కులను విక్రయించినట్టు ఆయన చెప్పారు. హైదరాబాద్‌లోని హయత్‌నగర్, మియాపూర్, పాశమైలారంతోపాటు నాగర్‌కర్నూల్, కోదాడ, పాల్వంచ, కరీంనగర్, నిజామాబాద్, అనంతపురంలో సేల్స్, సర్వీస్ సెంటర్లను ఏర్పాటు చేసినట్టు ఆయన తెలిపారు. గత ఐదు సంవత్సరాల్లో దేశవ్యాప్తంగా 65 వేలకుపైగా ట్రక్కులను విక్రయించినట్టు భారత్ బెంజ్ ప్రతినిధులు చెప్పారు.



బులియన్

బంగారం (10 గ్రాములు)	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	ప్రొద్దుటూరు	చెన్నై
24 క్యారెట్లు	30,930	30,750	30,910	30,650	30,120
క్రితం ముగింపు	30,760	30,700	30,910	30,500	29,920
22 క్యారెట్లు	28,460	28,600	28,430	28,340	28,690
క్రితం ముగింపు	28,480	28,500	28,430	28,270	28,500
వెండి (కిలో)	40,000	40,300	39,900	40,000	42,010
క్రితం ముగింపు	39,800	40,200	39,900	39,900	42,000

రిటైల్ (ఒక గుడ్డు) ధర రూ. 4.60 — నెక్ (100 గుడ్లు)



హైదరాబాద్	402.00	చిత్తూరు	398.00
వరంగల్	404.00	చెన్నై	405.00
విజయవాడ	404.00	నమక్కల్	395.00
గోదావరి	404.00	బెంగళూరు	405.00
విశాఖపట్నం	404.00	ముంబై	447.00

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	90.00	విజయవాడ	90.00
కరీంనగర్	91.00	గుంటూరు	90.00
వరంగల్	90.00	ఒంగోలు	92.00
మహబూబ్‌నగర్	90.00	చిత్తూరు	80.00
కర్నూలు	90.00	నెల్లూరు	88.00
విశాఖపట్నం	82.00	అనంతపురం	88.00
గోదావరి	90.00		

విస్తరణ బాటలో రీజెన్ ఆర్థో స్పోర్ట్స్

- ఆర్థోపెడిక్స్‌లో సరికొత్త వైద్యం
- స్టెమ్‌సెల్స్‌తో జాయింట్స్‌కు చికిత్స
- రీజెన్ ఆర్థో స్పోర్ట్స్ సారథి వెంకటేశ్ మొవ్వ



క్రీడలతో ఆరోగ్యం మెరుగవుతుందని విన్నాం. అయితే క్రీడలతో కొన్ని సమస్యలు వచ్చే అవకాశం ఉంది. వీటన్నింటికి స్పోర్ట్స్ మెడిసిన్ మార్గం చూపుతుంది. అమెరికా వంటి అభివృద్ధి చెందిన దేశాల్లో ఎన్నో ఏళ్ల క్రితమే స్పోర్ట్స్ మెడిసిన్ అందుబాటులోకి వచ్చింది. స్పోర్ట్స్ మెడిసిన్ విభాగంలో అమెరికాలో గడచిన పాతికేళ్లుగా రీజెనెక్స్ పేరుతో వైద్య సేవలందిస్తున్న వెంకటేశ్ మొవ్వ.. భారత మార్కెట్‌కు ఈ వైద్యాన్ని అందుబాటులోకి తీసుకువచ్చారు. హైదరాబాద్‌లో రీజెన్ ఆర్థో స్పోర్ట్స్ పేరుతో హాస్పిటల్‌ను ఏర్పాటు చేసి అత్యాధునిక వైద్య సేవలను అందిస్తున్నారు. వైద్యసేవలు, కార్యకలాపాల విస్తరణ వంటి అంశాలపై వెంకటేశ్ మొవ్వ 'ఎబిఎన్ ఆంధ్రజ్యోతి బెస్ట్ ఇన్ ది బిజినెస్'తో ముచ్చటించారు. ఆ వివరాలు.

విజయవాడ నుంచి అమెరికాకు ఎలా ?

విజయవాడలోని సిద్ధార్థ మెడికల్ కాలేజీలో వైద్య విద్యను అభ్యసించిన అనంతరం ఉన్నత చదువుల కోసం అమెరికాకు వెళ్లాలని నిర్ణయించుకున్నా. భారత్‌లో అందుబాటులో లేని వైద్యం ఏదైనా బాగుంటుందనే ఆలోచనతో పాటు భిన్నంగా ఉండాలన్న ఉద్దేశంతో స్పోర్ట్స్ మెడిసిన్‌లో చేరిపోయాను. అక్కడే రెసిడెన్సీ, ఫెలోషిప్ పూర్తి చేసి డాలస్‌లో క్లినిక్ కూడా ఏర్పాటు చేశాం. స్పోర్ట్ మెడిసిన్ పశ్చిమ దేశాల్లో చాలా అడ్వాన్స్‌డ్‌గా ఉంటుంది. భారత్‌లో ఇప్పుడిప్పుడిప్పుడే వృద్ధిలోకి వస్తోంది. ఇప్పటి వరకు అథ్లెట్స్, క్రీడాకారులకు సేవలందిస్తూ వస్తుండగా రీజెనరేటివ్ విధానంలో భాగంగా సాధారణ ప్రజలకు ఈ వైద్యాన్ని అందుబాటులోకి తీసుకువచ్చాం. కొత్తగా వచ్చే వైద్య పద్దతులన్నీ పశ్చిమ దేశాల్లోనే అందుబాటులోకి వస్తాయి. తొలుత ప్లేట్‌లెట్స్‌తో ఇప్పుడేమో స్టెమ్‌సెల్స్‌తో వైద్యం అందిస్తున్నాం. పదిహేనేళ్లుగా అమెరికాలో స్టెమ్‌సెల్స్ ద్వారా వైద్య సేవలను అందిస్తూ వస్తున్నాం. తాజాగా దీన్ని భారత్‌కు పరిచయం చేశాం.

రీజెనెక్స్ అంటే ?

ప్రధానంగా శరీరంలోని జాయింట్స్‌కు సంబంధించి రీజెనరేటివ్ థెరపీ ద్వారా చికిత్సను అందిస్తున్నాం. వీటన్నింటిని ఇంటర్వెన్షనల్ ఆర్థోపెడిక్స్‌గా వ్యవహరిస్తాం. రీజెనెక్స్ బ్రాండ్ పేరుతో ఈ వైద్య సేవలను అందుబాటులోకి తీసుకువచ్చాం. గత ఎనిమిదేళ్లుగా స్టెమ్‌సెల్స్ ద్వారా అందిస్తున్న ఈ వైద్య సేవలు ఎంతో ప్రాచుర్యం పొందాయి. ఉదాహరణకు సాంప్రదాయ వైద్య విధానంలో కాలు నొప్పి ఉంటే సర్జరీ చేయటం ద్వారా దాన్ని సరిచేస్తారు. అవసరమైతే టోటల్ రీప్లేస్‌మెంట్ చేస్తారు. అయితే స్టెమ్‌సెల్ పద్ధతి ద్వారా ఎలాంటి సర్జరీ లేకుండా దీన్ని సరిచేయవచ్చు.

భారత మార్కెట్లోకి ఎప్పుడు అడుగు పెట్టారు ?

ఏడాదిన్నర క్రితం హైదరాబాద్‌లో రీజెన్ ఆర్థో స్పోర్ట్స్ పేరుతో హాస్పిటల్‌ను ఏర్పాటు చేయటం ద్వారా భారత మార్కెట్లోకి ప్రవేశించాం. స్టెమ్‌సెల్స్ విధానంలో ఆర్థోపెడిక్ వైద్య సేవలను అందించటం భారత్‌లో ఇదే తొలిసారి. ఈ తరహా వైద్య విధానానికి అద్భుతమైన స్పందన వచ్చింది. కార్యకలాపాల విస్తరణలో భాగంగా నాలుగు నెలల క్రితం ముంబైలో ఒక హాస్పిటల్‌ను ప్రారంభించాం. రానున్న కొద్ది రోజుల్లో ఢిల్లీలో కూడా ఒక ఆర్థో స్పోర్ట్స్‌ను ఏర్పాటు చేయనున్నాం. తొలుత మెట్రో నగరాల్లో ఈ సేవలను అందుబాటులోకి తీసుకురావాలని చూస్తున్నాం. భవిష్యత్‌లో ఆంధ్రప్రదేశ్ కొత్త రాజధాని అమరావతిలో కూడా ఒక హాస్పిటల్‌ను ఏర్పాటు చేసే అవకాశం ఉంది.

రెగ్యులర్ చికిత్సకు, రీజెనెక్స్ చికిత్సకు తేడా ఏంటి?

సాధారణ ఆర్థోపెడిక్ వైద్యం అంటే దాదాపు సర్జరీలే ఉంటాయి. అయితే రీజెనెక్స్‌లో మాత్రం ఇంటర్వెన్షనల్ ఆర్థోపెడిక్స్ ద్వారా చికిత్సను అందిస్తాం. ఎక్కడా కూడా సర్జరీ మాట ఎత్తకుండా నీడిల్ ఆధారంతో చికిత్సను అందిస్తాం. రోగి శరీరం నుంచే స్టెమ్‌సెల్స్‌ను తీసుకుని కటింగ్ లేకుండా నీడిల్ ద్వారా ఎక్కడైతే ఇబ్బంది ఉందే అక్కడికి చేరుస్తాం. సర్జికల్ విధానంలో చేస్తే చికిత్స చేసే ప్రాంతంలో కొంత టిష్యూలు దెబ్బతినే ప్రమాదం ఉంది. నాన్ సర్జికల్ విధానంలో టిష్యూలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సమస్య ఉన్న ప్రాంతంలో స్టెమ్‌సెల్స్‌ను చేర్చటం ద్వారా జాయింట్ సక్రమంగా పనిచేసే విధంగా చేస్తాం. హాస్పిటల్‌లో చేరకుండా సత్వరమే చికిత్సను అందించటం దీని ప్రత్యేకత. కార్పొరేట్ హాస్పిటల్స్‌లో సర్జరీకి ఎంత ఖర్చవుతుందో దీనికి కూడా అంతే ఖర్చవుతుంది.

రంకేసిన ఉత్సాహం



కానికి వెనుక కట్టిన బండను రంకెలేస్తూ లాగుతున్న ఎడ్లు!! పోటీదార్లలో ఉత్సాహం.. చూస్తున్నవారిలో ఎవరు గెలుస్తారనే ఆసక్తి, ఉత్కంఠ. సంక్రాంతి సంబురాలను పురస్కరించుకొని నాగర్ కర్నూలు జిల్లాలో శనివారం నిర్వహించిన ఎడ్ల బండ పోటీలో రైతులు ఇలా ఉత్సాహంగా పాల్గొన్నారు.

అరక దున్నిన భట్టి



ఖమ్మం జిల్లా చింతకాని మండలం కొదుమూరు, వందనం ఎత్తిపోతల పథకాన్ని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లు భట్టి విక్రమార్క శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా సమీపంలోని మొక్కజొన్న చేలో కాసేపు అరక దున్నారు. -చింతకాని

జీతం తక్కువ.. పనెక్కువ!

సాఫ్ట్‌వేర్ 'ఫ్రెషర్స్' కష్టాలు.. భారీగా తగ్గిన నియామకాలు.. దాంతోపాటు పెరిగిన శ్రమ దోపిడీ

- ఇది యాజమాన్యాల కుమ్మక్కే
- పెద్ద సంఖ్యలో ఉద్యోగుల లభ్యత
- సొమ్ము చేసుకుంటున్న ఐటీ సంస్థలు

హైదరాబాద్ సిటీ, జనవరి 13 (ఆంధ్రజ్యోతి):

'ఫ్రెషర్స్‌కి మంచి జీతాలు దక్కట్లేదు. గడచిన ఏడేళ్లుగా కొత్త వారి ప్రారంభ వేతనాల్లో పెరుగుదల ఏమీ లేదు. సీనియర్ స్థాయుల్లో ఉన్నవారికి వేతనాలు వెయ్యి శాతం పెరిగాయి. ఇంత తేడా పరిశ్రమకు మంచిది కాదు'

..ఇది ఇన్ఫోసిస్ అధినేత నారాయణమూర్తి అభిప్రాయం.

'చాలా ఐటీ కంపెనీలు ఎంట్రీ-లెవల్ జాబ్స్‌కి మంచి జీతాలు ఇవ్వట్లేదు. ఐటీ కంపెనీల యాజమాన్యాలు కుమ్మక్కై కొత్తవారికి భారీ వేతనాలు ఇవ్వరాదన్న అంగీకారానికి వచ్చాయి'


..ఇది ఇన్ఫోసిస్ మాజీ సీఈవో సుందర్‌దాస్ పాయ్ చేసిన ఆరోపణ.

ఐటీ రంగంలో శ్రమ దోపిడీని బట్టబయలు చేసిన వ్యాఖ్యలివి. అంతర్జాతీయ పరిణామాలు, కృత్రిమ మేధస్సు పేరిట క్యాంపస్ సెలక్షన్లు, బయట నియామకాలను తగ్గించేసిన ఐటీ కంపెనీలు.. ఇస్తున్న కొద్దిపాటి ఉద్యోగాలకూ ఎన్నో ఏళ్లుగా ఇస్తున్న ప్రారంభ వేతనాలనే ఇస్తున్నాయి. తప్ప పెంచడం లేదు. తమ దగ్గర శిక్షణ తీసుకున్న ఫ్రెషర్లు కొద్దికాలానికే మరో కంపెనీకి ఎగిరిపోతున్నారని, వారికి తామే శిక్షణ ఇచ్చుకోవాల్సి వస్తోందనే కారణాలతో కంపెనీలన్నీ కలిసి కుమ్మక్కై వేతనాలపై మారటోరియం విధించాయనే ఆరోపణలు ఐటీ రంగంలో వినిపిస్తున్నాయి. నాలుగేళ్ల ఇంజనీరింగ్ చదివి పేరొందిన ఐటీ కంపెనీలో ఉద్యోగం వచ్చిందని యువత సంబరపడుతున్నా.. తాము అందుకుంటున్న జీతం తమ ప్రతిభకు తగ్గట్టుగా లేదనే ఆందోళన వ్యక్తం చేస్తోంది.

ఇదీ లెక్క..

ఇన్ఫోసిస్, టీసీఎస్, ఎసెంచర్, ఐబీఎం, కాగ్నిజెంట్, హెచ్‌సీఎల్, టెక్ మహీంద్రా, విప్రో, వర్టెక్స్, క్యాప్‌జెమిని... మొదలైన సంస్థల్లో ప్రారంభ వేతనం ఏడాదికి రూ.3.2 లక్షల నుంచి రూ.3.6 లక్షలకు మించడం లేదు. గత ఏడేళ్లుగా ఇదే పరిస్థితి. దాదాపు అన్ని ఇండియన్ ఐటీ కంపెనీల్లోనూ ఇవే జీతాలు. పోటీ అధికంగా ఉన్నా ఏమైనా భత్యాలు ఇస్తున్నారా.. అంటే అవీ అరకొర మాత్రమే. మాస్ రిక్రూట్‌మెంట్ అంటే క్యాంపస్ ఇంటర్వ్యూల్లో నియామకాలను తగ్గించేయడమే కాకుండా తక్కువ జీతాలతో ఉద్యోగుల శ్రమను దోచుకుంటున్నాయని వాదన బలంగా ఉంది. ఏదో ఒక ఉద్యోగం కావాలి కాబట్టి రాజీ పడుతున్న వారు ఎక్కువ ..అందుకే వారి మాట చెల్లుబాటవుతోందని మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. "మమ్మల్ని సంప్రదించే పెద్ద కంపెనీల యాజమాన్యాలు ప్రారంభ వేతనాలు అంతే అన్నట్టుగా స్థిరపరిచాయి.

అయితే బోష్ లాంటి జర్మన్ కంపెనీలు మంచి వేతనాలు ఆఫర్ చేస్తున్నాయి. కొత్తవారికి వారు ప్రారంభంలోనే రూ.6 లక్షలకుపైగా ఇస్తున్నారు. అందుకే వాటివైపు చాలా మంది చూస్తున్నారు" అని బెంగళూరులోని ప్రముఖ ఐటీ కన్సల్టెన్సీ స్వాఫ్ట్ టెక్నాలజీస్ హెచ్‌ఆర్ చీఫ్ మృదుల మానా ప్రగడ చెప్పారు. "గత ఆరు సంవత్సరాలుగా ఎంట్రీ లెవల్ జాబ్స్‌కి వేతనాలు మారలేదు. దీనికి కారణం ఒకటే.. మేం తీసుకునే ఫ్రెషర్స్ అంతా అన్‌స్కిల్డ్. వారికి ఏమీ తెలియదు. వారికి వర్క్ నేర్పాలి. కోడింగ్, టెస్టింగ్, డేటా అనలసిస్.. మొదలైనవి.. దీనికి ప్రతి వ్యక్తి మీద దాదాపు రెండు లక్షల రూపాయల దాకా ఖర్చు చేస్తాం. కొందరు నిపుణులను తెప్పించి మరీ శిక్షణ చేస్తాం. ఇదంతా కలిపితే ఇచ్చే సేలరీ తక్కువేం కాదు" అని మృదుల వివరించారు. అయితే.. బెంగళూరులోని ఐబీఎంలో పనిచేస్తున్న సీనియర్ ఉద్యోగి రశ్మి ఈ వాదనతో విభేదించారు. "క్యాంపస్‌లో రిక్రూటైన వారందరూ అన్‌స్కిల్డ్ అని చెప్పడం సరికాదు. ఒక్కో కంపెనీ తాలూకు అవసరాలు ఒక్కో రకంగా ఉంటాయి. వారి క్లయింట్లు డిఫరెంట్. వారికి అనుగుణంగా మా చేత పని చేయిస్తారు. అది నేర్పించడం వారి విధి. దీనికి రెండేళ్లు పట్టదు. మహా అయితే ఆరు నుంచి ఎనిమిది నెలలు అంతే.. ఇందులోనూ తొందరగా వర్క్ నేర్చుకునే ట్రైనీ బ్రెయిన్స్ ఉంటారు. వారికి రెండేసి లక్షలు ఖర్చు చేస్తున్నామని చెప్పడం తప్పు" అంటారామె. 'మంచి వేతనాలు ఇవ్వని పక్షంలో ప్రతిభ ఉన్న యువత ఆ కంపెనీలో చేరడానికి ఇష్టపడరు. దీని వల్ల అంతిమంగా నష్టపోయేది ఐటీ ఇండస్ట్రీయే! నిజానికి రెండేళ్ల తరువాత కూడా అద్భుతమైన పెరుగుదల ఉండదు. ఓ 15-20 శాతం హైక్ మాత్రమే ఉంటుంది. అందుకే చాలా మంది విసిగిపోయి నాలుగైదేళ్లు దాటాక వేరే జాబ్స్‌కి మారిపోతున్నారు" అని చెప్పారు ఇన్ఫోసిస్‌లో పనిచేసే మానసి. డిజైనింగ్‌లోకి మళ్లిన రాజీవ్ జె ఆనంద్. కారణాలేవైనాగానీ.. బలమైన పోటీ ఉంటే తప్ప ఐటీరంగంలో ఫ్రెషర్ల వేతనాలు పెరిగే అవకాశం కనిపించట్లేదు.



సాగనంపడానికి సవాలక్ష మార్గాలు..!

ఫ్రెషర్ల సంగతి అలా ఉంటే.. దశాబ్దకాలంగా పని చేస్తూ మంచి అనుభవం సాధించి, ఎక్కువ వేతనాలు అందుకుంటున్న వారిపై వేటు వేయడం ఇటీవలి కాలంలో పెరిగింది. నిన్నమొన్నటి వరకూ అవసరమున్నా లేకున్నా ఉద్యోగులను తీసుకున్న సంస్థలు.. సవాలక్ష సాకులు చూపి వారిని ఉద్యోగాల్లోంచి తొలగిస్తున్నాయి. ఈ క్రమంలో అవి చట్టాలను ఉల్లంఘిస్తున్నా లేబర్ కమిషన్ పట్టించుకోవట్లేదనే ఆరోపణలున్నాయి. నిజానికి ఐటీ సంస్థలన్నీ కూడా దాదాపుగా లాభాలనే ప్రకటిస్తున్నాయి. ఈ క్రమంలో ఉద్యోగులకు ఇంక్రిమెంట్లు వేయాల్సింది పోయి పింక్ స్లిప్‌లను చేతిలో పెడుతున్నాయి. కొద్దికాలంగా ఉద్యోగుల తొలగింపు పర్వం ఆగిపోయిందని అనుకున్నా మళ్లీ మొదలైనట్టు సమాచారం. తాజా తొలగింపుల్లో నూతన మార్గాలను అనుసరించడం ద్వారా ఐటీ సంస్థల హెచ్‌ఆర్ మేనేజర్లు ఉద్యోగులను భయాందోళనలకు గురి చేస్తున్నారు. చట్టాలను అనుసరిస్తున్నామంటూనే వాటికి తూట్లు పొడుస్తుండటం హైదరాబాద్ ఐటీ పరిశ్రమలో కనిపిస్తున్న నయా ట్రెండ్ అని ఐటీ ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై ఫోరం ఫర్ ఐటీ ప్రొఫెషనల్స్ ఫౌండర్లలో ఒకరైన కిరణ్ చంద్ర మాట్లాడుతూ.. "ఇటీవల ఓ ఉద్యోగి విషయంలో లేబర్ కమిషనర్ ఆఫీసు నుంచి ఒత్తిడి రావడంతో ఓ సుప్రసిద్ధ ఐటీ కంపెనీ రాజీకి వచ్చినట్లుగా నటించింది. తీరా ఉద్యోగి తన ఫిర్యాదును ఉపసంహరించుకున్న తరువాత.. రాజీనామా చేయాలని, చేయకపోతే టెర్మినేట్ చేస్తామని బెదిరించింది. బాండ్ పేపర్ మీద తనంతట తాను రాజీనామా చేసినట్లు రాయించుకుంది" అని చెప్పారు. కొన్ని కంపెనీలేమో.. తాము తీసేయాలనుకున్న ఉద్యోగులకు ఒక టాపిక్ ఇచ్చి మర్నాడు పరీక్ష పెడతామంటాయి. రాస్తే.. ఫెయిల్ అయ్యావంటూ ఉద్యోగంలోంచి తీసేస్తున్నాయి. ఉద్యోగులను తొలగించడానికి కొన్ని ఐటీ సంస్థలు భౌతిక దాడులకూ దిగుతున్నాయిప్పుడు. కొన్ని కంపెనీలైతే.. 'మేం మిమ్మల్ని తొలగిస్తున్నాం... మీకు అభ్యంతరం ఉంటే కోర్టుల్లో అయినా తేల్చుకోండి. మేం రెడీ. మీకే నష్టం.. వేరెక్కడా ఉద్యోగాలు రావు. కోర్టుల్లో ఎప్పటికి తేలుతుందో తెలియదు' అని బెదిరిస్తున్నాయి. ఇటీవల ఓ సుప్రసిద్ధ ఐటీ కంపెనీ తమ ఉద్యోగులపై సైబర్ క్రైమ్ కేసు పెట్టింది. తమ కంపెనీ డేటాను చోరీ చేశారని, కాబట్టి ఆ ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని కోరింది. పోలీసులు మౌఖికంగా విచారించగా అసలు విషయం బయటపడటంతో కేసు రిజిస్టర్ చేయలేదు. కానీ కంపెనీ ప్రతినిధులను మందలించి వదిలేశారట. బౌన్సర్లు, సైకాలజిస్టుల సహాయం తీసుకుంటున్న కంపెనీలు కూడా పెరుగుతున్నాయి. మానసిక ఒత్తిడి తగ్గించే సైకాలజిస్టులు ఇప్పుడు ఉద్యోగులను సాగనంపేదుకు మానసికంగా సిద్ధం చేస్తున్నారు. అయితే కంపెనీల ప్రతినిధులు మాత్రం.. నైపుణ్యాలు లేనివారిని మాత్రమే తొలగిస్తున్నాం తప్ప ప్రతిభావంతులను కాదనే వాదన వినిపిస్తున్నారు.

పంట కాల్వ మాయం!

- రికార్డుల నుంచి తొలగించిన అధికారులు
- ఇదే అదునుగా కబ్జాల పర్వం

సూర్యాపేట, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : ఇరవై ఏళ్ల క్రితం వరకూ 2 వేల ఎకరాలకు సాగు నీరు అందించిన పంట కాల్వ ఇప్పుడు ఉనికినే కోల్పోయింది. కాల్వ విషయంలో రైతుల మధ్య విభేదాలను సాకుగా చూపుతూ అధికారులు ఏకంగా దానిని రికార్డుల నుంచి తొలగించారు. ఇదే అదునుగా కబ్జారాయుళ్ల ఆక్రమణలకు పాల్పడటంతో 8 కిలోమీటర్ల పొడవైన కాల్వ ఆనవాళ్లు కోల్పోయింది. మూసీ కుడి, ఎడమ కాల్వల కింద 40వేల ఎకరాల ఆరు తడి పంటలకు సాగునీరు అందించేందుకు వీలుగా 84 డిస్ట్రిబ్యూటరీలున్నాయి. వీటిలో సూర్యాపేటలోని శాంతినగర్ నుంచి తాళ్లఖమ్మంపహాడ్ జంగాలగూడెం వరకు 8 కిలోమీటర్ల పొడవుతో డిస్ట్రిబ్యూటరీ-27 కాల్వ ఉంది. దీని ద్వారా గతంలో శాంతినగర్ నుంచి జిల్లా కేంద్రంలోని పుల్లారెడ్డి చెరువుకు నీటిని వదిలేవారు. ఈ నీటి విడుదలపై ఆయా గ్రామాల రైతుల మధ్య విభేదాలు తలెత్తడంతో కొందరు కోర్టును ఆశ్రయించారు. దీన్ని సాకుగా చూపుతూ డీ-27 కాల్వను మూసీ ప్రాజెక్టు అధికారులు రికార్డుల నుంచే తొలగించింది. నీరు రాకపోవడంతో కొందరు కాల్వను ఆక్రమించేశారు. ప్రస్తుతం కాల్వ ఆనవాళ్లు కూడా కనిపించకుండా గృహాలు నిర్మించుకున్న వారు, రియల్టర్లు ఆక్రమించుకున్నారు. సూర్యాపేట ఇందిరమ్మ కాలనీ వద్ద కాల్వ పూర్తిగా కనుమరుగైంది. ఉన్నట్టుండి కాల్వను రికార్డుల నుంచి తొలగించడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు.



సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఆక్రమణకు గురైన డీ-27 కాల్వ



శిలాఫలకం వద్ద కడియం, హరీశ్, తుమ్మల, కొండా తదితరులు

కాళేశ్వరంతో వర్ధన్నపేటకే తొలి లబ్ధి

- ట్రాఫిక్ తిప్పలు తప్పించేందుకే వరంగల్‌కు ఓఆర్‌ఆర్: హరీశ్

వరంగల్ రూరల్/వరంగల్ టౌన్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టుతో వర్ధన్నపేట నియోజక వర్గానికే తొలి లబ్ధి చేకూరుతుందని మంత్రి టీ హరీశ్‌రావు అన్నారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలో ఎమ్మెల్యే కొండా సురేఖ, ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు ఆధ్వర్యంలో రూ.6 కోట్లతో తలపెట్టిన ఆర్‌యూబీ నిర్మాణ పనులతో సహా వరంగల్ రూరల్, అర్బన్ జిల్లాల్లో పలు అభివృద్ధి పనులకు శనివారం కడియం శ్రీహరి, తుమ్మలతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. కాళేశ్వరం పూర్తయితే వర్ధన్నపేట నియోజకవర్గంలో 50 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. రాష్ట్రంలో రెండో అతిపెద్ద నగరమైన వరంగల్‌కు ట్రాఫిక్ తిప్పలు తప్పించేందుకే అవుటర్ రింగ్ రోడ్డు నిర్మాణం చేపట్టామన్నారు. కొండా సురేఖ, మురళీధర్‌రావు దంపతులు తూర్పు నియోజకవర్గం అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారన్నారు. పెద్దచెరువు రిజర్వాయర్‌ను పునరుద్ధరించడం ద్వారా 2 వేల ఎకరాలకు సాగునీరు అందించవచ్చని కడియం అన్నారు. తుమ్మల మాట్లాడుతూ.. ప్రభుత్వం టెక్స్‌టైల్ పార్కు, ఐటీ హబ్, హెరిటేజ్ తదితర ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులను వరంగల్‌కే మంజూరు చేసిందన్నారు.



కేసీఆర్, తలసాని చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న చిన్నా

సింగరాయకొండలో కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

సింగరాయకొండ రూరల్, జనవరి 13: యాదవుల అభివృద్ధికి తెలంగాణలో ఎన్నో సంక్షేమ పథకాలు ఎన్నో అమలుపరుస్తున్నారని ఏపీలోని ప్రకాశం జిల్లా వైసీపీ ప్రధాన కార్యదర్శి యన్నాబత్తిన వెంకటేశ్వర్లు (చిన్నా) అన్నారు. శనివారం ప్రకాశం జిల్లా సింగరాయకొండ బస్టాండ్ కూడలిలో సీఎం కేసీఆర్, మంత్రి తలసాని చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌లో యాదవ భవన నిర్మాణానికి 10 ఎకరాలు, రూ.10 కోట్ల నిధులు, 5వేల కోట్ల నిధులతో 75శాతం సబ్సిడీతో ప్రతి పేద యాదవ కుటుంబానికి గొర్రెల యూనిట్లకు వెచ్చించిన ఘనత తెలంగాణ ప్రభుత్వానికి దక్కిందని తెలిపారు. ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే పదవులకు సముచిత స్థానం కల్పించడానికి స్పష్టమైన హామీ ఇచ్చారని తెలిపారు. ఇప్పటికైనా ఏపీ సీఎం చంద్రబాబు స్పందించి యాదవుల అభివృద్ధి కృషి చేయాలని కోరారు.

'ఆన్‌డ్యూటీ'ని పునరుద్ధరించాలి

- ఎస్సీ, ఎస్టీ టీచర్లు

నాంపల్లి/హైదరాబాద్ , జనవరి 13 (ఆంధ్రజ్యోతి): బీఎడ్ వంటి ఉన్నత విద్యను అభ్యసించే ఎస్సీ, ఎస్టీ టీచర్లకు.. వేతనంతో కూడిన సెలవులు ఇచ్చే వ్యవస్థను పునరుద్ధరించాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయుల సంఘం డిమాండ్ చేసింది. శనివారం జరిగిన కార్యవర్గ సమావేశం అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ సంఘం అధ్యక్షుడు శాగ కైలాశం మాట్లాడుతూ.. ఈ సదుపాయాన్ని ప్రభుత్వం పునరుద్ధరించని పక్షంలో.. తాము పదోతరగతి పరీక్షలను బహిష్కరిస్తామని హెచ్చరించారు. మరోవైపు ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయుల సెలవు హక్కును హరించేలా విద్యాశాఖ వ్యవహరిస్తోందని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం మండిపడింది.

బకాయిలకు ప్రభుత్వ కార్యాలయాల్లో ఇబ్బందులు అందరికీ తెలిసినవే

- గోపాల్‌శర్మ వృత్తి ధర్మాన్ని నిర్వర్తించారు
- దానిని నేరంగా చిత్రీకరించాలని చూస్తున్నారు: కోదండరామ్

హైదరాబాద్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): టీ జేఏసీ కో-కన్వీనర్ గోపాల్ శర్మ వృత్తిరీత్యా న్యాయవాది అని, తాను న్యాయ సలహాదారుగా వ్యవహరిస్తున్న కంపెనీ క్లయింటు తరఫున మాట్లాడేందుకు వెళ్లి వృత్తి ధర్మాన్ని నిర్వర్తించారని టీజేఏసీ చైర్మన్ కోదండరామ్ అన్నారు. ఆయన రకరకాల కేసుల్ని వాదిస్తుంటారని తెలిపారు. ఐటీసీ రిటర్న్స్ విషయమై వాణిజ్య శాఖ అధికారులు డిమాండ్ చేసిన లంచం ఇస్తున్నారన్న ఆరోపణలపై గోపాల్‌శర్మని శుక్రవారం విజయవాడలో ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. ఇందుకు సంబంధించి పత్రికల్లో వచ్చిన వార్తల ప్రకారం.. ఒక కంపెనీ కమర్షియల్ ట్యాక్స్ చెల్లింపులకు సంబంధించిన బకాయిలు రావాల్సి ఉందని, ఆ కేసు గురించి గోపాల్ శర్మ విజయవాడ వెళ్లారని కోదండరామ్ చెప్పారు. అక్కడ ఏం జరిగిందో తనకు తెలియదని శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. న్యాయ సలహాదారుగా క్లయింట్ తరఫున మాట్లాడడం న్యాయవాది బాధ్యత అని, వృత్తి ధర్మం నిర్వర్తించడాన్ని నేరంగా చిత్రీకరించడానికి కొందరు ప్రయత్నిస్తున్నారని తప్పుబట్టారు. ప్రభుత్వ కార్యాలయాల నుంచి రావాల్సిన బకాయిలు తెచ్చుకోవడంలో ఉన్న సమస్యలు అందరికీ తెలిసినవేనని, కేవలం తన క్లయింట్ తరఫున వెళ్లిన వారిని దోషులుగా చిత్రీకరించడం అన్యాయం, అక్రమమని తప్పుబట్టారు. పూర్తి వివరాలు తెలిసిన తర్వాత గోపాల్‌శర్మ విషయంపై సమగ్ర ప్రకటన చేస్తామన్నారు.

రాష్ట్రమంతా 'శాండ్ ట్యాక్సీ'

- ఇసుక అక్రమ రవాణాపై కఠిన వైఖరి
- రాబడి, ఇసుక అందుబాటుపై దృష్టి
- ప్రతి జిల్లాలో డీఎంఎఫ్ గవర్నింగ్ కౌన్సిళ్లు
- వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి కేటీఆర్

హైదరాబాద్/పెద్దపల్లి, జనవరి 13(ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమ రవాణాను అరికట్టడంతో పాటు ప్రజావసరాలకు కావాల్సిన ఇసుకను వారి చెంతకే తీసుకొచ్చేందుకు 'శాండ్ ట్యాక్సీ' పాలసీని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్లకు పరిశ్రమలు, గనులు, ఐటీ, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి కేటీఆర్ ఆదేశించారు. అక్రమ మైనింగ్, ఇసుక అక్రమ రవాణా, సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలపై శనివారం మంత్రి సచివాలయం నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వ విధానాల వల్ల ఇసుక రాబడి పదేళ్లలో తక్కువగా వచ్చిందని, తమ ప్రభుత్వ విధానాలతో ఆదాయం పెరిగిందన్నారు. ఇసుక విషయంలో ప్రభుత్వ ఆదాయం పెంచడం, ప్రజలకు ఇసుకను అందుబాటులో ఉంచడంపై కలెక్టర్లు దృష్టిని కేంద్రీకరించాలన్నారు. ఇసుక రవాణాకు గద్వాల, పెద్దపల్లి, మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్లు చేపట్టిన ఉత్తమ విధానాలను ఇతర జిల్లాల కలెక్టర్లు కూడా అనుసరించాలన్నారు. పెద్దపల్లిలో డిసెంబర్ నెలాఖరు వరకు రూ.14.85 కోట్లు సమకూరిందన్నారు. ఇందులో ప్రభుత్వానికి రూ. 1.28 కోట్లు, డీఎంఎఫ్‌టీకి రూ.32 లక్షలు, ఎస్ఎంఎఫ్‌టికి రూ.2.26 లక్షలు, ఇన్‌కం ట్యాక్స్ కింద రూ.2.26 లక్షల ఆదాయం వచ్చిందన్నారు. మిగిలిన మొత్తాన్ని ట్రాక్టర్ల యజమానులకు, ఉద్యోగుల వేతనాలు, నిర్వహణకు ఖర్చు చేస్తున్నారన్నారు. ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు అనుసరించాల్సిన వ్యూహంతో డీజీపీతో మరోసారి సమావేశం నిర్వహిస్తామన్నారు. ప్రతి జిల్లాలో డిస్ట్రిక్ మినరల్ ఫౌండేషన్(డీఎంఎఫ్) గవర్నింగ్ కౌన్సిళ్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జిల్లా స్థాయిలోనే బ్యాంకర్లతో సమావేశాలు నిర్వహించాలని, చెల్లింపుల్లో ఆలస్యం వల్ల చిన్న పరిశ్రమలు ఖాయిలా పడకుండా చూడాలన్నారు. ఖాయిలా పడిన పరిశ్రమల పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ఆర్థిక సంవత్సరాంతం వరకు జిల్లాల్లో ముద్రా లోన్ల మేళాలు కనీసం రెండుసార్లు నిర్వహించాలని ఆదేశించారు.



క్వారీలో ఇసుక లోడింగ్‌కు కోసం వచ్చిన ట్రాక్టర్లు

ఏమిటీ శాండ్ ట్యాక్సీ పాలసీ?

ఇసుక రవాణాలో అక్రమాలకు చెక్ పెట్టేందుకు పెద్దపల్లి జిల్లా కలెక్టర్ వీఎస్ అళగు వర్షిణి తీసుకొచ్చినదే 'శాండ్ ట్యాక్సీ' పాలసీ. ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌లో ఇసుక రీచ్‌లు, మండలాలు, పట్టణాలు, గ్రామాల పేర్లు పొందుపర్చారు. ఒక రీచ్ నుంచి ఒక గ్రామానికి ఇసుక రవాణా చేస్తే సీనరేజీ రుసుము, నిర్వహణ, కూలీల, ట్రాక్టర్ రవాణా ఖర్చులు కలుపుకొని ఒక ట్రాక్టర్ ట్రిప్పునకు ఎంత చెల్లించాలో ఆన్‌లైన్‌లో పొందుపర్చారు. ఇసుక కావాల్సిన వాళ్లు తగిన రుసుము చెల్లిస్తే 2, 3 రోజుల్లో ఇంటి వద్దకే ఇసుక రవాణా అవుతుంది. ట్రాక్టర్ యజమానులు రూ.25 వేలు డిపాజిట్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ట్రాక్టర్లకు అమర్చే డబ్బాలపై 'శాండ్ ట్యాక్సీ' పాలసీ అని రాయించారు. ట్రాక్టర్లకు జీపీఆర్ఎస్ పరికరాలు అమర్చి కంట్రోల్ రూంలకు అనుసంధానం చేశారు. ఈ పాలసీ కింద జిల్లాలో 725 ట్రాక్టర్ల యజమానులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఒక్కో రీచ్ కింద ముగ్గురితో ల్యాప్‌టాప్‌లో వివరాలు నమోదు చేయిస్తున్నారు. శాండ్ ట్యాక్సీ ట్రాక్టర్‌లో ఇసుకను అక్రమంగా రవాణా చేస్తే వారి డిపాజిట్ జప్తు చేసి చట్టపరంగా చర్యలు తీసుకుంటున్నారు. దీంతో ఒక ట్రిప్పు ట్రాక్టర్ ఇసుక రూ.1200 నుంచి రూ.2 వేలకే లభిస్తోంది. గత ఏడాది ఫిబ్రవరి నెలాఖరు నుంచి అమలు చేస్తున్న ఈ విధానంతో జిల్లాలో 80% ఇసుక అక్రమ రవాణాకు బ్రేక్ పడింది.

మద్యం మత్తుకు బలి

- అదుపు తప్పి డివైడర్‌ను ఢీ కొన్నకారు
- యువకుడి మృతి.. ముగ్గురికి గాయాలు
- మృతుడు.. బాసర ఆలయ పూజారి

బంజారాహిల్స్/హైదరాబాద్, జనవరి 13: ఆ నలుగురు యువకులు మద్యమే లోకం.. ఆ మత్తే ఆనందం అన్నట్టుగా తప్పతాగారు. కానీ అదే మద్యం మత్తు.. వారిలో ఒకరి నిండు ప్రాణాన్ని బలితీసుకుంది. మిగతా ముగ్గురిని గాయాల పాల్జేసింది. తాగిన మత్తులో వాహనం నడపడంతో హైదరాబాద్‌లో మరో ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. శనివారం తెల్లవారుజామున జూబ్లీహిల్స్‌లో ఓ కారు డివైడర్‌ను ఢీకొట్టి, పల్టీలు కొట్టడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. బర్కత్‌పురకు చెందిన విశ్వజీత్ వాల్వాకర్ (33) బాసర సరస్వతి ఆలయంలో అర్చకుడు. జూబ్లీహిల్స్‌లో ఉంటున్న వివేక్ రాజ్, పృథ్వీరాజ్, చెన్నకేశవశెట్టి అతడికి స్నేహితులు. వారంతా శుక్రవారం సాయంత్రం వివేక్ ఇంటి నుంచి కారును తీసుకొని మాదాపూర్‌కు వెళ్లారు. అక్కడ మద్యం బాటిళ్లను కొని, నిర్మానుష్య ప్రదేశానికి వెళ్లి తాగారు. అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో కారులోనే ఫిలింనగర్‌కు వచ్చి ఇడ్లీలు తిన్నారు. అనంతరం రోడ్లపై కొద్దిసేపు కారులో చక్కర్లు కొట్టారు. ఆ తర్వాత వివేక్ ఇంటికి బయల్దేరారు. వివేక్ డ్రైవింగ్ చేస్తుండగా అతడి పక్కన పృథ్వీరాజ్, వెనక సీట్లో విశ్వజీత్, చెన్నకేశవ శెట్టి కూర్చున్నారు. 2:30 గంటల ప్రాంతంలో ప్రశాసన్‌నగర్ వద్ద వివేక్ ఓ మలుపును గమనించకపోవడంతో అతివేగంతో దూసుకెళ్లిన కారు.. ఒక్కసారిగా గాల్లోకి లేచి డివైడర్‌ను, చెట్టును ఢీకొట్టి.. అదే వేగంతో తిరిగి రోడ్డుపై పల్టీకొట్టింది. స్థానికులు 108 ద్వారా క్షతగాత్రులను అపోలో ఆస్పత్రికి తరలించారు. తీవ్ర గాయాలు కావడంతో విశ్వజీత్ అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు తెలిపారు. కేసు నమోదు చేసిన జూబ్లీహిల్స్ పోలీసులు ఘటనాస్థలిలో సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. గాయపడ్డ వారికి పోలీసులు బ్రీతింగ్ ఎనలైజర్ ద్వారా పరీక్షలు నిర్వహించారు. వివేక్‌కు 53 బ్లడ్ ఆల్కహాల్ కంటెంట్ వచ్చింది. అయితే, వివేక్ సీటు బెల్టు పెట్టుకోవడంతో అతడు కూర్చున్నవైపు కారు దెబ్బతిన్నా స్వల్ప గాయాలతో బయటపడ్డాడని పోలీసులు తెలిపారు. కాగా బాసర క్షేత్రంలో పూజారి అయిన మృతుడు విశ్వజీత్.. గత ఏడాది అక్కడ సరస్వతీ అమ్మవారి విగ్రహాన్ని అక్రమంగా తరలించిన కేసులో నిందితుడని తెలిసింది.




మృతుడు విశ్వజీత్ వాల్వాకర్ (ఫైల్) ప్రమాదంలో ధ్వంసమైన కారు

ఆకాశంలో పతంగుల హరివిల్లు



హైదరాబాద్ సిటీ, జనవరి 13(ఆంధ్రజ్యోతి): పతంగుల పండుగతో భాగ్యనగరం సందడిగా మారింది. నోరూరించే మిఠాయిలు, గుమగుమలాడే పిండివంటలు, 20 రాష్ట్రాలకు చెందిన స్వీట్లతో సికింద్రాబాద్‌లోని పరేడ్ మైదానంలో ఇంటర్నేషనల్ కైట్, స్వీట్ ఫెస్టివల్ శనివారం అట్టహాసంగా ప్రారంభమైంది. దేశ, విదేశాల నుంచి ఔత్సాహికులు ఈ ఫెస్టివల్‌లో పాల్గొన్నారు. విభిన్న ఆకృతులతో రంగురంగుల పతంగులు చూపరులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమాన్ని డిప్యూటీ సీఎం మహమూద్ అలీ, మంత్రి చందూలాల్ ప్రారంభించారు. శాసనమండలి చైర్మన్ స్వామిగౌడ్ సతీసమేతంగా స్వీట్లు తింటూ సందడి చేశారు.

జస్టిస్ లోయా మృతి వెనుక అమిత్‌షా

- ప్రధాని మోదీ వల్లే న్యాయవ్యవస్థలో సంక్షోభం
- దేశ చరిత్రలో తొలిసారి సీజేఐపై ఆరోపణలు
- ఉన్నతస్థాయి విచారణ జరిపించాలి: నారాయణ



అమరావతి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): సీబీఐ స్పెషల్ జడ్జి జస్టిస్ బీహెచ్ లోయా మరణం వెనుక బీజేపీ జాతీయాధ్యక్షుడు అమిత్‌షా హస్తం ఉందని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ ఆరోపించారు. సొహ్రాబుద్దీన్ ఎన్‌కౌంటర్ కేసును విచారిస్తున్న లోయా మరణం అమిత్‌షా వల్లే మిస్టరీగా మారిందన్నారు. ఇందుకు సంబంధించి ఆయనపై కూడా కేసు నమోదు చేశారని తెలిపారు. శనివారం విజయవాడలోని సీపీఐ రాష్ట్ర కార్యాలయంలో నారాయణ విలేకరులతో మాట్లాడుతూ.. ప్రధాని మోదీ వికృత చేష్టలే న్యాయవ్యవస్థలో సంక్షోభానికి కారణమని ఆరోపించారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత న్యాయవ్యవస్థలో సంక్షోభం రావడం, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు బహిరంగంగా సుప్రీం చీఫ్ జస్టిస్‌పై ఆరోపణలు చేయడం ఇదే ప్రథమమని అన్నారు. దీనికి కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని, న్యాయమూర్తుల ఆరోపణలపై ఉన్నతస్థాయి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. చట్టపరంగా, సాంకేతికంగా సుప్రీంకోర్టు సీనియర్ న్యాయమూర్తులు బహిరంగ వ్యాఖ్యలు చేయడం సరికానప్పటికీ, వారి వెనుక ఉన్న ఆవేదనను అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అరుణాచల్ ప్రదేశ్ సీఎంగా ఉన్న కలిఖోపుల్ 2016లో 62 పేజీల ఉత్తరం రాసి ఆత్మహత్య చేసుకున్నారని, ప్రధాన మంత్రి కార్యాలయం నుంచి స్వయంగా లంచాలు తీసుకోవాలని ఆయనపై ఒత్తిడి పెరగడంతోనే ఆయన ఆత్మహత్య చేసుకున్నారని అన్నారు. ఇక ప్రధాని మోదీతో సీఎం చంద్రబాబు భేటీ వివరాలను ప్రధాని కార్యాలయం వెల్లడించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. మూడున్నరేళ్లలో.. చంద్రబాబు ఢిల్లీ వెళ్లడం, అర్జీలు ఇవ్వడం, తిరిగి రావడం తప్ప రాష్ట్రానికి ఏ విధమైన న్యాయమూ జరగడంలేదన్నారు.

లోయా మృతిపై పిటిషన్ దురుద్దేశపూరితం

బాంబే లాయర్స్ అసోసియేషన్ ఆరోపణ

ముంబై, జనవరి 13: సీబీఐ జడ్జి బీహెచ్ లోయా మృతిపై దర్యాప్తు చేయాలంటూ సుప్రీం కోర్టులో దాఖలు చేసిన పిటిషన్ దురుద్దేశపూరితమని బాంబే లాయర్స్ అసోసియేషన్ (బీఎల్‌ఏ) ఆరోపించింది. ఇదే అంశంపై అసోసియేషన్ దాఖలు చేసిన పిటిషన్‌ను బాంబే హైకోర్టు విచారణ చేయకుండా జర్నలిస్ట్ బీఆర్ లోన్ ఆ పిటిషన్‌ను దాఖలు చేశారని ఆరోపించింది. "లోయా మరణం వెనక ఉన్న కారణాలపై జ్యుడీషియల్ విచారణ జరపాలంటూ మేం జనవరి 4న పిటిషన్ దాఖలు చేశాం. అదే రోజు సుప్రీం కోర్టులో ఆ పిటిషన్‌ను దాఖలు చేశారు. ఇది దురుద్దేశపూరితం. ఈ అంశం సుప్రీం కోర్టులో ఉందన్న కారణంతో మా పిటిషన్‌ను హైకోర్టు విచారణ చేయకుండా అడ్డుకునే యత్నం" అని బీఎల్‌ఏ అధ్యక్షుడు అహ్మద్ అబ్ది ఆరోపించారు. ఆ పిటిషన్‌ను 4నే దాఖలు చేసినా, నలుగురు న్యాయమూర్తుల అసాధారణ విలేకరుల సమావేశం తర్వాత జనవరి 12వ తేదీ మధ్యాహ్నమే హైకోర్టు రిజిస్ట్రార్ దానికి నంబరు ఇచ్చారన్నారు. న్యాయవాదుల సంఘానికే ఇటువంటి పరిస్థితి వస్తే ఇక సామాన్యుల పరిస్థితి ఏమిటని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే, ఆయన ఈ ఆరోపణలను హైకోర్టు రిజిస్ట్రార్ అగర్వాల్ ఖండించారు.

రాజీ దిశగా సుప్రీం రగడ

(మొదటిపేజీ తరవాయి)

నాడు తన ప్రత్యేక కార్యదర్శి నృపేన్ మిశ్రాను దీపక్ మిశ్రా నివాసానికి పంపి- పరిష్కారమార్గాల గురించి- చర్చించారు. అటు అటార్నీ జనరల్ కూడా సోమవారానికి ఈ అభిప్రాయభేదాలు సమసిపోతాయని, అంతా సర్దుకుంటుందని చెబుతున్నారు. ఉన్నతస్థాయి వర్గాల కథన ప్రకారం- ఆదివారం నాడు - ఛీఫ్ జస్టిస్ దీపక్ మిశ్రా- తనపై తిరుగుబాటు చేసిన నలుగురినీ కలిసి మాట్లాడే అవకాశం ఉంది. అయితే దీనికి సంబంధించిన అధికారిక సమాచారమేదీ లేదు. చర్చలు అంతరంగికంగానే సాగుతాయని సుప్రీంకోర్టు వర్గాలు అంటున్నాయి. అసంతుష్ట జడ్జీల్లో ముగ్గురు ఢిల్లీలో లేనందున శనివారం నాడు వారితో ప్రత్యక్ష సమావేశాలేవీ జరగలేదు. వీరు ముగ్గురూ ఆదివారం నాటికి తిరిగివస్తారు.. బార్ కౌన్సిల్ ప్రతినిధులు, ప్రభుత్వ ప్రత్యక్ష దూత అయిన అటార్నీ జనరల్ వేణుగోపాల్ వీరిని వారి నివాసాల్లో కలిసి మాట్లాడే అవకాశం ఉంది.

ఇది సుప్రీంకోర్టు అంతర్గత వ్యవహారమని కేంద్రం అధికారికంగా స్పందించినప్పటికీ- నరేంద్ర మోదీ ఎందుకు రాయబారం నడిపారన్నది ప్రశ్న. సుప్రీంకోర్టు అన్నది స్వతంత్ర ప్రతిపత్తి ఉన్న రాజ్యాంగ సంస్థ కాబట్టి కేంద్రం ప్రత్యక్షంగా వేలు పెట్టలేదు. అందుకే మోదీ తెరవెనుక యత్నాలు చేస్తున్నారని బీజేపీ వర్గాల్లో వినిపిస్తున్న మాట.



మార్పులకు సీజే విముఖం?

నలుగురు జడ్జీలు కోరుతున్నప్పటికీ- సుప్రీం కోర్టు పాలనావ్యవహారాల్లో మార్పులు తెచ్చేందుకు ప్రధాన న్యాయమూర్తి ఇప్పటికిప్పుడు సుముఖంగా లేరని తెలుస్తోంది. కొంత కాలం పాటు ఇదే పద్ధతి కొనసాగవచ్చని సుప్రీంకోర్టు అధికారులు అంచనావేస్తున్నారు. పరస్పర చర్చలు, అవగాహన ద్వారా జడ్జీలే విభేదాల పరిష్కారానికి ప్రయత్నించాలని, సీజే చొరవ కూడా ముఖ్యమని వారంటున్నారు. ఆయన సమయానుకూలంగా స్పందించి సమస్యకు సామరస్యపూర్వకమైన ముగింపు పలుకుతారని వారు విశ్వసిస్తున్నారు.

అంతా రాజకీయమే!

బెంచ్‌ల కేటాయింపు, రోస్టర్, కేసుల్ని డీల్ చేస్తున్న విధానం ఇవన్నీ- విభేదాలకు కారణంగా బయటకు కనిపిస్తున్నప్పటికీ- రాజకీయ అంతరాలే అసలు కారణాలుగా సుప్రీంకోర్టు వర్గాలు పేర్కొంటున్నాయి. బీజేపీ- కాంగ్రెస్ నేతల ప్రమేయాలు చాలా కేసుల్లో ప్రస్ఫుటంగా కనిపిస్తున్నందున- ఆ పార్టీల పట్ల అనుకూలతలు వేరే రూపేణా ఇలా రిఫ్లెక్ట్ అవుతున్నాయన్నది ఆ వర్గాల విశ్లేషణ. రాజకీయుల చేతిలో ఓ పావుగా న్యాయవ్యవస్థ ఎపుడో మారిందని, దాని విపరిణామాలే ఇపుడు చూస్తున్నామని సీనియర్ లాయర్ దుష్యంత్ దవే ఇప్పటికే వ్యాఖ్యానించారు. "అమిత్ షా గతంలో నిందితుడిగా ఉన్న కేసును విచారించిన జడ్జి లోయా మృతి వ్యవహారంపై పకడ్బందీ విచారణ జరగాలని కాంగ్రెస్ కోరుకుంటోంది. కాంగ్రెస్ నేతలు చిదంబరం, రాహుల్ గాంధీలు ఎదుర్కొంటున్న కేసుల విచారణ పక్కాగా సాగాలని బీజేపీ వాంఛిస్తోంది. ఈ ఒత్తిళ్ళు న్యాయవ్యవస్థపై పనిచేస్తున్నాయి. ప్రాథామ్యాలు తదనుగుణంగా నిర్ణయమవుతాయి.. అవే అసంతృప్తులకు, తిరుగుబాట్లకు కారణమవుతాయి" అని ఆ వర్గాలు వివరించాయి.

సీజే ఇంటికి ప్రిన్సిపల్ సెక్రటరీ

ఇంటి వద్ద కారులోనే ఎదురు చూపులు.. నృపేంద్ర మిశ్రాను కలవని దీపక్ మిశ్రా

- వెనుదిరిగిన ప్రధాని ప్రిన్సిపల్ సెక్రటరీ



న్యూఢిల్లీ, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఆయన ప్రధాన మంత్రికి ముఖ్య కార్యదర్శి. కారులో ఆయన వెనకాల కూర్చున్నారు. ఆయన కారు సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ దీపక్ మిశ్రా ఇంటి బయట చాలాసేపు ఆగి ఉంది. కారు డ్రైవర్ గేటు దగ్గరకు వెళ్లి ఏదో ఇచ్చి వచ్చాడు. అయినా, గేటు తెరుచుకోలేదు. ఈ విజువల్స్ శనివారం టీవీ చానల్స్‌లో ప్రసారమయ్యాయి. 'సుప్రీం చిచ్చు' దేశాన్ని కుదిపేసిన మరుసటి రోజు జరిగిన ఈ ఘటన ఇప్పుడు తీవ్ర వివాదాస్పదమవుతోంది. పీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ నృపేంద్ర మిశ్రా చీఫ్ జస్టిస్ దీపక్ మిశ్రా ఇంటికి వెళ్లడం విజువల్స్‌లో స్పష్టంగా కనిపించింది. శనివారం ఉదయం 10 గంటల సమయంలో జస్టిస్ దీపక్ మిశ్రా అధికార నివాసమైన 5, కృష్ణా మీనన్ మార్గ్ బంగ్లా గేటు ముందు నృపేంద్ర కారు ఆగింది. ఐదు నిమిషాలైనా బంగ్లా గేట్లు తెరుచుకోలేదు. అక్కడే ఉన్న మీడియా ప్రతినిధులు కారులో ఎవరున్నారా అని ఆరా తీస్తే.. ప్రధాన మంత్రి ప్రిన్సిపల్ కార్యదర్శి నృపేంద్ర మిశ్రా కనిపించారు. ఆయనను చూసిన ప్రతి ఒక్కరూ నివ్వెరపోయారు. బంగ్లా ముందు చాలాసేపు కారు ఆగినా గేట్లు తెరుచుకోలేదు. కారులో నుంచి ఓ వ్యక్తి దిగి గేటు దగ్గర ఉన్న భద్రతా సిబ్బందితో ఏదో మాట్లాడారు. అయినా, గేటు తీయలేదు. ప్రధాని తరఫున ఈ సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవడానికి కొన్ని సూచనలతో నృపేంద్ర వచ్చినట్లు తెలిసింది. ఆయనను కలవడానికి దీపక్ మిశ్రా సంసిద్ధత వ్యక్తం చేయలేదని సమాచారం. దీనికితోడు, అక్కడే ఉన్న మీడియా ప్రతినిధులు తనను గుర్తించడంతో నృపేంద్ర మిశ్రా వెనుదిరిగి సౌత్ బ్లాక్ కార్యాలయం వైపు వెళ్లారు. ఇప్పుడు నృపేంద్రను కలిస్తే ఈ వివాదం మరింత ముదురుతుందని దీపక్ మిశ్రా భావించారని న్యాయ నిపుణులు అంటున్నారు. చీఫ్ జస్టిస్ దీపక్ మిశ్రాపై నలుగురు సీనియర్ జడ్జిలు శుక్రవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. ఆ మరుసటి రోజే ప్రధాని కార్యాలయంలో కీలక వ్యక్తి ఆయనను కలవడానికి రావడం చర్చనీయాంశమైంది. న్యాయ వ్యవస్థలో తలెత్తిన ఈ వివాదంలో తాము జోక్యం చేసుకోబోమని కేంద్రం ప్రకటించింది కూడా. అయినా, చీఫ్ జస్టిస్‌తో నృపేంద్ర ఎందుకు భేటీ అవ్వాలనుకున్నారో అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రధాని మోదీయే నృపేంద్రను పంపించి ఉంటారని అధికార వర్గాల్లో చర్చ జరుగుతోంది.

'ప్రత్యేక దూత'పై ప్రధాని వివరణ ఇవ్వాలి: కాంగ్రెస్

సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి నివాసానికి ప్రధాని ప్రిన్సిపల్ కార్యదర్శి వెళ్లడాన్ని కాంగ్రెస్ పార్టీ తప్పుబట్టింది. దీనిపై ప్రధాని మోదీ వివరణ ఇవ్వాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ అధికార ప్రతినిధి రణ్‌దీప్ సుర్జేవాలా ట్విటర్‌లో ట్వీట్ చేశారు. "ప్రధాన న్యాయమూర్తి దగ్గరికి ప్రత్యేక దూతను పంపించడంపై ప్రధాని వివరణ ఇవ్వాలి" అని పేర్కొన్నారు. ప్రశ్నించడానికి ప్రతి ఒక్కరికీ హక్కు ఉంటుందని, ఈ విషయంలో ప్రభుత్వం జోక్యం చేసుకోరాదని కాంగ్రెస్ అధికార ప్రతినిధి తెహ్సీన్ పూనావాలా అన్నారు. ఈ వివాదాన్ని సుప్రీం కోర్టు జడ్జిలో సాధ్యమైనంత త్వరగా పరిష్కరించుకోవాలన్నారు.

న్యాయవ్యవస్థ కోసమే నోరు విప్పాం

- బయటి వారి జోక్యం అవసరం లేదు: జస్టిస్ కురియన్
- సంక్షోభం లేదు: జస్టిస్ గొగోయ్


జస్టిస్ కురియన్ జోసెఫ్


జస్టిస్ గొగోయ్

న్యూఢిల్లీ/కొచ్చిన్, జనవరి 13: న్యాయవ్యవస్థ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకునే తాము బహిరంగంగా మాట్లాడాల్సి వచ్చిందని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కురియన్ జోసఫ్ వ్యాఖ్యానించారు. తమ చర్య న్యాయవ్యవస్థపై ప్రజల నమ్మకాన్ని మరింత పెంచేందుకు దోహదపడుతుందన్నారు. శనివారం ఆయన కేరళలోని కాలడిలో విలేకరులతో మాట్లాడారు. తాము లేవనెత్తిన అంశాలు త్వరలోనే పరిష్కారమవుతాయన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. ఇందులో బయటవారి జోక్యం అవసరం లేదని స్పష్టం చేశారు. తాము క్రమశిక్షణను ఉల్లంఘించామన్న వాదన అసంబద్ధమని, తమ చర్య సుప్రీంకోర్టు పాలనావ్యవహారాల్లో మరింత పారదర్శకతను తీసుకువస్తుందని అభిప్రాయపడ్డారు. సుప్రీంకోర్టుపైన కానీ, సుప్రీంకోర్టు జడ్జీలపై కానీ రాష్ట్రపతికి రాజ్యాంగపరంగా ఎలాంటి బాధ్యత ఉండదని, అందుకే ఈ అంశాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లలేదన్నారు. తాము ప్రస్తావించిన అంశాలను వినాల్సిన వారు విన్నారని, త్వరలోనే ఇది సద్దుమణుగుతుందని, భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకూడదని భావిస్తున్నానని అన్నారు. కాగా, శుక్రవారం నాటి విలేకరుల సమావేశంలో పాల్గొన్నా మరో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్.. 'న్యాయ వ్యవస్థలో ఎలాంటి సంక్షోభంలో లేదు' అని వ్యాఖ్యానించారు. శనివారం ఢిల్లీలో ఆయన విలేకరులతో మాట్లాడారు.

న్యాయ సంక్షోభాన్ని వాడుకోవద్దు

- పార్టీలు, నేతలకు బార్ కౌన్సిల్ హెచ్చరిక
- సుప్రీం న్యాయమూర్తులతో మాట్లాడేందుకు ఏడుగురు సభ్యులతో కమిటీ ఏర్పాటుకు తీర్మానం

న్యూఢిల్లీ, జనవరి 13: న్యాయవ్యవస్థలో నెలకొన్న తాజా పరిస్థితిని పార్టీలు, నేతలు తమ ప్రయోజనాలకు వాడుకోకూడదని బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) హెచ్చరించింది. శుక్రవారంనాడు సుప్రీం న్యాయమూర్తుల పత్రికా సమావేశం ముగిసిన కొద్దిసేపటికే కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ మీడియాతో దీనిపై మాట్లాడటమే బీసీఐ ప్రకటనకు కారణమని భావిస్తున్నారు. కాగా, శనివారం అత్యవసరంగా సమావేశమైన 17 మంది సభ్యుల బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా.. సుప్రీం న్యాయమూర్తులతో మాట్లాడేందుకు ఏడుగురు సభ్యుల కమిటీని ఏర్పరచాలని తీర్మానించింది. ఆ కమిటీ ఆదివారంనాడు.. వివాదానికి మూలమైన టాప్-5 సీనియర్ న్యాయమూర్తులు మినహా, సుప్రీం కోర్టులోని మిగతా న్యాయమూర్తులతో ఈ సంక్షోభంపై మాట్లాడనుంది. వారితో చర్చించాక.. తిరుగుబావుటా ఎగురవేసిన నలుగురు న్యాయమూర్తులతో, చివరగా ప్రధాన న్యాయమూర్తితో కమిటీ మాట్లాడనుంది. మరోవైపు.. సుప్రీం న్యాయమూర్తులు తమ మధ్య సమస్యలను అంతర్గతంగా, రాజ్యాంగ పరిధిలో పరిష్కరించుకోవాలని 'ద ఎగ్జిక్యూటివ్ కమిటీ ఆఫ్ ద సుప్రీం కోర్ట్ అడ్వకేట్స్ ఆన్ రికార్డ్ అసోసియేషన్ (స్కోరా)' కూడా అభిప్రాయపడింది. న్యాయమూర్తుల మధ్య ఉన్న విభేదాలను సుప్రీం ఫుల్‌కోర్టే పరిష్కరించాలని సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ (ఎస్‌సీబీఏ) పేర్కొంది.

17 నుంచి 8 అంశాలపై సుప్రీంలో వాదనలు

న్యూఢిల్లీ, జనవరి 13: ఈ నెల 17 నుంచి ఆధార్ సహా అత్యంత ముఖ్యమైన ఎనిమిది అంశాలకు సంబంధించి సుప్రీంకోర్టు ఐదుగురు న్యాయమూర్తులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం వాదనలు ప్రారంభించనుంది. ఈ మేరకు అపెక్స్ కోర్టు వెబ్‌సైట్‌లో సమాచారాన్ని ఉంచారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, సీనియర్ న్యాయమూర్తుల మధ్య కేసుల కేటాయింపులకు సంబంధించిన వివాదం ఓవైపు కొనసాగుతున్న నేపథ్యంలోనే ఈ మేరకు ప్రకటన విడుదలైంది.

లోపలేం జరుగుతోంది?

- కొలీజియంలో సీనియర్లకు ఉక్కపోత
- ప్రాధాన్యం లేని కేసులే అప్పగింత
- మాస్టర్ రోస్టర్ ప్రధాన న్యాయమూర్తే
- ఆయన చెప్పినట్లే కేసుల కేటాయింపు
- తనకు సీనియర్లపై అపనమ్మకం

న్యూఢిల్లీ, జనవరి 13: న్యాయవ్యవస్థలో సంప్రదాయాలకు, సీనియారిటీకి పెద్ద పీట వేస్తారు. చీఫ్ జస్టిస్ సహా మొదటి ఐదు స్థానాల్లో ఉండే న్యాయమూర్తులు కొలీజియంగా వ్యవహరిస్తారు. లోపల ఎలాంటి గొడవలున్నా కొలీజియం ఇన్నాళ్లు ఒక్కతాటిపై నడిచింది. న్యాయమూర్తుల నియామకంలో కొలీజియమే నిర్ణయం తీసుకుంటుంది. ఈ పద్ధతిని మార్చాలని కేంద్ర ప్రభుత్వం ఎంతగా ప్రయత్నించినా కొలీజియం మూకుమ్మడిగా ఎదుర్కొంది. న్యాయమూర్తుల నియామకానికి ఎన్‌జేఏసీ ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించినపుడు సుప్రీంకోర్టు 4-1 మెజారిటీతో దాన్ని కొట్టేసింది. నాటి చరిత్రాత్మక తీర్పులో ఎన్‌జేఏసీని సమర్థించిన ఏకైక న్యాయమూర్తి జస్టిస్ చలమేశ్వర్. నిజానికి అంతకు ముందు ఆయన్ను సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమించినప్పటి నుంచే కొలీజియంతో ఆయనకు విభేదాలున్నాయి. ఒకేసారి సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా ఇద్దరు జడ్జిలను నియమితులైనపుడు ఎవర్ని ముందు ప్రమాణ స్వీకారం చేయిస్తే వారే భవిష్యత్తులో ప్రధాన న్యాయమూర్తి అవుతారు. వయస్సులో పెద్ద వాడైన, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఎక్కువ సీనియారిటీ కలిగిన జస్టిస్ చలమేశ్వర్‌ను కాదని, ఆయన కన్నా చిన్నవాడైన జస్టిస్ దీపక్ మిశ్రాతో ముందుగా ప్రమాణ స్వీకారం చేయించారు. జస్టిస్ చలమేశ్వర్ ప్రమాణ స్వీకారం చేసి ఉంటే, ఇద్దరికీ ప్రధాన న్యాయమూర్తిగా అవకాశం దక్కేది.

కేసుల కేటాయింపులో వివక్ష

ఏ న్యాయమూర్తికి ఏ కేసును కేటాయించాలనేది (రోస్టర్) ప్రధాన న్యాయమూర్తి చూస్తారు. చాన్నాళ్లుగా సీనియర్లకు ముఖ్యమైన కేసులేవీ కేటాయించడం లేదు. డిసెంబరులో మెడికల్ కళాశాలల అవినీతిలో న్యాయమూర్తుల పాత్రపై ఓ స్వచ్ఛంద సంస్థ ప్రజాహిత వ్యాజ్యం వేస్తే జస్టిస్ చలమేశ్వర్ విచారణకు స్వీకరించారు. సంప్రదాయం ప్రకారం మాస్టర్ రోస్టర్ అయిన ప్రధాన న్యాయమూర్తికి పంపించారు. ఆయన పిటిషన్‌ను జస్టిస్ చలమేశ్వర్‌కు కాకుండా జస్టిస్ సిక్రీ బెంచ్‌కు కేటాయించారు. ఈ విషయం తెలిసిన స్వచ్ఛంద సంస్థ ఇదే అంశంపై జస్టిస్ చలమేశ్వర్ సమక్షంలో మరో పిటిషన్ వేసింది. ఈసారి ఆయన ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ఐదుగురు సీనియర్ సభ్యులు ధర్మాసనం ఈ కేసును విచారించాలని ఆదేశించారు. ప్రధాన న్యాయమూర్తి పేరు కూడా వివాదంలో ఉండటంతో ఆయన బెంచ్ నుంచి తప్పుకోవాల్సి ఉంటుంది. అప్పుడు సీనియారిటీలో రెండో స్థానంలో ఉన్న చలమేశ్వర్ నేతృత్వం వహిస్తారు. ముప్పును గ్రహించి వెంటనే ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా 'మాస్టర్ రోస్టర్' తానేనని, తాను చెప్పినట్లే కేసుల కేటాయింపు జరగాలని స్పష్టం చేశారు. కేసును సీనియారిటీలో 8, 10, 17 స్థానాల్లో ఉన్న న్యాయమూర్తుల ధర్మాసనానికి అప్పగించారు. అప్పటి నుంచీ ప్రధాన న్యాయమూర్తి చెప్పినట్లే జడ్జిల మధ్య కేసుల పంపిణీ జరుగుతోంది. గత ఆర్నెల్లుగా ప్రాధాన్యమున్న కేసులేవీ తమ వద్దకు రాకపోవడం సీనియర్లలో ఆగ్రహం కలిగించింది. తాజాగా మహారాష్ట్ర న్యాయమూర్తి అనుమానాస్పద మరణం కేసును జూనియర్ న్యాయమూర్తులకు అప్పగించడంపై జస్టిస్ చలమేశ్వర్, ఇతర సీనియర్ న్యాయమూర్తులు అభ్యంతరం చెప్పారు. తానే రోస్టర్ మాస్టర్‌నని, జస్టిస్ హెచ్‌ఎల్ దత్తు ప్రధాన న్యాయమూర్తిగా ఉన్నప్పటి నుంచీ ఇదే సంప్రదాయం నడుస్తోందని, ఎవరూ అభ్యంతరం వ్యక్తం చేయలేదని గుర్తు చేశారు. దాంతో కొలీజియం సభ్యులు మీడియాకు ఎక్కారు. చలమేశ్వర్ 2007లో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అయ్యారు. తర్వాత 2009 నవంబరులో జస్టిస్ కేహర్, డిసెంబరు జస్టిస్ దీపక్ మిశ్రాలు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులుగా పదోన్నతులు సాధించారు. నిజానికి అదే ఊపులో జస్టిస్ చలమేశ్వర్‌కు తొలుత సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి లభిస్తే ఆయన ప్రధాన న్యాయమూర్తి అయ్యేవారు. అయితే, సుప్రీంకోర్టు పదోన్నతిలో మొదట జస్టిస్ కేహర్‌కు(2011) అవకాశమిచ్చారు. తర్వాత నెల రోజులకు జస్టిస్ మిశ్రా, జస్టిస్ చలమేశ్వర్‌కు ఒకేరోజు అవకాశమిచ్చారు. కేవలం ముందు ప్రమాణ స్వీకారం చేసినందుకు జస్టిస్ మిశ్రా సీనియర్ అయ్యారు. కొలీజియంలో పక్షపాతాన్నిఎండగట్టడానికి జస్టిస్ చలమేశ్వర్ ఎప్పుడూ వెనుకాడలేదు. కొలీజియంలో పెద్దలు కోటరీగా వ్యవహరిస్తున్నారని, 'నువ్వు కొలీజియంలో ఉన్నపుడు నావాళ్లను ఎంపిక చేయి... నేను కొలీజియంలో ఉన్నపుడు నీవాళ్లను ఎంపిక చేస్తా...' అన్నట్లుగా వ్యవహారం సాగుతోందని ఒకసారి అన్యాపదేశంగా చెప్పారు. కొలీజియంలో మొదటి ముగ్గురు న్యాయమూర్తులు హైకోర్టు న్యాయమూర్తులను ఎంపిక చేస్తారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులను, సుప్రీంకోర్టు న్యాయమూర్తులను ఐదుగురు సభ్యుల కొలీజియం ఎంపిక చేస్తుంది. ఠాకూర్, కేహర్‌లు ప్రధాన న్యాయమూర్తులుగా ఉన్నపుడు జస్టిస్ చలమేశ్వర్ కొలీజియం సభ్యుడైనా సమావేశాలకు హాజరు కాలేదు. న్యాయమూర్తుల ఎంపిక విధానంపై నిరసనతోనే దూరంగా ఉన్నారు.

> ప్రధాన న్యాయమూర్తి అంటే, న్యాయమూర్తుల్లో ప్రథముడు. ఎవరికన్నా ఎక్కువ కాదు. దేశ ప్రయోజనాల దృష్ట్యా అత్యంత ప్రాధాన్యమున్న కేసుల్ని కూడా ఆయన తనకు ఇష్టమొచ్చినట్లు జూనియర్లకు వేసేస్తున్నారు. న్యాయవ్యవస్థ పరిపాలన సరిగాలేదు. దీన్ని దేశ ప్రజల దృష్టికి తీసుకు రావాలనుకుంటున్నాం
>
> - సుప్రీంకోర్టు కొలీజియంలో మిగతా నలుగురు సీనియర్ న్యాయమూర్తుల ఆవేదన.

> ప్రధాన న్యాయమూర్తే మాస్టర్ రోస్టర్. ఏ కేసు ఏ జడ్జికి వేయాలో తనే నిర్ణయించాలి. గత నలుగురు ప్రధాన న్యాయమూర్తులు ఇదే విధానాన్ని అవలంబించారు. ఇప్పటికీ అదే కొనసాగుతోంది. అందరూ సమానమని భావిస్తే జూనియర్లకు ముఖ్యమైన కేసులివ్వడంపై ఎందుకు అభ్యంతరం?
>
> - సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా కార్యాలయం



చిదంబరం ఇంట్లో ఈడీ సోదాలు

- కొడుకు కార్తీ తదితరుల ఇళ్లలోనూ
- చెన్నై, ఢిల్లీలో ఏకంగా 10 చోట్ల దాడులు





చిదంబరం గృహంలో ఈడీ దాడుల సందర్భంగా కాపలా కాస్తున్న పోలీసులు.. ఈడీ దాడుల తర్వాత తన ఇంటి బయట విలేకరులతో మాట్లాడుతున్న చిదంబరం

న్యూఢిల్లీ, చెన్నై, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మాజీ మంత్రి పి.చిదంబరం ఇంట్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సోదాలు జరిపింది. ఆయన తనయుడు కార్తీ చిదంబరం, ఆయన చార్టర్డ్ అకౌంటెంట్, వ్యక్తిగత సహాయకుడి ఇళ్లపైనా దాడులు చేసింది. చెన్నై, కరైక్కుడి, ఢిల్లీల్లో ఒకే సమయంలో ఈ సోదాలు జరిగాయి. చిదంబరం కేంద్ర మంత్రిగా ఉన్నప్పుడు ఎయిర్‌సెల్-మ్యాక్సిస్ సంస్థల ఒప్పందం, ముంబైకి చెందిన ఐఎన్‌ఎక్స్ మీడియా సంస్థకు విదేశీ పెట్టుబడులకు అనుమతి జారీ చేయడంలో చోటుచేసుకున్న అవినీతి, అక్రమాలకు సంబంధించి సీబీఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం నమోదు చేసిన కేసుల విచారణలో భాగంగా ఈ దాడులు జరిగాయి. చెన్నైలోని 9 ప్రాంతాల్లో, దక్షిణ ఢిల్లీలోని చిదంబరం ఇంట్లో శనివారం తెల్లవారుజాము నుంచి దాడులు ప్రారంభించింది. తనిఖీలు జరుగుతున్నప్పుడు చిదంబరం సతీమణి నళిని, కోడలు శ్రీనిధి, మనుమరాలు మాత్రమే ఉన్నారు. చిదంబరం ఢిల్లీలోను, కార్తీ శివగంగలోను ఉన్నారు. సుమారు 3 గంటలపాటు ఈ సోదాలు జరిగాయి. కానీ ఎలాంటి దస్తావేజులు అధికారులకు చిక్కలేదని తెలిసింది. ఈ సందర్భంగా చిదంబరం, కార్తీలపై నేరాన్ని ఆరోపించదగిన కీలక డాక్యుమెంట్లు దొరికాయని ఈడీ వర్గాలు తెలిపాయి. ఈడీ, సీబీఐ నమోదు చేసిన కేసుల ఆధారంగానే దాడులు చేశామని తెలిపాయి.

డ్రామా ముందే తెలుసు: చిదంబరం

ఎయిర్‌సెల్-మాక్సిస్ కేసులో సోదాల పేరిట ఈడీ ఆడుతున్న నాటకం తనకు ముందే తెలుసునని చిదంబరం పేర్కొన్నారు. ఈ సోదాల్లో అధికారులకు ఎలాంటి దస్తావేజులు లభ్యం కాలేదని తెలిపారు. ఈడీ దాడులను 'తప్పుల కుప్ప'గా చిదంబరం అభివర్ణించారు. "ఈ ఇల్లు కార్తీది అనుకుని వచ్చామని అధికారులు చెప్పారు. కార్తీ చెన్నైలో ఉంటాడని, ఇది నా ఇల్లని చెప్పాను. అయినా, మా ఇంట్లో కిచెన్, బాత్‌రూం కూడా వెతికారు. వాళ్లకు ఏమీ దొరకలేదు. సోదాల్లో వాళ్లే ఇరుక్కుని, 'అపరాధ భావం'తో వెళ్లిపోయారు. చెన్నైలో కూడా వాళ్లకు ఏమీ దొరకలేదు. ఏమీ స్వాధీనం చేసుకోలేదు. ఇప్పుడే కాదు.. భవిష్యత్తులో అయినా మా ఇంట్లో వాళ్లు ఏమైనా దొరకబుచ్చుకుంటే ఈడీ అధికారులను నేనే అభినందిస్తాను" అని చిదంబరం ఎద్దేవా చేశారు. దాడుల తర్వాత ఢిల్లీలో తన ఇంటి బయట ఆయన విలేకరులతో మాట్లాడారు.


దృష్టి మరల్చేందుకే చిదంబరంపై ఈడీ దాడులు: అఖిలేశ్

చెన్నై/ముంబై/న్యూఢిల్లీ, జనవరి 13: సుప్రీంకోర్టు న్యాయమూర్తుల వివాదం నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకే కాంగ్రెస్ నేత, కేంద్ర మాజీ మంత్రి పి.చిదంబరం కుమారుడు కార్తి చిదంబరం నివాసంపై కేంద్ర ప్రభుత్వం ఈడీ దాడులు చేయించిందని యూపీ మాజీ ముఖ్యమంత్రి అఖిలేశ్‌యాదవ్ ఆరోపించారు. శుక్ర, శనివారాల్లో కార్తికి చెందిన దాదాపు పది ప్రాంతాల్లో ఈడీ దాడులు చేసిన నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. మరోవైపు సుప్రీంకోర్టు న్యాయమూర్తుల వివాదాన్ని వారికి వారు పరిష్కరించుకోలేకపోతే రాష్ట్రపతి కోవింద్ జోక్యం చేసుకోవాలని డీఎంకే వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.కె.స్టాలిన్ కోరారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించే అత్యున్నత వ్యవస్థ సుప్రీంకోర్టు అని, దీనిపై రాష్ట్రపతి వెంటనే స్పందించాల్సిన అవసరం ఉందని అన్నారు. కాగా న్యాయవ్యవస్థను చెవిటి, మూగను చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని శివసేన అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రే ఆరోపించారు. రాష్ట్రపతి కోవింద్ ఆదివారం ముంబైలో పర్యటించనున్న నేపథ్యంలో.. ఈ పర్యటనను ఠాక్రే తప్పుబట్టారు. అత్యున్నత న్యాయస్థానం సంక్షోభంలో ఉంటే పట్టించుకోకుండా.. ముంబై పర్యటనకు రావాల్సిన తొందరేముందని ప్రశ్నించారు. మరోవైపు సుప్రీం కోర్టు న్యాయమూర్తులు బయటికి వచ్చి మాట్లాడినట్లుగానే.. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు కేంద్ర మంత్రులు కూడా భయాన్ని వీడి ధైర్యంగా మాట్లాడాలని బీజేపీ అసమ్మతి నేత యశ్వంత్ సిన్హా అన్నారు.

ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్
హైదరాబాద్ x బెంగళూరు
ఫైనల్
రా. 7.00 నుంచి
STAR SPORTS 1

ప్రొ రెజ్లింగ్ లీగ్
పంజాబ్ రాయల్స్
X
వీర్ మరాఠాస్
(రా. 6 నుంచి)
SONY ESPN

అండర్-19 ప్రపంచ కప్
భారత్ x ఆస్ట్రేలియా
ఉదయం
5.30 నుంచి
స్టార్ స్పోర్ట్స్ -1లో



హంటర్స్ x బ్లాస్టర్స్

- పీబీఎల్ ఫైనల్లో బెంగళూరు
- సెమీస్‌లో అహ్మదాబాద్‌పై గెలుపు
- నేడు హైదరాబాద్‌తో అమీతుమీ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్ (పీబీఎల్) రెండో సెమీస్ అభిమానులకు మస్తు మజా పంచింది. అటు బెంగళూరు బ్లాస్టర్స్, ఇటు అహ్మదాబాద్ స్మాష్ మాస్టర్స్ హోరాహోరీగా తలపడడంతో చివరి, ఐదో మ్యాచ్ వరకూ ఫలితం తేలలేదు. ఆఖరి పోటీ..మిక్స్‌డ్ డబుల్స్ కూడా నువ్వానేనా అన్నట్టు సాగడంతో ఉత్కంఠ తీవ్రస్థాయికి చేరింది. కానీ చివరకు హైదరాబాద్ అమ్మాయి సిక్కిరెడ్డి - రంగ్ జోడీ మిక్స్‌డ్ మ్యాచ్ సొంతంచేసుకోవడంతో బెంగళూరు 4-3 ఆధిక్యంతో అహ్మదాబాద్‌పై నెగ్గి టైటిల్‌పోరుకు చేరింది. పురుషుల తొలి సింగిల్స్‌లో చోంగ్ వీ ఫెంగ్ 2-15, 15-14, 10-15తో సౌరభ్ వర్మ చేతిలో ఓడడంతో బెంగళూరు 0-1తో పోరును ఆరంభించింది. తదుపరి పురుషుల డబుల్స్ మ్యాచ్‌ను బెంగళూరు ట్రంప్‌గా ఎంచుకుంది. ఈ మ్యాచ్‌లో రంగ్ - బొ జోడీ 15-13, 15-12తో రెగినాల్డ్, నందగోపాల్ ద్వయంపై గెలవడంతో బెంగళూరు 2-1 ఆధిక్యంలోకి వెళ్లింది. ఇక మహిళల సింగిల్స్‌ను అహ్మదాబాద్ జట్టు ట్రంప్‌గా ఎంచుకొంది. ఈ మ్యాచ్‌లో యంగ్ 8-15, 15-13, 15-8తో క్రిస్టీ గిల్మోర్‌పై గెలుపొందడంతో ఆ జట్టు 3-2తో ముందుకెళ్లడంతో పోరు ఉత్కంఠగా మారింది. ఈదశలో రెండో పురుషుల సింగిల్స్‌లో బెంగళూరు షట్లర్, వరల్డ్ నెంబర్‌వన్ విక్టర్ అక్సెల్సన్ 15-11, 15-14తో ప్రణయ్‌పై నెగ్గడంతో ఇరుజట్లు 3-3తో సమంగా నిలిచాయి. దీంతో నిర్ణయాత్మకమైన కీలక మిక్స్‌డ్ డబుల్స్ పోరులో సిక్కిరెడ్డి-రంగ్ జంట 15-12, 13-15, 15-9తో అహ్మదాబాద్ జోడీ హిమ్-జుహిని ఓడించడంతో బెంగళూర ఫైనల్ బెర్త్ ఖరారు చేసుకుంది. ఆదివారం ఇక్కడి గచ్చిబౌలి స్టేడియంలో జరిగే ఫైనల్లో హైదరాబాద్ హంటర్స్‌ను బెంగళూరు ఢీకొంటుంది. తొలి సెమీఫైనల్లో హైదరాబాద్ 3-0తో ఢిల్లీపై గెలుపొందిన సంగతి తెలిసిందే.



బోణీ అదిరేనా..?

నేడు ఆస్ట్రేలియాతో భారత్ ఢీ • అండర్-19 వరల్డ్ కప్

మౌంట్ మాంగనూయ్: ఆశావహ దృక్పథం..నిండైన ఆత్మవిశ్వాసం..సత్తా చాటాలన్న ఉత్సాహం.. కలగలిసిన యువ భారత్ అండర్-19 వరల్డ్‌కప్‌లో ఆస్ట్రేలియాతో ఆదివారం జరిగే డే/నైట్ తొలిపోరుకు సిద్ధమైంది. ద్రావిడ్ శిక్షణలో రాటుదేలిన భారత జట్టులో ప్రతిభకు ఏమాత్రం కొదవ లేదు. దేశవాళీలో సెంచరీలపై సెంచరీలతో కదం తొక్కుతున్న కెప్టెన్ పృథ్వీ షా, యూత్ వన్డేల్లో పరుగుల వరద పారిస్తున్న హిమాన్షు రాణా, బరిలో దిగుతూనే బ్యాటు ఝుళిపించే శుభమన్ గిల్.. ఇలా ముగ్గురు ధాటిగా ఆడే బ్యాట్స్‌మెన్‌తో భారత టాపార్డర్ దుర్భేధ్యంగా ఉంది. అంకుల్ రాయ్, అభిషేక్ వర్మలతో మిడిలార్డర్ కూడా పటిష్ఠంగా ఉంది. భారత్ నాలుగోసారి ప్రపంచ కిరీటం సొంతం చేసుకోవాలంటే టాపార్డర్ రాణించడం ఎంతో కీలకం. పేసర్ ఇషాన్ పోరెల్ నేతృత్వంలో శివమ్ మావితో కూడిన పేస్ బౌలింగ్ విభాగం పటిష్ఠంగా ఉంది. ఇక్కడి వాతావరణ పరిస్థితులకు అలవాటు పడేందుకని భారత్ ముందుగానే న్యూజిలాండ్ విచ్చేసింది. ఇక తొలి మ్యాచ్‌కు వేదికైన మాంగనూయ్‌లో వారం క్రితమే మకాం వేసింది. మరోవైపు కెప్టెన్ జాసన్ సంఘా, ఆస్టిన్ వా, విల్ సదర్లాండ్‌లతో ఆస్ట్రేలియా కూడా పటిష్ఠంగా ఉంది.

అఫ్ఘాన్ చేతిలో పాక్ చిత్తు

శనివారం జరిగిన ఆరంభ మ్యాచ్‌లో అఫ్ఘానిస్థాన్ 5 వికెట్లతో పాకిస్థాన్‌ను చిత్తుచేసింది. ఇతర మ్యాచ్‌లలో జింబాబ్వే 10 వికెట్లతో పపువా న్యూగినియాపై, బంగ్లాదేశ్ 87 రన్స్‌తో నమీబియాపై, న్యూజిలాండ్ 8 వికెట్లతో డిఫెండింగ్ చాంపియన్ వెస్టిండీస్‌పై గెలుపొందాయి.

జట్లు

భారత్: పృథ్వీ షా (కెప్టెన్), శుభమన్ గిల్, ఆర్యన్ జుయల్, అభిషేక్ శర్మ, హర్షదీప్ సింగ్, హార్విక్ దేశాయ్, మన్జోత్ కల్రా, కమలేష్ నాగర్‌కోటి, పంకజ్ యాదవ్, రియాన్ పరాగ్, ఇషాన్ పోరెల్, హిమాన్షు రాణా, అంకుల్ రాయ్, శివమ్ మావి, శివసింగ్.

ఆస్ట్రేలియా : జాసన్ సంఘా (కెప్టెన్), విల్ సదర్లాండ్, జేవియర్ బార్ట్‌లెట్, మాక్స్ బ్రయంట్, జాక్ ఎడ్వర్డ్స్, జాక్ ఇవాన్స్, జారోడ్ ఫ్రీమన్, ర్యాన్ హార్డ్‌లీ, బాక్స్‌టర్ హోల్ట్, నాథన్ మెక్‌స్వీనీ, జొనాథన్ మెర్లో, లాయిడ్ పోప్, జాసన్ రాల్‌స్టోన్, పరమ్ ఉప్పల్, ఆస్టిన్ వా.

యువ బాక్సర్ దారుణ హత్య..?



నోయిడా: హరియాణాకు చెందిన మాజీ బాక్సర్ జితేందర్ మన్ అనుమానాస్పదరీతిలో హత్యకు గురయ్యాడు. జెటా సెక్టార్‌లోని ఏ తన అపార్ట్‌మెంట్‌లో శుక్రవారం శవమై కనిపించాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జితేందర్‌ను కలిసేందుకు స్నేహితుడు ప్రీతం అతని ఇంటికెళ్లాడు. ఎంతకీ తలుపు తీయకపోవడంతో బద్దలుకొట్టి చూడగా, జితేందర్ రక్తపుమడుగులో పడి ఉన్నాడు. జితేందర్ శరీరంపై బుల్లెట్ గాయాలున్నట్లు పోలీసులు వెల్లడించారు. జూనియర్ బాక్సింగ్‌లో అంతర్జాతీయ స్థాయి టోర్నీల్లో ఆడిన జితేందర్.. గాయాల కారణంగా 8నెలల క్రితం బాక్సింగ్‌కు వీడ్కోలు పలికాడు. అతను ప్రస్తుతం జిమ్ ట్రైనర్‌గా పనిచేస్తున్నాడు.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురు రెజ్లర్ల దుర్మరణం



ముంబై: మహారాష్ట్రలోని సంగ్లీ జిల్లాలో శనివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు రాష్ట్రస్థాయి రెజ్లర్లు సహా ఆరుగురు దుర్మరణం పాలయ్యారు. రెజ్లర్లు ఔంద్ గ్రామంలో జరిగిన పోటీల్లో పాల్గొని కుందాల్ బయలుదేరగా.. వారు ప్రయాణిస్తున్న ఎస్‌యూవీని ఎదుటనుంచి వేగంగా వచ్చిన ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ఘటనలో రెజ్లర్లు సహా ఆరుగురు అక్కడికక్కడే మరణించారు.

ఐపీఎల్ వేలానికి 1122 మంది క్రికెటర్లు

న్యూఢిల్లీ: ఈనెల 27, 28 తేదీల్లో జరిగే ఐపీఎల్ వేలానికి మొత్తం 1122 మంది క్రికెటర్లు రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు బీసీసీఐ వెల్లడించింది. ఆటగాళ్ల రిజిస్ట్రేషన్ జాబితాను ఎనిమిది ఫ్రాంచైజీలకు పంపించినట్లు బోర్డు శనివారం ప్రకటించింది. ఈ జాబితాలో 281 క్యాప్‌డ్ (అంతర్జాతీయ) ప్లేయర్లతో పాటు 838 అన్‌క్యాప్‌డ్ (అంతర్జాతీయ అరంగేట్రం చేయని) ఆటగాళ్లున్నారు. మిగతా ముగ్గురు అసోసియేట్ దేశాల క్రికెటర్లు. వీరిలో 778 మంది భారత ఆటగాళ్లున్నారు. విదేశీ క్రికెటర్లలో క్రిస్ గేల్, మాక్స్‌వెల్, హషీమ్ ఆమ్లా, కేన్ విలియమ్సన్, రబాడ స్టార్ అట్రాక్షన్ కానుండగా.. భారత్ నుంచి గంభీర్, అశ్విన్, రహానె, యువరాజ్ సింగ్, కుల్దీప్ యాదవ్, కేఎల్ రాహుల్, మురళీ విజయ్‌ల మధ్య పోటీ నెలకొనే అవకాశముంది.

అజయ్ రెడ్డి ఆల్‌రౌండ్ షో

- అంధుల ప్రపంచకప్‌లో బంగ్లాపై భారత్ గెలుపు



దుబాయ్: కెప్టెన్ అజయ్ రెడ్డి ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టడంతో అంధుల క్రికెట్ ప్రపంచకప్‌లో భారత్ 10 వికెట్లతో బంగ్లాదేశ్‌పై ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్ నిర్ణీత 40 ఓవర్లలో 8 వికెట్లకు 226 పరుగులు చేసింది. అజయ్‌రెడ్డి 4 వికెట్లు పడగొట్టాడు. 227 పరుగుల లక్ష్యాన్ని భారత్ 18.4 ఓవర్లలోనే ఛేదించడం విశేషం. అజయ్‌రెడ్డి (60 బంతుల్లో 14 ఫోర్లతో 101 నాటౌట్), సునీల్ రమేష్ (57 బంతుల్లో 17 ఫోర్లతో 105) సెంచరీలతో జట్టును సునాయాసంగా గెలిపించారు. భారత్ తన తర్వాతి మ్యాచ్‌ను నేపాల్‌తో ఆదివారం ఆడనుంది.

లంచ్ బ్రేక్‌కు సౌతాఫ్రికా స్కోరు 78/0

మార్‌క్రమ్ అర్ధ సెంచరీ కొట్టేశాడు..! మరో ఓపెనర్ ఎల్గర్ క్రీజులో పాతుకుపోయాడు..! ఛా.. గత మ్యాచ్‌ల్లో బ్యాట్స్‌మెన్ చేతులెత్తేస్తే.. ఈ పోరులో బౌలర్లూ నిరాశ పరుస్తున్నారన్న ఆందోళన అభిమానుల్లో..! భువనేశ్వర్‌ను పక్కన బెట్టడం సరైన నిర్ణయం కాదని విశ్లేషకుల కన్నెర్ర..!

టీ విరామానికి 182/2

ఓపెనర్లను ఎట్టకేలకు అవుట్ చేసినా.. సీనియర్లు ఆమ్లా, డివిల్లీర్స్ కుదురుకున్నారు..! ఇక తొలి రోజు సఫారీలదే..! వాళ్లు భారీ స్కోరు చేయడం ఖాయం..! భారత్‌కు కష్టాలు తప్పవు..! ఇలా ఎన్నో ఆలోచనలు చుట్టుముట్టాయి..!

కానీ, తొరోజు ఆటముగిసేసరికి 269/6 ..

కాస్త ఆలస్యమైనా టీమిండియా బౌలర్లు, ఫీల్డర్లు అద్భుత ప్రదర్శన చేశారు..! నాటకీయ పరిణామాల మధ్య చివరి గంటలో ఐదు పరుగుల తేడాతో మూడు వికెట్లు పడగొట్టి తొలి రోజును సానుకూలంగా ముగించారు..!



డికాక్ (0) వికెట్ తీసిన ఆనందంలో కోహ్లీసేన

ఆఖర్లో బ్రేకేశారు

- దక్షిణాఫ్రికా 269/6 • మార్‌క్రమ్, ఆమ్లా మెరుపులు • చివరి సెషన్‌లో పుంజుకున్న భారత్ • అశ్విన్‌కు మూడు వికెట్లు

సెంచూరియన్: మొదటి టెస్టు తొలి రోజు ఆరంభంలో అదరగొట్టిన టీమిండియా తర్వాత తడబడితే రెండో మ్యాచ్‌లో సీన్ రివర్సయింది. తొలి రెండు సెషన్లలో పేలవ ప్రదర్శన చేసిన కోహ్లీసేన ఆఖరి సెషన్‌లో పంజా విసిరింది. నాలుగు వికెట్లు పడగొట్టి ప్రత్యర్థికి దీటుగా జవాబిచ్చింది. బౌన్సీ వికెట్‌పై పేసర్లు విఫలమైన వేళ రవిచంద్రన్ అశ్విన్ (3/90) బంతిని గిర్రున తిప్పుతూ మూడు వికెట్లతో సత్తా చాటాడు. దాంతో, శనివారం ఇక్కడ మొదలైన రెండో టెస్టులో దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో ఆరు వికెట్లకు 269 పరుగులు చేసింది. ఓపెనర్ ఐడెన్ మార్‌క్రమ్ (150 బంతుల్లో 15 ఫోర్లతో 94), హషీమ్ ఆమ్లా (153 బంతుల్లో 14 ఫోర్లతో 82) అద్భుత బ్యాటింగ్‌తో పటిష్ఠ పునాది వేసినా.. మిడిలార్డర్ తడబాటు కారణంగా మొదటిరోజు ఆతిథ్య జట్టు పైచేయి సాధించలేకపోయింది. ప్రస్తుతం కెప్టెన్ డుప్లెసిస్ (24 బ్యాటింగ్), కేశవ్ మహరాజ్ (10 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు.

ఆరంభం పేలవం..: గత మ్యాచ్‌లో చిత్తయిన భారత్ సెంచూరియన్‌లో ఊహించినట్టే మూడు మార్పులు చేసింది. ధవన్, వృద్ధిమాన్ సాహా, భువనేశ్వర్ స్థానాల్లో రాహుల్, పార్థివ్, ఇషాంత్‌లను తీసుకుంది. స్టెయిన్ స్థానంలో ఎన్‌గిడికి అరంగేట్రం చాన్స్ ఇచ్చిన ఆతిథ్య జట్టు టాస్ నెగ్గి బ్యాటింగ్ ఎంచుకుంది. అయితే, అత్యంత బలీయంగా ఉన్న భారత పేస్ బలగం నుంచి.. గత మ్యాచ్‌లో మాదిరిగా మెరుపు ఆరంభాన్ని ఆశించిన అభిమానులకు నిరాశే ఎదురైంది. కొత్త బంతితో బుమ్రా, షమి ఏమాత్రం ప్రభావం చూపలేకపోయారు. ఓపెనర్లు మార్‌క్రమ్, ఎల్గర్ (31) ధాటిగా బ్యాటింగ్ చేయడంతో షమి తొలి స్పెల్‌లో నాలుగు ఓవర్లలో ఏకంగా 23 పరుగులు ఇచ్చుకున్నాడు. ఎనిమిదో ఓవర్లో బంతి అందుకున్న సీనియర్ పేసర్ ఇషాంత్ కాస్త మెరుగ్గా బౌలింగ్ చేశాడు. అయితే, మరో ఎండ్‌లో అతనికి హార్దిక్ పాండ్యా నుంచి సహకారం కొరవడింది. 20వ ఓవర్లో అశ్విన్ రంగంలోకి దిగినా అతనూ బ్రేక్ సాధించలేకపోయాడు. బుమ్రా వేసిన 21వ ఓవర్లో ఎల్గర్ ఇచ్చిన క్లిష్టమైన క్యాచ్‌ను స్క్వేర్‌లెగ్‌లో విజయ్ వదిలేశాడు. దీన్ని సద్వినియోగం చేసుకున్న ఎల్గర్ అలవోకగా పరుగులు రాబట్టాడు. మరో ఎండ్‌లో వేగంగా ఆడిన మార్‌క్రమ్ లంచ్ బ్రేక్‌కు ముందు హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు.

అశ్విన్ డబుల్ స్ట్రయిక్: రెండో సెషన్ ఆరంభంలోనే అశ్విన్ భారత్‌కు బ్రేక్ ఇచ్చాడు. అతని బౌలింగ్‌లో విజయ్ పట్టిన చురుకైన క్యాచ్‌కు ఎల్గర్ వెనుదిరిగాడు. ఆ తర్వాత ఆమ్లాకు షార్ట్ బాల్స్, ఆఫ్ స్టంప్‌పై బంతులు సంధిస్తూ సవాల్ విసిరారు. కానీ, వేగంగా బ్యాటింగ్ చేస్తూ ఎదురుదాడికి దిగిన ఆమ్లా, మార్‌క్రమ్ రెండో వికెట్‌కు 63 పరుగులు జోడించారు. సెంచరీ దిశగా దూసుకెళ్తున్న మార్‌క్రమ్‌ను అశ్విన్ టర్నింగ్ బాల్‌తో అవుట్ చేశాడు. మూడు ఓవర్ల తర్వాత ఇషాంత్ బౌలింగ్‌లో కీపర్ పార్థివ్ క్యాచ్ అందుకొని ఉంటే ఆమ్లా కూడా అవుటయ్యేవాడు. అప్పటికి 30 పరుగుల వద్ద నిలిచిన ఆమ్లా ఈ లైఫ్‌ను సద్వినియోగం చేసుకున్నాడు. డివిల్లీర్స్ (20)తో కలిసి ఇన్నింగ్స్‌ను నడిపించాడు. ఈ సెషన్‌లో రెండు వికెట్లు పడగొట్టిన భారత్ కాస్త ఊరట చెందినా.. సఫారీలు 108 పరుగులు రాబట్టారు.

ముగింపు మనదే..: టీ విరామం తర్వాత ఆమ్లా వెంటవెంటనే మూడు బౌండ్రీలు కొట్టి బౌలర్లపై ఎదురుదాడికి దిగాడు. మరో ఎండ్‌లో డివిల్లీర్స్ నెమ్మదిగా ఆడుతూ అతనికి సహకారం అందించాడు. అయితే, 63వ ఓవర్లో ఇషాంత్ ఊరించే బంతితో డివిల్లీర్స్‌ను బౌల్డ్ చేసి ఈ జోడీని విడదీశాడు. కానీ, తర్వాతి ఓవర్లోనే కవర్ డ్రైవ్‌తో బౌండ్రీ కొట్టి హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్న ఆమ్లా.. అదే జోరును కొనసాగించాడు. కెప్టెన్ డుప్లెసిస్ సహకారంతో.. ఓవర్‌కో ఫోర్ కొడుతూ స్కోరుబోర్డును పరుగులు పెట్టించాడు. సెంచరీ చేసేలా కనిపించిన అతణ్ణి హార్దిక్ తన బౌలింగ్‌లోనే అద్భుతమైన డైరెక్ట్ త్రోతో రనౌట్ చేసి భారత శిబిరంలో ఉత్సాహం నింపాడు. రెండు బంతుల తర్వాత అశ్విన్ బౌలింగ్‌లో కోహ్లీకి క్యాచ్ ఇచ్చిన డికాక్ (0) డకౌట్ కావడంతో ఆ ఆనందం రెట్టింపైంది. హార్దిక్ వేసిన తర్వాతి ఓవర్లో అవతలి ఎండ్‌లో ఉన్న డుప్లెసిస్ వారిస్తున్నా గుడ్డిగా పరుగు కోసం వచ్చిన ఫిలాండర్ (0) రనౌటయ్యాడు. దాంతో, సఫారీ జట్టు 245/3తో పటిష్ఠస్థితి నుంచి ఒక్కసారిగా 251/6తో కష్టాల్లో పడింది. అయితే, కేశవ్‌తో కలిసి డుప్లెసిస్ మరో వికెట్ పడకుండా రోజును ముగించాడు.

స్కోరుబోర్డు

దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్: ఎల్గర్ (సి) విజయ్ (బి) అశ్విన్ 31, మార్‌క్రమ్ (సి) పార్థివ్ (బి) అశ్విన్ 94, ఆమ్లా (రనౌట్/హార్దిక్) 82, డివిల్లీర్స్ (బి) ఇషాంత్ 20, డుప్లెసిస్ (నాటౌట్) 24, డికాక్ (సి) కోహ్లీ (బి) అశ్విన్ 0, ఫిలాండర్ (రనౌట్) 0, కేశవ్ (నాటౌట్) 10; **ఎక్స్‌ట్రాలు: 8; మొత్తం: 90 ఓవర్లలో 269/6; వికెట్ల పతనం:** 1-85, 2-148, 3-199, 4-246, 5-250, 6-251; **బౌలింగ్:** బుమ్రా 18-4-57-0, షమి 11-2-46-0, ఇషాంత్ 16-3-32-1, హార్దిక్ 14-4-37-0, అశ్విన్ 31-8-90-3.

అంతా అనైతికం.. చట్టవిరుద్ధం!

- వివేక్ వైదొలగాలి • కొత్తగా ఎన్నికలు నిర్వహించాలి
- హెచ్‌సీఏపై బీసీసీఐకి ఫిర్యాదు • నాపై నిషేధం లేదు
- రాష్ట్ర క్రికెట్‌కు సేవ చేసేందుకే ముందుకొచ్చా: అజరుద్దీన్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడా ప్రతినిధి): హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ)లో అనైతిక, చట్ట విరుద్ధ పాలన నడుస్తోందని భారత మాజీ కెప్టెన్ మహ్మద్ అజరుద్దీన్ విమర్శించాడు. అధ్యక్షుడు వివేకానంద్ తనపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నాడు. హెచ్‌సీఏలో నెలకొన్న పరిస్థితులపై బీసీసీఐ పెద్దలకు, బోర్డు పాలక మండలి (సీవోఏ)కి లేఖ రాశానని శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో అజర్ చెప్పాడు. కేబినెట్ ర్యాంక్‌తో ప్రభుత్వ సలహాదారుగా ఉన్న వివేక్ అధ్యక్ష పదవిలో కొనసాగేందుకు అనర్హుడన్నాడు. లోధా సిఫారసులను అమలు చేశామంటున్న ఆయన.. అలాంటప్పుడు సుప్రీంకోర్టు మార్గనిర్దేశాల ప్రకారం పాలకవర్గాన్ని రద్దుచేసి హెచ్‌సీఏకు కొత్తగా ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశాడు. 'ఈ పాలకవర్గం ఏర్పాటైన తొలిరోజు నుంచే నిబంధనలకు విరుద్ధంగా పని చేస్తోంది. లోధా కమిటీ సిఫారసులను పదేపదే ఉల్లంఘిస్తోంది. బోర్డు నాకు క్లియరెన్స్ ఇచ్చిన విషయాన్ని దాచిపెట్టి గత జనవరిలో జరిగిన ఎన్నికల్లో నన్ను పోటీ చేయకుండా అడ్డుకొని, నా ప్రాథమిక హక్కులకు భంగం కలిగించిన నాటి హెచ్‌సీఏ అడ్‌హక్ కమిటీ చైర్మన్ ప్రకాశ్ చంద్ జైన్‌తోపాటు ఇతరులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటా. ప్రస్తుతం హెచ్‌సీఏలో జరుగుతున్న పరిస్థితులపై బీసీసీఐకి, సీవోఏకు లేఖ రాశా. బోర్డు, సీవోఏ సానుకూలంగా స్పందిస్తుందని భావిస్తున్నా'ని వివరించాడు.



'లోధా'ను ఎన్ని సార్లు ఆమోదిస్తారు...?: 'లోధా సిఫారసులను ఆమోదించేందుకు ఎస్‌జీఎమ్ నిర్వహించామని వివేక్ చెబుతున్నారు. కానీ, వాటిని ఎన్నిసార్లు ఆమోదిస్తారు. గత జూన్‌లోనే ఆమోదించినట్టు సొసైటీలో రిజిస్టర్ చేసినట్టు ప్రకటించారు. అదే విషయాన్ని సుప్రీంకోర్టుకు కూడా తెలిపారు. అలాంటప్పుడు నిబంధనల ప్రకారం కార్యవర్గాన్ని రద్దు చేసి వెంటనే ఎన్నికలు నిర్వహించాల'ని అజర్ డిమాండ్ చేశాడు.

బీసీసీఐ నన్ను గుర్తించింది.: వివేక్ తండ్రి పేరు మీద టీ-20 లీగ్‌ను హెచ్‌సీఏ నిర్వహించడం చట్ట విరుద్ధమన్నాడు. తెలంగాణ జిల్లాల్లో హెచ్‌సీఏ ఇప్పటి వరకు ఎలాంటి అభివృద్ధి చేయలేదన్నాడు. జిల్లాల్లో క్రికెట్ అభివృద్ధికి కృషి చేస్తానని అజర్ పేర్కొన్నాడు. ఇక, తాను టీసీఏతో పని చేస్తున్నానని వివేక్ చేస్తున్న ఆరోపణల్లో నిజం లేదన్నాడు. 'హైదరాబాద్‌తో, హెచ్‌సీఏతో మాత్రమే నాకు అనుబంధం ఉంది. సభ్యులందరి కృషితో సంఘంలో నెలకొన్న పరిస్థితులను చక్కదిద్దేందుకే ముందు కొచ్చాన'ని అజర్ పేర్కొన్నాడు. మ్యాచ్ ఫిక్సింగ్ ఆరోపణల్లో తనపై విధించిన నిషేధాన్ని ఏపీ హైకోర్టు కొట్టి వేసిన తర్వాత తనపై ఎలాంటి నిషేధం ఉండబోదని అజర్ పునరుద్ఘాటించాడు. బీసీసీఐ తనను గుర్తించిందన్నాడు. తనకు రావాల్సిన పెన్షన్, ఇతర ప్రయోజనాల గురించి బోర్డుకు లేఖ రాశానని, వచ్చే ఎస్‌జీఎమ్‌లో వాటికి ఆమోదం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశాడు. రాష్ట్రంలో, హైదరాబాద్‌లో క్రికెట్‌ను కొత్త మార్గంలో నడిపించడం తన కర్తవ్యంగా భావిస్తున్నానని అజర్ తెలిపాడు.



బౌల్ట్ దెబ్బకు పాక్ చిత్తు

- మూడో వన్డేలో ఓటమి
- సిరీస్ 3-0తో కివీస్ సొంతం

డ్యునెడిన్: న్యూజిలాండ్‌తో శనివారం జరిగిన మూడో వన్డేలో పేసర్ ట్రెంట్ బౌల్ట్ (5/17) దెబ్బకు పాకిస్థాన్ కుదేలైంది. 258 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన పాక్‌ను బౌల్ట్ కకావికలం చేశాడు. ఐదు బంతుల్లో మూడు టాపార్డర్ వికెట్లు పడగొట్టిన బౌల్ట్.. ఆపై మరో ఇద్దరు బ్యాట్స్‌మెన్‌నూ పెవిలియన్ చేర్చడంతో పాక్ 27.2 ఓవర్లలో 74 పరుగులకే కుప్పకూలింది. ఫలితంగా 183 పరుగులతో చిత్తయిన పాక్.. ఐదు వన్డేల సిరీస్‌ను 0-3తో ఆతిథ్య జట్టుకు కోల్పోయింది. రయీస్ (16) ఒక్కడే పాక్‌లో టాప్ స్కోరర్. అంతకుముందు టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన కివీస్ నిర్ణీత 50 ఓవర్లలో 257 పరుగులకు ఆలౌటైంది. గప్టిల్ (45), కెప్టెన్ విలియమ్సన్ (73), రాస్ టేలర్ (52) సత్తా చాటారు. రయీస్, హసన్ అలీ చెరో మూడేసి వికెట్లు, షాదాబ్ ఖాన్ రెండు వికెట్లు తీశారు.

విఫలమైతే విరాట్ కూడా వైదొలగాలి



న్యూఢిల్లీ: తొలిటెస్ట్‌కు జట్టు కూర్పుపై విమర్శలు ఎదుర్కొన్న కెప్టెన్ కోహ్లీ.. రెండోమ్యాచ్‌కు టీమిండియా ఎంపికలోనూ విమర్శలు మూటగట్టుకుంటున్నాడు. మాజీ ఓపెనర్ సెహ్వాగ్ ఒక అడుగు ముందుకేసి..సెంచూరియన్ టెస్ట్‌లో విఫలమైతే విరాట్ కూడా తదుపరి మ్యాచ్‌కు వైదొలగాలని డిమాండ్ చేశాడు. ధవన్, భువనేశ్వర్, సాహా స్థానాల్లో రాహుల్, ఇషాంత్, పార్థివ్ పటేల్‌కు రెండో టెస్ట్‌లో చోటు కల్పించారు. ఈ నేపథ్యంలో సెహ్వాగ్ తీవ్రంగా స్పందించాడు. 'ఒక్క వైఫల్యంతో ధవన్‌పై వేటు వేశారు. ఏకారణం లేకుండా భువిని పక్కనబెట్టారు. ఇదంతా చూస్తే..రెండో టెస్ట్‌లో కోహ్లీ రాణించలేకపోతే మూడో మ్యాచ్‌కు అతడు కూడా పక్కకు తప్పుకోవాలి' అని సెహ్వాగ్ అన్నాడు.

జట్టు ఎంపికను ప్రశ్నించిన గవాస్కర్: రెండో టెస్టుకు భారత జట్టు ఎంపిక అసంబద్ధంగా ఉందని మాజీ కెప్టెన్ సునీల్ గవాస్కర్ విమర్శించాడు. ఓపెనర్ ధవన్ తలపై ఎప్పుడూ కత్తి వేలాడుతుంటుందన్న సన్నీ.. ప్రతిసారీ ధవన్‌నే బలిపశువుగా చేస్తున్నారన్నాడు. జట్టు ఎంపికలో సమతుల్యత లోపించిందన్నాడు.

హాకీ క్రీడాకారిణులకు యో యో టెస్ట్

బెంగళూరు: స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా సౌత్ సెంటర్‌లో హాకీ క్రీడాకారిణులు చెమటోడుస్తున్నారు. ఈ ఏడాది కామన్వెల్త్ క్రీడలు, ఆసియా గేమ్స్, ప్రపంచకప్ టోర్నీలకు ఫిట్‌నెస్ పెంచుకునే దిశగా వారికి యోయో టెస్టులు నిర్వహిస్తున్నామని చీఫ్ కోచ్ హరేంద్రసింగ్, జట్టు సాంకేతిక సలహాదారు వేన్ లాంబర్డ్ తెలిపారు. శిక్షణ పొందుతున్న క్రీడాకారిణులలో అత్యధికంగా 21.1, అత్యల్పంగా 17.7 స్కోరు నమోదు చేశారని, వారి సగటు స్కోరు ఆశాజనకంగా ఉందన్నారు.



మేఘాలపై చర్చి కట్టినట్టు లేదూ? 11వ శతాబ్దం నాటి ఈ చర్చి స్పెయిన్‌లోని శాన్ రోమన్‌డీసావ్ గ్రామంలో ఉంది. 1960లో కాటలోనియాలో రిజర్వాయర్ నిర్మాణం కారణంగా ఆ గ్రామం, చర్చి నీట మునిగిపోయాయి. రిజర్వాయర్ నీటిమట్టం తగ్గడంతో ఇప్పుడు బయటపడింది. నీటిలో ఆకాశం, మేఘాల ప్రతిబింబం వల్ల అబ్బురపరిచే ఈ దృశ్యం ఆవిష్కృతమైంది.

విమానాలను ఆపేసిన భోగి పొగ

- చెన్నైలో విమాన సేవలకు అంతరాయం
- బెంగళూరు, హైదరాబాద్‌లకు మళ్లింపు
- రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు మృతి

చెన్నై/శంషాబాద్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): భోగి మంటల కారణంగా ఏర్పడిన పొగ, మంచు దట్టంగా కమ్మేయడంతో చెన్నైలో శనివారం విమాన సేవలకు తీవ్రఅంతరాయం ఏర్పడింది. తెల్లవారుజామున 3 గంటల నుంచి ఉదయం 8.30 గంటల వరకు రన్‌వేను మూసివేశారు. దీంతో నగరంలో దిగాల్సిన 18 విమానాలను బెంగళూరు, హైదరాబాద్(శంషాబాద్)లకు మళ్లించారు. చెన్నై నుంచి బయల్దేరాల్సిన 40కి పైగా విమానాలు మూడున్నర నుంచి నాలుగు గంటలు ఆలస్యంగా కదిలాయి. సంక్రాంతి/పొంగల్ పండగల కోసం నగరానికి రావాల్సిన, నగరం నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. శుక్రవారం రాత్రి నుంచి పెద్ద ఎత్తున భోగిమంటలు వేయడంతో ఆ పొగతో పాటు దట్టమైన మంచు కారణంగా వాహనాలు వెళ్లలేని పరిస్థితి. దీంతో చెన్నై చుట్టుపక్కల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు మరణించారు. అంబత్తూర్, ఆవడి, పట్టాభిరామ్, తిరునింద్రవూర్ తదితర ప్రాంతాల్లో మంచు ప్రభావం వల్ల రైళ్లను వేగం తగ్గించి నడిపారు.



చెన్నై ఎయిర్‌పోర్టు రహదారిని కమ్మేసిన పొగమంచు



ఉత్తర భారతదేశం చలి గుప్పిట్లో చిక్కుకుంది. కశ్మీర్ లోయలో ఉష్ణోగ్రతలు కనిష్ఠస్థాయికి పడిపోయాయి. లేహ్‌లో రికార్డుస్థాయిలో మైనస్ 15 డిగ్రీల సెల్సియస్ నమోదైంది. రాజస్థాన్, పంజాబ్, హరియాణాల్లో చలి తీవ్రత కొనసాగుతోంది. ఉత్తరప్రదేశ్‌లో పలు ప్రాంతాలను మంచు దట్టంగా కమ్మేసింది. అలాగే ఆంధ్రప్రదేశ్ కోస్తా జిల్లాలనూ పొగమంచు కమ్మేసింది. మధ్యాహ్నం వరకు కొన్ని ప్రాంతాల్లో దట్టంగా మంచు కురిసింది. విజిబిలిటీ 200 మీటర్ల కంటే తక్కువకు పడిపోయింది. ఉత్తరాది మాదిరిగా పొగమంచు కురవడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. గాలి నిశ్చలంగా ఉండడం, వాతావరణంలో తేమ పెరగడంతో కోస్తాలో పొగమంచు మరింత పెరిగింది. మరో రెండు రోజుల వరకు దీని ప్రభావం కొనసాగే అవకాశం ఉందని వాతావరణ నిపుణుడు ఆర్.మురళీకృష్ణ తెలిపారు.

క్షయ రోగులకు నెలకు రూ.500

- కీలక నిర్ణయం తీసుకోనున్న కేంద్రం!

న్యూఢిల్లీ, జనవరి 13: క్షయ(టీబీ) రోగుల విషయంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకోనుంది! పోషకాహారం కొనుగోలుకు, ప్రయాణ ఖర్చులకు ఉపయోగపడేలా రోగం నయమయ్యే వరకూ ప్రతినెలా రూ.500 చొప్పున ఇవ్వాలని చూస్తోందని ఆరోగ్యమంత్రిత్వ శాఖ వర్గాలు తెలిపాయి. ఆదాయ స్థాయితో సంబంధం లేకుండా రోగులందరికీ ఈ సహాయం అందించాలనే ప్రతిపాదన ఉంది. ఆర్థిక కమిటీ(వ్యయ) ఇందుకు ఆమోదం తెలిపిందని, మిషన్ స్టీరింగ్ గ్రూపునకు ఈ ప్రతిపాదన పంపామని అధికారులు తెలిపారు.

ముంబై తీరంలో హెలికాప్టర్ ప్రమాదం

- ఐదుగురు ఓఎన్‌జీసీ సిబ్బంది, ఇద్దరు పైలెట్లు గల్లంతు

ముంబై, జనవరి 13: ముంబై తీరంలో ఐదుగురు ఓఎన్‌జీసీ అధికారులతో వెళుతున్న పవన్ హాన్స్ హెలికాప్టర్ కూలిపోయింది. ఈ ఘటనలో ఇద్దరు పైలెట్లు సహా ఏడుగురు గల్లంతయ్యారు. వీరిలో ఐదుగురి మృతదేహాలు లభ్యమయ్యాయి. గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. జుహూ విమానాశ్రయం నుంచి టేకఫ్ అయిన హెలికాప్టర్ 15 నిమిషాల్లోనే ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్‌తో సంబంధాలు తెగిపోయాయి. దీంతో రంగంలోకి దిగిన కోస్ట్‌గార్డ్, నేవీ సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టగా.. ముంబైకి 30నాటికల్ మైళ్ల దూరంలో హెలికాప్టర్ కూలిపోయినట్లు గుర్తించారు.

గోదాదేవిపై వివాదాస్పద వ్యాఖ్యలు

- తమిళ రచయిత వైరముత్తుపై కేసు

కొయంబత్తూర్, జనవరి 13: గోదాదేవిపై ఇటీవల వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన తమిళ రచయిత వైరముత్తుపై కేసు నమోదైంది. హిందూ మున్నాని కార్యదర్శి ఫిర్యాదు మేరకు తమిళనాడులోని రాజపాలయం పోలీసులు కేసు నమోదు చేశారు. గోదాదేవిని దేవదాసిగా వ్యాఖ్యానిస్తూ ఇటీవల తమిళ పత్రిక దినమణిలో వైరముత్తు వ్యాసం రాశారు. దీనిపై బీజేపీ నేతలతో పాటు, హిందూత్వ సంస్థలు అభ్యంతరం వ్యక్తంచేశాయి. దీంతో గోదాదేవి గురించి తప్పుగా మాట్లాడడం తన ఉద్దేశం కాదని.. ఓ పరిశోధక విద్యార్థి రాసిన వ్యాఖ్యలను మాత్రమే ఉదహరించినట్లు తెలిపారు.గోదాదేవిపై చేసిన వ్యాఖ్యలు ఆమె భక్తులను బాధించాయని హిందూ మున్నాని కార్యదర్శి ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దత్తతకు కొత్త చట్టం.. 16 నుంచి అమలు

అమరావతి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): పిల్లలను దత్తత తీసుకునేందుకు ఉద్దేశించిన చట్టానికి కేంద్ర ప్రభుత్వం పదునుబెట్టింది. దత్తత రెగ్యులేషన్-2017 అనే కొత్త చట్టాన్ని ఈ నెల 16 నుంచి అమల్లోకి తీసుకురానున్నారు. కేంద్ర మహిళా శిశు సంక్షేమశాఖకు చెందిన సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ(కారా) దీనికి సంబంధించిన నిబంధనలను సిద్ధం చేసింది. పిల్లలను దత్తత తీసుకోదలచుకున్న దంపతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అధిగమించేందుకు కొత్త చట్టంలో మార్పులు చేశారు. ఈ ప్రక్రియలో పారదర్శకతతో పాటు పిల్లలు త్వరగా దత్తత కుటుంబంలో సభ్యులుగా మారేందుకు వీలు కలుగుతుంది.

పాక్ నిర్భయ జైనాబ్

పంజాబ్ ప్రావిన్స్‌లో పెల్లుబికిన జనాగ్రహం



- కీలకంగా మారిన తాజా వీడియో ఫుటేజ్

లాహోర్, జనవరి 13: పాకిస్తాన్ అట్టుడికిపోతోంది. ప్రజాగ్రహం పెల్లుబికుతోంది. కాసుర్ నగరంలో చిన్నారి జైనాబ్‌పై హత్యాచార ఘటన పంజాబ్ ప్రావిన్స్‌ను కుదిపేస్తోంది. చిన్న పిల్లలను కూడా కాపాడలేరా? అంటూ ప్రజలు వీధుల్లోకి వచ్చి పోలీసులను నిలదీస్తున్నారు. కాసుర్‌లో చిన్నారులపై వరుస లైంగిక దాడులు, కిడ్నాప్‌లు, హత్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. జైనాబ్ హత్య కేసుకు సంబంధించిన తాజా వీడియో ఫుటేజ్‌ను పంజాబ్ పోలీసులు విడుదల చేశారు. చిన్నారి ఇంటి సమీపంలో ఓ గుర్తుతెలియని వ్యక్తి దృశ్యాల్లో కనిపిస్తున్నాడనీ, టోపీ పెట్టుకుని ఉన్నాడని చెబుతున్నారు. చిన్నారి హత్యలో ఆ వ్యక్తికి ప్రమేయం ఉందని అనుమానిస్తున్నారు. కేసులో తాజా వీడియో కీలకంగా మారిందనీ, ఇప్పటికే లభ్యమైన సీసీటీవీ దృశ్యాలతో ఈ ఫుటేజ్‌ను పోల్చి చూస్తున్నామని పోలీసులు తెలిపారు. గత ఏడాది కాలంలో కాసుర్ జిల్లాలో జైనాబ్ తరహాలో 12 హత్యలు జరిగాయి. వాటిలో ఏడు హత్యల్లో నిందితుడు ఒక్కడేనని డీఎన్‌ఏ పరీక్షల్లో తేలినట్లు వెల్లడించారు.

పాక్ అంతటా నిరసన ప్రదర్శనలు

ఏడేళ్ల జైనాబ్‌ను రేప్ చేసి.. గొంతు నులిమి చంపేసి.. శవాన్ని చెత్తకుప్పలో విసిరేయడం పాక్‌నే కాదు యావత్ ప్రపంచాన్ని కన్నీరు పెట్టించింది. ఢిల్లీలో నిర్భయ ఘటనకు నిరసనగా దేశమంతా ఎలా భగ్గుమందో..ఇప్పుడు పాకిస్తాన్ అంతటా అదే విధంగా నిరసన ప్రదర్శనలు జరుగుతున్నాయి. సినీ తారలు, క్రీడాకారులు, రాజకీయ నాయకులు, విద్యావేత్తలు, విద్యార్థులు, మహిళలు ఇలా సమాజంలో అన్ని వర్గాలు ఏకమై కాసుర్ ఘటనను ఖండిస్తున్నారు. 'జస్టిస్ ఫర్ జైనాబ్' హ్యాష్‌ట్యాగ్‌తో ప్రపంచ వ్యాప్తంగా ఆగ్రహావేశాలు పెల్లుబికాయి.

'నా పేరు జైనాబ్..నేను బాలికను'
కలచివేస్తున్న జైనాబ్ నోట్‌బుక్‌లో చివరి మాటలు

'నేను.. నేనొక బాలికను..నా పేరు జైనాబ్..నా తండ్రి పేరు అమీన్..
నా వయసు ఏడేళ్లు..
నేను కాసుర్‌లో నివసిస్తాను'

పాకిస్తాన్‌లోని పంజాబ్ ప్రావిన్స్‌లో హత్యాచారానికి గురైన చిన్నారి జైనాబ్ చివరి మాటలివి! ఆమె ఇప్పుడు లేదు. కానీ ఈ అక్షరాలే మిగిలాయి!

జనవరి 4న జైనాబ్ హత్యకు గురైంది. అదే రోజు ఉదయం స్కూల్లో తన నోట్‌బుక్‌లో చిన్నారి రాసిన ఈ మాటలు పాకిస్తాన్‌ను కలచివేస్తున్నాయి. కన్నీరు పెట్టిస్తున్నాయి.



యూపీలో ఘోరం!

1వ తరగతి విద్యార్థినిపై 5వ తరగతి బాలుర రేప్

- ఢిల్లీలో మతిస్థిమితం లేని బాలికపై సామూహిక అత్యాచారం

న్యూఢిల్లీ, జనవరి 13: సినిమాలు లేక టీవీ సీరియళ్ల ప్రభావమో తెలియదు కానీ అభం శుభం తెలియని పిల్లలు తప్పుదోవ పడుతున్నారు. ఉత్తరప్రదేశ్ బులంద్‌షహర్‌లో జరిగిన ఘటనే దీనికి ఉదాహరణ. ప్రభుత్వ పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్న విద్యార్థినిపై అదే స్కూల్లో 5వ తరగతి చదువుతున్న ముగ్గురు అత్యాచారం చేశారు. బాధిత చిన్నారి గట్టిగా ఏడవడంతో అటుగా వెళ్తున్నవారు వచ్చి కాపాడారు. దీనిపై బాధిత చిన్నారి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్థానిక మీడియాలో వార్తలు రావడంతో విద్యాశాఖ అధికారులు ఆగమేఘాలపై చర్యలు ప్రారంభించారు. ఇద్దరు టీచర్లను ఉద్యోగాల నుంచి డిస్మిస్ చేశారు. మరో ఏడుగురిని సస్పెండ్ చేశారు. ఇక, ఢిల్లీలో 15 ఏళ్ల మానసిక వికలాంగురాలిపై ఆరుగురు సామూహిక అత్యాచారం చేశారు. మాండవలీ ప్రాంతంలో ఇంటి బయట మాట్లాడుతున్న బాధితురాలికి భోజనం పెడతామని ఆశ చూపించి సమీపంలోని పార్క్‌లో లోకి తీసుకెళ్లాడో వ్యక్తి. అక్కడ మరో 5గురు ఉన్నారు. మద్యం తాగించి బాలికపై అత్యాచారం చేశారు. ఈ నెల 8న ఈ ఘటన జరిగినా... చికిత్స కోసం ఆస్పత్రికి వెళ్లిన సమయంలో డాక్టర్లు ప్రశ్నించడంతో బాధితురాలు జరిగిన విషయం చెప్పింది. దాంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మొత్తం ఆరుగురు నిందితులను అరెస్ట్ చేశారు. ఢిల్లీ ఆదర్శనగర్‌లో ఇలాంటిదే మరో ఘటన జరిగింది. సామాజిక మాధ్యమంలో పరిచయం అయిన 17 ఏళ్ల బాలికను గెస్ట్ హౌజ్‌కు ఆహ్వానించిన 23 ఏళ్ల వ్యక్తి, ఆమెకు మద్యం తాగించి అత్యాచారం చేశాడు.

ఇకపై 2 రంగుల పాస్‌పోర్టులు!

- చివరి పేజీ ఖాళీగా ఉంచుతారు
- తండ్రి పేరు, చిరునామా ఉండవు
- త్రిసభ్య కమిటీ నివేదికకు కేంద్రం ఓకే
- గడువు ముగిసే వరకు ప్రస్తుత పాస్‌పోర్టులు చెల్లుతాయి

న్యూఢిల్లీ, జనవరి 13: ఇండియన్ పాస్‌పోర్టులు ఇకపై రెండు రంగుల్లో ఉండనున్నాయి. అదే సమయంలో పాస్‌పోర్టులోని చివరిపేజీని ఖాళీగా ఉంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. విదేశీ వ్యవహారాలు, మహిళ, శిశు సంక్షేమశాఖ అధికారులతో ఏర్పాటైన త్రిసభ్య కమిటీ అందజేసిన నివేదికతో ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం పాస్‌పోర్టులోని చివరి పేజీలో తండ్రి లేదా సంరక్షకుడి పేరు, తల్లి, భార్య పేర్లు, చిరునామా, పాస్‌పోర్టు కలిగిన వ్యక్తికి ఎమిగ్రేషన్ చెక్ అవసరమా.. కాదా అన్న వివరాలు ఉంటున్నాయి. ఇకపై చివరి పేజీని ఖాళీగా ఉంచడంతో..ఈ వివరాలన్నీ పాస్‌పోర్టులో ఉండవు. దీంతో అడ్రస్ ప్రూఫ్ కోసం పాస్‌పోర్టును వినియోగించుకునే అవకాశం ఉండదు. అలాగే ఎమిగ్రేషన్ చెక్ అవసరమా.. కాదా.. అని నిర్ధారించేందుకు పాస్‌పోర్టును రెండు రంగుల్లో తీసుకురానున్నారు. ఎమిగ్రేషన్ చెక్ అవసరమైన వారికి కాషాయ రంగులో ఉండే పాస్‌పోర్టును, ఇమ్మిగ్రేషన్ చెక్ అవసరం లేని వారికి ప్రస్తుతం జారీ చేస్తున్న నీలం రంగులోనే ఉంటాయి. దీని ప్రకారం భర్త నుంచి విడిపోయి ఒంటరిగా జీవనం సాగిస్తున్న తల్లుల వద్ద పెరిగిన పిల్లల పాస్‌పోర్టులోను, దత్తత పిల్లల పాస్‌పోర్టులోను ఇకపై తండ్రి పేరు ఉండదని అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం ఉన్న పాస్‌పోర్టులు వాటి గడువు ముగిసే వరకు చెల్లుబాటులో ఉంటాయని విదేశీ వ్యవహారాల శాఖ ప్రకటించింది.

ఢిల్లీ ట్రిపుల్ ఐటీలో ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్‌పై ఎంటెక్ కోర్సు


న్యూఢిల్లీ, జనవరి 13: ఢిల్లీలోని ఇంద్రప్రస్థ సమాచార సాంకేతిక విద్యాసంస్థ (ట్రిపుల్ ఐటీ)లో రానున్న విద్యాసంవత్సరం నుంచి ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), మెషిన్ లెర్నింగ్ (ఎంఎల్) ప్రత్యేక సబ్జెక్టులుగా ఎంటెక్ కోర్సును ప్రవేశపెట్టనున్నారు. ఢిల్లీ ట్రిపుల్ ఐటీలోని ఇన్ఫోసిస్ కేంద్ర అధిపతి మయాంక్ వాత్స ఈ వివరాలు వెల్లడించారు. 'ఈ కోర్సు చేసే విద్యార్థులు పోస్ట్ గ్రాడ్యుయేషన్‌తో పాటు.. పరిశ్రమలు ఎదుర్కొంటున్న సవాళ్లను ఏఐ, డీఎల్‌ల ద్వారా పరిష్కరించేలా శిక్షణ పొందుతారు.

బరువు దించే మిరియం!

- ఊబకాయానికి మహత్తర ఔషధం
- పోపుపెట్టెలోనే 'పొట్ట'కు మందు
- ఎస్వీయూలో పదేళ్ల ప్రయోగాలు

(తిరుపతి, విశ్వవిద్యాలయాలు) జనవరి 13

మిరియాల చారు కాచారా? గారెల్లో మిరియాలు నూరి వేశారా? దద్దోజనంలో మిరియాలు నల్లగా మెరిసిపోతుంటాయే? 'పొంగల్' గురించి ప్రత్యేకంగా చెప్పేదేముంది! ముద్దముద్దకూ రెండు మిరియాలు పంటి కింద నలగాల్సిందే! పండగపూట పొద్దున్నే ఈ మిరియాల గోలేమిటని అనుకుంటున్నారా? అక్కడికే వస్తున్నాం! పండగక్కే కాదు... ప్రతి రోజూ ఆహారంలో మిరియాలు ఏదోరూపంలో తినండి. ఇది ఊబకాయాన్ని దూరం చేసే దివ్యౌషధం! కొవ్వును కరిగించే మహత్తరమైన మందు! తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయ నిపుణులు చేసిన పరిశోధనలో ఈ విషయం స్పష్టమైంది. ఎస్వీయూ బయో కెమిస్ట్రీ, కెమిస్ట్రీ విభాగాలతోపాటు హైదరాబాద్‌లోని జాతీయ పౌష్టికాహార సంస్థ (ఎన్ఐఎన్) సంయుక్తంగా ఈ అధ్యయనం చేశాయి. ఆ విశేషాలు లండన్‌కు చెందిన 'న్యూట్రిషన్ అండ్ మెటబాలిజం' అనే జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. అధిక బరువు ఒంటరిగా ఉండలేదు. కొన్నాళ్లకు షుగర్, రక్తపోటు, హైపర్ టెన్షన్‌ను తోడు తెచ్చుకుంటుంది. అందుకే... బరువు ఎక్కకూడదు. ఎక్కిన బరువును వెంటనే దించేసుకోవాలి. దీనికి సంబంధించి ఎస్వీయూ పరిశోధకులు అల్బినో ఎలుకలపై మిరియాల ప్రయోగం చేశారు. కొన్ని ఎలుకలకు ఊబకాయం వచ్చేలా చేశారు. వాటిని మూడు బృందాలుగా విభజించి... మొదటి గ్రూపులోని ఎలుకలను అలా వదిలేశారు. రెండో గ్రూపులోని ఎలుకలకు మిరియాలను నిర్దిష్ట పరిమాణంలో ఆహారంతోపాటు ఇచ్చారు. మూడో గ్రూపు ఎలుకలకు ఊబకాయానికి వాడే ఇతర మందులు ఇచ్చారు. ఇలా 22 వారాలపాటు ప్రయోగం చేశారు. ఆ తర్వాత... ఎలుకల బరువును, రక్త నమూనాలను పరీక్షించారు. శరీరంలో కొవ్వు పేరుకోకుండా చూడటంలో కీలకమైన కాలేయం, మూత్ర పిండాలు వంటి కీలక అవయవాల పనితీరునూ పరీక్షించారు. మిరియాలను నిర్దిష్టమైన పరిణామంలో ఇచ్చిన ఎలుకల బరువు తగ్గిందని గుర్తించారు. అలాగే... వాటి అవయవాల పనితీరు చాలా మెరుగుపడింది. ఆ ఎలుకలపై జన్యు సంబంధిత ప్రయోగాలను కూడా నిర్వహించారు. ఊబకాయ నివారణ, కొవ్వు నియంత్రణలో మిరియాలు భేషుగ్గా పని చేస్తున్నట్లు శాస్త్రీయంగా నిర్ధారించారు.



న్యూట్రిషన్ అండ్ మెటబాలిజం జర్నల్ ముఖచిత్రం.

మిరియాలు తింటే...

మిరియాలు అతిగా ఆహారం తీసుకోకుండా శరీరాన్ని నియంత్రిస్తాయి. ఆహార పదార్థాలను కొవ్వుగా మారకుండా చేస్తాయి. శరీరంలో వేడిని కలిగించడం ద్వారా చెమట, మల విసర్జనలో కొవ్వు బయటికి పోతుంది.

వీరే పరిశోధకులు...

'ఊబకాయానికి విరుగుడుగా మిరియాలు'... పరిశోధనలో ఎస్వీయూ బయో కెమిస్ట్రీ విభాగ అధ్యాపకుడు డాక్టర్ మేరిగ బాలాజీ, కెమిస్ట్రీ విభాగ ప్రొఫెసర్ చుండూరి వెంకటరావు, నెల్లూరులోని విక్రమ సింహపురి వర్సిటీ సైన్స్ కాలేజీ అధ్యాపకుడు పరిమ బ్రహ్మ నాయుడు, హైదరాబాద్‌లోని ఎన్ఐఎన్ పరిశోధకులు రమావత్ రవీంద్ర నాయక్, నమని హరిశంకర్, పోతాని సురేష్, తమిళనాడులోని నామక్కల్ జిల్లా తిరుచెంగోడుకు చెందిన శరవణం గణపతి, సత్యబాబు భాగం పంచుకున్నారు.


కేన్సర్, షుగర్‌పైనా...



మిరియాలతో ఊబకాయాన్ని నివారించవచ్చునని శాస్త్రీయంగా నిరూపించాం. మిరియాలతోపాటు ఇతర సహజ సిద్ధంగా లభించే వస్తువులతో కేన్సర్, షుగర్, మతిమరుపు, న్యూరో సంబంధమైన అనారోగ్య సమస్యలను దూరం చేసేలా పరిశోధనలు చేపట్టనున్నాం.

- డాక్టర్ ఎం. బాలాజీ, బయో కెమిస్ట్రీ విభాగం అధ్యాపకుడు, ఎస్వీయూ

ఆహారంలో ఇవి ఉంటే...



ఊబకాయాన్ని అధిగమించడానికి అనేక పరిష్కార మార్గాలున్నాయి. అయితే... ప్రకృతి సిద్ధంగా లభించే వాటి ద్వారానే ఊబకాయాన్ని తగ్గించుకోవడం చాలా మంచిది. ప్రతి ఒక్కరూ ఆహారంలో మిరియాలు, మునగాకు, కరివేపాకు, అల్లం, దాల్చిన చెక్క, వెల్లుల్లి వంటివి ఉండేలా చూసుకోవాలి.

- ప్రొఫెసర్ సి. వెంకట్రావు, కెమిస్ట్రీ విభాగం, ఎస్వీయూ

Printed and Published by Koganti Venkata Seshagiri Rao, on behalf of Aamoda Publications Pvt. Ltd., at the Aamoda press at Gollapalli road.,Dharmaram(B)Village,Dichpally Mandal, Nizamabad- 503230. Editor: K. Srinivas, Ph. Nos. 08461-245301, 245306. Fax 245307, RNI NO: AP TEL /2004/12975 .Managing Director : Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి 1
నవ్య
కుటుంబ కదంబం
ఆదివారం
14 జనవరి 2018

సందర్భం


ఫోటో: ప్రసాద్ కాశి, కాకినాడ

ప్రకృతి... పుడమి.. సంక్రాంతి



పన్నెండు మాసాల కాలంలో సూర్యుడు పన్నెండు రాశుల్లో - ఒక్కొక్క రాశిలో ఒక్కొక్క మాసం ఉంటాడు. ఒక రాశి లోంచి మరో రాశిలోకి సంక్రమిస్తాడు. ఈ సంక్రమణనే 'సంక్రాంతి'గా పేర్కొంటారు. అంటే... ఇలా సంవత్సరంలో పన్నెండు సంక్రాంతులు వస్తాయి. వీటిలో ధనూరాశి నుండి మకరరాశిలోకి సూర్యుడు సంక్రమణం చేయడానికి 'మకర సంక్రాంతి' గా పేరు. సంక్రాంతులన్నిటిలో మకరసంక్రాంతి ప్రాముఖ్యాన్నీ, పవిత్రతనూ సంతరించుకుంది.

ఉత్తరాభిముఖంగా సూర్యగమనం

మకర సంక్రాంతినాడు. ప్రకృతిలో మధురక్రాంతి సంభవిస్తున్నది. అది వెలుగుల విక్రాంతి. నాటి నుంచి సూర్యగమనం ఉత్తరాభిముఖంగా ఉంటుంది. ఉత్తరార్ధ గోళంలో సూర్యుని కాంతి క్రమంగా పెరుగుతూ అంతవరకు చలితో వణుకుతున్న ప్రజలకు సాంత్వన లభిస్తుంది. దీనిని భాగవతంలో పోతన "అహములు సన్నములయ్యెను- దహనము హితమయ్యె దీర్ఘ దశలయ్యె నిశల్- బహుశీతోపేతంబై- ఉహుహు అని వడకె లోకము" అని చక్కగా వర్ణించాడు.

ధనుర్మాసం నుంచే...

వృశ్చిక రాశి నుండి ధనూరాశిలోనికి సూర్యుడు ప్రవేశించినప్పుడు 'ధనుస్సంక్రాంతి'. ఈ రాశిలో నెలరోజులు సూర్యుడు నివసిస్తాడు కనుక దీనిని ధనుర్మాసమని వ్యవహరిస్తారు. వాస్తవానికి ధనుర్మాసం నుండే సంక్రాంతి శోభ పరిఢవిల్లుతుంది. ప్రతి ఇంట్లో మహిళలు, ముఖ్యంగా కన్నెపిల్లలు వేకువనే లేచి ఇళ్ళ ముంగిట ఆవు పేడతో కళ్ళాపి జల్లి, అందంగా రంగవల్లికలు తీర్చి దిద్దుతారు. ఆకాశంలోని చుక్కలకు ప్రతీకగా చుక్కల ముగ్గులు, మధ్యలో కంటికింపుగా కనిపించే గొబ్బెమ్మలు, వాటిపై బంతి, చామంతి, గుమ్మడి పూల అలంకరణ లు చేస్తారు. మేలుకొలుపు గానాలతో హరినామస్మరణ చేస్తూ హరిదాసులు, శివనామస్మరణతో జంగమయ్యలు, వారి వెనుక గంగిరెద్దులవారు "అయ్యగారికీ దండం పెట్టూ, అమ్మగారికీ దండం పెట్టూ" అంటూ గంగిరెద్దుల నాట్యం చేయిస్తారు. బుడబుడక్కులవారు, పగటివేషగాళ్ళు తమ కళాకౌశలాన్ని చూపిస్తూ వారి వెనుక వస్తారు. ఇదంతా ఒక కళా విలాసం.

పంచుకోవడమే పండుగ!

హేమంతంలో వచ్చే సంక్రాంతి మూడు రోజుల పండుగ... భోగి, సంక్రాంతి, కనుమ. సంక్రాంతి అంటే ప్రకృతిలో సంభవించే మంచి మార్పులు. ఆ మార్పులకు అనుగుణంగా నిర్వహించవలసిన విధివిధానాలను ద్రష్టలైన మన పూర్వీకులు ఘనంగా నిర్వచించారు.

భోగి మంటలు.. బొమ్మల కొలువు...

మకర సంక్రాంతికి ముందురోజు భోగి. ఇది దక్షిణాయనానికి చివరిరోజు. అలాగే ధనుర్మాసానికి ఆఖరి రోజు. ఈనాడు తెల్లవారుజామునే లేచి ఉత్తరాయణానికి స్వాగతం పలుకుతున్నట్టుగా ఇంటి ముంగిట, కూడళ్ళలో భోగి మంటలు వేస్తారు. మాసమంతా పెట్టిన గొబ్బెమ్మలను ఎండబెట్టి ఆ మంటల్లో వేస్తారు. అరిష్ట నివారణమన్నట్లు ఇళ్ళలో పనికిరాని వస్తువులను కూడా మంటల్లో వేస్తారు. నువ్వుల నూనె రాసుకుని, నువ్వుపిండితో నలుగు పెట్టుకుని, మంటల వద్ద కాచిన వేడినీటితో అభ్యంగనం చేస్తారు. కొత్త దుస్తులు ధరించి పెద్దవారి దీవెనలు పొందుతారు. ప్రతి ఇంటిని పచ్చటి తోరణాలతో, గుమ్మాలకు పసుపు, కుంకుమలను అలంకరించి శోభాయమానంగా రూపొందిస్తారు.

పెద్దలను తలుచుకునే సంక్రాంతి!

ఈ సంక్రాంతి నాడు సూర్యుడు మకరరాశిలోకి ప్రవేశిస్తాడు కనుక మకర సంక్రాంతి పుణ్యప్రదమైన రోజు. ముందురోజు మాదిరిగానే ఇంటిలోని వారందరూ విధిగా తలంటు పోసుకోవాలి. పుణ్యప్రదమైన ఈ రోజున గతించినవారికి తర్పణాలు వదలడం, వారి పేరున దానాలు ఇవ్వడం సంప్రదాయం. గుమ్మడిపండు, నువ్వులు, వస్త్రాదులు దానమివ్వాలని శాస్త్ర ఉవాచ.

కృతజ్ఞత చెప్పడమే.. కనుమ!

మరుసటి రోజు కనుమ. ఇది ప్రధానంగా వ్యవసాయదారుల పండుగ. పశువుల పండగ అని కూడా అంటారు. తమ వ్యవసాయ సంపదకు కారణభూతమైన భూమాతకు, గో సంపదకు, పాలేళ్లకు, పక్ష్యాదులకు కృతజ్ఞత తెలియజేయడం ఈ పండుగలోని ఆంతర్యం. పశువులశాలలను శుభ్రం చేసి, పశువులను కడిగి, కొమ్ములకు రంగులు వేసి, మెడలో గజ్జెలు, పూలదండలతో అలంకరిస్తారు. కొత్త బియ్యంతో పొంగలి వండి నివేదించి, తీపి పదార్థాలతోపాటు పశువులకు దాణాగా వేస్తారు. ఆ పొంగలిని తమ పొలాల్లో చల్లుతారు. దీన్ని 'పొలి చల్లటం' అంటారు.

ముక్కనుమను మూడు రోజుల సంక్రాంతి పండుగలో చేర్చకపోయినా అది ప్రాముఖ్యమున్న పండుగ. ఈ రోజున నవ వధువులు సమష్టిగా సావిత్రీగౌరీదేవి వ్రతం చేపడతారు. పదహారురోజులపాటు చేసే ఈ వ్రతంలో ప్రధానంగా పల్లెసీమల్లో ఆడవారందరూ పాల్గొంటారు.

• ఏ. సీతారామారావు

సంక్రాంతి అంటేనే సంబరం..
ఆరుగాలాల కష్టానికి అందే ప్రతిఫలం..
వాడవాడలా ముచ్చటగా ముగ్గులమయం..
అతిథులకు ఆత్మీయంగా అందే
అందమైన ఆహ్వానం...
వెండితెర మీద సందడి చేస్తున్న ఈ పొరుగు భామల
పండుగ కోలాహలం... 'నవ్య' ప్రత్యేకం!



పండుగంతా నాదే!

అమ్మాయిలు చక్కగా ముస్తాబై , ఇంటిని అలంకరించి, రకరకాల స్వీట్లు చేసి.. అందరికీ పంచి, ఆరామంగా తింటూ ఉంటే ఏ పండుగైనా సూపర్‌గా ఉంటుంది. చిన్నప్పుడు ఉత్తరాది పండుగలను ఆస్వాదించిన నేను ఇప్పుడు తెలుగు పండుగలన్నిటినీ పరిచయం చేసుకుని పరవశిస్తున్నాను. ఇక్కడ ఏ పర్వదినాన్ని ఎంత గొప్పగా జరుపుకొంటారని తెలిస్తే అంత వైభవంగా మా ఇంట్లోనూ మేం నిర్వహించుకుంటాం. మన దేశంలో కుటుంబవ్యవస్థ చాలా గొప్పది. నేను హైదరాబాద్‌లో ఒంటరిగా ఉండను. మా కుటుంబంతోనే ఉంటాను. మా పొరుగునే రాజమౌళిగారి ఫ్యామిలీ ఉంటుంది. అనుబంధాలు, ఆప్యాయతల్ని గురించి తెలుసుకోవాలంటే వాళ్లని చూసి తీరాల్సిందే. ఒకవైపు వృత్తిని ఎంత ప్రేమిస్తారో, మరోవైపు సంప్రదాయాలకు కూడా అంతే ప్రాముఖ్యతనిచ్చే కుటుంబంవాళ్లది. ఇరుగు చల్లన, పొరుగు చల్లన అని ప్రార్థించడం మన పండుగల ప్రత్యేకత. ఆ విషయాన్ని పుణికిపుచ్చుకున్నారు వాళ్లు. ఎప్పుడూ అందరినీ చిరునవ్వుతో పలకరిస్తుంటారు.

ఇక నాకు తెలిసిన సంక్రాంతి స్పెషల్‌ని ఒక్క మాటలో చెప్పేయలేం. మూడు, నాలుగు రోజులు ఈ సందడి ఉంటుంది. రంగవల్లులతో, రంగుల వస్త్రాల షాపింగ్ చేయడంతో, ఆ తర్వాత పలు వర్ణాల పతంగులను ఎగరేయడంతో ఈ పండుగ ముడిపడి ఉంది. చిన్నపిల్లలకు పోసే భోగి పళ్ల నుంచి, డూడూబసవన్నల వరకు, గొబ్బెమ్మల నుంచి, నింగికి ఎగిరే పతంగుల వరకు అన్నిటి గురించీ క్షుణ్ణంగా తెలుసుకున్నా. మా ఫ్యామిలీ మెంబర్స్‌కి ఇవన్నీ నాకన్నా ఎక్కువే తెలుసు. ఏ ప్రాంతంలో ఉంటే అక్కడి సంస్కృతిని తెలుసుకుని, దాంతో మమేకమైపోవడం మాకు ఇష్టం. ఈ సారి కూడా మేం ఇంటిముందు ముగ్గులు పెట్టి రంగులు వేసి, గుమ్మాలకు తోరణాలు కట్టి, పొంగలి, బొబ్బట్లతో సంక్రాంతిని సెలబ్రేట్ చేసుకుంటాం.

- రాశీఖన్నా



కాంతలు.. కాంతులు..

సంక్రాంతులు!

నా ఖాతాలోనూ ఒకటి ఉంది!

దక్షిణాదిన సంక్రాంతి సందర్భంగా విడుదలయ్యే సినిమాలకు ఎంతటి ప్రత్యేకత ఉంటుందో నాకు తెలుసు. తెలుగులో సంక్రాంతి హిట్ చిత్రాల్లో నేను నటించిన 'శతమానం భవతి' ఉంది. సో నా ఖాతాలో ఓ సంక్రాంతి సినిమా ఉందన్నమాట. 'శతమానం భవతి' కేవలం సంక్రాంతి సందర్భంగా విడుదలైన సినిమా మాత్రమే కాదు. అందులో సంక్రాంతి విశిష్టతను గురించి చెప్పారు. ఆ సినిమా షూటింగ్ చేసినన్నాళ్లు నిజంగా పండుగలాగే అనిపించింది. పచ్చటి పల్లెటూరిలో పండుగ సందడిలో గడిపిన క్షణాలను మర్చిపోలేం. రంగులు చేతికి దొరికితే ఎవరికైనా హోలీ ఆడాలని అనిపిస్తుంది. పద్ధతిగా ముంగిలి ముందు ముగ్గుపెట్టి రంగులు వేస్తే మగవాళ్లే కాదు.. పిల్లలు కూడా తొక్కడానికి సాహసించరు. అందులోనూ ముగ్గు మధ్యలో పెట్టే గొబ్బెమ్మ చాలా స్పెషల్. గొబ్బెమ్మ లేకపోతే ముగ్గు పరిపూర్ణం కాదు.. అని ఓ పెద్దావిడ నాతో చెప్పారు. అందాల ముగ్గును అందరూ ముచ్చటపడి చూడటాన్ని నేను స్వయంగా చాలాసార్లు చూశాను. సంక్రాంతికి చేసుకునే బొబ్బట్లు, పాయసం.. ఇంకా రకరకాల తెలుగు వంటల గురించి కూడా తెలుసుకున్నా. ఇంటికి ధాన్యం వచ్చి అందరి కళ్లలోనూ సంతృప్తి కలిగించే సంక్రాంతి మై ఫేవరేట్ ఫెస్టివల్.

- అనుపమ పరమేశ్వరన్



అప్పుడే మొదలైంది!

సంక్రాంతి అంటేనే కొత్త. అంతా కొత్తకొత్తగా ఉండాలి. కొత్త ధాన్యం, కొత్త కుండలు, కొత్త అల్లుళ్లు, కొత్త కోడళ్లు, కొత్త వరసలు, సరసాలు, సందళ్లు... ప్రతి ఏటా ఇలాంటి కొత్తదనాన్ని ఆస్వాదించే సంక్రాంతి పండుగకు ఇప్పుడు ఇదంతా పాతపడిపోయి ఉండవచ్చు. కానీ నాకు మాత్రం సర్వం నిత్యనూతనంగా అనిపిస్తోంది. పొంగల్ అనగానే చెన్నైలో అన్నీ షాపుల్లోనూ ఆఫర్లు ప్రకటించేస్తారు. దాంతో పండుగకు ముందే అందరూ బట్టలు కొనుగోలు చేసేస్తారు. స్కూల్ టైమ్‌లో పొంగల్ వస్తోందంటే చాలు.. 'పొంగల్‌కి డ్రస్ కొన్నావా? షాపింగ్ అయిందా?' అని ఒకరినొకరు ఆరా తీసుకోవడాన్ని మర్చిపోలేను. ఇప్పుడు నా షాపింగ్ పూర్తయింది. చైతన్యని పెళ్లి చేసుకుని కొత్తకాపురంలో అడుగుపెట్టడమే ఈ ఏడాది నా సంక్రాంతి స్పెషల్. ఇప్పుడు నేను అల్లరి పిల్లని కాదు. అక్కినేని ఇంటికి కొత్త కోడలిని. పెద్ద కోడలిని. పెళ్లైన తర్వాత వచ్చే సంక్రాంతిని మా చెన్నైలో 'తలై పొంగల్' అంటారు. ఈ పండుగ నాకు తలైపొంగల్. మా ఇంట్లో మా తలై పొంగల్ సందడి మొదలైంది. ఇప్పుడిప్పుడే బంధువులంతా బాగా పరిచయమవుతున్నారు. వరసలు అలవాటవుతున్నాయి. అందరం కలిసి ఉండటమే సంతోషంగా ఉంటుంది. అదే ప్రతి ఒక్కరి ముఖంలోనూ సంతోషాన్ని చూస్తుంటే ఆ సంబరాన్ని మాటల్లో చెప్పగలమా? నేను ఇప్పుడు అలాంటి గొప్ప అనుభూతిని పొందుతున్నాను. చెన్నైలో నేను చూసిన ధనుర్మాస వైభవం, మొత్తం ఇప్పుడు మా ముంగిట్లో కొలువుదీరినంత ఆనందంగా ఉంది.

- సమంత





ఆ సినిమానే గుర్తుకొస్తుంది

పొంగల్ అనగానే నాకు విశాల్‌తో నటించిన 'ఆంబల' సినిమా గుర్తుకొస్తుంది. తెలుగులో 'మగమహారాజు' పేరుతో విడుదలైన చిత్రమది. ఆ సినిమా షూటింగ్‌లో నేను తొలిసారి పూర్తిగా సంక్రాంతి శోభను గమనించాను. సంక్రాంతి పండుగకు చెరకు గడకు ఉన్న సంబంధం ఏంటో అప్పటిదాకా నాకు తెలియదు. సంక్రాంతి రోజు పొంగించే పొంగలిని గరిటతో కాకుండా చెరకు గడతో తిప్పుతారని ఆ సినిమా సమయంలోనే తెలుసుకున్నా.

సున్నం కొట్టించి, మావిడాకులతోనూ, అరటి ఆకులు, చెట్లతోనో, బంతిపువ్వులతోనూ అలంకరించిన ఇళ్లను అప్పుడే తొలిసారి చూశా. దక్షిణాదిన పండుగ సమయంలో ఏ పల్లెటూరికి వెళ్లినా పెద్ద పెద్ద ముగ్గులు, రకరకాల రంగులతో భలేగా కనువిందుచేస్తాయి. అంత పెద్ద ముగ్గులను చాలా సందర్భాల్లో ఎవరి సాయమూ తీసుకోకుండా ఒంటరిగా మహిళలు తీర్చిదిద్దుతుంటారు. అంత సేపు నడుం వంచి ముగ్గు వేయడం మామూలు విషయం కాదు. చుట్టు గీతలకు బదులు చెరకు గెడలు వేసి, పక్కన పొంగల్ పొంగుతున్న కుండ, దానిపైన సూర్యుడు, ఓ పక్కగా 'సంక్రాంతి శుభాకాంక్షలు' అనే అక్షరాలతో చాలా ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతారు. మంచు కురిసే వేళలో పల్లె పడుచులు అందరూ కలిసి ముగ్గులను తీర్చిదిద్దే దృశ్యాలను ప్రత్యక్షంగా చూసి తీరాల్సిందే. చాలా ఆర్టిస్టిక్‌గా ఉంటుందా దృశ్యం. నాకు స్వతహాగా బొమ్మలు గీయడం చాలా ఇష్టం. అందుకే ఎక్కడ క్లిష్టమైన ముగ్గు కనిపించినా.. ఇలా ఎలా వేయగలిగారా.. అని రెట్టింపు ఆసక్తితో గమనిస్తుంటాను. పండుగకు అసలైన అర్థాన్ని చెప్పేలా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని సందడిగా ఉండే సంక్రాంతి నాకు ఎప్పుడూ ఇష్టమే.


- హన్సిక

• డా. చల్లా భాగ్యలక్ష్మి



వి.తేజస్విని
మహబూబ్‌నగర్

15 చుక్కలు
1 వచ్చే వరకు
సరిచుక్క





కె.మాధురి
తిరువూరు


21 చుక్కలు
మధ్యచుక్క
11 వచ్చే వరకు

ముత్యాల ముగ్గులు

గిఫ్ట్ హ్యాంపర్
విజేత



ఎస్. ఇందిరా అరవింద
తణుకు, ప.గో. జిల్లా



21 చుక్కలు
5 వరసలు
5 వచ్చే వరకు



ప్రతిరోజూ విజేతలకు టాటా-జెమినీ టీ వారి నుంచి గిఫ్ట్ హ్యాంపర్ అందుతుంది.

మా చిరునామా: నవ్య, ముత్యాలముగ్గు, ఆంధ్రజ్యోతి కార్యాలయం,
రోడ్ నెంబర్ 70, హుడా హైట్స్, జూబ్లీ హిల్స్, హైదరాబాద్-500033.
navya@andhrajyothy.com

నవ్య | ఆంధ్రజ్యోతి దృశ్యం
2 ఆదివారం 14 జనవరి 2018 3



తమిళంలో రూపొందుతున్న '100% లవ్' రీమేక్ '100% కాదల్' సెట్స్‌లో శనివారం సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. ఈ సినిమాతో కోలీవుడ్‌కి పరిచయమవుతున్న 'అర్జున్‌రెడ్డి' భామ షాలినిపాండే పట్టుచీరలో మెరిసిపోతూ, పొంగళ్లు వండుతూ సందడి చేసింది. హీరో జీవీ ప్రకాష్ కుమార్, బామ్మ పాత్రలో నటిస్తున్న సీనియర్ నటీమణి జయచిత్ర తదితరులు కూడా సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్నారు.

ఫ్రెండ్స్... పతంగ్స్!



\- లావణ్య త్రిపాఠి

సంక్రాంతి అంటే నాకు ముందుగా గుర్తొచ్చేది పతంగులే. ఉత్తరాదిలో మకర సంక్రాంతికి చిన్నారులు, పెద్దలు... ప్రతి ఇక్కరూ ఎంతో సంతోషంగా గాలిపటాలు ఎగరేస్తారు. హైదరాబాద్ వచ్చిన తర్వాత, ఇక్కడా నాకు సేమ్ ట్రెడిషన్ కనిపించింది. హైదరాబాద్‌లో నాకు బాగా నచ్చిన మరో అంశం ముగ్గులు. సంక్రాంతి వచ్చిందంటే చాలు... ప్రతి ఇంటి ముందూ రంగులతో భలే భలే ముగ్గులు వేస్తారు. కొన్ని ముగ్గులు ఎంత ముద్దొస్తాయో! అలాగే, బిల్డింగ్ పైకి ఎక్కితే... ఆకాశమంతా పతంగులతో పరిచేసినట్టు ఉంటుంది. ఏ బిల్డింగ్ మీద చూసినా ఫ్రెండ్స్‌తో చిన్న పిల్లలు, వాళ్లతో కలసి పెద్దలు చేసే హంగామా కనిపిస్తుంది. ప్రస్తుతం సాయిధరమ్ తేజ్‌తో కలిసి వీవీ వినాయక్ దర్శకత్వంలో నటిస్తున్న 'ఇంటిలిజెంట్' షూటింగ్ నిమిత్తం హైదరాబాద్‌లో ఉన్నాను. పండగ రెండు రోజులూ షూటింగులకు సెలవు కనుక స్నేహితులతో కలిసి సరదాగా ఎంజాయ్ చేస్తాను. అప్పుడప్పుడూ... పతంగులు ఎగరేయాలని నాకూ అనిపిస్తుంది. ఈ సంక్రాంతికి ఆ అవరాశం వస్తుందో? లేదో? చూడాలి. తెలుగు ప్రజలందరికీ, ప్రేక్షకులకూ మకర సంక్రాంతి శుభాకాంక్షలు.

\- సత్య పులగం, గనిరెడ్డి అరుణ్‌కుమార్

జైసల్మేర్‌లో... ఫెస్టివల్!

\- రకుల్ ప్రీత్‌సింగ్



నాన్నగారు ఆర్మీ ఆఫీసర్ కావడంతో చిన్నప్పట్నుంచి ఢిల్లీతో పాటు వివిధ ప్రాంతాల్లో పెరిగాను. అందువల్ల, ఎక్కడికి వెళితే... అక్కడ సంస్కృతి, సంప్రదాయాల గురించి కొంచెం కొంచెం తెలుసుకునే అవకాశం వచ్చింది. హీరోయిన్ అయ్యాక, హైదరాబాద్ వచ్చిన తర్వాత సంక్రాంతి గురించి తెలిసింది. తెలుగు ప్రజలు అందరికీ హ్యాపీ సంక్రాంతి. సరిగ్గా ఇక్కడ సంక్రాంతి జరుపుకునే సమయంలోనే పంజాబ్‌లో లోరి జరుపుకుంటారు. భోగికి రెండు మూడు రోజుల ముందు వస్తుందేమో! పంజాబీలు చాలా సంతోషంగా జరుపుకునే పండగల్లో లోరి ఒకటి. ఈసారి పండగ ముందు నేను రాజస్తాన్‌లోని జైసల్మేర్‌లో ఉన్నా. వచ్చే నెలలో విడుదలవుతోన్న నా హిందీ సినిమా 'అయ్యారే' టీమ్‌తో కలసి జైసల్మేర్‌లోని బీఎస్ఎఫ్ (బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్) ట్రయినింగ్ క్యాంప్‌లో జవాన్స్‌తో టైమ్ స్పెండ్ చేశాం. ప్రతి రోజూ వాళ్లు ఏమేం చేస్తారు? వాళ్ల ట్రయినింగ్ ఎలా ఉంటుంది? అనేవి తెలుసుకునే అవకాశం లభించింది. నిజంగా ఆర్మీ జవాన్స్ ఎంతో గ్రేట్! ఐయామ్ ప్రౌడ్ టు బి ఆర్మీ కిడ్! అలాగే, ఈ ఏడాది ప్రతి ఒక్కరికీ గొప్పగా ఉండాలని కోరుకుంటున్నా. వన్స్ ఎగైన్... ప్రతి ఒక్కరికీ భోగి, మకర సంక్రాంతి మరియు కనుమ శుభాకాంక్షలు!

చలిమంటల సావాసం

\- మెహరీన్



డిసెంబర్ వచ్చిందంటే చలి పులిలాగా మారుతుందన్న సంగతి తెలిసిందే. ఎక్కడ కాస్త వెచ్చగా ఉంటే అక్కడికి కాళ్లకన్నా ముందు మనసు పరుగులు తీస్తుంది. జనవరిలో వచ్చే సంక్రాంతిని నేను అమితంగా ఇష్టపడటానికి ఇది కూడా కారణం కావచ్చు. తెల్లారుజామునే మంచు కురుస్తుంటే పోటీపడి ముంగిళ్ల ముందు వేసి భోగిమంటలు నా ఫేవరేట్. పైన షాల్ తీసి దూరంగా పడేసి మంటకు కాస్త దూరంగా కూచుని చేతులు చాచి చలికాచుకుంటుంటే ఆ అనుభవాన్ని మాటల్లో చెప్పలేం. ఎవరైనా అనుభవించాల్సిందే. ఆ తర్వాత స్వీట్స్. ఎలా అలవాటైందో తెలియదు కానీ సంక్రాంతికి మా ఇంట్లో పొంగలి చేస్తారు. స్వీట్ పొంగలి మా ఇంట్లో చాలా స్పెషల్. డ్రై ఫ్రూట్స్, కొబ్బరి తురుము, నెయ్యి వేసి చాలా టేస్టీగా చేస్తుంది మా అమ్మ. మా వైపు ఈ పండుగను లోరీ అని పిలుస్తారు. బాగా తిన్న తిండి అరిగేవరకు, పతంగులను ఎగరేయడంతో పండుగ పూర్తయినట్టే. ఈ సారి కూడా ఫ్యామిలీతో ముంబైలో ఉన్నా. మా ఇంట్లో పండగ షురూ అయింది..!

చీర కట్టి.. ముగ్గు పెట్టి..!

\- నందితా శ్వేత



నా సొంతూరు బెంగళూరు. మాకూ సంక్రాంతి పెద్ద పండుగే. కొత్త ఏడాదిలో వచ్చే తొలి పండుగ ఇది. ఇంట్లోనే సెలబ్రేట్ చేసుకుంటాం. ఆ రోజంతా ఇంట్లోనే ఉంటాను. తెలుగులో ఎలా జరుపుకుంటారో మేము కూడా అలాగే పండుగ చేసుకుంటాం. ఇంటి ముందు ముగ్గులు పెట్టి, కొత్త బట్టలు కట్టుకుని, అమ్మ చేసే పిండి వంటలు తింటూ, ఇల్లంతా సందడిగా ఉంటే... అబ్బో భలే ఉంటుంది. ఈ సంక్రాంతికి చీర కట్టాలని అనుకుంటున్నాను. సాధారణంగా నేను శారీ, సల్వార్లు ఎక్కువగా వాడను. కట్టను. వెండితెరపై పాత్రల్లోనే ఆ రెండింటితో కనిపిస్తాను. ఈ పండుగకి చీర కట్టాలని నిర్ణయించేసుకున్నాను. ముగ్గులు కూడా పెడతాను. స్కూల్‌లో చదువుకునేటప్పుడు కాంపిటీషన్లలో పాల్గొని ముగ్గులు, బొమ్మలు వేసేదాన్ని. ఈ సంవత్సరం పండుగ నాకు మరింత స్పెషల్. నటిగా చాలా బిజీగా ఉన్నాను. తెలుగులో మూడు, తమిళంలో మూడు సినిమాల్లో నటిస్తున్నాను. గత సంవత్సరం తెలుగులో 'ఎక్కడికి పోతావు చిన్నవాడా', తమిళంలో 'ఉళ్‌కుత్తు' మంచి పేరు తెచ్చిపెట్టాయి. 2018లో ఎక్కువ సినిమాలు విడుదలవుతాయి. ఇంకా బాగుంటుందని ఆశిస్తున్నాను.

డైలీ సుడోకు - 78

7			3					
3			5			6		
2				4	8			9
	7					3	2	
		2	1	9	7	8		
	6	1					9	
1			4	2				6
		9			5			3
					1			8


ఎలా పూరించాలి?

ప్రతి బాక్స్‌లోనూ 9 గళ్లు ఉంటాయి.

నిలువుగానూ, అడ్డంగానూ ప్రతీ లైనులోనూ 1 నుంచి 9 వరకు అంకెలను పూరించాలి.

ఒకసారి పూరించిన అంకెను తిరిగి వాడకూడదు.

సుడోకు- 77 సమాధానం



సంక్రాంతి శుభాకాంక్షలు... నేడే చూడండి BLOCKBUSTER HIT...



దేవి 70 ఎ/సి - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్ 11.00,2.15,5.45,9.15

Enjoy 4k Digital Projection & Dolby Atmos Sound System

భ్రమరాంబ - కూకట్‌పల్లి 11.30,2.45,6.30,9.45
సత్యం - అమీర్‌పేట 11.30,2.30,6.30,9.30
కోణార్క్ - దిల్‌సుఖ్‌నగర్ 11.15,2.15,6.15,9.15
ప్రశాంత్ - సికింద్రాబాద్ 11.00,2.00,6.00,9.00

ASIAN - 10.10,1.15,4.30,4.40,7.35,10.40
ASIAN LAKSHMI CINEPRIDE - 10.40,2.15,5.45,9.30,9.50
ASIAN GPR MULTIPLEX - 10.40,1.45,4.40,7.25,10.30
ASIAN - 10.30,1.30,4.35,7.35,10.30
ASIAN RADHIKA - కాప్రా - 10.30,1.30,4.35,7.30
ASIAN SHIVA GANGA - దిల్‌సుఖ్‌నగర్ - 10.45,6.00
ASIAN SHAH SHAHENSHAH - చింతల్ - 11.30,6.30PM
PRASADS - 10.00,11.00,1.15,4.30,7.45,11.00
PVR - 10.00,1.55,4.00,7.25,10.50
PVR RK COMPLEX - 10.15,1.10,7.35,10.50
PVR CENTRAL MALL - పంజాగుట్ట - 10.10,1.35,7.25,10.50
PVR FORUM MALL - 10.00,10.00,1.00,4.40,7.25,11.00
INOX - 10.50,12.50,4.05,7.30,10.20
INOX - 9.55,12.55,4.05,7.25,10.05
Cinemax AMEERPET - అమీర్‌పేట - 11.00,1.40,7.40,10.40
Cinemax SHAMEERPET - శామీర్‌పేట - 1.15,4.25,7.40
Cinépolis - 10.20,1.10,4.45,11.00
Cinépolis - CCPL - 10.20,1.05,4.35,7.25,10.50
Cinépolis ATTAPUR - అత్తాపూర్ - 10.10,12.55,4.30,7.10,10.50
TIVOLI - సికింద్రాబాద్ - 11.00,2.00,7.45,10.50
Cine Planet - 10.40,1.20,4.30,7.25,10.30
10.40,1.20,7.30,10.20
ఇసిఐఎల్ - 11.15,2.15,9.15
Cinetown - మియాపూర్ - 10.45,5.45,9.00
MULTIPLEX BVK L.B.NAGAR - ఎల్బీనగర్ - 1.10,4.15,10.00
ASIAN - హన్మకొండ - 10.40,4.30,7.35,10.40
GEETHA ASIAN - 10.20,1.25,4.25,7.30,10.35
SVC - ప్రతిమ ఎ/సి - కరీంనగర్
ఎస్2 సినిమాస్ - వరంగల్

రాఘవేంద్ర కాంప్లెక్స్ - మల్కాజ్‌గిరి 11.15,2.15,6.15,9.15
మెట్రో - బహదూర్‌పుర 11.30,2.30,6.00,9.00
విమల్ - బాలానగర్ 11.15,2.15,6.15,9.15
కుమార్ - కాచిగూడ 11.15,2.15,6.15,9.15
విష్ణు - వనస్థలిపురం 11.15,2.15,6.15,9.15
సంతోష్ - ఆబిడ్స్ 11.30,2.30,6.15,9.15
శ్రీదేవి - రామచంద్రాపురం 11.15,2.15,6.15,9.15
అంబ - మెహిదీపట్నం 11.30,2.30,6.30,9.30
రంగ 70 - జీడిమెట్ల 11.00,2.00,6.00,9.00
శారద - కాప్రా 11.00,2.00,6.00,9.00
రాజ్యలక్ష్మి - ఉప్పల్ 11.30,2.30,6.30,9.30
లక్ష్మీ కళా మందిర్ - అల్వాల్ 11.30,2.30,6.30,9.30
ఆరాధన - తార్నాక 11.00,2.00,6.00,9.00
సెన్సేషన్ ఇన్సోమ్నియా - ఖైరతాబాద్ 11.00,2.00,6.00,9.00
శ్రీరమణ కాంప్లెక్స్ - అంబర్‌పేట 11.30,2.30,6.30,9.30
శ్రీసాయిపూజ - సూరారం 11.00,2.00,6.00,9.00
SVC మహాలక్ష్మి కాంప్లెక్స్ - కొత్తపేట 11.00,2.00,6.00,9.00
శివరంజని - ఇస్నాపూర్ 11.00,2.00,6.00,9.00
నాగేంద్ర - కర్మన్‌ఘాట్ 12.00,3.00,7.00,10.00
రుక్మిణి - పటాన్‌చెరు 11.00,2.00,6.00,9.00
స్వప్న కాంప్లెక్స్ - కాటేదాన్ 11.00,2.15,5.45,9.00
లక్ష్మి - శంషాబాద్ 11.30,2.30,6.30,9.30

వరంగల్
జెమిని స్క్రీన్ -2 - వరంగల్
విజయ - హన్మకొండ
శాంభవి - కాజిపేట
అరవింద్ కెఎం - నర్సంపేట
ముకుంద్ - మహబూబాబాద్
ఆనంద్ - భూపాలపల్లి
కాకతీయ - పరకాల
స్వర్ణ కెఎం - జనగాం
వెంకటేశ్వర - మరిపెడ
అశ్విని కెఎం - తొర్రూర్

ఖమ్మం
శ్రీనివాస - ఖమ్మం
ఆదిత్యా - ఖమ్మం
పరమేశ్వరి - కొత్తగూడెం
శాంతి - పాల్వంచ
విజయ్‌భాస్కర్ - భద్రాచలం
బాలాజి - సత్తుపల్లి
సీతారామ - ఇల్లందు
వెంకటదుర్గ - అశ్వారావుపేట
లక్ష్మీశ్రీనివాస - మధిర

సత్యభాస్కర్ - మణుగూరు
నరసింహ - ఎన్కూర్
బాలాజి - దమ్మాపేట
శ్రీదేవి 70 ఎ/సి - చెర్ల

కరీంనగర్
వెంకటేశ్వర - కరీంనగర్
శ్రీనివాస - జగిత్యాల
ఊర్వశి - గోదావరిఖని
నటరాజ్- సిరిసిల్ల
సాయికృష్ణ - మెట్‌పల్లి
అన్నపూర్ణ - జమ్మికుంట
శ్రీనివాస - పెద్దపల్లి
శివరామకృష్ణ - వేములవాడ
కిన్నెర 70 - కోరుట్ల
నటరాజ్ - హుజూరాబాద్
మహేశ్వరి - రాయ్‌కల్

నిజామాబాద్
నటరాజ్ - నిజామాబాద్
దర్శన్ - కామారెడ్డి
బృందావన్ - ఆర్మూర్
శ్రీనివాస - భీంగల్

వెంకటేశ్వర - బాన్సువాడ

మహబూబ్‌నగర్
వెంకటేశ్వర - మహబూబ్‌నగర్
సాయిరాజా - షాద్‌నగర్
వెంకటేశ్వర - వనపర్తి
వెంకటేశ్వర - గద్వాల్
రామకృష్ణ - నాగర్‌కర్నూల్
సత్యలక్ష్మి - అచ్చంపేట
మనోహర్ - నారాయణపేట
శ్రీదేవి - కొత్తకోట
రాఘవేంద్ర - జడ్చర్ల
వెంకటేశ్వర - ఆమన్‌గల్
రాఘవేంద్ర - మక్తల్
సత్యసాయి - కొల్లాపూర్
పార్థసారధి - కల్వకుర్తి
భువనేశ్వరి - ఐజ

నల్గొండ
తిరుమల - నల్గొండ
శ్రీనివాస - మిర్యాలగూడ
సాయికృష్ణ - కోదాడ
కృష్ణప్రియ - కోదాడ
భద్రాద్రి - భువనగిరి

నవ్య - సూర్యాపేట
మనోజ్ - దేవరకొండ
రామకృష్ణ - నకిరేకల్
సాయిబాబా - హుజూర్‌నగర్
అంజిరెడ్డి - చౌటుప్పల్
వెంకటేశ్వర - తిరుమలగిరి

ఆదిలాబాద్
నటరాజ్ - ఆదిలాబాద్
లక్ష్మి - మంచిర్యాల
రామకృష్ణ - బెల్లంపల్లి
తిరుమల - నిర్మల్
కమల 70 -భైంసా
తిరుమల కాంప్లెక్స్ - సిసిసి శ్రీరాంపూర్

మెదక్
సాగర్ డీలక్స్ - మెదక్
మోహన్ - జహీరాబాద్
వెంకటేశ్వర - సిద్దిపేట
సితార - సంగారెడ్డి
శ్రీనివాస - నర్సాపూర్
జ్యోతి - సదాశివపేట
యాదగిరి - గజ్వేల్


వెంకటేశ్వర - నారాయణఖేడ్
సంతోష్ - రామాయంపేట

రంగారెడ్డి
లక్ష్మి 70 - తాండూర్
శైలజ - వికారాబాద్
సాయికృష్ణ - పరిగి
సాయిబాబా - శంకర్‌పల్లి
మణికంఠ - చేవెళ్ల

రాయచూర్
ఎస్ఎన్‌టి - రాయచూర్
సందీప్ - గంగావతి
అమర్ - గంగావతి
మంజునాథ - సింధనూర్
మల్లిఖార్జున - మాన్వి
లక్ష్మి 70 - కొప్పల్
మారుతి - కుస్తిగి
పదామృతి - కర్తగి
హిమాలయ - కుకునూర్
నంది - కనకగిరి
శరణబసవేశ్వర - మస్కి
సంగం - తవర్గేరా

GLOBAL CINEMAS

సంక్రాంతి శుభాకాంక్షలు... నేడే చూడండి SUPER HIT...




సంధ్య 70 ఎంఎం ఎ/సి - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్ 11.00,2.00,6.00,9.00

PRASADS 10.30,1.45,4.45,5.00,8.00,8.15,10.15
బిగ్ స్క్రీన్: 12.30,3.45,7.00,10.15
PVR INORBIT MALL - 10.00,11.05,1.15,2.05,4.30,7.15,7.45,10.30,11.00
PVR RK COMPLEX - బంజారాహిల్స్ - 10.00,1.15,4.30,7.45,11.00
PVR CENTRAL MALL - పంజాగుట్ట - 10.00,11.00,1.15,4.30,7.15,7.45,11.00
PVR FORUM MALL - కూకట్‌పల్లి - 10.00,10.40,11.00,1.15,1.45,3.50,4.05,4.30,7.05,7.25,7.45,10.00,10.20,10.40,11.00
INOX GVK - 10.00,11.35,1.15,3.40,4.30,6.55,7.45,10.10,11.00
INOX - 9.10,10.10,12.15,3.25,4.00,6.30,7.15,9.40,10.20
Cinemax AMEERPET - 10.00,1.00,4.00,4.40,7.00,10.00,10.40
Cinemax SHAMEERPET - శామీర్‌పేట - 10.00,1.00,4.00,7.00,10.00
Cinépolis KUKATPALLY - కూకట్‌పల్లి - 9.0012.15,3.30,4.45,6.45,10.30
Cinépolis CCPL MALKAJGIRI - మల్కాజ్‌గిరి - 9.30,12.45,1.25,4.00,7.15,10.30
Cinépolis ATTAPUR - అత్తాపూర్ - 9.00,12.15,3.30,4.45,6.45,10.30
TIVOLI - సికింద్రాబాద్ - 11.15,1.20,4.30,7.40,10.45
Cine Planet - 9.55,1.05,1.20,4.10,4.25,7.15,7.30,10.20
దిల్‌సుఖ్‌నగర్ - 10.35,1.45,4.55,8.05,11.00
ఇసిఐఎల్ క్రాస్ రోడ్స్ - 11.00,2.00,6.00,9.00
ASIAN CINE SQUARE UPPAL - 10.30,9.55,1.30,1.00,4.30,4.05,7.35,7.10,10.35,10.10
ASIAN MULTIPLEX KUKATPALLY - కూకట్‌పల్లి - 10.20,1.25,4.30,7.40,10.40
ASIAN - 10.00,1.05,1.30,4.10,7.15,7.40,10.20
ASIAN RADHIKA - కాప్రా - 10.00,1.05,4.10,4.30,7.15,10.20
ASIAN SHIVA GANGA - దిల్‌సుఖ్‌నగర్ - 11.00,2.00,5.45,9.00
Cinetown - మియాపూర్ - 11.00,2.15,6.00,9.15
MULTIPLEX BVK L.B.NAGAR - ఎల్.బినగర్ - 10.30,1.30,4.30,7.30,10.30
ASIAN SHAH SHAHENSHAH - ఎ/సి - చింతల్ 11.15,2.15,6.00,9.15
ASIAN - 10.00,1.05,1.30,4.10,7.15,7.25,10.20
GEETHA ASIAN - 10.00,1.05,1.30,4.10,7.15,7.25,10.20

తారకరామ - కాచిగూడ 11.00,2.00,6.00,9.00
పద్మావతి - కాచిగూడ 11.30,2.30,6.30,9.30
మంజు - సికింద్రాబాద్ 11.00,2.00,6.00,9.00
మల్లిఖార్జున - కూకట్‌పల్లి 11.30,2.30,6.30,9.30
విశ్వనాథ్ - కూకట్‌పల్లి 11.45,2.45,6.45,9.45
రాజధాని 70 - దిల్‌సుఖ్‌నగర్ 11.00,2.00,6.00,9.00
మెగా - దిల్‌సుఖ్‌నగర్ 11.00,2.00,6.00,9.00
శ్రీరాములు - మూసాపేట్ 11.30,2.30,6.30,9.30
శ్రీసాయిరాం - మల్కాజ్‌గిరి 11.00,2.00,6.00,9.00
SVR శివశక్తి - కాప్రా 11.00,2.00,6.00,9.00
భుజంగ - జీడిమెట్ల 11.00,2.00,6.00,9.00
గోకుల్ - ఎర్రగడ్డ 11.15,2.15,6.15,9.15
శ్రీలక్ష్మి - కర్మన్‌ఘాట్ 12.00,3.00,7.00,10.00
జ్యోతి - ఆర్.సి.పురం 11.00,2.00,6.00,9.00
శ్రీనివాస - ఉప్పల్ 11.15,2.15,6.15,9.15
నర్తకి - అల్వాల్ 11.30,2.30,6.30,9.30
సెన్సేషన్ సన్‌షైన్ - ఖైరతాబాద్ 11.00,2.00,6.00,9.00
శ్రీరమణ 70 - అంబర్‌పేట్ 11.00,2.00,6.00,9.00
సుష్మ - వనస్థలిపురం 11.00,2.00,6.00,9.00
గెలాక్సి - టోలిచౌకి 11.00,2.00,6.00,9.00
వైజయంతి - నాచారం 11.00,2.00,6.00,9.00
సాయిరంగ - మియాపూర్ 11.00,2.00,6.00,9.00
అలంకార్ ప్రతాప్ - లంగర్‌హౌజ్ 11.00,2.00,6.00,9.00
విజేత - బోరబండ 11.00,2.00,6.00,9.00

సత్యం - అమీర్‌పేట్ 11.00,2.00,6.00,9.00
BR హైటెక్ - మాదాపూర్ 11.00,2.00,6.00,9.00
సూపర్ - బాలాపూర్ 11.00,2.00,6.00,9.00
కళ్యాణి మూవీమ్యాక్స్ - బోయిన్‌పల్లి 11.00,2.00,6.00,9.00
రామకృష్ణ - అబిడ్స్ 11.30,2.30,6.30,9.30
SV సినీప్లెక్స్ - పటాన్‌చెరు 11.00,2.00,6.00,9.00
శ్రీరామా - బహదూర్‌పుర 11.00,2.00,6.00,9.00
యాదగిరి - సంతోష్‌నగర్ 11.30,2.30,6.00,9.00
శ్రీదేవి - చిలకలగూడ 11.30,2.30,6.30,9.30
ప్రియ - మల్లేపల్లి 1130,2.30,6.30,9.30
శ్రీప్రేమ - తుక్కుగూడ 11.00,2.00,6.00,9.00
కృష్ణ సినిమా - నాగారం 11.00,2.00,6.00,9.00
స్వప్న 70 - కాటేదాన్ 11.00,2.15,5.45,9.00
సంతోష్ - ఇబ్రహీంపట్నం 11.00,2.00,6.00,9.00
జగదాంబ - ఘట్‌కేసర్ 11.00,2.00,6.00,9.00
జ్యోతి - ఐడిఎబొల్లారం 11.00,2.00,6.00,9.00
సెలెక్ట్ - మచ్చబొల్లారం 12.00,3.00,7.00,10.00
కృష్ణ సినిమా - అలియాబాద్ 11.00,2.00,6.00,9.00
విజయలక్ష్మి - మహేశ్వరం 11.00,2.00,6.00,9.00
వెంకటసాయి - కీసర 11.00,2.00,6.00,9.00
గణేష్ - శంషాబాద్ 11.15,2.15,6.15,9.15
వెంకటేశ్వర - మేడ్చల్ 11.00,2.00,6.00,9.00






అలా కనిపించాలనుకోవడం లేదు!

- హరిప్రియ


"నేను ర్యాంప్ ఎక్కాలనుకుంటే 'సైజ్ జీరో' మెయింటెయిన్ చేయాలి. నేను ర్యాంప్ మీద కనిపించాలని అనుకోవడం లేదు" అని అంటున్నారు హరిప్రియ. నందమూరి బాలకృష్ణ సరసన ఆమె నటించిన 'జై సింహా' ఇటీవల విడుదలైంది. హరిప్రియ సోషల్ మీడియాలో అభిమానుల ప్రశ్నలకు సమాధానమిచ్చారు. "నాకు కావాల్సింత తింటాను. అందుకు తగ్గ వ్యాయామం చేస్తాను. కథ డిమాండ్ మేరకు బరువు తగ్గుతూ పెరుగుతూ ఉంటాను. అంతేగానీ ఒకే రకమైన బరువు మెయింటెయిన్ చేస్తానని పట్టుబట్టి కూర్చోను. 'జై సింహా' తర్వాత తెలుగులో ప్రస్తుతానికి ఏ సినిమానూ అంగీకరించలేదు. కెరీర్ మొదట్లో ఇక్కడ కొన్ని సినిమాలు చేశాను. అయితే అవి కథగా వినడానికి బాగానే అనిపించాయి. తెరమీద అంతగా ఆకట్టుకోలేకపోయాయి. అందుకే ఇప్పుడు సినిమాను అంగీకరించడానికి ముందు ఒకటికి పదిసార్లు ఆలోచిస్తున్నాను. దక్షిణాది భాషలు అన్నిట్లోనూ సినిమాలు చేయాలని ఉంది. హిందీలో మంచి స్క్రిప్ట్ వస్తే తప్పకుండా చేస్తాను. నాకు శ్రీదేవి, సౌందర్య అంటే చాలా ఇష్టం. వారు చేసిన పాత్రలను పోలిన పాత్రల్లో నటించాలని ఉంది .సినిమాల్లో అవకాశం రావడం వల్ల నేను ఇప్పటిదాకా ఇంకా చదువు పూర్తి చేయలేదు. త్వరలోనే డిగ్రీ తెచ్చుకోవాలని అనుకుంటున్నాను" అని తెలిపారు. జీడిపప్పుతో చేసిన వంటలు మినహాయిస్తే, మిగిలిన స్వీట్లన్నీ తనకు ఇష్టమేనని అన్నారు హరిప్రియ.
















SANKRANTHI WINNER
సంక్రాంతి పండక్కి కూతుళ్ళకి, కోడళ్ళకి బంగారం కొని పెట్టడం మన ఆనవాయితి.కానీ ఈ సారి పండక్కి 'జై సింహా' సినిమా ని మీ వాళ్ళకి చూపించండి. బంగారం లాంటి సినిమా చూపించారు, ఇక మాకు బంగారం ఎందుకు అనకపోతే మీ టికెట్ డబ్బులకి మాది గ్యారెంటీ..
సి.కె.ఎంటర్‌టైన్‌మెంట్స్ (ప్రై.) లిమిటెడ్
ఇట్లు
సి.కె.ఎంటర్‌టైన్‌మెంట్స్ (ప్రై.) లిమిటెడ్ యూనిట్
జై సింహా
సి.కళ్యాణ్ కె.యస్.రవికుమార్
సి. వెంకటేశ్వరరావు - పత్స నాగరాజా చిరంతన్ భట్
యం.రత్నం సి.రాంప్రసాద్ రామ్-లక్ష్మణ్ ప్రవీణ్ ఆంథోని అన్‌బరివు వెంకట్ నారాయణరెడ్డి వంశీ శేఖర్
భోగి, సంక్రాంతి శుభాకాంక్షలు
U/A
ADITYA MUSIC


VKA FILMS
భోగి, సంక్రాంతి శుభాకాంక్షలు
WITH THE BLESSINGS OF MAA TULJA BHAVANI
జనవరి 19 విడుదల
PRODUCERS VIJAY KARAN KAUSHAL KARAN ANIL KARAN
WRITTEN & DIRECTED BY SUBRAHMANYAM RV
MUSIC SAI KARTHEEK DOP PRASAD GK EDITOR SIVA Y.PRASAD ART RK REDDY STUNTS NANDU
U/A
mango music
VKA FILMS
93926 80706 / 98480 54706